

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 345

బుధవారం 6-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఒకవైపు వరద జలాలను ఒడిసి పట్టి, ఫ్లోరైడ్ ప్రభావిత, మెట్ట ప్రాంతాలకు త్రాగు, సాగునీరు అందించి సస్యశ్యామలం చేసే సంకల్పంతో వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్‌ను నవంబర్ 2021లో, రెండో టన్నెల్‌ను జనవరి 2024లో పూర్తి చేసి నేడు జంట టన్నెళ్ల ప్రారంభోత్సవం.. మరోవైపు అన్నదాతలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం అందిస్తూ రైతన్నలకు అన్నివేళలా అండగా నిలబడుతున్న మన ప్రభుత్వం..

రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ..



ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం అందిస్తామన్న మాట మరోసారి నిలబెట్టుకుంటూ..


2023లో వర్షాభావం (కరువు), డిసెంబర్, 2023లో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో సంభవించిన అధిక వర్షాల వల్ల నష్టపోయిన **11,59,126** మంది వ్యవసాయ, ఉద్యానవన రైతన్నలకు రూ.**1,294.58** కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని నేడు తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

నేడు జమ చేస్తున్న రూ. **1,294.58** కోట్లతో కలిపి ఈ 57 నెలల్లో వర్షాభావం (కరువు), తుఫాను, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన **34.41** లక్షల మంది రైతన్నలకు అందించిన మొత్తం ఇన్‌పుట్ సబ్సిడీ అక్షరాల రూ. **3,262** కోట్లు..

విపత్తుల వల్ల నష్టపోయిన రైతన్నలకు ఈ 57 నెలల్లో అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ...

పంట నష్ట కాలం	పరిహారం అందించిన తేది	రైతుల సంఖ్య	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ. కోట్లలో)
2019-20 (భారీ వర్షాలు)	26 ఏప్రిల్, 2020	1.57 లక్షలు	123.70
ఏప్రిల్ - సెప్టెంబర్, 2020 (భారీ వర్షాలు)	27 అక్టోబర్, 2020	1.74 లక్షలు	146.24
అక్టోబర్, 2020 (భారీ వర్షాలు)	17 నవంబర్, 2020	1.97 లక్షలు	132.63
నవంబర్, 2020 (నివర్ తుఫాన్)	29 డిసెంబర్, 2020	8.34 లక్షలు	646.00
సెప్టెంబర్, 2021 (గులాబ్ తుఫాన్)	16 నవంబర్, 2021	0.35 లక్షలు	22.10
నవంబర్, 2021 (భారీ వర్షాలు)	15 ఫిబ్రవరి, 2022	5.97 లక్షలు	542.13
2018 లో తిత్లీ తుఫాన్ వల్ల నష్టపోయిన ఉద్యానవన పంటలకు అదనపు పరిహారం	22 జూన్, 2022	0.91 లక్షలు	182.62
ఖరీఫ్, 2022 (భారీ వర్షాలు)	28 నవంబర్, 2022	0.46 లక్షలు	39.40
డిసెంబర్, 2022 (మాండోస్ తుఫాన్)	28 ఫిబ్రవరి, 2023	0.91 లక్షలు	76.99
మార్చి-మే, 2023 (అకాల వర్షాలు)	01 జూన్, 2023	0.48 లక్షలు	44.19
ఖరీఫ్, 2023 (హార్టీ కల్చర్)	09 సెప్టెంబర్, 2023	0.11 లక్షలు	11.02
ఖరీఫ్ 2023లో వర్షాభావం (కరువు), డిసెంబర్, 2023లో మిచాంగ్ తుఫాన్	06 మార్చి, 2024	11.59 లక్షలు	1,294.58
మొత్తం సాయం		34.41 లక్షలు	3,261.60

ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతన్నలకు సత్వర ఉపశమనం కల్పిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఏ సీజన్ లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్ ముగిసేలోగానే నష్ట పరిహారం పంపిణీ..



శ్రీ. కాకాణి గోవర్ధన్ రెడ్డి, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ & ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు..

ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని ఫ్లోరైడ్ ప్రభావిత, మెట్ట ప్రాంతాలైన 30 మండలాల్లో **15.25** లక్షల జనాభాకు త్రాగు నీరు, **4.47** లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండు టన్నెళ్లను పూర్తి చేసి నేడు ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఎగువ చెర్లోపల్లిలో ప్రారంభించనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..



ప్రాజెక్టు విశిష్టతలు..

- ప్రాజెక్టు అంచనా వ్యయం : రూ. 10,010.54 కోట్లు..
- నీటి లభ్యత : శ్రీశైలం రిజర్వాయర్ కు ఎగువన 841 మీటర్ల నీటిమట్టం (సిల్ లెవెల్) నుండి కొల్లం వాగు ద్వారా కృష్ణా జలాల తరలింపు..
- సాగు నీరు : 4,47,300 ఎకరాలు
- త్రాగు నీరు : 15.25 లక్షల మందికి..
- లబ్ధి పొందే జిల్లాలు : ప్రకాశం, వైఎస్సార్, SPS నెల్లూరు జిల్లాల్లోని 30 మండలాలు
- మొదటి దశ (కెనాల్ డిస్ట్రిబ్యూటరీ): ప్రకాశం జిల్లా పరిధిలో 1,19,000 ఎకరాలకు సాగు నీరు, 4 లక్షల మందికి త్రాగు నీరు..
- రెండవ దశ (కెనాల్ డిస్ట్రిబ్యూటరీ) : ప్రకాశం, SPS నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో 3,28,300 ఎకరాలకు సాగు నీరు, 11.25 లక్షల మందికి త్రాగు నీరు..
- నల్లమల సాగర్ రిజర్వాయర్ సామర్థ్యం : 53.85 టీఎంసీలు

టన్నెల్స్ పనుల పురోగతి (కి.మీలలో)

పనులు	2004-2014	2014-2019	2019-2024	మొత్తం
టన్నెల్ -1	11.586	4.331	2.883	18.800
టన్నెల్ -2	8.747	2.355	7.685	18.787
	20.333	6.686	10.568	37.587

వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడంతో లబ్ధి పొందే అనుబంధ పథకాలు..

- రూ. 33.82 కోట్లతో నిర్మించనున్న వెలగలపాయ ఎత్తిపోతల పథకం ద్వారా అర్ధవీడు మండలంలోని 9 గ్రామాల్లో 4,500 ఎకరాలకు సాగు నీరు...
- పాపినేనిపల్లి వద్ద రూ.17.34 కోట్లతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకం ద్వారా అర్ధవీడు మండలంలోని 7 గ్రామాల్లో 8,500 ఎకరాలకు సాగు నీరు..
- రాళ్లపాడు రిజర్వాయర్ క్రింద 16,000 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు వెలిగొండ ప్రాజెక్టు తూర్పు ప్రధాన కాలువ ద్వారా 1.6 టీఎంసీల సాగు నీరు..
- పశ్చిమ ప్రకాశంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,657 గ్రామాలకు వాటర్ గ్రిడ్ పథకం ద్వారా నల్లమల సాగర్ రిజర్వాయర్ నుండి 2.25 టీఎంసీల త్రాగు నీరు..
- ప్రకాశం జిల్లా దొనకొండ వద్ద 24,358 ఎకరాల విస్తీర్ణంలో ఏపీఐఐసి నిర్మించనున్న మెగా ఇండస్ట్రియల్ హబ్ కు నల్లమల సాగర్ రిజర్వాయర్ నుండి 2.58 టీఎంసీల నీటి సరఫరా..
- ప్రకాశం జిల్లా పామూరు, పెద్దచెర్లోపల్లి మండలాల పరిధిలో 14 వేల ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న నేషనల్ ఇన్వెస్ట్ మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ (NIMZ) కు వెలిగొండ ప్రాజెక్టు తూర్పు ప్రధాన కాలువ ద్వారా 1.27 టీఎంసీల నీటి సరఫరా..

వెలిగొండ జంట టన్నెళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆర్ అండ్ ఆర్ ను కూడా త్వరలో పూర్తి చేసి ఇక వచ్చే సీజన్ లో నల్లమల సాగర్‌లో నీళ్లు నింపడం జరుగుతుంది..

దివంగత ముఖ్యమంత్రి శ్రీ.వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వం 2004 లో ప్రారంభించిన ఈ వెలిగొండ ప్రాజెక్టు, నల్లమల సాగర్‌తో సహా జంట టన్నెళ్ల పనులను జగనన్న ప్రభుత్వం పూర్తి చేయడం గమనార్హం..

శ్రీ. అంబటి రాంబాబు, జలవనరుల శాఖామాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు జంట టన్నెళ్లను ప్రకాశం జిల్లా ఎగువ చెర్లోపల్లి వద్ద 6 మార్చి, 2024న ఉదయం 10 గం.లకు ప్రారంభిస్తారు. అనంతరం తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గం.లకు ఇన్‌పుట్ సబ్సిడీని బటన్ నొక్కి రైతన్నల ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు. ఈ కార్యక్రమాలను అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు..

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ
YSR CONGRESS PARTY
ఆరాధ్య నాయకుడికి..
ఆత్మీయ కృతజ్ఞతలు..
నేడు ఒంగోలు పార్లమెంట్‌లోని యర్రగొండపాలెం విచ్చేయుచున్న
జగనన్నకు మనసారా స్వాగతం...
డా॥ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సమన్వయకర్త, ఒంగోలు పార్లమెంట్

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 345

బుధవారం 6-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

ప్రపంచ పరిణామాలపై అప్రమత్తత 22,400 దిగువకు నిఫ్టీ - బిజినెస్‌లో



రైల్వేస్టేషన్లలో 'స్విగ్గీ' డెలివరీ

ఈ నెల 12 నుంచి విశాఖ, విజయవాడ సహా 4 స్టేషన్లలో సర్వీసులు - బిజినెస్‌లో



ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

మావోయిస్టులతో సంబంధాల కేసులో మాజీ ప్రొఫెసర్ సాయిబాబాను బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ నిర్దోషిగా ప్రకటించింది.

వివరాలు 6లో ▸



భారత బలగాలు వద్దు

సాధారణ దుస్తుల్లోనైనా సరే భారత సైనిక సిబ్బంది తమ భూభాగంలో ఉండరాదని మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు అన్నారు.

వివరాలు 6లో ▸



డీకే శివకుమార్‌కు ఊరట

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై గతంలో నమోదైన మనీ లాండరింగ్ కేసును సుప్రీంకోర్టు కొట్టేసింది.

వివరాలు 6లో ▸



జలాంతర మెట్రో

కోల్‌కతాలోని అత్యంత లోతైన హౌరా మెట్రో స్టేషన్ గుండా నీటి అడుగున మెట్రో రైళ్లు పరుగులు పెట్టనున్నాయి.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

పచ్చ 'రోగం' ముదిరింది

- ఉద్దానం ప్రాజెక్టుతో గురివిందకు 'నీరుడు బంద్'!
- కిడ్నీ బాధితులకు అండగా నిలిచిన ప్రభుత్వంపై నిందలా?
- పలాసలో రూ.85 కోట్లతో వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రం
- రూ.700 కోట్లతో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్ట్ నిర్మాణం
- మార్కాపురం బోధనాస్పత్రిలో యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాలు.. డయాలసిస్ కోసం 37 రకాల ఉచిత మందులు

5 లో



విశాఖపట్నంలో నిర్వహించిన 'విజన్ విశాఖ' సదస్సుకు హాజరైన పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు



సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం జగన్

విశాఖలోనే ప్రమాణ స్వీకారం

ఎన్నికల్లో గెలిచి అక్కడి నుంచే పాలన: సీఎం జగన్

- రాష్ట్రానికి విశాఖ గ్రోత్ ఇంజిన్ లాంటిది
- పదేళ్లలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకి దీటుగా ఎదుగుతుంది
- వ్యవసాయంతోపాటు తయారీ, సేవా రంగాలూ వృద్ధి చెందాల్సిందే
- ఏపీలో ప్రతి 50 కి.మీ.కి పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్.. రూ.16 వేల కోట్లతో 4 కొత్త పోర్టుల నిర్మాణం
- 3 భారీ పారిశ్రామిక పార్కుల అభివృద్ధి
- స్వయం ఉపాధితో జీవన ప్రమాణాలను పెంపొందించాం
- నేను ఏ ప్రాంతానికీ వ్యతిరేకం కాదు.. శాసన రాజధానిగా అమరావతి
- విశాఖపట్నంపై ప్రతిపక్షాలు, మీడియా దుష్ప్రచారం
- 'విజన్ విశాఖ'ను ఆవిష్కరించిన సీఎం
- రానున్న ఐదేళ్లలో విశాఖ అభివృద్ధికి రూ.లక్ష కోట్లతో ప్రణాళిక..
- సచివాలయం ఐకానిక్ భవనం నమూనా ఆవిష్కరణ
- 'ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ విత్ సీఎం'లో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ఏరియల్ వ్యూ ద్వారా భోగాపురం ఎయిర్‌పోర్టు పనుల పరిశీలన

2 లో

నైపుణ్య శిక్షణలో విశ్వరూపం

'భవిత' ప్రారంభోత్సవంలో సీఎం వైఎస్ జగన్

నాణ్యమైన విద్య కోసం కరిక్యులమ్‌లో మార్పులు

జాబ్ ఓరియెంటెడ్ చదువులే మన లక్ష్యం

పరిశ్రమలే నేరుగా విద్యా సంస్థలతో కలిసి పనిచేస్తాయి.. స్కిల్ యాప్, లోగో, యాంథమ్‌ను ప్రారంభించిన సీఎం

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో పలు సంస్థల ఒప్పందాలు

10 లో

యువతరానికి దిక్సూచి 'భవిత'

ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోంది

కమిట్‌మెంట్ ఉన్న ముఖ్యమంత్రి

2 లో



'వెలిగొండ'.. కల సాకారం

యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు జంట సొరంగాలు పూర్తి.. నేడు జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్

మొదటి సొరంగం 2021 జనవరి 13 నాటికే పూర్తి

ఈ ఏడాది జనవరి 21 నాటికి రెండో సొరంగం తవ్వకం పనులు పూర్తి

4 లో

వాళ్లని అవినీతికి వాడుకుని..

వదిలేసిన చంద్రబాబు

చంద్రబాబు 'యూజ్ అండ్ త్రో' జాబితాలో ఉమా, గంటా, చింతమనేని, యరపతినేని

అధికారం ఉన్నప్పుడు పోలవరం, ఇతర ప్రాజెక్టుల్లో దేవినేని ఉమా అడ్డగోలు దోపిడీ

ఆ సొమ్ముతో జేబులు నింపుకున్న బాబు, లోకేశ్.. చింతమనేని మట్టి తవ్వకాలు, రౌడీయిజానికి అండ

విశాఖలో గంటాతో భూ దోపిడీలు.. మైనింగ్‌లో యరపతినేనితో రికార్డుస్థాయిలో అక్రమాలు

అప్పుడు దోపిడీకి వాడుకుని ఇప్పుడు టికెట్లు ఇవ్వకుండా వదిలించుకుంటున్న చంద్రబాబు

12 లో

బీసీలకు అండగా ఉంటాం

- బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చంద్రబాబు, పవన్
- 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చి రూ. 4 వేలకు పెంచేలా బాధ్యత తీసుకుంటాం
- చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాడతాం
- బీసీ డిక్లరేషన్‌కు జనసేన మద్దతిస్తుంది: పవన్ కళ్యాణ్

- వివరాలు 10లో

అప్పుడు విస్మరించి ఇప్పుడు డిక్లరేషనా?

- బీసీల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదు
- వలంటీర్ల గురించి మేం గర్వంగా ఫీలవుతాం
- బాబు తన జన్మభూమి కమిటీలను మళ్లీ తెస్తామని చెప్పగలరా?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల

- వివరాలు 10లో

హస్తినకు బీజేపీ అభ్యర్థుల జాబితా

- 25 లోక్‌సభ స్థానాలకు ఇద్దరు లేదా ముగ్గురి చొప్పున ఎంపిక
- 175 అసెంబ్లీ స్థానాలకు మూడేసి పేర్లతో నివేదిక
- శివప్రకాష్ నేతృత్వంలో జిల్లాల వారీగా పూర్తయిన భేటీలు

- వివరాలు 11లో

విశాఖలోనే ప్రమాణ స్వీకారం

ఎన్నికల్లో గెలిచి అక్కడి నుంచే పాలన: సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: రానున్న ఎన్నికల్లో గెలిచిన తర్వాత విశాఖపట్నం నుంచే పరిపాలన సాగించనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక వైజాగ్‌లోనే ప్రమాణ స్వీకారం కూడా చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రానికి వైజాగ్ గ్రోత్ ఇంజన్ లాంటిదని సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్రం ఆర్థికంగా సమగ్రాభివృద్ధి చెందాలంటే విశాఖ పరిపాలన రాజధాని కావాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఐదేళ్లలో విశాఖ అభివృద్ధికి రూ.లక్ష కోట్ల మేర వ్యయం చేయనున్నట్లు చెప్పారు. అయితే తాను ఏ ప్రాంతానికీ వ్యతిరేకం కాదని, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసమే విశాఖను పరిపాలన రాజధానిగా, శాసన రాజధానిగా అమరావతిని, న్యాయ రాజధానిగా కర్నూలును ప్రతిపాదించామని స్పష్టం చేశారు. ఇప్పటికే కనీస మౌలిక సదుపాయాలున్న విశాఖ నగరంపై కొద్దిగా శ్రద్ధ పెడితే పదేళ్లల్లో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాలతో పోటీపడుతుందన్నారు. 'విజన్ విశాఖ' సదస్సులో భాగంగా మంగళవారం విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2 వేల మందికిపైగా పారిశ్రామిక, వాణిజ్య వర్గాలతో సీఎం జగన్ సమావేశమయ్యారు. 'ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ విత్ సీఎం' అంశంపై ప్రసంగించి విజన్ విశాఖ డాక్యుమెంటరీని తిలకించారు. రానున్న ఐదేళ్లలో విశాఖ అభివృద్ధి ప్రణాళికతో కూడిన 'విజన్ విశాఖ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పరిపాలన రాజధాని విశాఖలో ఐకానిక్ కన్వెన్షన్ సెంటర్, అంతర్జాతీయ స్టేడియంతో పాటు ఐకానిక్ సెక్రటేరియట్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఐకానిక్ సెక్రటేరియట్ భవన నమూనాను కూడా సీఎం జగన్ ఆయన ఆవిష్కరించారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..



జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆర్థికాభివృద్ధిలో నగరాభివృద్ధి కీలకం

రాష్ట్రానికి విశాఖ ఎందుకు అవసరం? నగరాన్ని ఎలా తీర్చిదిద్దాలి? అనే అంశాలపై మనం చర్చించాల్సిన అవసరం ఉంది. విభజన తర్వాత ఏపీ వ్యవసాయాధారిత రాష్ట్రంగా మిగిలిపోయింది. దేశ వ్యాప్తంగా జీఎస్‌డీపీలో వ్యవసాయం వాటా సగటున 17–18 శాతం ఉంటే మన రాష్ట్రంలో 35 శాతం ఉంది. ద్వితీయ, తృతీయ రంగాలైన తయారీ, సేవా రంగాలు వృద్ధి చెందకుంటే రాష్ట్రం ఆర్థికంగా నిలబడలేదు. అవి శరవేగంగా వృద్ధి చెందితేనే మన ముందున్న సవాళ్లను అధిగమించి ఆశించిన మేరకు ఆర్థికాభివృద్ధిని సాధించగలం. విభజనతో హైదరాబాద్ నగరాన్ని కోల్పోవడం వల్ల రాష్ట్రం మీద పెను ప్రభావం పడింది. ఏ రాష్ట్రమైనా ఆర్థికంగా పురోగమించాలంటే ఒక చోదకశక్తి అవసరం. ఉమ్మడి రాష్ట్రంలో అలాంటి ఆర్థిక చోదక శక్తి అయిన హైదరాబాద్‌ను మనం కోల్పోయాం. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన ఐడీపీఎల్, ఎన్ఎండీసీ, ఎన్ఎఫ్‌సీ, ఐఐసీటీ లాంటివన్నీ అక్కడే ఉండటంతో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. అలాంటి సంస్థలు వస్తే అభివృద్ధి పరంగా వెంటనే మంచి మార్పు కనిపిస్తుంది. ఆ ప్రాంతంలో మంచి జీతాలు లభిస్తున్న ఉద్యోగులు ఉంటారు. మంచి సంస్థలు రావడం, మంచి ఆర్థిక ప్రగతి నమోదు ఒక సైకిల్ లాగా జరుగుతుంది. తద్వారా ఆ నగరం బాగా విస్తరిస్తుంది. ఉమ్మడి ఏపీకి కేటాయించిన ప్రభుత్వరంగ సంస్థల్లో 90 శాతం హైదరాబాద్‌లోనే స్థాపించడంతో అది వేగంగా అభివృద్ధి చెందింది. దురదృష్టవశాత్తూ ఉమ్మడి రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో అలా జరగలేదు.

విశాఖతో సేవా రంగం వాటా పెరుగుతుంది..

ఆర్థిక రంగాన్ని ముందుకు నడిపేది సేవారంగమే. జాతీయ స్థాయిలో చూస్తే జీఎస్‌డీపీలో సేవారంగం వాటా 55 శాతంగా ఉంది. తెలంగాణలో సేవా రంగం వాటా దాదాపు 62.87 శాతం. ఇందులో మెజార్టీ హైదరాబాద్ నుంచే వస్తోంది. మన రాష్ట్రంలో సేవా రంగం వాటా 40 శాతం మాత్రమే ఉంది. తయారీ రంగంలో జాతీయ స్థాయితో పోలిస్తే సమాన స్థాయిలో ఉన్నప్పటికీ సేవా రంగం విషయంలో మనం గణనీయ ప్రగతి సాధించాల్సిన అవసరం ఉంది. అది పెరిగినప్పుడే మన ఎకానమీ పెరుగుతుంది. 2022–23లో ఏపీ తలసరి ఆదాయం రూ. 2,19,518 కాగా తెలంగాణలో రూ. 3,12,398 గా ఉంది. తెలంగాణ తలసరి ఆదాయంలో అత్యధిక భాగం హైదరాబాద్ నుంచే వస్తోంది. ఏపీలో సేవా రంగం వాటా పెరగాలంటే హైదరాబాద్ లాంటి నగరాన్ని నిర్మించుకోవాలి. మహానగ రాలతో పోటీపడే సత్తా ఉన్న నగరం విశాఖ మాత్రమే.

మన బలం.. మన తీరమే

దేశంలోనే రెండో అతిపెద్ద సముద్రతీర ప్రాంతం మనకు ఉంది. 974 కి.మీ పొడవైన తీరం వల్ల పోర్టు ఆధారిత అభివృద్ధికి అవకాశం ఉంది. తద్వారా తయారీ రంగానికి మంచి అవకాశాలుంటాయి. పోర్టులను అభివృద్ధి చేయడం ద్వారా తయారీ రంగానికి సహకారాన్ని అందిస్తూ తీరం వెంట పారిశ్రామిక వాడలు, విశాఖను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. 2019కు ముందు ఏపీలో కేవలం 4 చోట్ల నుంచే ఎగుమతులు జరగ్గా మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.16 వేల కోట్లతో మరో 4 పోర్టులను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే రూ.4 వేల కోట్ల పైచిలుకు ఖర్చు చేశాం. రామాయపట్నం పోర్టుకు వచ్చే నెలలోనే షిప్పులు వచ్చే పరిస్థితి ఉంది. కాకినాడలోని ప్రైవేట్ పోర్టుతోపాటు మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు వేగంగా కొనసాగుతున్నాయి. 10 ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తున్నాం. తీరం వెంట ప్రతి 50 కి.మీ లకు పోర్టు లేదా ఒక ఫిషింగ్ హార్బర్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. అలాగే 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లనూ ఏర్పాటు చేస్తున్నాం.

భారీ పారిశ్రామిక పార్కులు..

పారిశ్రామిక నోడ్స్‌లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌ను నెలకొల్పాం. అచ్యుతాపురం, ఓర్వకల్లు, కృష్ణపట్నంలలో భారీ పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రమంతటా సమతుల్య అభివృద్ధి ఉండేలా చూస్తున్నాం. ప్రభుత్వ చర్యలు, వ్యాపార అనుకూల వాతావరణం వల్ల మూడేళ్లుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ తొలి స్థానంలో నిలిచింది. విశాఖ జీఐఎస్‌లో రూ.13 లక్షల కోట్లకుపైగా విలువైన 352 ఒప్పందాలు కుదిరాయి. దాదాపు 6 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

స్వయం ఉపాధికి ప్రోత్సాహం... కొత్తగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు

కేవలం భారీ పరిశ్రమల ద్వారా మాత్రమే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదు. అందుకే ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ స్వయం ఉపాధి మార్గాల వైపు నడిపిస్తోంది. లంచాలకు తావులేకుండా, దళారీలు లేకుండా డీబీటీ పద్ధతిలో ప్రయోజనాన్ని అందిస్తున్నాం. ఉదాహరణకు చేయూత పథకాన్నే తీసుకుంటే క్రమం తప్పకుండా ఒక్కో మహిళకు రూ.18,750 చొప్పున నాలుగేళ్లపాటు స్థిరంగా ఇచ్చాం. లబ్ధిదారులైన ఆ మహిళలను బ్యాంకులతో అనుసంధానం చేశాం. అమూల్, ఐటీసీ, రిలయన్స్, పీ అండ్ జీ లాంటి పెద్ద కంపెనీల భాగస్వామ్యంతో వారికి స్వయం ఉపాధి మార్గాలు చూపిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ఇలాగే అమలు చేసింది. ఉపాధి అవకాశాల్లో ప్రభుత్వ రంగ వాటా కొద్ది శాతమే. మేం అధికారంలోకి రాకముందు ప్రభుత్వ రంగంలో ఉన్న ఉద్యోగుల సంఖ్య 4 లక్షలు కాగా మేం వచ్చాక మరో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను అదనంగా కల్పించాం. దశాబ్దాలపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 4 లక్షలే కాగా 50 శాతం కొత్త ఉద్యోగాలను మేం వచ్చాక సృష్టించగలిగాం. ఉపాధిలో వ్యవసాయానిది కూడా ప్రముఖ పాత్ర. మన వ్యవసాయ రంగంపై 62 శాతం మంది ప్రజలు ఆధారపడి ఉన్నారు. 52 శాతం మంది రైతులకు అర హెక్టారు లోపే భూమి ఉంది. 70 శాతం మందికి హెక్టారు లోపే పొలం ఉంది. ఏపీలో సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నారు. వీరు ఆదాయాలు పొందలేకపోతే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. అందుకే రైతులకు ఆర్బీకేలు, అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా తోడుగా నిలుస్తున్నాం.

ఎంఎస్ఎంఈలకు అండగా..

అతి భారీ, భారీ పరిశ్రమల వల్ల 3 లక్షల నుంచి 4 లక్షల ఉద్యోగాలు వస్తే ఎంఎస్ఎంఈలు 30 లక్షల మంది ఉద్యోగాలు చేస్తున్నారు. 1.5 కోట్ల మందికి స్వయం ఉపాధి, ఆర్థిక వ్యవస్థ బలోపేతం వెనుక వీటి పాత్ర కీలకం. రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా స్వయం ఉపాధికి సహకారాన్ని అందిస్తోంది. రాష్ట్రంలో కోటిమందికి పైగా మహిళలు స్వయం సహాయ సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. మన ప్రభుత్వం రాకముందు స్వయం సహాయక సంఘాల రుణ బకాయిలు, ఎన్పీఏలు 80 శాతం వరకూ ఉంటే ఇప్పుడు 0.3 శాతం మాత్రమే ఉన్నాయి. సొంతంగా కార్లు, వాహనాలు నడుపుతూ జీవించేవారికి వాహనమిత్ర ద్వారా అండగా నిలుస్తున్నాం. కులవృత్తులు చేసుకుంటున్న నాయీబ్రాహ్మణులు, రజకులు, టైలర్లు లాంటి వారికి కూడా ప్రభుత్వం చేదోడుగా నిలిచింది. ఆర్థికాభివృద్ధిలో వీరందరిదీ కీలక పాత్ర. కోవిడ్ సంక్షోభ సమయంలోనూ ఎంఎస్ఎంఈలకు సకాలంలో ప్రోత్సాహకాలను విడుదల చేసి ప్రభుత్వం ఆదుకుంది. అందుకే వృద్ధి గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. 2018–19లో ఆర్థిక వృద్ధిరేటులో రాష్ట్రం చివరిలో ఉండగా గతేడాది మొదటి 5 రాష్ట్రాల్లో నిలవడం దీనికి నిదర్శనం.

విశాఖ అభివృద్ధికి రూ.లక్ష కోట్లు

రానున్న ఐదేళ్లలో విశాఖ అభివృద్ధికి రూ.లక్ష కోట్ల మేర వ్యయం చేయనున్నట్లు 'వైజాగ్ విజన్' డాక్యుమెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. అవి ఏమిటంటే...

- కనెక్టివిటీలో భాగంగా రూ.8,980.82 కోట్లతో 12 ఫ్లై ఓవర్ల నిర్మాణం, 6 లైన్ల బీచ్ కారిడార్ ప్రాజెక్టు, సబ్బవరం నుంచి షీలానగర్‌కు 6 లైన్ల రహదారి, షీలానగర్ నుంచి పోర్టు వరకు రోడ్డు నిర్మాణం. మరో రూ.1906.15 కోట్లతో నగరంలో వివిధ రోడ్ల నిర్మాణం.
- ఫ్రైట్ కారిడార్‌లో భాగంగా రూ.196 కోట్లతో కొత్త సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు, శ్రీకాకుళం నుంచి సింహాచలం వరకు ఫ్రైట్ కారిడార్.
- రూ. 14,309 కోట్లతో విశాఖ మెట్రోరైలు ప్రాజెక్టు
- రూ. 4,727 కోట్లతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం.
- పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా రూ.2,633.47 కోట్లతో కనమాం వద్ద ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు, మురుగునీరు శుద్ధి ప్లాంటు, కోడూరు వద్ద ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణం వగైరా.
- రూ. 10,823 కోట్ల పారిశ్రామిక పెట్టుబడుల్లో భాగంగా ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుతో పాటు టీవీఎస్ లాజిస్టిక్స్, జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు తదితరాలు.
- రూ. 975 కోట్లతో విశాఖలో 24 గంటలు మంచినీటి సరఫరా పథకం
- రూ. 1,703 కోట్లతో నగరంలో మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు
- సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా రూ. 50 కోట్లతో 100 పార్కుల అభివృద్ధి, రూ. 250 కోట్లతో 151 చెరువుల అభివృద్ధి ప్రాజెక్టును రానున్న 5 ఏళ్లలో చేపట్టనున్నారు.
- రూ. 300 కోట్లతో అంతర్జాతీయ స్టేడియం నిర్మాణం
- నగరంలో రూ.169.3 కోట్లతో ఇండోర్ స్టేడియంల నిర్మాణం
- రూ. 33.33 కోట్లతో అత్యాధునిక శ్మశానవాటికల నిర్మాణం
- రూ.40 కోట్లతో అమ్యూజ్‌మెంట్, ఫన్ జోన్లు ఏర్పాటు.
- రూ. 87.5 కోట్లతో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ నిర్మాణం.
- రూ. 108 కోట్లతో నేచురల్ హిస్టరీ పార్కు, రూ. 220 కోట్లతో కన్వెన్షన్ సెంటర్, రూ. 18 కోట్లతో నేచురల్ కాటేజెస్ నిర్మాణం, రూ. 394.8 కోట్లతో బీచ్ డెక్, సైన్స్ మ్యూజియం నిర్మాణం.
- రూ.178.22 కోట్లతో ఎకో వైజాగ్ పేరుతో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు నిర్మాణం, వనాల నిర్మాణం, రూ.16 కోట్లతో బీచ్ క్లీనింగ్ కార్యక్రమం.
- వీటితో పాటు రూ.4,039.20 కోట్లతో జగనన్న కాలనీల నిర్మాణం. రూ.1250 కోట్లతో మాల్స్, గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటు

ఎందుకీ ఏడుపులు..?

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను శరవేగంగా ముందుకు ఎలా తీసుకెళ్లాలన్న దానిపై ఇప్పుడు మనం ఆలోచన చేయాలి. విశాఖ విషయంలో మనం ఏం చేయాలి? నగర అభివృద్ధి చరిత్రను ఎలా మార్చాలి? వచ్చే పదేళ్లలోగా మనం మహా నగరాలతో ఎలా పోటీపడాలన్నదానిపై దృష్టి సారించాలి. ఇదే విజన్ విశాఖకు అర్థం, పరమార్థం కావాలి. ఈ ప్రాంతం, నగరం పట్ల అభిరుచి, అంకిత భావం, చిత్తశుద్ధి లేకపోతే ఈ విజన్ సాకారం కాదు. వాస్తవంలోకి రాదు. అన్నిటికంటే ముందు.. ఒక సీఎంగా ఉన్న నేను ఇక్కడకు వచ్చి నివాసం ఉండాలి. నేను ఈ మాట చెప్పగానే ఏపీలో ఉన్న ప్రతిపక్షాలు, సొంత ప్రయోజనాలున్న నెగెటివ్ మీడియా ఒక్కసారిగా భోరున విలపిస్తాయన్న సంగతి మీకు తెలిసిందే. వైజాగ్‌కు మారుస్తున్నామంటే చాలు.. భూములు కబ్జా చేయడానికే వస్తున్నారంటూ సిగ్గు లేకుండా కథనాలు వ్యాప్తి చేస్తున్నారు. కోర్టులకు వెళ్లి కేసులు వేస్తున్నారు. ఇవన్నీ వాళ్లు ఎందుకు చేస్తున్నారంటే?..సీఎం అనే వ్యక్తి ఇక్కడకు వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది! ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా పురోగతి సాధిస్తుంది! అందుకే సీఎం ఇక్కడకు రాకూడదని అడ్డుపడుతున్నారు. దీనివెనుక వారికి స్వార్థ ప్రయోజనాలున్నాయి. అమరావతి రాజధాని ప్రకటనకు ముందే వేలాది ఎకరాలను బినామీల పేర్లతో కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీశారు.

స్వప్రయోజనం ఆశిస్తే కడప అనలేనా?

హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో మనం పోటీపడాలంటే వైజాగ్ ఎకనామిక్ గ్రోత్ ఇంజన్ లాంటిది. రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక చోదకశక్తి కావాల్సిందే. నిజంగా నాకేమైనా స్వప్రయోజనం ఉంటే నేను కడప గురించి మాట్లాడేవాడిని. భవిష్యత్తు తరాలకు ఏది చేస్తే మంచిది? ఏం చేయడం వల్ల రాష్ట్ర ఆదాయాలు పెరుగుతాయి? దేనివల్ల ఆర్థికంగా పురోగమిస్తాం? అనే ఆలోచన చేయకపోతే అన్యాయం చేసిన వాళ్లమవుతాం. ఈ కోణంలో మనం వైజాగ్ గురించి ఆలోచించలేకపోతే ఇంకెవరు ఆలోచిస్తారు? అని అంతా ప్రశ్నించుకోవాలి. నాయకుడి దార్శనికత సరిగా లేకపోతే వైజాగ్ అభివృద్ధి చెందదు. కార్యనిర్వాహక రాజధానిగా విశాఖ కోసం ఎవరైనా గట్టిగా నిలబడ్డారంటే.. అది నేను మాత్రమే. విశాఖ కోసం ప్రతిపక్షాలతో, ఎల్లో మీడియాతో పోరాడుతున్నాం. వారిలో ప్రతి ఒక్కరూ విశాఖ కార్యనిర్వాహక రాజధాని కాకూడదని కోరుకుంటున్నారు. కోర్టు కేసులు నడుస్తున్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత నేను విశాఖలోనే నివాసం ఉంటా. నా ప్రమాణ స్వీకారోత్సవం కూడా విశాఖలోనే జరుగుతుంది. వైజాగ్ పట్ల నాకున్న కృతనిశ్చయం ఇది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాఖలో రూ.1,528.92 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సీఎం జగన్ శంకుస్థాపనలు నిర్వహించారు.

- రూ. 595 కోట్లతో మధురవాడలో పారిశ్రామిక, గృహ అవసరాల కోసం నీటి సరఫరా ప్రాజెక్టు పనులు
- రూ. 553 కోట్లతో మధురవాడలో సమగ్ర మురుగునీటి వ్యవస్థ పనులు, రూ. 99.47 కోట్లతో ముడసర్లోవ ప్రాంతంలో జీవీఎంసీ కొత్త సమీకృత కార్యాలయ నిర్మాణం.
- రూ. 231.04 కోట్లతో అమృత్ పథకం కింద వివిధ జోన్లలో సమగ్ర నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు పనులు.
- రూ. 15.65 కోట్లతో సాగర్‌నగర్ తాబేలు బీచ్ నిర్మాణ పనులు.
- రూ. 34.76 కోట్లతో ఎన్‌హెచ్–16కి సమాంతరంగా గిరి ప్రదక్షిణ రహదారి విస్తరణ పనులు.

పదేళ్ల విజన్‌తో విశాఖ

విశాఖ అభివృద్ధి కోసం పదేళ్ల విజన్‌తో వాస్తవిక దృక్పథంతో ప్రణాళిక రూపొందించాం. రాష్ట్ర ప్రభుత్వమే కాకుండా కేంద్రం,పీపీపీ పద్ధతుల్లో అందరూ ఇందులో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది. పదేళ్లలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు పోటీగా విశాఖను తీర్చిదిద్దేలా ఈ విజన్ ఉంటుంది. రాజధానిగా అమరావతి ఆలోచనను నేను ఎందుకు వ్యతిరేకించాలి? అలాంటి వ్యతిరేకత కూడా నాకేమీ లేదు. శాసన రాజధానిగా అమరావతిని ప్రకటించిందీ, నిర్ణయించిందీ నేనే. కర్నూలును కూడా న్యాయ రాజధానిగా ప్రకటించింది నేనే. నాకేమీ ఎలాంటి వ్యతిరేకతా లేదు.

ముందుగానే రూ.లక్ష కోట్లు ఖర్చు

అమరావతి అనేది 50 వేల ఎకరాల ఖాళీ భూమి. రోడ్లు, నీళ్లు, విద్యుత్ లాంటి కనీస సదుపాయాలు కల్పించడానికే వాళ్లు ఇచ్చిన డీపీఆర్ ప్రకారం ఎకరాకు రూ.2 కోట్లు ఖర్చు అవుతుంది. అమరావతి ప్రాంతంలో భవనాలు రావాలంటే ముందు కనీసం రూ.లక్ష కోట్లు పైనే ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇవాళ మనం ఒక లక్ష కోట్లు అనుకుంటే 20 ఏళ్లలో ఏటా రూ.5 వేల కోట్లు చొప్పున వేసుకుంటే సుమారుగా రూ.10 లక్షల కోట్లో, ఖర్చులు పెరిగి రూ.15 లక్షల కోట్లో అయినా అవుతుంది. అందుకనే అక్కడ అది చేయలేమని అంటున్నాం. అమరావతి ఆలోచనకు నేను వ్యతిరేకం కాదు. వైజాగ్‌లో ఇప్పటికే కనీస మౌలిక సదుపాయాలున్నాయి. మంచి రోడ్లు, కరెంటు, తాగునీటి సదుపాయం.. ఇలా అన్నీ ఉన్నాయి. కొన్ని మెరుగులు దిద్దితే సరిపోతుంది. వీటితో సిటీ రూపురేఖలు గణనీయంగా మారుతాయి. కార్యనిర్వాహక రాజధానిగా ఇక్కడకు మారే సమయంలో ఉద్యోగులు పనిచేసుకునేందుకు ఐకానిక్ సెక్రటేరియట్ ఉండాలి. అది దేశం దృష్టిని ఆకర్షించాలి. దేశం అంతా ఇటు చూసేలా ఐకానిక్ కన్వెన్షన్ సెంటర్, అహ్మదాబాద్ తరహాలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం కూడా ఉండాలి. వాటి రాకతో వైజాగ్ స్థాయి పెరుగుతుంది. దేశమే కాకుండా ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక అంశాలను బోధించేలా ఎమర్జింగ్ టెక్నాలజీ యూనివర్సిటీ కూడా రావాలి. రానున్న 15–18 నెలల్లో పూర్తి చేసేలా భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. భోగాపురం ఎయిర్ పోర్టును అనుసంధానించేలా 6 లేన్లతో అందమైన బీచ్ కారిడార్ రోడ్డు ప్రాజెక్టు కూడా రావాల్సి ఉంది. మెట్రో రైలు ప్రాజెక్ట్, ఏడాదిలోగా ప్రారంభమయ్యే మూలపేట పోర్టుతో హారిజాంటల్ గ్రోత్ కారిడార్ ఏర్పడుతుంది. డేటా సెంటర్‌తో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయి. ఆతిథ్య రంగంలో ఒబెరాయ్, మై ఫెయిర్ పెట్టుబడులు పెట్టబోతున్నాయి. నగరానికి అత్యుత్తమ ఫైవ్ స్టార్ సదుపాయాలు సమకూరుతాయి. ఎన్టీపీసీ, గ్రీన్ హైడ్రోజన్ రూపంలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయి. ప్రధాని తాజాగా దీనికి వర్చువల్‌గా శంకుస్థాపన కూడా చేశారు. ఇవన్నీ సాధ్యం కానివేమీ కాదు. ఇవన్నీ వాస్తవ రూపంలోకి వచ్చేవే. వచ్చే పదేళ్లలో ఇవన్నీ రాబోతున్నాయి. హైస్పీడ్ రైలు కారిడార్లపై కూడా ప్రధానితో మాట్లాడుతున్నాం. హైదరాబాద్ – వైజాగ్, విజయవాడ– బెంగళూరుల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లకోసం సంప్రదిస్తున్నాం. ఇవన్నీ రావడమే కాకుండా సీఎం కూడా ఇక్కడకు వస్తే పదేళ్లలో వైజాగ్ ప్రపంచంలో అత్యుత్తమ నగరాలతో పోటీపడుతుంది. ఎన్ని అడ్డంకులున్నా, అవరోధాలున్నా విశాఖ నగర వాసులకు నేను ఒకటే చెబుతున్నా.. మనం తప్పకుండా విజయం సాధిస్తాం.

యువతరానికి దిక్సూచి 'భవిత'

- ఏపీ ప్రభుత్వ నైపుణ్య శిక్షణకు పారిశ్రామిక ప్రతినిధుల ప్రశంస
- విద్యార్థులు, పారిశ్రామిక ప్రతినిధులతో సమావేశం అద్భుత అంశం
- పరిశ్రమలకు మానవ వనరుల్ని అందించడంలో సీఎం కృషి ఎనలేనిది
- ఏపీ యువతని సానబెడితే అన్ని రంగాల్లోనూ రాణిస్తారు
- స్కిల్ పేరుతో గత ప్రభుత్వం రూ. కోట్లని వృథా చేసింది: మంత్రి బుగ్గన
- ఏపీ స్కిల్ ప్రోగ్రామ్ మా భవితని మార్చేసింది: ఉద్యోగాలు పొందిన యువత

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చూపిస్తున్న చొరవకు పారిశ్రామికవేత్తలు ఫిదా అయ్యారు. 'భవిత' పేరుతో ప్రారంభించిన స్కిల్ కాస్కేడింగ్ కార్యక్రమం.. యువత భవిష్యత్తుకు దిక్సూచిగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఏపీలో నైపుణ్య శిక్షణ ద్వారా పరిశ్రమలకు అవసరమైన మ్యాన్ పవర్ దొరుకుతోందని.. ఇక్కడ విద్యార్థుల్ని సానబెడితే అన్ని రంగాల్లోనూ రాణించగల సత్తా ఉందని సూచించారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం.. తమలాంటి ఎందరో యువతీ యువకుల జీవన స్థితిగతుల్ని మార్చేసిందని ఉద్యోగాలు పొందిన యువత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

స్కిల్లింగ్ ఎకో సిస్టమ్‌ని అభివృద్ధి చేసిన ఏపీ..



ఏపీలో యంగ్ సీఎం ఉన్నారు. అందుకే యువతకి అవకాశాలు ఎక్కువగా కల్పించాలన్న ఆలోచనలతో అడుగులు వేస్తున్నారు. సింగపూర్‌లో స్కిల్లింగ్‌కి ఏజ్ బార్ లేదు. ఇక్కడ కూడా అదే జరుగుతోంది. దేశంలో స్కిల్లింగ్ ఎకోసిస్టమ్‌ని అభివృద్ధి చేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. పదిస్థాయిల్లో శిక్షణ అందించేలా స్కిల్ పిరమిడ్‌ను కూడా సీఎం జగన్ రూపొందించారు. యువతకి నైపుణ్యాన్ని పెంపొందించే ప్రోగ్రామ్‌ని కూడా తయారు చేశారు. పరిశ్రమలతో అనుసంధానం చేయడంతో వారికి కావాల్సిన సాంకేతిక నైపుణ్యం ఉన్న యువతకు ఉపాధి కల్పిస్తున్నారు.

– బుగ్గన రాజేంద్రనాథ్, రాష్ట్ర ఆర్థిక, స్కిల్‌డెవలప్‌మెంట్ శాఖ మంత్రి

కెమికల్ ఇంజనీర్స్ అవసరం చాలా ఉంది



ఏపీ సెజ్ అచ్యుతాపురంలో మా సంస్థని ఏర్పాటు చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆటమిక్ రీసెర్చ్ ఉత్పత్తుల్లో ఎంతో ఉన్నతి సాధించాం. కెమికల్ ప్రాసెసింగ్ వైపు కూడా మా సంస్థ అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో మాకు కెమికల్ ఇంజనీర్స్ అవసరం ఎంతో ఉంది. నేరుగా నియామకం చేసుకోవాలని భావిస్తున్నాం. ఇందుకోసం రాష్ట్ర స్కిల్ డెవలప్ మెంట్ సొసైటీతో కలిసి పనిచేస్తున్నాం. విద్యార్థులకు మాకు అవసరమైన రీతిలో శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తాం. పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల్ని అందించడంలో సీఎం వైఎస్ జగన్ చేస్తున్న కృషి అనిర్వచనీయం.

– కొయిచీ సాటో, టొయేట్సు రేర్ ఎర్త్ ప్రై.లి., ఎండీ

ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోంది



సీఎం జగన్ ప్రభుత్వం మా సంస్థని, పెట్టుబడుల్ని ఎంతగానో ప్రోత్సహి స్తోంది. రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు రావాలని ఆశిస్తున్నాం. స్కిల్ సెక్టార్ కు ఇది గొప్ప అడుగు. స్కిల్ ఎకో సిస్టమ్‌ని అభివృద్ధి చేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం చర్యలకు నిజంగా అభినందనలు. కియా మోటార్స్ ఇండియా ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌ని శ్రీ సత్యసాయి జిల్లాలో ఏర్పాటు చేశాం. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థల ద్వారా అద్భుత అవకాశాలు ఏపీలో ఉన్న యువతకు అందుతున్నాయి.

–కె.గ్వాంగ్‌లీ, కియా మోటర్స్ ఎండీ

సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు



నేను మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేశాను. అప్పుడు ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో 45 రోజులు శిక్షణ తీసుకున్నాను. శిక్షణలో నేను చాలా నేర్చుకున్నాను. మెషిన్ ఆపరేటింగ్, సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పారు. 2021లో ఏషియన్ పెయింట్స్ వారి ఇంటర్వ్యూలకు హాజరై ఎగ్జిక్యూటివ్ ట్రైనీగా ఏడాదికి రూ. 5 లక్షల ప్యాకేజీలో సెలక్ట్ అయ్యాను. ఇప్పుడు ఎగ్జిక్యూటివ్‌గా ఏడాదికి రూ. 7.2 లక్షల ప్యాకేజీ తీసుకుంటున్నాను. మా కుటుంబానికి నేను ఇప్పుడు చాలా ఆసరాగా ఉన్నాను. ఈ విధమైన శిక్షణ ఇచ్చిన ఏపీ ప్రభుత్వానికి, సీఎంకు నా కృతజ్ఞతలు. – భార్గవ్, విశాఖపట్నం

నేను కోరుకున్న ఫీల్డ్‌లో స్థిరపడ్డాను



మాది విశాఖపట్నం పెదగంట్యాడ. మా నాన్న లిఫ్ట్ ఆపరేటర్, అమ్మ గృహిణి, నాకు ఒక సోదరి కూడా ఉంది. మేం ఇద్దరం జగనన్న ప్రభుత్వం ఇచ్చిన విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా లబ్ధిపొంది చదువుకున్నాం. నా గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఆటోమేషన్‌లో స్థిరపడాలని సీడాప్ ద్వారా స్కిల్ కాలేజీలో జాబ్ ఓరియెంటెడ్ కోర్సు గురించి తెలుసుకొని రిజిస్టర్ చేసుకొని ట్రైనింగ్ తీసుకున్నాను. మాకు టెక్నికల్ స్కిల్స్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్పించారు. అనేక ప్రముఖ కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. నేను రెండు కంపెనీలలో మంచి ప్యాకేజ్‌కు ఎంపికయ్యాను. చెన్నైలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో 4 రౌండ్ల ఇంటర్వ్యూ తర్వాత గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీగా సెలక్ట్ అయ్యాను.

– దీపిక, గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ కంపెనీ, చెన్నై


కమిట్‌మెంట్ ఉన్న సీఎం జగన్



దేశంలో ఇప్పటి వరకూ చాలా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు హాజరయ్యాను. ఇలాంటి కమిట్‌మెంట్ ఉన్న ప్రభుత్వాన్ని ఇంతవరకూ చూడలేదు. యువత ముందే పారిశ్రామికవేత్తల్ని కమిట్‌మెంట్ ఇవ్వాలని చెప్పడం అద్భుతం. మా సంస్థ విమానాలు తయారు చేస్తుంది. భవిష్యత్తులో విమానయానంలో ఎన్నోరకాల ఉపాధి అవకాశాలున్నాయి. లెర్నింగ్ వింగ్స్ ఫౌండేషన్ అనే స్కిల్లింగ్ భాగస్వామితో పని చేస్తున్నాం. మా సంస్థ సామర్థ్యం మేరకు స్కిల్ ఎకో సిస్టమ్‌కు మద్దతు అందిస్తాం.

– ప్రవీణ యజ్ఞంభట్, బోయింగ్ ఇండియా చీఫ్ ఆఫ్ స్టాఫ్

మానవవనరుల్లో మనమే ముందంజ..



అత్యధికంగా నైపుణ్యంతో కూడిన మానవ వనరులున్న రాష్ట్రంగా ప్రభుత్వం తీర్చిదిద్దడంతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ ముందు వరసలో ఉంది. స్కిల్ ట్రైనింగ్ అనేది కేవలం ఉపాధి అవకాశాల్ని అందిస్తోంది. ఐదేళ్లలో 15 లక్షల మంది యువతకు శిక్షణ ఇవ్వగా.. 3.8 లక్షల మందికి ఉపాధి కల్పించాం. ఇంకొందరు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారు. సీఎం జగన్ 27 స్కిల్ కాలేజీలు, 192 స్కిల్ హబ్స్, 55 స్కిల్ స్పోక్స్ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు. భవిత పేరుతో శిక్షణని అప్‌గ్రేడ్ చేస్తున్నాం.

– సురేష్‌కుమార్, ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చెందుతుంది

విశాఖ అభివృద్ధిపై సీఎం జగన్ పోస్ట్

సాక్షి,అమరావతి: కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం అభివృద్ధి చెందుతుందని, రానున్న పదేళ్లలో విశాఖ అభివృద్ధి పై చేపట్టాల్సిన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశామని సీఎం జగన్ పేర్కొన్నారు. 'ఎన్నికల అనంతరం సీఎంగా నా రెండో ప్రమాణ స్వీకారం విశాఖలోనే ఉంటుంది. నేను ఇక్కడే నివాసం ఉంటాననీ హామీ ఇస్తున్నా.. వైజాగ్ మీద నా నిబద్ధత అది' అని మంగళవారం సీఎం జగన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

భోగాపురం పనులను పరిశీలించిన సీఎం

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం పనులను సీఎం జగన్ ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. మంగళవారం విశాఖ పర్యటన సందర్భంగా హెలికాప్టర్ నుంచి ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల పురోగతిని గమనించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

నేడు ప్రకాశం జిల్లాలో సీఎం జగన్ పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ బుధవారం ప్రకాశం జిల్లాలో పర్యటించనున్నారు. ఇందుకోసం బుధవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి దోర్నాల మండలం ఎగువ చెర్లోపల్లికి సీఎం జగన్ చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం వ్యూ పాయింట్ నుంచి వెలిగొండ ప్రాజెక్ట్‌ను, రెండో టన్నెల్‌ను పరిశీలిస్తారు. ఆ తర్వాత పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్‌ను సీఎం జగన్ జాతికి అంకితం చేస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లికి చేరుకుంటారు.

సైనికుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి

గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్


సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, అమరావతి: సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో మంగళవారం జరిగిన రాష్ట్ర సైనిక సంక్షేమ బోర్డ్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. సైనికులు, వారి కుటుంబాల కోసం ఉద్దేశించిన పథకాలు, కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర సైనిక సంక్షేమ బోర్డ్ డైరెక్టర్ వి.వెంకట రెడ్డి సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రోత్సాహకాల కింద అందిస్తోన్న మొత్తాన్ని పెంచేందుకు ప్రతిపాదనలను సమర్పించారు. సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా, సైనిక సంక్షేమ బోర్డ్ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ వేదికగా పాలన ప్రకటన హర్షణీయం

1,255వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: విశాఖ వేదికగా పరిపాలన కొనసాగిస్తానని సీఎం జగన్ ప్రకటించడం అభినందనీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,255వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. బాబు అండ్ కో అధికారం కోసం ఎల్లో మీడియా, అమరావతిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయాలనుకుని బొక్క బోర్లా పడిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పరిపాలనా రాజధానిగా విశాఖను స్పష్టంగా ప్రకటించడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. మాదిగాని గురునాథం, పల్లె బాబు, కొమరవల్లి కిషోర్ బాబు, బోదాల సలోమీ, పులి దాసు, బోదాల సౌమ్య, ఈపూరి ఆదాం, పుష్పరాజు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ ఎనలేని కృషి

సినీ నటుడు సుమన్ ప్రశంస



వీరఘట్టం: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సీఎం జగన్ ఎనలేని కృషి చేస్తున్నారని సినీ నటుడు సుమన్ ప్రశంసించారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కత్తులకవిటిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథి సుమన్ మాట్లాడుతూ నాడు-నేడుతో రాష్ట్రంలో అన్ని పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చారని చెప్పారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో విరిగిపోయిన బెంచీలు, పగిలిపోయిన గచ్చులు, టాయిలెట్ల కోసం ఆరుబయటకు పరుగులు తీస్తున్న విద్యార్థులు... వంటివి కనిపించేవని తెలిపారు. కానీ ఇప్పుడు పల్లెల్లోని పాఠశాలలను పట్టణాల్లో ఉండే కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తాను ఎంతోమంది సీఎంలను చూశానని, అయితే పేదల చదువుపై ఇంత బాగా దృష్టి పెట్టినది వైఎస్ జగన్ మాత్రమేనని చెప్పారు. మనకు మేలు చేసేవారిని మరువకూడదని సుమన్ పేర్కొన్నారు.

ఈవీఎంల వినియోగం, నిర్వహణపై శిక్షణ

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణ, వాటి వినియోగంలో నోడల్ అధికారులు ఎదుర్కొంటున్న సందేహాలను హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈసీఐఎల్ అధికారులు సీనియర్ డీజీఎం రాజు, ఇంజినీర్ ఆదిత్యలు నివృత్తి చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రెండో రౌండ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ఈవీఎం నోడల్ అధికారులు, సాంకేతిక సహాయకులు ప్రత్యక్షంగాను, అరుణాచల ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాలకు చెందిన అధికారులు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీఈవో పి.తాతబ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.


బాసిత్తు పెంటారావు, వసంత కుమారికి రూ.లక్ష చెక్కును అందజేస్తున్న ఆర్ఐ కె.ప్రవీణ్


ప్రసన్నకుమార్‌కు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న ఆర్ఐ కె.ప్రవీణ్


మద్దాల రాంబాబు, జ్యోతిలకు రూ.లక్ష అందజేస్తున్న రూరల్ తహసీల్దార్ నరవ శివన్నారాయణ

వేదన విన్నారు.. ఆదుకున్నారు

అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి సాయం చేయాలని సీఎం ఆదేశం

- వెంటనే సాయం అందించిన రెవెన్యూ అధికారులు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): విజన్ విశాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని జిల్లాకు చెందిన ముగ్గురు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆ ముగ్గురికీ తక్షణమే ఆర్థిక సాయం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వెంటనే జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున చెక్కులను సమకూర్చగా.. రెవెన్యూ అధికారులు బాధితుల ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. ఎండాడకు చెందిన మద్దాల జ్యోతి సీఎంను కలిసి తన భర్త మద్దాల రాంబాబు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నారని.. వైద్యం కోసం ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేసింది. పీఎం పాలెంకు చెందిన యు.ఉమాదేవి తన 15 ఏళ్ల కుమారుడు ప్రసన్నకుమార్ రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని.. సాయం చేయాలని సీఎంకు విన్నవించుకుంది. ఎండాడ సుభాష్ నగర్‌కు చెందిన బాసిత్తు వసంతకుమారి తన భర్త పెంటారావు బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారని మొరపెట్టుకుంది. అలాగే తన కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ఆమె అభ్యర్థించింది. బాధితులందరికీ ఆర్థిక సాయం అందించటంతో పాటు మెరుగైన వైద్య చికిత్స చేయించాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. దీంతో కలెక్టర్ మల్లికార్జున తక్షణ చర్యలు చేపట్టారు. విశాఖ రూరల్ తహసీల్దార్, ఇతర అధికారులను బాధితుల ఇళ్ల వద్దకే పంపించి ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేయించారు.

కేబినెట్ నుంచి మంత్రి గుమ్మనూరు బర్తరఫ్

సాక్షి,అమరావతి: రాష్ట్ర మంత్రివర్గం నుంచి మంత్రి గుమ్మనూరి జయరాం బర్తరఫ్ అయ్యారు. సీఎం జగన్ సిఫార్సు మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మంగళవారం మంత్రిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తూ ఆదేశాలిచ్చారు.

ఉద్యోగుల సస్పెన్షన్ వ్యవధి ఏడాదికి తగ్గింపు


సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సస్పెన్షన్ కాల వ్యవధిని రెండేళ్ల నుంచి సంవత్సరానికి తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం ఏసీబీ కేసులతో పాటు శాఖాపరమైన విచారణల్లో సస్పెన్షన్ వేటుపడిన ప్రభుత్వ ఉద్యోగుల సస్పెన్షన్ కాల వ్యవధి రెండేళ్లు ఉంది. నిర్దేశించిన అన్ని షరతులకు లోబడి ప్రభుత్వ ఉద్యోగి సస్పెన్షన్ నాటి నుంచి రెండేళ్లు పూర్తి అయితే సస్పెన్షన్‌ను తొలగించాలనే నిబంధన ఉంది. ఇప్పుడు సస్పెన్షన్ తేదీ నుంచి ఏడాది పూర్తి అయితే షరతులకు లోబడి సస్పెన్షన్‌ను తొలగించవచ్చునని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. గతంలో ఉద్యోగులను సస్పెన్షన్ చేసిన తరువాత ప్రతీ ఆరు నెలలకో సారి సమీక్షించి, షరతులకు లోబడి సస్పెన్షన్‌ను తొలగించవచ్చు. ఇప్పుడు ప్రతీ నాలుగు నెలలకో సారి సమీక్షించాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇందుకనుగుణంగా సచివాలయ అన్ని శాఖలతో పాటు శాఖాధిపతులు కార్యాలయాలు, కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో ఆదేశించారు.

7న ఈజిప్ట్, యూరప్ ప్రతినిధుల బృందం పర్యటన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసేందుకు ఈజిప్ట్, యూరప్ దేశాలకు చెందిన అత్యున్నత ప్రతినిధుల బృందం ఈ నెల 7వ తేదీన రాష్ట్రంలో పర్యటించనుంది. ప్రపంచ వ్యాప్తంగా సామాజిక అభివృద్ధి, పర్యావరణంలో మార్పు కోసం కృషి చేస్తున్న 100 అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేస్తోన్న ఎన్ ఓడబ్ల్యూ, యూరోపియన్ ఇన్నొవేషన్ ట్రస్ట్, షేకేమ్ సంస్థల ప్రతినిధులు వాల్టర్ లింక్, లూసీ వాలెస్, మెల్లిసా, హెల్మీ అబౌలీష్, అమర్ సహాబి, జస్టస్ హాని, అబౌలీష్‌ల నేతృత్వంలోని ఈ బృందాలు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలలో పర్యటించనున్నాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తోన్న పలువురు రైతులతో భేటీ కానున్నాయి. రైతు క్షేత్రాలను కూడా సందర్శించి వారు అనుసరించే పద్ధతులపై అధ్యయనం చేయనున్నాయి. రసాయన వ్యవసాయ క్షేత్రాలను కూడా సందర్శించి ఫలితాలను పోల్చి చూడనున్నాయి.

నల్లమలసాగర్ రిజర్వాయర్ సమగ్ర స్వరూపం

పూర్తి నీటినిల్వ సామర్థ్యం	వినియోగించే జలాలు	గరిష్ఠ నీటి మట్టం	కనీస నీటి మట్టం	డెడ్ స్టోరేజ్
53.85 టీఎంసీలు	43.50 టీఎంసీలు	244 మీటర్లు (సముద్ర మట్టానికి)	214.3 మీటర్లు	10.35 టీఎంసీలు


వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాలు, ఫీడర్ చానల్

పంటలకు అవసరమైన జలాలు **38.57 టీఎంసీలు**


తాగునీటికి కేటాయించినవి **1.57 టీఎంసీలు**

ఆవిరి నష్టాలు **3.36 టీఎంసీలు**

వెలిగొండ .. కల సాకారం

యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు జంట సొరంగాలు పూర్తి.. నేడు జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్

- ఆసియాలోనే అత్యంత పొడవైన సొరంగాలను పూర్తిచేసి చరిత్ర సృష్టించిన ప్రభుత్వం
- ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్న సీఎం జగన్
- ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల దుర్భిక్ష ప్రాంతాల్లోని 4.47 లక్షల ఎకరాల్లో సాగునీటి సరఫరాకు మార్గం సుగమం
- ఆ జిల్లాల్లోని 30 మండలాల్లో 15.25 లక్షల మంది తాగునీటి సమస్యకు చెక్
- దొనకొండలో మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు 2.58 టీఎంసీలు, పామూరు నిమ్జ్‌కు 1.27 టీఎంసీలు సరఫరాకు లైన్‌క్లియర్



సాక్షి, అమరావతి: ప్రజాసంకల్ప పాదయాత్రలో రైతులకిచ్చిన మరో మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో దుర్భిక్ష ప్రాంతాల ప్రజల దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును సాకారం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వెలిగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమలసాగర్‌కు కృష్ణా జలాలను తరలించేందుకు వీలుగా మొదటి టన్నెల్‌ను 2021, జనవరి 13 నాటికి పూర్తిచేయించిన సీఎం జగన్.. రెండో టన్నెల్ తవ్వకం పనులను ఈ ఏడాది జనవరి 21 నాటికి పూర్తిచేయించారు. ఆసియా ఖండంలోనే అత్యంత పొడవైన నీటిపారుదల సొరంగాల (ఇరిగేషన్ టన్నెల్స్)ను రికార్డు సమయంలో పూర్తిచేయడం ద్వారా ముఖ్యమంత్రి చరిత్ర సృష్టించారని సాగునీటిరంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. ఈ జంట సొరంగాలను బుధవారం సీఎం జగన్ జాతికి అంకితం చేయనున్నారు. వచ్చే సీజన్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు కృష్ణా వరద జలాలు చేరి, నీటి మట్టం కనీస స్థాయికి అంటే 854 అడుగులకు చేరుకున్న వెంటనే వెలిగొండ జంట సొరంగాల ద్వారా ఆ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమలసాగర్‌కు తరలించడానికి రంగం సిద్ధంచేశారు. తీగలేరు, గొట్టిపడియ, తూర్పు, పశ్చిమ కాలువల ద్వారా ఆయకట్టుకు నీళ్లందించి.. రైతులకు వెలిగొండ ప్రాజెక్టు ఫలాలను అందించనున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్టును పూర్తిచేయడం ద్వారా ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో దుర్భిక్ష ప్రభావిత 30 మండలాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. 15.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం, ఉదయగిరి నియోజకవర్గాల్లో దశాబ్దాలుగా పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యకు కూడా ఈ ప్రాజెక్టు పూర్తి ద్వారా సీఎం జగన్ శాశ్వత పరిష్కారం చూపారు.

మహానేత వైఎస్సార్ ముందుచూపునకు తార్కాణం

శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చే 45 రోజుల్లో... రోజుకు 85 క్యూమెక్కులు (3,001 క్యూసెక్కులు) చొప్పున తరలించే సామర్థ్యంతో 7 మీటర్ల వ్యాసం, 18.80 కి.మీ.ల పొడవుతో సొరంగం తవ్వి.. వెలిగొండ కొండల్లో నిర్మించే నల్లమల సాగర్‌కు నీటిని తరలించి ప్రకాశం జిల్లాలో దుర్భిక్ష ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని 1993–94లో డీపీఆర్ రూపొందించారు. కానీ, 2004 వరకూ పట్టించుకోలేదు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించాక జలయజ్ఞం చేపట్టారు. ఈ క్రమంలో వెలిగొండ డీపీఆర్‌ను సమూలంగా మార్చేశారు. కృష్ణా నదికి వరద రోజులు క్రమేణ తగ్గుతున్న నేపథ్యంలో.. శ్రీశైలానికి వరద వచ్చే 45 రోజుల్లోనే రోజుకు 11,584 క్యూసెక్కులు చొప్పున 43.50 టీఎంసీలను తరలించేలా జంట సొరంగాలు (మొదటిది 85 క్యూమెక్కుల సామర్థ్యం, రెండోది 243 క్యూమెక్కుల సామర్థ్యం) తవ్వి.. కొత్తగా 53.85 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే నల్లమలసాగర్‌లో నిల్వచేసి.. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో వర్షాభావ ప్రాంతాల్లో 4,47,300 (తీగలేరు కెనాల్ ద్వారా 62 వేలు, తూర్పు ప్రధాన కాలువ ద్వారా 3,70,800, గొట్టిపడియ కాలువ ద్వారా 9,500 ఎకరాలు) ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు ఆ మూడు జిల్లాల్లోని 30 మండలాల్లో 15.25 లక్షల మంది దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో వైఎస్సార్ 2004, అక్టోబర్ 27న శ్రీకారం చుట్టారు. రూ.3,610.38 కోట్లు ఖర్చుచేసి.. నల్లమలసాగర్‌తోపాటు సొరంగాల్లో చాలావరకు పనులు పూర్తిచేయించారు. సొరంగాలను నల్లమలసాగర్‌ను అనుసంధానం చేసేలా 23 కి.మీల పొడవున ఫీడర్ చానల్ పనులను చేయించారు. తీగలేరు కెనాల్, తూర్పు, పశ్చిమ ప్రధాన కాలువ, గొట్టిపడియ కెనాల్ పనులను చేపట్టారు.

చంద్రబాబు దోపిడీని కడిగేసిన కాగ్..

ఎన్టీఆర్‌కు 1995లో వెన్నుపోటు పొడిచి అధికారాన్ని చేజిక్కించుకున్నాక.. 1996 లోక్‌సభ ఎన్నికల రూపంలో ఎదురైన తొలి గండాన్ని గట్టెక్కేందుకు ఆ ఏడాది మార్చి 5న గొట్టిపడియ వద్ద నాటి సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 2004 వరకూ ఈ ప్రాజెక్టు కోసం కేవలం రూ.పది లక్షలు మాత్రమే ఖర్చుచేశారు. అదీ శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన సభ కోసం మాత్రమే. రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014లో మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రజాధనాన్ని దోచుకోవడానికి వెలిగొండ ప్రాజెక్టును ప్రయోగశాలగా మార్చుకున్నారు. 2014–2019 వరకూ రూ.1,385.81 కోట్లు ఖర్చుచేసినా పనుల్లో ఏమాత్రం ప్రగతి కనిపించకపోవడమే చంద్రబాబు దోపిడీకి నిదర్శనం. జీఓ–22 (ధరల సర్దుబాటు), జీవో–63 (పనుల పరిమాణం ఆధారంగా బిల్లుల చెల్లింపు)ను వర్తింపజేసి.. కాంట్రాక్టర్లకు ఉత్తినే రూ.630.57 కోట్లను దోచిపెట్టారు. 2017 నాటికే వెలిగొండను పూర్తిచేస్తామని ప్రకటించి.. టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్)ల మరమ్మతుల కోసం కాంట్రాక్టర్లకు రూ.66.44 కోట్లను ఇచ్చేసి, కమీషన్లు వసూలు చేసుకున్నారు. మరమ్మతు చేయకపోవడంవల్ల టీబీఎంలు ఎందుకూ పనికిరాకుండాపోయాయి. ఇక 2018, 2019 నాటికి పూర్తిచేస్తామంటూ ఎప్పటికప్పుడు హామీలిస్తూ వచ్చిన చంద్రబాబు.. రెండో సొరంగం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించి, మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని పెంచి.. వాటిని అధిక ధరలకు సీఎం రమేష్‌కు కట్టబెట్టి, కమీషన్లు వసూలుచేసుకుని ప్రాజెక్టు పనులను గాలికొదిలేశారు. వెలిగొండ ప్రాజెక్టులో చంద్రబాబు దోచేయడాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కడిగిపారేసింది.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్..

- 2019లో వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయడంపై ప్రత్యేక దృష్టిపెట్టారు. గత 58 నెలల పాలనలో దాదాపు రెండేళ్లు కరోనావల్ల పనులు చేయలేని పరిస్థితి. అయినాసరే.. మొదటి సొరంగం పనుల్లో మిగిలిన 2.883 కిమీల పనులను 2019, నవంబరులో ప్రారంభించి.. 2021, జనవరి 13 నాటికి పూర్తిచేయించారు. 2014–19 మధ్య టీడీపీ సర్కార్ హయాంలో మొదటి సొరంగంలో రోజుకు సగటున 2.41 మీటర్ల మేర తవ్వితే.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రోజుకు సగటున 4.12 మీటర్ల మేర తవ్వడం గమనార్హం. అలాగే, శ్రీశైలం రిజర్వాయర్ నుంచి మొదటి సొరంగం ద్వారా నల్లమలసాగర్‌కు నీటిని విడుదలచేసే హెడ్ రెగ్యులేటర్ పనులను అదే ఏడాది పూర్తిచేయించారు.
- ఇక రెండో సొరంగం మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని 2019 ఎన్నికలకు ముందు భారీగా పెంచేసిన చంద్రబాబు.. వాటిని అధిక ధరలకు సీఎం రమేష్‌కు కట్టబెట్టి, ప్రజాధనాన్ని దోచిపెట్టారు. వాటిని రద్దుచేసిన సీఎం జగన్.. రివర్స్ టెండరింగ్ నిర్వహించి టీడీపీ సర్కార్ అప్పగించిన ధరల కంటే రూ.61.76 కోట్లు తక్కువకు పూర్తిచేసేందుకు ముందుకొచ్చిన 'మేఘా' సంస్థకు 7.698 కి.మీ.ల సొరంగం పనులను అప్పగించారు. తద్వారా చంద్రబాబు అక్రమాలను ప్రజల ముందు పెట్టారు.
- రెండో సొరంగంలో టీబీఎంకు కాలం చెల్లడంతో.. రోజుకు ఒక మీటర్ పని జరగడం కూడా కష్టంగా మారింది. దాంతో 2022లో మనుషుల ద్వారా పనులు చేయించాలని అధికారులకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. మొదటి సొరంగం నుంచి రెండో సొరంగంలోకి 17.8 కి.మీ, 16.555 కి.మీ, 14.5 కి.మీ, 13.5 కి.మీ, 12.5 కి.మీ వద్ద సొరంగాలను తవ్వి.. అక్కడ మనుషులతో సొరంగాన్ని తవ్వించేలా పనులు చేపట్టారు. మంగళవారం నాటికి రెండో సొరంగం తవ్వకం పనులు పూర్తయ్యాయి. 7.685 కి.మీల పొడవున తవ్వకం పనులు, హెడ్ రెగ్యులేటర్ పనులు కూడా పూర్తయ్యాయి. శ్రీశైలానికి వరద వచ్చేలోగా టీబీఎంను సొరంగం నుంచి బయటకు తీయనున్నారు. మరోవైపు.. 2014–19 మధ్య చంద్రబాబు సర్కార్ హయాంలో రెండో సొరంగం రోజుకు సగటున 1.31 మీటర్ల మేర తవ్వితే.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రోజుకు 7.25 మీటర్లు (టీబీఎం ద్వారా 1.45, మనుషుల ద్వారా 6.80 మీటర్లు) తవ్వడం గమనార్హం.


వెలిగొండ సొరంగం

- ఇక టీడీపీ సర్కార్ చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిన తీగలేరు హెడ్ రెగ్యులేటర్, తూర్పు ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటర్ పనులను చేపట్టిన సీఎం వైఎస్ జగన్ యుద్ధప్రాతిపదికన పూర్తిచేయిస్తున్నారు. శ్రీశైలంలోకి కృష్ణా వరద జలాలు వచ్చిన వెంటనే.. సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు తరలించి.. ఆయకట్టుకు నీళ్లందించనున్నారు.
- ప్రాజెక్టు పనులకు ఇప్పటివరకూ రూ.978.02 కోట్లను సీఎం వైఎస్ జగన్ ఖర్చుచేశారు. ప్రాజెక్టు పనులకు పెట్టిన ప్రతి పైసా సద్వినియోగమయ్యేలా జాగ్రత్తలు తీసుకుని.. శరవేగంగా పూర్తిచేయించారు.

నల్లమలసాగర్.. ఓ ఇంజినీరింగ్ అద్భుతం

ప్రకాశం జిల్లాలో విస్తరించిన నల్లమల పర్వత శ్రేణులకు సమాంతరంగా వెలుపల ఉన్న కొండలను వెలిగొండలు అంటారు. వెలిగొండ శ్రేణుల్లో సుంకేశుల, కాకర్ల, గొట్టిపడియ వద్ద కొండల మధ్య ఖాళీ ప్రదేశాల (గ్యాప్)ను కలుపుతూ 373.5 మీటర్ల పొడవు, 63.65 మీటర్ల ఎత్తు (సుంకేశుల డ్యామ్)తో.. 587 మీటర్ల పొడవు, 85.9 మీటర్ల ఎత్తు (గొట్టిపడియ డ్యామ్)తో 356 మీటర్ల పొడవు, 57 మీటర్ల ఎత్తు (కాకర్ల డ్యామ్)తో మూడు డ్యామ్‌లు నిర్మించడంతో నల్లమల పర్వత శ్రేణులు, వెలిగొండ కొండల మధ్య 62.40 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో 53.85 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నల్లమలసాగర్ సహజసిద్ధంగా రూపుదిద్దుకుంది. ఇదో ఇంజినీరింగ్ అద్భుతమని సాగునీటిరంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. నల్లమలసాగర్ పనులను మహానేత వైఎస్ పూర్తి చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కొల్లంవాగు ద్వారా రోజుకు 11,583 క్యూసెక్కులు తరలించేలా కొల్లంవాగు కుడి వైపునున్న కొండను తొలచి, రెండు సొరంగాలు (టన్నెల్–1 ద్వారా 3,001 క్యూసెక్కులు, టన్నెల్–2 ద్వారా 8,582 క్యూసెక్కులు) తవ్వి.. ఫీడర్ ఛానల్ ద్వారా నల్లమలసాగర్‌కు కృష్ణా జలాలను తరలిస్తారు. వెలిగొండ ప్రాజెక్టులో 18.8 కి.మీ.ల పొడవున తవ్విన రెండు సొరంగాలు ఆసియా ఖండంలోనే అతిపెద్ద నీటిపారుదల సొరంగాలు కావడం గమనార్హం.


నల్లమలసాగర్‌లో అంతర్భాగమైన గొట్టిపడియ డ్యామ్

దుర్భిక్ష ప్రాంతాల రూపురేఖల్లో సమూల మార్పు..

ప్రకాశం జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన దొనకొండ వద్ద 24,358 ఎకరాల్లో ఏపీఐఐసీ (ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ) మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు సిద్ధంగా ఉంది. ఇందులో ఏర్పాటయ్యే పరిశ్రమలకు అవసరమైన నీటిని సరఫరా చేయడానికి వెలిగొండ ప్రాజెక్టులో 2.58 టీఎంసీలను ప్రభుత్వం కేటాయించింది. పామూరు, పెద్దచెర్లోపల్లి మండలాల్లో, ఉప్పలపాడు పరిసర ప్రాంతాల్లో 14 వేల ఎకరాల్లో నిమ్జ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చర్ జోన్) ఏర్పాటుకూ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇందులో ఏర్పాటయ్యే పరిశ్రమలకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు వెలిగొండ ప్రాజెక్టులో 1.27 టీఎంసీలు కేటాయించింది. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయిన నేపథ్యంలో మెగా ఇండస్ట్రియల్ హబ్, నిమ్జ్‌లలో భారీఎత్తున పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. తద్వారా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. మరోవైపు.. సాగునీటి సరఫరా చేయడంవల్ల ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయి. వెలిగొండ ప్రాజెక్టు పూర్తవడంతో ఈ జిల్లాల రూపురేఖలు సమూలంగా మారిపోతాయని అధికారవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

వెలిగొండ ప్రాజెక్టు పనులకు వ్యయం ఇలా..

- ప్రాజెక్టు అంచనా వ్యయం: రూ.10,010.54 కోట్లు
- పరిపాలన అనుమతి: రూ.8,043.85 కోట్లు
- 2004–14 (మహానేత వైఎస్ హయాంలో) వ్యయం: రూ.3,610.38 కోట్లు
  - పనులకు రూ.2,890.17 కోట్లు
  - భూసేకరణకు రూ.262.64 కోట్లు
  - పునరావాసం కల్పనకు రూ.20.53 కోట్లు
  - అటవీ అనుమతులకు రూ.437.04 కోట్లు
- 2014–19 మధ్య వ్యయం (చంద్రబాబు హయాంలో): రూ.1,385.81 కోట్లు
  - పనులకు రూ.1,208.35 కోట్లు,
  - భూసేకరణకు రూ.114.89 కోట్లు
  - పునరావాసం కల్పనకు రూ.62.57 కోట్లు
- 2019 మే 30 నుంచి ఇప్పటివరకూ (సీఎం జగన్ హయాంలో) వ్యయం: రూ.978.02 కోట్లు
  - పనులకు రూ.822.08 కోట్లు
  - భూసేకరణకు రూ.79.21 కోట్లు
  - పునరావాసం కల్పనకు రూ.76.73 కోట్లు
- మొత్తం వ్యయం: రూ.5,974.21 కోట్లు
- ప్రాజెక్టు పూర్తికి ఇంకా అవసరమైన నిధులు: రూ.4,036.33 కోట్లు

సీఎం జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం


వెలిగొండ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన జంట సొరంగాలను సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధి, అంకితభావంవల్లే పూర్తి చేయగలిగాం. టీబీఎంలు పనిచేయకపోవడంతో సంప్రదాయ పద్ధతి (బ్లాస్టింగ్ చేయడం, మనుషుల ద్వారా తవ్వడం)లో పనులు చేపట్టాలని సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. సంప్రదాయ పద్ధతిలో పనులు చేపట్టడంవల్లే రెండు సొరంగాలను పూర్తి చేయగలిగాం.

– శశిభూషణ్‌కుమార్,
ముఖ్య కార్యదర్శి, ఏపీ జలవనరుల శాఖ

ఇదో మహోజ్వల ఘట్టం

వెలిగొండ ప్రాజెక్టును మహానేత వైఎస్సార్ చేపడితే.. ఆయన తనయుడు సీఎం జగన్ పూర్తిచేసి బుధవారం జాతికి అంకితం చేయనున్నారు. తండ్రి చేపట్టిన ప్రాజెక్టును తనయుడు పూర్తిచేసి జాతికి అంకితం ఇవ్వడం నీటిపారుదలరంగ చరిత్రలో మహోజ్వల ఘట్టం. ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులను పూర్తిచేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి సీఎం జగన్ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారు.

– సి.నారాయణరెడ్డి,
ఇంజనీర్ ఇన్ చీఫ్, ఏపీ జలవనరుల శాఖ


పూర్తయిన వెలిగొండ రెండు సొరంగాలు


పూర్తయిన తీగలేరు కెనాల్ హెడ్ రెగ్యులేటర్


శ్రీశైలం రిజర్వాయర్ నుంచి వెలిగొండ సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు నీటిని తరలించే ఫీడర్ చానల్

వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల తవ్వకం పనులిలా..

టన్నెల్	పొడవు (కి.మీ.లలో)	2004-2014 మధ్య (వైఎస్ హయాంలో)		2014-19 మధ్య (టీడీపీ హయాంలో)		2019 నుంచి ఇప్పటివరకూ		మొత్తం	
		పొడవు (కి.మీ.లలో)	వ్యయం (రూ.కోట్లలో)	పొడవు (కి.మీ.లలో)	వ్యయం (రూ.కోట్లలో)	పొడవు (కి.మీ.లలో)	వ్యయం (రూ.కోట్లలో)	పొడవు (కి.మీ.లలో)	వ్యయం (రూ.కోట్లలో)
టన్నెల్-1	18.800	11.586	469.37	4.331	284.257	2.883	203.503	18.800	957.130
రోజుకు సగటున తవ్వకం మీటర్లలో		5.53		2.41		4.12			
టన్నెల్-2	18.787	8.747	410.30	2.355	136.37	7.685	304.380	18.787	851.050
రోజుకు సగటున తవ్వకం మీటర్లలో		4.79		1.31		7.25			
మొత్తం	37.587	20.333	879.67	6.686	420.627	10.568	507.883	37.587	1,808.18

పలాస కిడ్నీ ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం భవానీతో వైద్య బృందం

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఓ అరుదైన ఆపరేషన్ జరిగింది. లావేరు మండలం, లావేటిమొదల గ్రామానికి చెందిన వోయివోని భవానీ అనే డయాలసిస్ పేషెంట్‌కు పలాసలోని కిడ్నీ ఆస్పత్రిలో మంగళవారం ఏవీఎఫ్ గ్రాఫ్ట్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. భవానీ ఏడాదిగా రెండు కిడ్నీలు పాడైపోయి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇటీవల అనేక ప్రాంతాల్లో డయాలసిస్ చేయించుకున్న కారణంగా చేతిపై ఉండే నరాలు పూర్తిగా పని చేయడం మానేశాయి. ప్రైవేటు వైద్యులు కూడా చికిత్స చేయలేకపోయారు. దీంతో పలాస కిడ్నీ కేంద్రానికి తీసుకురావడంతో డాక్టర్ కిశోర్‌కుమార్ భవానీకి కృత్రిమంగా నరాలకు ప్రత్యేకమైన పైపును అమర్చి రక్తాన్ని శుద్ధి చేశారు. ఇకపై డయాలసిస్ చేసేటప్పుడు అమర్చిన పైపు వెంబడి రక్తశుద్ధి చేసి తిరిగి శరీరంలోకి పంపిస్తారు. ఈ కృత్రిమ పైపు అమరికను ఏవీఎఫ్ గ్రాఫ్ట్ అని పిలుస్తారు. ఇదే ఆపరేషన్ కార్పొరేట్ ఆస్పత్రిలో చేస్తే రూ.లక్ష అవుతుంది. అది కూడా గంటలోనే జరగాలి. పలాస కిడ్నీ ఆస్పత్రిలో ఆపరేషన్ విజయవంతం కావడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

కంటి ఆపరేషన్ చేసుకుని కిడ్నీ ఆస్పత్రి సేవలు చూడండి

పచ్చమీడియాకు మంత్రి సీదిరి హితవు



కాశీబుగ్గ: ప్రతిపక్ష నాయకులు కంటి ఆపరేషన్ చేసుకుని చూస్తే ప్రభుత్వం కిడ్నీ రోగులకు ఎలాంటి సదుపాయాలు కల్పిస్తుందో కనిపిస్తుందని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలో కిడ్నీ బాధితుల అవసరార్థం సీఎం జగన్ రూ.85 కోట్లతో నిర్మించిన కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆయన మంగళవారం సందర్శించారు. కిడ్నీ పరిశోధన కేంద్రంపై పచ్చ మీడియా తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని విమర్శించారు. అత్యాధునిక సదుపాయాలతో వైద్యం అందిస్తున్నామని, అన్ని విభాగాలకు చెందిన నిపుణులైన డాక్టర్లు మొత్తం 17 మంది పనిచేస్తున్నారని చెప్పారు. 195 మంది సిబ్బందికి 127 మందిని నియమించుకున్నామని వారంతా ప్రస్తుతం సేవలు అందిస్తున్నారని వివరించారు. రోజుకు 50-60 మంది వరకూ ఓపీ నడుస్తోందని స్కానింగ్‌లు, ల్యాబ్‌లు, ఫార్మసీ వంటి సేవలు అందరూ వినియోగించుకుంటున్నారని చెప్పారు. కిడ్నీ రోగాలే కాకుండా కిడ్నీలతో అనుసంధానం ఉన్న సమస్యలు ఇక్కడ చూపించుకోవచ్చునని తెలిపారు.

పచ్చ 'రోగం' ముదిరింది

పింఛన్ పెంచి.. బాసటగా నిలచి

కిడ్నీ బాధితులకు గత ప్రభుత్వంలో రూ.2500 ఉన్న పింఛన్‌ను ఏకంగా రూ.10 వేలకు పెంచింది. . ప్రభుత్వం వ్యాధి తీవ్రత ఆధారంగా రెండు రకాలుగా పింఛన్లు అందజేస్తోంది. 5పైబడి సీరం క్రియేటినైన్ ఉన్న వారికి రూ.5వేలు, డయాలసిస్ రోగులకు రూ. 10వేల పింఛను ఇస్తున్నారు. ఈ లెక్కన ప్రస్తుతం 831మందికి రూ.10వేలు చొప్పున, 451 మందికి రూ.5వేలు ఇస్తున్నారు. ఈ రకంగా ఎంత మందికైనా మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇలా కిడ్నీ బాధితులకు ప్రతి అడుగులో ప్రభుత్వం అండగా నిలుస్తుంటే రామోజీ వాస్తవాలను వక్రీకరిస్తున్నారు.

గురివింద రామోజీ అర్జంటుగా కళ్లద్దాలు మార్పించుకుంటే బావుంటుంది. చూపు మందగించడంతో రాష్ట్రంలో అభివృద్ధిని ఎటూ చూడలేకపోతున్న ఈ రాజగురువు ప్రజల రోగాలతో కూడా ఆడుకోవడం దుర్మార్గం. గత ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చి.. ఉద్దానం సమస్యకు పరిష్కారం చూపకపోతే పల్లెత్తు మాట అనని రామోజీ.. ఇప్పుడు కిడ్నీ పరిశోధన కేంద్రం, రీసెర్చ్ సెంటర్ అందరి కళ్లెదుటే అద్భుత పనితీరు కనబరుస్తున్నా కుళ్లుబోతు రాతలు రాస్తున్నారు. ఇదివరకెన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ ఏకంగా కిడ్నీ వ్యాధిపై యుద్ధమే ప్రకటించి, ఉద్దానంకు ఆరోగ్య భరోసా కల్పించడం పట్ల యావత్ ప్రపంచం ప్రశంసిస్తుంటే రామోజీ మాత్రం తప్పుడు కథనాలు వండివారుస్తున్నారు. దుర్మార్గానికి కూడా ఓ హద్దు ఉంటుంది. రామోజీ ఈ హద్దును కూడా దాటేసి చంద్రబాబు కోసం బరితెగించారు. ఈయన గారి పచ్చ రోగానికి త్వరలో ప్రజలే తగిన వైద్యం చేయడం ఖాయం.


కిడ్నీ.. రోగం పిండేస్తోంది!

- ఉద్దానం ప్రాజెక్టుతో గురివిందకు 'నీరుడు బంద్'!
- జి. కొండూరులో కిడ్నీ బాధితుల కోసం అందుబాటులో అంబులెన్స్
- రూ.2,500 పింఛన్ ఏకంగా రూ.10 వేలకు పెంపు
- కిడ్నీ బాధితులను గాలికి వదిలేసింది మీ బాబు హయాంలో కాదా?

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: చంద్రబాబు అధికారంలో ఉండగా ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశాడు. కొన్ని దశాబ్దాలుగా శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపడంలో పూర్తిగా విఫలం అయ్యారు. బాబుకు తొత్తుగా ఉన్న రామోజీరావుకు అప్పట్లో చీమ కుట్టినట్టు కూడా అనిపించలేదు. ప్రజాశ్రేయస్సు పట్ల కమిట్‌మెంట్ ఉన్న సీఎం జగన్ కేవలం నాలుగేళ్ల వ్యవధిలోనే ఉద్దానం ప్రాంత సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపారు. బాబు చేయలేనిది సీఎం జగన్ చేసి చూపించడంతో రామోజీరావుకు కన్నుకుట్టింది. దశాబ్దాల సమస్యలను అనతికాలంలోనే పరిష్కరించిన సీఎం జగన్‌కు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ పెరిగి, టీడీపీ కనుమరుగు అవుతుందని భయం పట్టుకుంది. దీంతో తన 'ఛీ'నాడులో 'కిడ్నీ రోగం పిండేస్తోంది' అంటూ మంగళవారం ఓ కట్టుకథను రామోజీ అల్లాడు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను సీఎం జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.. బాబే వాళ్లను ఉద్ధరించాడంటూ సన్నాయి నొక్కుడు రాతలు రాసుకొచ్చారు. ఈ రాతలను చూసి ఉద్దానం ప్రాంత వాసులతో పాటు, రాష్ట్ర ప్రజలు పచ్చపత్రికను ఛీదరించుకుంటున్నారు. రాష్ట్రంలో కిడ్నీ బాధితులను నిర్లక్ష్యం చేసింది.. మీ బాబు కాదా రామోజీరావ్ అని ప్రశ్నిస్తున్నారు.

కళ్లెదుటే ప్రాజెక్టులుంటే కబోది రాతలా..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే ఉద్దానం కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపుతానని 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేరుస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అడుగులు ముందుకు వేశారు. పలాసలో రూ. 85 కోట్లతో వైఎస్సార్ కిడ్నీ పరిశోధనా కేంద్రం, మరొకటి రూ. 700 కోట్లతో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు. ఈ వ్యాధిపై పరిశోధనలు చేసేందుకు పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, డయాలసిస్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. సుజలధార ప్రాజెక్ట్ ద్వారా కిడ్నీ ప్రభావిత పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో 7 మండలాల్లోని 807 గ్రామాలకు రక్షిత నీటి సరఫరా చేపడుతున్నారు. 6.78 లక్షల జనాభా 2051 నాటికి 7.85 లక్షలకు చేరుతుందన్న అంచనాతో అప్పటి అవసరాలకు కూడా సరిపోయేలా ఒక్కొక్కరికి రోజుకు 100 లీటర్ల చొప్పున నీటి సరఫరా చేసేలా ప్రాజెక్టు నిర్మించారు. కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేసేందుకు పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, డయాలసిస్ యూనిట్ల ఏర్పాటు చేశారు.

విరివిగా కేంద్రాలు నెలకొల్పి..

ప్రస్తుతం టెక్కలి, పలాస, సోంపేట, కవిటి, హరిపురం ఆస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. 63 మెషిన్లతో 68 పడకలపై డయాలసిస్ అందిస్తున్నారు. సోంపేట సీహెచ్‌సీ డయాలసిస్ సెంటర్లలో గతంలో 13 పడకలు ఉండేవి. ఇప్పుడవి 19కి పెరిగాయి. కవిటి సీహెచ్‌సీ డయాలసిస్ సెంటర్లలో గతంలో 10 పడకలు ఉండేవి. ఇప్పుడవి 15కి పెరిగాయి. హరిపురంలో కొత్తగా 10 పడకలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. కొత్తగా గోవిందపురం, అక్కుపల్లి, కంచిలి, బెలగాంలో డయాలసిస్ సెంటర్లు మంజూరయ్యాయి. ఇవికాకుండా రెండు కంటైన్డ్ బేస్డ్ సర్వీసెస్ డయాలసిస్ యూనిట్లను ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో డయాలసిస్ రోగులకు 20 రకాల మందులే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు 37రకాల మందులను అందుబాటులో ఉంచారు. రోగులకు వైద్య పరీక్షల కోసం సెమీ ఆటో ఎనలైజర్స్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్స్, యూరిన్ ఎనలైజర్స్‌ను ఉద్దానం పరిధిలో ఉన్న 29ల్యాబ్‌లలో అందుబాటులో ఉంచారు. టీడీపీ హయాంలో జిల్లా నెఫ్రాలజీ విభాగమే లేదు. ఈ ప్రభుత్వం వచ్చాక శ్రీకాకుళం జీజీహెచ్‌లో నెఫ్రాలజీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. పలాసలో కిడ్నీ ఆస్పత్రి నిర్మించాక స్పెషలిస్టులతో పాటు మొత్తంగా 17 మంది వైద్యులు, స్టాఫ్ నర్సులు 60 మంది, డీడీఏ స్టాఫ్ 50 మంది, సపోర్టింగ్ స్టాఫ్ 20 మంది సేవలు అందిస్తున్నారు. మొత్తం ఆస్పత్రిలో 195 పోస్టులు మంజూరుకాగా ప్రస్తుతం 127 పోస్టులను భర్తీ చేయడం జరిగింది. మిగతావి భర్తీ చేసే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది.

క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు

శ్రీకాకుళం జిల్లాలో ఉద్దాన ప్రాంతంలోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, వజ్రపు కొత్తూరు, పలాస తదితర 7 మండలాలు, ఇచ్ఛాపురం, పలాస మున్సిపాలిటీల్లో మొత్తం 807 హేబిటేషన్ల పరిధిలో కిడ్నీ రోగులున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కచ్చితంగా స్క్రీనింగ్ క్రమం తప్పకుండా వైద్యారోగ్య శాఖ సిబ్బందితోనే నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న మొత్తం 4,34,925 మంది జనాభాలో ఇప్పటివరకు 30,612 మందికి స్క్రీనింగ్ పూర్తి చేశారు. సీరమ్ క్రియాటిన్ సికెడి (క్రిటికల్ కిడ్నీ డిసీజ్) కేసులు సుమారుగా 3 వేల మందిని గుర్తించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిర్వహించిన వైద్యశిబిరాల్లో సుమారు 49,021 మంది ఓపి చూపించుకున్నారు. ఇందులో ఇప్పటివరకు 474 మందిని సికెడి అనుమానితులుగా గుర్తించారు. 2018లో టీడీపీ హయాంలో ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ రోగాలకు అసలైన కారణాల పరిశోధనకు అప్పటి ప్రభుత్వం జార్జి ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంతో రూ.5 కోట్ల చెల్లింపునకు ఎంవోయు కుదుర్చుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేసేందుకు అంగీకారం తెలిపింది. జాతీయ హెల్త్ మిషన్ ద్వారా రూ.2 కోట్లను విడుదల చేసింది. మిగిలిన నిధులు విడుదల చేయలేదు. ప్రభుత్వం మారిపోగా...కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఎన్‌హెచ్ఎం నుంచి నిధులను సదరు జార్జి సంస్థకు పరిశోధనకై నిధులు కేటాయించేది లేదని స్పష్టం చేసింది. దీంతో మిగిలిన నిధులు ఆ సంస్థకు సర్దుబాటు కాలేదు.

కొండూరు బాధితులకు కొండంత అండ

ఎన్టీఆర్ జిల్లా కొండూరు ప్రాంత కిడ్నీ బాధితులకు ఈ ప్రభుత్వం పూర్తిగా అండగా నిలుస్తోంది. ఎ.కొండూరు, తిరువూరుల్లో కొత్తగా డయాలసిస్ సెంటర్‌లను నెలకొల్పింది. కొండూరు చుట్టు పక్కల తండాల్లో 30 ఏళ్లు పైబడిన వారందరికీ రక్త పరీక్షలను నిర్వహించి కిడ్నీ సమస్యలున్న వారిని గుర్తించింది. కిడ్నీ బాధితులకు రూ.వేల ఖరీదు చేసే మందులను ఉచితంగా సరఫరా చేస్తోంది. తిరువూరు, విజయవాడకు డయాలసిస్, ఇతర వైద్య సేవలు అవసరం ఉన్న కిడ్నీ బాధితులకు ఉచిత రవాణా కోసం ప్రత్యేకంగా ఓ అంబులెన్స్‌ను ఎ.కొండూరులో అందుబాటులో ఉంచింది. కిడ్నీ కేసులు నమోదు అవుతున్న గ్రామాలన్నింటికీ రక్షిత మంచినీటి ట్యాంకర్‌ల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురం పరిసర ప్రాంతాల్లో కిడ్నీ బాధితులకు వైద్య సేవలను చేరువ చేయడంలో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన మార్కాపురం బోధనాస్పత్రిలో యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాలను ప్రభుత్వం మంజూరు చేసింది.

అనకాపల్లి-గుంటూరు మధ్య ప్రత్యేక రైలు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా, గోరంట్లలో ఈనెల 7 నుంచి 10 వరకు జరిగే క్రైస్తవ మహాసభలు (గుడారాల పండుగ)కు తరలివచ్చే భక్తుల సౌకర్యం కోసం అనకాపల్లి-గుంటూరు మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్ మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. అనకాపల్లి-గుంటూరు ప్రత్యేక రైలు (07225) ఈనెల 6న రాత్రి 7.40 గంటలకు అనకాపల్లిలో బయలుదేరి, మరుసటిరోజు తెల్లవారుజామున 4 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈరైలు (07226) ఈనెల 10న రాత్రి 10.30 గంటలకు గుంటూరులో బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 8.10 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. ఈ రైలు తుని, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ స్టేషన్‌లలో ఆగుతుంది.

కోనసీమలో డ్రోన్ హబ్ ప్రారంభం


సాక్షి,అమలాపురం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం దేవగుప్తం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ హబ్‌ను కలెక్టర్ శుక్లా మంగళవారం ప్రారంభించారు. అమలాపురం స్టేడియంలో 21 ఫ్లయింగ్ డ్రోన్లను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ..రూ.2 కోట్లతో దేవగుప్తం పీఏసీఎస్ 21 డ్రోన్లను కొనుగోలు చేసిందన్నారు. ఒక్కొక్క డ్రోన్ 6-8 నిమిషాల్లో ఒక ఎకరానికి స్ప్రేయింగ్ ప్రక్రియను పూర్తి చేస్తుందని తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా కొనుగోలు చేసిన ఈ డ్రోన్స్‌ను అద్దె ప్రాతిపదికన రైతులకు అందుబాటులో తెస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు స్ప్రేయర్ ఎకరాకు రూ.వెయ్యి ఖర్చుతో పిచికారీ చేస్తున్నారని, డ్రోన్ టెక్నాలజీతో ఎకరాకు రూ. 300 అవుతుందన్నారు. రైతులు బృందంగా ఏర్పడితే రూ.10 లక్షలు విలువైన వ్యవసాయ డ్రోన్‌ను కొనుగోలు చేయవచ్చన్నారు. దేవగుప్తం పీఏసీఎస్ చైర్మన్, రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) మాట్లాడుతూ ప్రతి మండలంలో ఒక డ్రోన్ ఉండేలా ప్రభుత్వం ఆలోచన చేసిందన్నారు. వైఎస్సార్ హార్టీకల్చర్ వర్సిటీ సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ శుక్లా

రావణ వాహనంపై పరమేశ్వరుడు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఐదవ రోజు మంగళవారం స్వామి వారికి రావణ వాహన సేవ నిర్వహించారు. ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలోకి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను తోడ్కొని వచ్చి ప్రత్యేకంగా అలంకరించిన రావణ వాహనంపై ఆశీనులను చేశారు. రావణుడి భుజస్కంధాలను అధిష్టించిన ఉత్సవమూర్తులకు విశేష పూజలు జరిపారు. ఆలయ ఉత్సవం నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. క్షేత్రం పుర వీధుల్లో రావణ వాహనంపై పరమేశ్వరుడు భక్తులను అనుగ్రహించారు. కాగా, స్వామి వారికి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరఫున ఆలయ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈవో ఎ.వెంకటేశ్ పట్టువస్త్రాలు సమర్పించారు. బుధవారం సాయంత్రం మల్లికార్జున స్వామికి పుష్పపల్లకి సేవోత్సవం, గ్రామోత్సవం నిర్వహించనున్నారు.



ప్రియుడి నిర్వాకంతో బాలిక బలవన్మరణం

- గర్భవతిని చేసి.. అబార్షన్ చేయించిన వైనం
- పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరణ
- తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్య
- పరారీలో నిందితుడు

పెడన: పదో తరగతి బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేయడంతో పాటు పెళ్లి చేసుకునేందుకు ప్రియుడు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన బాలిక బలవన్మరణానికి పాల్పడిన ఘటన కృష్ణా జిల్లా పెడన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలికతో అదే గ్రామానికి చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థి ప్రేమాయణం కొనసాగించాడు. తనకు రెండు నెలలుగా పీరియడ్స్ రావడం లేదని, మూడో నెల అని ఆమె ఆ యువకుడికి చెప్పింది. అతడు అబార్షన్ అయ్యేందుకు టాబ్లెట్స్ కొనుగోలు చేసి బాలికకు ఇచ్చాడు. వారం రోజుల కిందట అబార్షన్ కావడంతో బాలిక తీవ్ర అనారోగ్యానికి గురైంది. పాఠశాలకు సరిగ్గా వెళ్లకపోవడంతో గమనించిన తల్లి నిలదీయడంతో విషయాన్ని వివరించింది. దీంతో బాలికను వెంటబెట్టుకుని తల్లిదండ్రులు యువకుడి ఇంటికి వెళ్లారు. తమ కుమార్తెను పెళ్లి చేసుకోవాలని కోరారు. అందుకు యువకుడి తల్లిదండ్రులు నిరాకరించడంతో వెనుదిరిగారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మచిలీపట్నం డీఎస్పీ మహమ్మద్ అబ్దుల్ సుభాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు పెడన పోలీసులు తెలిపారు.

మీడియా అత్యుత్సాహంతో వ్యక్తిగత జీవన హననం

స్వరూపానందేంద్ర సరస్వతి

సాక్షి, తిరుపతి: 'పత్రికలు, న్యూస్ చానళ్లు, యూ ట్యూబ్, ఫేస్ బుక్ ల్లో చూస్తుంటాం, పనికిరాని అవాకులు చవాకులు గురించి. పెయిడ్ ఆర్టిస్టులు కొంతమంది మాట్లాడుతూ వ్యక్తిగత జీవితాన్ని హననం చేస్తూ తప్పుడు సమాచారం భవిష్యత్ తరాలకు అందించాలని, అత్యుత్సాహంతో ఆంధ్ర రాష్ట్రాన్ని తగులబెడుతున్నారు' అని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతిలోని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నివాసం వద్ద మంగళవారం నిర్వహించిన షణ్ముగయాగంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ..వేయికాళ్ల మండపం గురించి గానీ, అర్చకుల గురించి గానీ, కింది స్థాయి దేవాలయాల కోసం విశాఖ శ్రీ శారదా పీఠం పోరాటం చేసిందని గుర్తుచేశారు. శ్రీవారి పాదాల సాక్షిగా, నిజాయితీగా తాను చెబుతున్నానని, ఒకప్పుడు దళిత వాడలు, గిరిజన వాడల్లో మత మార్పిడులు జరిగే రోజుల్లో, మత మార్పిడులకు వ్యతిరేకంగా భారత్‌లోనే నాడు టీటీడీ ఓ సరికొత్త పంథా తీసుకువచ్చిందని చెప్పారు. ఎన్నో పీఠాలు వ్యతిరేకించినా గుండె బలంతో దళిత గోవిందం, కల్యాణమస్తు వంటి కార్యక్రమాలను టీటీడీ చైర్మన్ హోదాలో భూమన నిర్వహించారన్నారు. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు వేదపాఠశాలను వర్సిటీగా మార్చారని గుర్తు చేశారు. పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, టీటీడీ చైర్మన్ భూమన దంపతులు, టీటీడీ ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న స్వరూపానందేంద్ర.. చిత్రంలో టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి, అభినయ్ రెడ్డి

- విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) మరో ఒప్పందానికి శ్రీకారం చుట్టింది. పోర్టు, వెసల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(వీటీఎంఎస్)తో కలిసి ఇండియన్ కోస్ట్ గార్డుతో మంగళవారం ఎంవోయూ కుదుర్చుకుంది. రాడార్ ఫీడ్‌ని అందించేందుకు అవసరమైన పరికరాల్ని అమర్చేందుకు రూ.1.9 కోట్లతో జరిగిన ఒప్పంద పత్రాలపై పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు సమక్షంలో అధికారులు సంతకాలు చేశారు.



సాయిబాబా నిర్దోషి

మావోయిస్టులతో సంబంధాల కేసులో బాంబే హైకోర్టు తీర్పు

- కేసు నుంచి మరో ఐదుగురికి విముక్తి
- ఆరోపణలను రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: మావోయిస్టులతో సంబంధాల కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాతోపాటు మరో ఐదుగురు నిందితులను బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ నిర్దోషులుగా ప్రకటించింది. 2017లో సాయిబాబాతో పాటు ఇతరులను దోషులుగా నిర్ధారిస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పుపై నాగ్‌పూర్ బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ వినయ్ జోషీ, జస్టిస్ వాల్మీకి మెనెజెస్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. నిందితులపై వచ్చిన ఆరోపణలను రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని, అందుకే వారిపై అభియోగాలను కొట్టివేస్తున్నట్లు పేర్కొంది. నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును ధర్మాసనం తోసిపుచ్చింది. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని, దేశంపై యుద్ధంపై చేసే కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ 2017 మార్చిలో సాయిబాబా, ఇతరులను మహారాష్ట్రలోని గడ్చిరోలీ సెషన్స్ కోర్టు దోషులుగా నిర్ధారించింది. దీనిపై సాయిబాబా బాంబే హైకోర్టును ఆశ్రయించారు. 2022 అక్టోబరు 14న జస్టిస్ రోహిత్ నేతృత్వంలోని ధర్మాసనం సాయిబాబాను నిర్దోషిగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తదుపరి రోజు శనివారమైనప్పటికీ ప్రత్యేకంగా విచారించింది. హైకోర్టు ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది. అనంతరం జస్టిస్ షా, జస్టిస్ రవికుమార్ సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపి 2023 ఏప్రిల్ 19న బాంబే హైకోర్టు తీర్పును పక్కనపెట్టింది. ఈ తీర్పును మళ్లీ పరిశీలించాలని బాంబే హైకోర్టుకు పంపించింది. ఈ నేపథ్యంలో జస్టిస్ జోషీ, జస్టిస్ వాల్మీకిల హైకోర్టు ధర్మాసనం విచారించి, సాయిబాబా, ఇతరులను నిర్దోషులుగా ప్రకటించింది. ప్రొఫెసర్ సాయిబాబా 2014లో అరెస్టయ్యారు. ప్రస్తుతం నాగ్‌పూర్ సెంట్రల్ జైల్లో ఉన్నారు.

పదేళ్ల పోరాటం తర్వాత ఊరట దక్కింది

బాంబే హైకోర్టు తీర్పు పట్ల సాయిబాబా భార్య వసంత ఆనందం వ్యక్తం చేశారు. పదేళ్ల తర్వాత ఊరట లభించిందన్నారు. సాయిబాబాకు అండగా నిలిచిన లాయర్లకు, సామాజిక కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. తన భర్త పది సంవత్సరాలు జైలులో ఉన్నారని, ఆర్థికంగా, మానసికంగా తాము ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నామని చెప్పారు. సాయిబాబా గురించి ప్రజలకు వాస్తవాలు తెలుసని, ఆయన పట్ల వారికి సంపూర్ణ విశ్వాసం ఉందని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టులో మహారాష్ట్ర సర్కారు పిటిషన్

మావోయిస్టులతో సంబంధాల కేసులో మాజీ ప్రొఫెసర్ సాయిబాబాను నిర్దోషిగా విడుదల చేస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు మంగళవారం అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. బాంబే హైకోర్టు తీర్పును కొట్టివేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం విన్నవించింది. సాయిబాబాతోపాటు ఇతరులను నిర్దోషులుగా నిర్ధారిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుపై సుప్రీంకోర్టును ఆశ్రయించామని మహారాష్ట్ర అడ్వొకేట్ జనరల్ బీరేంద్ర షరాఫ్ ఈ సందర్భంగా చెప్పారు. నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పును కొంతకాలం నిలిపివేయాలని కోరుతూ హైకోర్టు ధర్మాసనం ముందు అప్లికేషన్ దాఖలు చేశారు. ధర్మాసనం స్పందిస్తూ.. న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్న తర్వాత దాన్ని పునఃపరిశీలించే అధికారం ఉండదని, ఇది వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన విషయమని స్పష్టం చేసింది. అడ్వొకేట్ జనరల్ దాఖలు చేసిన అప్లికేషన్‌ను కొట్టివేసింది.

జలాంతర మెట్రో

నేడే కోల్‌కతాలో నీటి అడుగున మెట్రో సేవలు ప్రారంభం

ఆధునిక భారత రైల్వే చరిత్రలో నూతన అధ్యాయానికి అండర్ వాటర్ మెట్రో శ్రీకారం చుట్టేందుకు సిద్ధమైంది. అత్యంత లోతైన హౌరా మెట్రో స్టేషన్ గుండా నీటి అడుగున మెట్రో రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఇందుకు కోల్‌కతాలోని ఈస్ట్–కోస్ట్ మెట్రో కారిడార్ వేదికగా మారనుంది. ఈ కారిడార్‌లోని హౌరా మైదాన్– ఎస్ప్లానేడ్ సెక్షన్‌లో ఈ అండర్ వాటర్ మెట్రో సేవలు ప్రయాణికులకు అద్భుత అనుభూతిని పంచనున్నాయి. దేశంలోనే మొట్టమొదటిదైన ఈ అండర్‌వాటర్ మెట్రో సేవలను బుధవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. హుగ్లీ నది జలాల కింద ఈ మెట్రో ప్రాజెక్టు రూపుదిద్దుకుంది.



విశేషాలు ఇవే...

- ఈస్ట్–వెస్ట్ మెట్రో మొత్తం పొడవు 16.6 కిలోమీటర్లు కాగా అందులో 10.8 కిలోమీటర్లమేర విస్తరించిన కారిడార్‌లో రైలు భూగర్భంలో ప్రయాణించనుంది.
- ఇందులో పూర్తిగా నదీజలాల కింద నుంచి 520 మీటర్లమేర రైలు పరుగులుపెట్టనుంది. 45 సెకన్లపాటు సాగే ఈ నదీగర్భ ప్రయాణం మెట్రో రైలు ప్రయాణికులకు అనిర్వచనీయ అనుభూతి ఇవ్వనుంది
- దేశంలో తొలిసారిగా నది అడుగున నిర్మించిన తొలి రవాణా టన్నెల్ కూడా ఇదే కావడం విశేషం.
- కోల్‌కతా పరిధిలోని జంట నగరాలుగా పేరొందిన హౌరా, సాల్ట్ లేక్‌లను కలుపుతూ ఈ మెట్రో రైల్వే సేవలను అందుబాటులోకి తెస్తున్నారు.
- 16.6 కిలోమీటర్లలో 4.8 కిలోమీటర్ల మార్గం కోల్‌కతాలోని సాల్ట్ లేక్ సిటీ ఐదో సెక్టార్, సెల్దాలోని కీలకమైన ఐటీ హబ్‌కు ఎంతో దోహదపడనుంది.
- హుగ్లీ నది అడుగున నిర్మించిన తొలి మెట్రో సొరంగ మార్గంగా ఇది రికార్డు లకెక్కనుంది.
- 'కోల్‌కతా మెట్రో'కు సంబంధించి 2023 ఏప్రిల్ నెల ప్రత్యేకమైంది. ఎందుకంటే ఆ నెలలో నదీ అడుగున 32 మీటర్ల మేర ప్రయోగాత్మక మెట్రో రైలును విజయవంతంగా నడిపి చూశారు.
- నేడు (బుధవారం) ప్రధాని మోదీ ఈ రైల్వే సేవలను లాంఛనంగా ప్రారంభించాక గురువారం నుంచి సాధారణ పౌరులను ప్రయాణాలకు అనుమతిస్తామని కోల్‌కతా మెట్రో అధికారి కౌశిక్ మిత్రా చెప్పారు. కవి సుభాష్‌–హిమంత ముఖోపాధ్యాయ్, తారాతలా–మాజెర్హాట్ మెట్రో సెక్షన్లను మోదీ ప్రారంభిస్తారు.
- ఈ మెట్రో సెక్షన్‌లో మొత్తంగా ఆరు స్టేషన్లు ఉంటాయి. వీటిలో మూడింటిని భూగర్భంలోనే కట్టారు. అయినా సరే ప్రయాణికులు భూగర్భం లోపలికి, బయటకు వేగంగా వచ్చిపోయేందుకు వీలుగా నిర్మించారు.
- అత్యంత రద్దీ, కాలుష్యమయ కోల్‌కతాలో పర్యావరణ అనుకూల ప్రయాణానికి భరోసానిస్తూ ఈ మెట్రోను ఇలా భూగర్భంలో డిజైన్‌చేశారు. దీంతో కాలుష్య తగ్గడంతోపాటు ప్రయాణికులకు ప్రయాణ సమయమూ కలిసిరానుంది.
- ఈస్ట్–వెస్ట్ మెట్రో కారిడార్ పనులు 2009లోనే మొదలయ్యాయి. హుగ్లీ నది అంతర్భాగ పనులు మాత్రం 2017లో ఊపందుకున్నాయి
- 2019 ఆగస్టులో భూగర్భంలో కొన్ని చోట్ల భూగర్భ జలాలు ఉబికిరావడం, భూమి కుంగడం వంటి ఘటనలతో అండర్‌వాటర్ మెట్రో పనుల్లో ఆలస్యం చోటుచేసుకుంది. 2022లో వాటర్ లీకేజీ ఘటనలూ ఎదురైనా అన్ని బాలారిష్టాలను దాటుకుంటూ ఎట్టకేలకు ఈ మెట్రో నేడు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.

ప్రపంచంలో ఎన్నెన్నో

19వ శతాబ్దిలోనే ఇంగ్లిష్ ఇంజనీర్లు భూగర్భ రైల్వే సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రపంచంలోనే పురాతన భూగర్భ రైల్వే నెట్‌వర్క్‌గా థేమ్స్ టన్నెల్‌ను చెప్పుకోవచ్చు. 1843లోనే రోథర్‌హీట్, ర్యాపింగ్ పట్టణాల మధ్య ఈ మార్గాన్ని నిర్మించారు. ఇప్పుడిది లండన్‌లో కీలక రైలు మార్గాల్లో ఒకటి. దీని పొడవు కేవలం 400 మీటర్లు. జపాన్‌లోని సీకెల్ టన్నెల్ ప్రఖ్యాతిగాంచిన అండర్‌వాటర్ రైల్వే టన్నెల్‌గా పేరొందింది. దీని పొడవు ఏకంగా 53.85 కిలోమీటర్లు. హోన్షూ, హొక్కైడో ద్వీపాల మధ్య సుగారు జలసంధి కింద దీనిని నిర్మించారు. ఇది ప్రపంచంలోనే లోతైన, పొడవైన రైల్వే టన్నెల్‌గా రికార్డుసృష్టించింది. తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో బోస్పోరస్ జలసంధి కింద అండర్‌వాటర్ టన్నెల్ నిర్మించారు. ఇది ఇస్తాంబుల్‌లోని ఆసియా, యూరప్ భూభాగాలను కలుపుతుంది. ఈ రైల్వే టన్నెల్ పొడవు దాదాపు 14 కి.మీ.లు.

– సాక్షి, నేషనల్ డెస్క్

డీకే శివకుమార్‌కు సుప్రీంలో ఊరట

2018నాటి మనీలాండరింగ్ కేసు కొట్టివేత



న్యూఢిల్లీ: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై గతంలో నమోదైన మనీ లాండరింగ్ కేసును సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కొట్టేసింది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గతంలో ఇచ్చిన సమన్లను రద్దుచేయాలంటూ డీకే 2019లో కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా అక్కడ ఆయనకు చుక్కెదురైంది. దీంతో ఆయన సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారించింది. పన్నుల ఎగవేత, హవాలా లావాదేవీలు జరిపారంటూ ఆదాయపన్ను శాఖ 2017లో డీకే శివకుమార్, ఆయన వ్యాపార భాగస్వామి, మద్యం వ్యాపారి సచిన్ నారాయణ్, మరో భాగస్వామి సునీల్ కుమార్ శర్మలపై కేసు వేసింది. అప్పుడే ఢిల్లీసహా పలు ప్రాంతాల్లో సోదాలు చేసి రూ.8.59 కోట్ల నగదును స్వాధీనం చేసుకుంది. బెంగళూరు కోర్టులో ఐటీ శాఖ చార్జిషీట్‌ను దాఖలుచేసింది. మనీ లాండరింగ్ జరిగిందంటూ ఈడీ 2018లో కేసు నమోదుచేసి విచారణ మొదలుపెట్టి 2019 సెప్టెంబర్‌లో డీకేను అరెస్ట్‌చేసింది. ఆ తర్వాతి నెలలో ఢిల్లీ హైకోర్టు డీకేకు బెయిల్ మంజూరుచేసింది. మంగళవారం వచ్చిన తీర్పుపై డీకే సంతోషం వ్యక్తంచేశారు.

ఫ్రాన్స్‌లో అబార్షన్ ఇక చట్టబద్ధ హక్కు

పారిస్: ఫ్రాన్స్ గర్భస్రావాన్ని చట్టబద్ధం చేసింది. అబార్షన్‌ను చట్టబద్ధ హక్కుగా పేర్కొన్న ప్రపంచంలోని మొట్టమొదటి దేశంగా నిలిచింది. ఈ మేరకు 1958 నాటి చట్టాన్ని సవరించేందుకు సోమవారం దేశ పార్లమెంట్ 780–72 ఓట్ల తేడాతో ఆమోదముద్ర వేసింది. కొత్త చట్టం ప్రపంచానికే ఒక సందేశం వంటిదని, ఫ్రాన్సుకు గౌరవమని అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ చట్టసభల సభ్యుల హర్షధ్వానాల మధ్య అభివర్ణించారు. ఈ సందర్భంగా పారిస్‌లోని ప్రముఖ పర్యాటక కట్టడం ఈఫిల్ టవర్‌ను 'మై బాడీ మై చాయిస్' అనే సందేశంతో కూడిన విద్యుద్దీపాలతో అలంకరించారు. అయితే, వాటికన్ సిటీ మాదిరిగానే అబార్షన్ వ్యతిరేక సంఘాలు ఈ మార్పును తీవ్రంగా విమర్శించాయి..

జడ్జి పదవిని వదిలి..బీజేపీలోకి..!



కోల్‌కతా: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ మంగళవారం పదవికి రాజీనామా చేశారు. బీజేపీలో చేరనున్నట్లు ఆయన మంగళవారం మీడియా సమక్షంలో వెల్లడించారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలకు మారుపేరుగా మారిపోయిందని విమర్శించారు. 'ఈ నెల 7వ తేదీన బీజేపీలో చేరబోతున్నాను. బీజేపీ జాతీయ పార్టీ. బెంగాల్‌లో అవినీతి టీఎంసీకి వ్యతిరేకంగా పోరాడుతోంది. అందుకే ఆ పార్టీలో చేరుతున్నాను'అని చెప్పారు. బీజేపీ అధిష్టానం కోరితే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానని చెప్పారు. 'పశ్చిమబెంగాల్‌లో టీఎంసీకి రోజులు దగ్గరపడ్డాయి. రాష్ట్రంలో సీపీఎం మాదిరిగానే టీఎంసీకి కూడా ఓటమి తప్పదు'అని ఆయన నిప్పులు చెరిగారు. రాజీనామా లేఖను మంగళవారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు, ప్రతులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు, కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ శివజ్ఞానంకు పంపారు.

మోదీ గ్యారంటీ హోర్డింగ్‌లు పెట్టండి

చమురు సంస్థలకు కేంద్రం అనధికార ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను పెట్రోలు బంకుల్లో ఏర్పాటు చేయాలని పెట్రోలియం శాఖ అనధికారికంగా కోరినట్లు తెలిసింది. మోదీ గ్యారెంటీల్లో ఒకటైన 'ఉజ్వల యోజన'పథకం హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు బుధవారం సాయంత్రం కల్లా అన్ని రిటైల్ ఔట్‌లెట్లలోనూ ఏర్పాటు చేయాలని మౌఖికంగా కోరినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా సుమారు 80 వేల పెట్రోల్ బంకులకు ఈ సమాచారం వెళ్లినట్లు తెలుస్తోంది. ఆదేశాలను పట్టించుకోని బంకుల వివరాలను ఫీల్డ్ ఆఫీసర్లకు రిపోర్టు చేయాలని చమురు సంస్థల మేనేజర్లకు కేంద్ర పెట్రోలియం శాఖ సూచించినట్లు తెలిసింది.

భారత బలగాలు మా భూభాగంపై వద్దేవద్దు

మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు అక్కసు



మాలె: మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు మరోసారి భారత వ్యతిరేకతను వెళ్లగక్కారు. సాధారణ పౌర దుస్తుల్లోనైనా సరే భారత సైనిక సిబ్బంది తమ భూభాగంలో మే 10వ తేదీ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండరాదని అన్నారు. మాల్దీవుల్లో భారత్ మూడు వైమానిక కేంద్రాలను ఏర్పాటు చేసింది. అక్కడి ప్రభుత్వం మార్చి 10వ తేదీ కల్లా భారత సైనిక సిబ్బంది వాటిని విడిచి వెళ్లిపోవాలని గడువు ప్రకటించింది. దీంతో, సైనిక సిబ్బంది నుంచి ఆ కేంద్రాల బాధ్యతలను చేపట్టేందుకు భారత్ నుంచి పౌర సిబ్బందితో కూడిన మరో బృందం అక్కడికి చేరుకున్న నేపథ్యంలో చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడు ముయిజ్జు మళ్లీ తన బుద్ధిని బయటపెట్టారు. భారతీయ సిబ్బంది ఏ రూపంలోనైనా సరే తమ దీవిలో ఉండరాదన్నారు.

నలుగురితో యూపీ మంత్రివర్గ విస్తరణ

లక్నో: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మంగళవారం తన మంత్రి వర్గాన్ని విస్తరించారు. కొత్తగా నలుగురు మంత్రులను చేర్చుకున్నారు. దీంతో మొత్తం మంత్రుల సంఖ్య 56కు చేరింది. తాజాగా మంత్రులైన వీరిలో ఇద్దరు బీజేపీ నేతలు కాగా మరో ఇద్దరు ఎన్‌డీఏ పక్షమైన సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) చీఫ్ ఓం ప్రకాశ్ రాజ్‌భర్, రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డీ) నేత అనిల్ కుమార్. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వీరి చేత గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ప్రమాణం చేయించారు. ఇది రెండోసారి సీఎం అయ్యాక యోగి చేపట్టిన మొదటి మంత్రివర్గ విస్తరణ. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బీజేపీ తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు చేసిన ప్రయత్నంగా భావిస్తున్నారు.

ప్రపంచ కుబేరుడు జెఫ్ బెజోస్



వాషింగ్టన్: ప్రపంచంలో అత్యంత ధనవంతుడిగా 'అమెజాన్' వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మరోసారి రికార్డుకెక్కారు. ఈ విషయంలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌ను ఆయన వెనక్కి నెట్టేశారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం జెఫ్ బెజోస్ సంపద 200 బిలియన్ డాలర్లు కాగా, ఎలాన్ మస్క్ సంపద 198 మిలియన్ డాలర్లు. ఎలాన్ మస్క్ గత ఏడాది కాలంలో 31 బిలియన్ డాలర్ల సంపద కోల్పోయారు. ఇదే సమయంలో బెజోస్ 23 బిలియన్ డాలర్లు సంపాదించారు. టెస్లా కంపెనీ షేరు ధర సోమవారం 7 శాతం క్షీణించింది. 'ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు' అనే రికార్డు స్థిరంగా ఏమీ ఉండదు. మార్కెట్ పనితీరు, ఆర్థిక పరిస్థితులను బట్టి తరచుగా చేతులు మారుతూ ఉంటుంది.

ఇజ్రాయెల్ దాడిలో 17 మంది మృతి

రఫా: గాజాలోని ఖాన్‌యూనిస్ నగరంపై మంగళవారం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. నేలమట్టమైన భవన శిథిలాల నుంచి మృతదేహాలను, క్షతగాత్రులను స్థానికులు బయటికి తీస్తున్న దృశ్యాలను స్థానిక యంత్రాంగం ఆన్‌లైన్‌లో ఉంచింది. గత 24 గంటల వ్యవధిలో దాడుల్లో 100 మంది వరకు చనిపోయినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. దీంతో, గత ఏడాది అక్టోబర్ 7వ తేదీ నుంచి ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడుల్లో చనిపోయిన వారి సంఖ్య 30,631కి, క్షతగాత్రుల సంఖ్య 72 వేలకు చేరుకుందని పేర్కొంది. డీ హైడ్రేషన్, పోషకాహార లోపంతో ఉత్తర గాజాలో 10 మంది వరకు చిన్నారులు చనిపోయినట్లు యూనిసెఫ్ తెలిపింది.

తమ ఖజానా నింపుకోవడమే కాంగ్రెస్ మిత్రపక్షాల పని

ఒడిశాలో ప్రధాని మోదీ విమర్శలు

జాజ్‌పూర్(ఒడిశా): కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో హస్తం పార్టీ, దాని మిత్ర పక్షాలు తమ బొక్కసాలు నింపుకోవడంలో బిజీగా ఉండేవని ప్రధాని మోదీ విమర్శించారు. ఒడిశా పర్యటన సందర్భంగా జాజ్‌పూర్ జిల్లాలో జరిగిన ఒక సభలో ప్రధాని ప్రసంగించారు. '' మా ప్రభుత్వహయాంలో అమలవుతోన్న అభివృద్ధి పనులు 2014 ఏడాదికి ముందు కూడా సాధ్యమే. కానీ ఆనాడు కాంగ్రెస్ హయాంలో అభివృద్ధిని పక్కనపడేసి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు తమ ఖజానాలు నింపుకోవడంలో మునిగిపోయాయి. గత పదేళ్లలో బీజేపీ కేంద్రప్రభుత్వం ఒడిశాలోకి పెట్టుబడుల వరద పారేలా చేసింది. వికసిత భారత్‌కు ఒడిశా సింహద్వారంగా మారాలనేది మా అభిమతం. నా 'మేరా భారత్, మేరా పరివార్' నినాదం విపక్షాల 'ఇండియా' కూటమి నేతలను కలవరపెడుతోంది'' అని మోదీ వ్యాఖ్యానించారు. తూర్పు భారతావని అభివృద్దే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని మోదీ ప్రకటించారు. ఒడిశాలో చమురు, సహజ వాయువు, రైల్వే, రోడ్డు రవాణా, అణు విద్యుత్ సంబంధిత రూ.19,600 కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ జాజ్‌పూర్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

భారత్.. దేశం కాదు ఉపఖండం

- ఒకే దేశం అయితే దేశమంతటా ఒకే భాష ఉండాలి
- భరతమాత, జైశ్రీరామ్‌ను తమిళనాడు స్వీకరించదు
- కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారతదేశ రాజ్యాంగమే ఉండదు
- డీఎంకే సీనియర్ నేత ఎ.రాజా వివాదాస్పద వ్యాఖ్యలు



చెన్నై: తమిళనాడుకు చెందిన అధికార డీఎంకే సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా మరో వివాదానికి ఆజ్యం పోశారు. బీజేపీ సిద్ధాంతాలైన భరతమాత, జైశ్రీరామ్‌ను తమిళనాడు ఎప్పటికీ స్వీకరించబోదని, అవి తమకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఇండియా ఒకే దేశం కాదని, ఇదొక ఉపఖండం మాత్రమేనని అన్నారు. ఒకే దేశం అయితే దేశమంతటా ఒకే భాష ఉండాలని చెప్పారు. మధురైలో మంగళవారం డీఎంకే కార్యక్రమంలో ఎ.రాజా ప్రసంగించారు. ''రాముడికి శత్రువు ఎవరు? రాముడి గురించి, రామాయణం గురించి నాకు అంతగా తెలియదు. వాటిపై నాకు నమ్మకం లేదు. రాముడు సీతతో కలిసి అడవికి వెళ్లాడని చిన్నప్పుడు మా తమిళ టీచర్ చెప్పారు. ఒక వేటగాడిని, సుగ్రీవుడిని, విభీషణుడిని రాముడు తన సోదరులుగా స్వీకరించాడు. ఇందులో కులం, మతం ప్రసక్తి లేదని అర్థమవుతోంది. ఇండియా ఒకే దేశమని అంటున్నారు. ఒకే దేశమైతే ఒకే భాష, ఒకే సంప్రదాయం, ఒకే సంస్కృతి ఉండాలి. ఇండియాలో అలా లేదు కాబట్టి ఇదొక ఉపఖండం. ఇండియా గతంలో ఎన్నడూ ఒక దేశంగా లేదు. తమిళనాడు, కేరళ, ఢిల్లీ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో వాటి సొంత సంస్కృతులు ఉన్నాయి. భిన్న జాతులు, భాషలు, సంస్కృతుల సమాహారమే ఇండియా. ఇక్కడ ఒక సామాజిక వర్గం ప్రజలు గొడ్డు మాంసం తింటారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తమిళనాడులో డీఎంకే ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంటున్నారు. తమిళనాడులో డీఎంకే లేకపోతే అసలు భారతదేశమే ఉండదు. ఇలా ఎందుకు చెప్తున్నానంటే.. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత దేశ రాజ్యాంగమే ఉండదు. రాజ్యాంగం లేకపోతే దేశం కూడా మనుగడ కోల్పోతుంది. భారతదేశం లేకపోతే తమిళనాడు రాష్ట్రం ఉండదు. దేశం నుంచి మేము విడిపోతాం. ఇలా జరగాలని భారతదేశం కోరుకొంటోందా?'' అంటూ ఎ.రాజా సంచలన వ్యాఖ్యలు చేశారు.

రాజాను వెంటనే అరెస్టు చేయాలి

డీఎంకే నేత ఎ.రాజా వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను తక్షణమే అరెస్టు చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎంకే నాయకులు విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం మానుకోవడం లేదని బీజేపీ నేత అమిత్ మాలవీయా విమర్శించారు. సనాతన ధర్మం గురించి ఉదయనిధి స్టాలిన్ అనుచితంగా మాట్లాడారని చెప్పారు. దేశాన్ని ముక్కలు చేయాలన్నదే డీఎంకే నేతల కుటిల యత్నమని మండిపడ్డారు. రాజాపై కఠిన చర్యలు తీసుకోవాలని తిమళనాడు డీఎంకే అధికార ప్రతినిధి తిరుపతి అన్నారు. రాజా వ్యాఖ్యలను డీఎంకే మిత్రపక్షం కాంగ్రెస్ సైతం ఖండించింది. మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని సూచించింది. రాజా వ్యాఖ్యలతో విభేదిస్తున్నానని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే చెప్పారు.

షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించం

- కలకత్తా హైకోర్టు ఆదేశాలు బేఖాతరు
- సుప్రీంలో బెంగాల్ ప్రభుత్వం పిటిషన్

కోల్‌కతా/న్యూఢిల్లీ: సందేశ్‌ఖాలీ అరాచకాల కేసులో ప్రధాన నిందితుడైన తృణమూల్ మాజీ నేత షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించాలంటూ కలకత్తా హైకోర్టు మంగళవారం జారీ చేసిన ఆదేశాలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం లెక్కచేయలేదు. అతడిని అప్పగించబోమని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. షేక్ ఇంట్లో సోదాలు చేసేందుకు వెళ్లిన ఈడీ అధికారులపై అతడి అనుచరులు దాడి చేశారు. ఈడీ ఫిర్యాదు మేరకు బెంగాల్ పోలీసులు షేక్‌ను అరెస్ట్‌చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని ఈడీ కోరగా, హైకోర్టు అంగీకరించింది. ఈ కేసులో పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని, నిందితుడిని కాపాడేందుకు దర్యాప్తులో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, బెంగాల్ ప్రభుత్వం తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో నిందితుడు షాజహాన్ షేక్‌ను బెంగాల్ పోలీసులు సీబీఐకి అప్పగించలేదు. మరోవైపు షాజహాన్ షేక్‌కు చెందిన రూ.12.78 కోట్ల ఆస్తులను అటాచ్ చేశామని ఈడీ ప్రకటించింది.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా క్షిపణి దాడి

కేరళ వాసి మృతి, మరో ఇద్దరికి గాయాలు

జెరూసలేం: ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా మిలిటెంట్లు జరిపిన యాంటీ ట్యాంక్ క్షిపణి దాడిలో ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. బాధితులంతా కేరళకు చెందిన వారే. ఉత్తర సరిహద్దులకు సమీపంలోని గలిలీ ప్రాంతంలో ఉన్న మర్గలియోట్ సామూహిక వ్యవసాయ క్షేత్రంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. పౌల్ట్రీఫాంలో ఉన్న పాట్ నిబిన్ మాక్స్‌వెల్ (31) చనిపోగా జోసెఫ్ జార్జి(31), పాల్ మెల్విన్(28) అనే వారు గాయపడ్డారు. మాక్స్‌వెల్‌ది కేరళలోని కొల్లం జిల్లా. క్షిపణి దాడిలో మాక్స్‌వెల్ గాయపడినట్లు సోమవారం సాయంత్రం తమకు ఇజ్రాయెల్‌లోని బంధువులు తెలిపారని తండ్రి పాత్రోస్ చెప్పారు. ఆ తర్వాత అతడు చనిపోయినట్లు అర్ధరాత్రి సమాచారమిచ్చారని గద్గద స్వరంతో మీడియాకు చెప్పారు. తన పెద్ద కుమారుడు ఇజ్రాయెల్‌లోనే ఉంటున్నారని ఆయన వివరించారు. గతంలో మస్కట్, దుబాయ్‌కి వెళ్లి వచ్చిన మాక్స్‌వెల్ రెండు నెలల క్రితమే ఇజ్రాయెల్ వెళ్లాడని తెలిపారు.

కోలుకుంటున్న క్షతగాత్రులు: 'క్షిపణి దాడిలో గాయపడిన జార్జిని పెటా టిక్వాలోని బీలిన్సన్ ఆస్పత్రికి తరలించాం. అతడి ముఖం, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం కోలుకుంటున్నాడు. భారత్‌లోని కుటుంబ సభ్యులతో అతడు మాట్లాడొచ్చు'అని అధికార వర్గాలు తెలిపాయి. మెల్విన్‌కు స్వల్ప గాయాలైనట్లు ఇజ్రాయెల్ అధికారవర్గాలు తెలిపాయి. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సాయం అందిస్తామని చెప్పాయి. ఘటనపై ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మిలిటెంట్ల దాడిని పిరికిపంద చర్యగా పేర్కొంది. కాగా, సోమవారం హెజ్బొల్లా మిలిటెంట్లు జరిపిన దాడిలో ఒకరు చనిపోగా మొత్తం ఏడుగురు గాయపడినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వివరించింది. గత ఏడాది అక్టోబర్ 8వ తేదీ నుంచి హమాస్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న పోరులో హమాస్‌కు మద్దతుగా లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్లు రాకెట్లు, డ్రోన్లు, క్షిపణులతో ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై దాడులకు పాల్పడుతున్నారు.

రాహుల్ గాంధీకి ఊహించని అనుభవం

మోదీ అంటూ బీజేపీ కార్యకర్తల నినాదాలు

షాజాపూర్: భారత్ జోడో న్యాయ్ యాత్రలో మంగళవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఊహించని అనుభవం ఎదురైంది. మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్‌లో బీజేపీ కార్యకర్తలు మోదీ, మోదీ అంటూ నినాదాలు చేశారు. దీంతో రాహుల్ వారి వద్దకు వెళ్లి, కరచాలనం చేశారు. అనంతరం రాహుల్ తిరిగి వాహనంలోకి వెళ్తూ గాల్లోకి ముద్దులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ..దేశంలో ప్రతి రంగంలోనూ సామాజిక అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. జనాభాలో 90 శాతం మేర ఉన్న వెనుకబడిన కులాలు, దళితులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు కీలక బాధ్యతల్లో లేనే లేరన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, కాలేజీలు, యూనివర్సిటీలు, చివరికి మీడియాలోనూ ఇవే పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. సాయంత్రం ఉజ్జయినిలో జరిగిన కార్యక్రమంలో షాజాపూర్ ఘటనను వివరించారు. 'అప్పుడప్పుడు ఇలాంటివి జరుగుతాయి. నిజానికి బీజేపీ కార్యకర్తలు నగరంలో నాకు స్వాగతం పలికారు' అని అన్నారు. తర్వాత ఉజ్జయినిలో మహాకాళేశ్వర్ ఆలయంలో పూజలు చేశారు.

పురాతన లిప్‌స్టిక్ లభ్యం

టెహ్రాన్: అతివల అధరాల అందానికి మరింత మెరుగులద్దడంలో లిప్‌స్టిక్‌ది అందెవేసిన చేయి. ఆధునిక ప్రపంచంలో నగరాల్లో అధరాలకు లిప్‌స్టిక్‌తో కనిపించే అమ్మాయిలు ఎక్కువగానే కనిపిస్తుంటారు. అయితే ఈకాలంలోనే కాదు పురాతన కాలంలోనూ లిప్‌స్టిక్‌ను ధరించే వారని, సౌందర్యోపాసన ఆనాడే అద్భుతంగా ఉండేదని తెలిపే ప్రబల సాక్ష్యమొకటి తాజా పరిశోధనలో దొరికింది. దాదాపు 4,000 సంవత్సరాల క్రితంనాటి లిప్‌స్టిక్ ఆనవాళ్లను ఇరాన్‌లో శాస్త్రవేత్తలు గుర్తించారు. క్రీస్తుపూర్వం 1936 – 1687 సంవత్సరాల మధ్యకాలంలో వినియోగంలో ఉన్న ఆ లిప్‌స్టిక్ పేస్ట్ ముదురు ఎరుపు వర్ణంలో మెరిసిపోతుండటం విశేషం. క్లోరైట్‌తో చేసిన చిన్నపాటి సీసాలో ఈ పేస్ట్‌ను పూర్వీకులు భద్రపరిచారు. 2001 ఏడాదిలో ఇరాన్‌లోని జిరాఫ్ట్ ప్రాంతంలో హలీల్ నదికి వచ్చిన వరదల్లో ఇది బయటపడింది. హెమటైట్ ధాతువు సమ్మేళనంగా దానిని తయారుచేశారు. కాంస్యయుగం నాటికే అతివల సౌందర్య సాధనాల జాబితాలోకి లిప్‌స్టిక్ వచ్చి చేరిందని వారు తెలిపారు. తూర్పు ఇరాన్‌లో మర్‌హాసీ నాగరికత వెల్లివిరిసిన కాలంలో లిప్‌స్టిక్ వినియోగం ఉండేదని అభిప్రాయపడ్డారు. కనుబొమ్మలకు, కనురెప్పలకు వాడే సౌందర్య వస్తువులు, బుగ్గలకు రాసుకునే పౌడి సైతం అవశేషాల్లో లభ్యమయ్యాయి.

విమానంలో బీడీ కాల్చిన ప్రయాణికుడు

ముంబై: విమానంలో బీడీ కాల్చి బుక్కయిపోయి జైలు ఊచలు లెక్కపెడుతున్న ఒక కార్మికుడి గాథ ఇది. సౌదీ అరేబియాలో కార్మికునిగా పనిచేసే 42 ఏళ్ల మొహమ్మద్ ఫక్రుద్దీన్ మొహమ్మద్ అమ్రుద్దీన్ సోమవారం ఢిల్లీలో రియాద్‌కు వెళ్లే విమానం ఎక్కాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ కళ్లుగప్పి బీడీలు, లైటర్ వెంట తెచ్చుకుని ఇండిగో విమానం ఎక్కేశాడు. విమానం మార్గమధ్యంలో ముంబైలో ఆగాల్సి ఉంది. ముంబైకి వచ్చేలోపే ఆకాశంలో ఉండగా ఫక్రుద్దీన్ బాత్రూమ్‌కు వెళ్లి బీడీ కాల్చాడు. విషయం తెలిసి విమానం ల్యాండ్ అవగానే ముంబై పోలీసులు అరెస్ట్‌చేసి స్థానికకోర్టులో హాజరుపరిచారు. ఇతడిని జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ స్థానిక కోర్టు ఉత్తర్వులిచ్చింది.



బాధ్యతల స్వీకరణ

చిలకలపూడి: జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారిగా ప్రకాష్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ పి. రాజా బాబును కలిసి మొక్కను అందజేశారు.



వీరమ్మతల్లికి జేజేలు

ఉయ్యూరు వీరమ్మతల్లి భక్తజన హారతులు నడుమ ఆలయం నుంచి ప్రత్యేక పల్లకీలో మెట్టినింటి ప్రవేశం చేసి భక్తుల పూజలందుకున్నారు. -8లో▸



'ఓపెన్' పరీక్షలకు ఏర్పాట్లు

ఓపెన్ పరీక్షల నిర్వహణకు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం అన్ని ఏర్పాట్లు చేసింది. మార్చి 18 నుంచి 27 వరకు పరీక్షలు నిర్వహించనుంది. -8లో▸

న్యూస్‌రీల్

జస్టిస్ అరుణ్‌మిశ్రాకు స్వాగతం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ అరుణ్ మిశ్రాకు మంగళవారం రాత్రి విజయవాడలోని హోటల్ వివంత వద్ద ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు స్వాగతం పలికారు. ఈనెల 6వ తేదీ బుధవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని బృందం నగరంలోని లబ్బీపేట పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో క్యాంప్ సిట్టింగ్ నిర్వహించనుంది. ఈ సిట్టింగ్‌లో రాష్ట్రానికి సంబంధించి కేసుల విచారణ చేపడతారు. ఈ నేపథ్యంలో నగరానికి విచ్చేసిన బృందానికి కలెక్టర్ స్వాగతం పలికారు. బృందంలో డాక్టర్ డీఎం మూలే, రాజీవ్ జైన్, విజయభారతి సయాని, సెక్రటరీ జనరల్ భరత్ లాల్, రిజిస్ట్రార్ (లా) సురాజిత్ డే, డీఐజీ పాటిల్ కేతన్ బలిరాం, డెప్యూటీ రిజిస్ట్రార్ (లా), నోడల్ అధికారి ఇంద్రజీత్ కుమార్ ఉన్నారు.

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బేటీ పడావో, బేటీ బచావో వాల్ పోస్టర్‌ను మహిళాభివృద్ధి, శిశు, సంక్షేమ శాఖ డైరెక్టర్ వెట్రి సెల్వీ ఆవిష్కరించారు. మంగళవారం ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మహిళలకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించేందుకు పోస్టర్లు రూపొందించినట్లు పీడీ జి. ఉమాదేవి తెలిపారు. మహిళలను చైతన్య పరిచే నినాదాలతో పోస్టర్ ప్రచురించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు ప్రాంత ఆర్జేడీ శైలజ, శ్రీ లక్ష్మి, డీసీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీ ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల నెట్ బాల్ మెన్ టోర్నమెంట్ ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్, టోర్నీ చైర్‌పర్సన్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. నాక్ అవుట్ మ్యాచ్‌లో ఆంధ్రా లయోలా కళాశాల టీమ్ మైలవరం ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై 12–5 స్కోరుతోను, వికాస్ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీమ్ కేబీఎన్ కళాశాల టీమ్‌పై 24–22 స్కోరుతో విజయం సాధించాయి. లీగ్ దశలో డీఏఆర్ కళాశాల జట్టు ఆంధ్రా లయోల కళాశాల జట్టుపై 21–13 స్కోరుతోను, ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు నున్న వికాస్ కాలేజి ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టుపై 29–23 స్కోరుతో జయకేతనం ఎగురవేశాయి. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ మండవ కోటేశ్వరరావు, డాక్టర్ డి. యుగంధర్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఉంగుటూరు: ఉపాధి హామీ పథకం అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు అని డ్వామా పీడీ జి.సూర్యనారాయణ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.8.6కోట్లతో చేపట్టిన 493పనులుపై సామాజిక తనిఖీ నివేదికలపై ప్రజా వేదిక మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100రోజులు పనిదినాలు కల్పించాలని సూచించారు. కొందరు ఎఫ్‌ఏలు 100రోజులు పని కల్పించకపోవడం, పని ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రానికి 27గ్రామ పంచాయతీలకు రికవరీ రూపంలో రూ.34,400, మైనర్ పెనాల్టీ రూ.34,400 విధించారు. ఏపీడీలు నాంచర్లరావు, రామ్మోహన్ రావు, లక్ష్మీరెడ్డి, ఎంపీపీ సరోజిని, ఎంపీడీవో మహేశ్వరరావు, ఎస్ఆర్‌పీ రాజు పాల్గొన్నారు.

శివ పూజకు వేళాయె

యనమలకుదురుకు బ్రహ్మోత్సవాల శోభ

- రేపటి నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు
- ప్రభోత్సవానికి ఏర్పాట్లు
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వం



శ్రీరామలింగేశ్వరస్వామివారి ఆలయం(ఫైల్) (ఇన్‌సెట్లో) రామలింగేశ్వరస్వామి



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు లక్షల్లో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. శివరాత్రి రోజు ప్రభోత్సవం ఆకట్టుకుంటుంది.

ఆలయ చరిత్ర..

విజయవాడకు సమీపంలో యనమలకుదురు గ్రామంలో మునిగిరి కొండపై వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి కొలువై ఉండి భక్తులకు కొంగు బంగారమై భాసిల్లుతున్నాడు. శివుడు ఇక్కడ స్వయం భూగా వెలిశాడు. వాయిలింగాకారంలో శివుడు ఇక్కడ ఉన్నాడు. పూర్వం యనమలకుదురు తపస్సుకు అనువుగా ఉండటంతో విష్ణుమూర్తి ఆరో అవతారమైన పరశురాముడు ఈ ప్రాంతానికి వచ్చి శివుడి కోసం తపస్సు చేశాడని చెబుతారు. ఆయన తన యజ్ఞం పూర్తి చేసిన తరువాత శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రాణప్రతిష్ఠ చేశాడని స్థల పురాణం చెబుతోంది. వెయ్యి మంది మునులు ఇక్కడ తపస్సు చేయటంతో వేయి మునుల కుదురుగా పేరు పొంది కాలక్రమేణా యనమలకుదురుగా మారింది.

నందీముద్దలు–గండదీపం..

భక్తులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇక్కడ పెద్ద ఎత్తున మొక్కులు తీర్చుకుంటారు. రామలింగేశ్వరుడు మహాశక్తివంతుడని భక్తులకు నమ్మకం. పిల్లలు పుట్టని వారు సంతానం కోసం భక్తులు ధ్వజ స్తంభానికి వస్త్రాలు కప్పి నందీముద్దలు (పులగం) పైకి విసురుతారు. అవి చీరకొంగులో పడితే వారికి పిల్లలు పుడతారని నమ్మకం. అలాగే కొండ పైకి ఉన్న మెట్లను కడిగి పసుపు కుంకుమ రాసి మొక్కులు తీర్చుకుంటారు. గండ దీపం తలపై పెట్టి నేలపై చీరలు పరిచి ఆ చీరలపై నడుచుకుంటూ కొండ పైకి వెళ్లి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఆలయంలో హనుమంతుడు, నాగేంద్రస్వామి, వీరభద్రుడు, దక్షిణ మూర్తి, చండీశ్వరుడు, నందీశ్వరుడు, నవగ్రహాలు, సప్తమాత్రికులు, సుబ్రహ్మణ్యస్వామి ఇలా అనేక మంది దేవతామూర్తులు కొలువై ఉన్నారు. భక్తులు పవిత్ర కృష్ణానదిలో స్నానాలు చేయటానికి శివలింగాల ఘాట్ వద్ద ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా ప్రభల ప్రదర్శన..

మహాశివరాత్రి ఉత్సవాల్లో ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. దేవుడి ప్రభతో పాటు కొండ చుట్టూ దాదాపు 60 ప్రభలు రంగురంగుల దీపాలతో అలంకరించి రాతి చక్రాల రథం పై ఉంచి ప్రదర్శిస్తారు. ప్రభలు 70 అడుగుల ఎత్తులో ఉంటాయి. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ప్రభలు ఒకేసారి కొండ చుట్టూ తిప్పుతారు. రాధాకృష్ణ కోలాటం, కోయా, హిరాణి నృత్యాలు, భేతాళ వేషాలు వంటివి సందడిగా నిర్వహిస్తారు.

ధ్వజస్తంభానికి బంగారు తాపడం

పార్వతీ సమేత రామలింగేశ్వర్వామివారి ఆలయంలో బంగారు తాపడానికి తెచ్చిన వస్తువులను మంగళవారం ఊరేగింపు నిర్వహించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు దంపతులు, సంగా సుబ్బారావు దంపతులు స్వామివారి ఆలయంలో ధ్వజస్తంభానికి బంగారు తాపడం చేయించారు. అలాగే ధ్వజస్తంభ పీఠం, మాలికలు, మేఖలాలు, త్రిశూలం, మొదలైన వస్తు ఆభరణాలు కొండ దిగువ నుంచి కొండ పైకి వేదమంత్రాలు, మేళతాళాల మధ్య ఊరేగింపుగా కొండపైకి తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్, ఈవో ఎం.గంగాధరరావు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు నరసింహారావు, భక్తులు

మహాశివరాత్రి కార్యక్రమాలు ఇలా..

- మహాశివరాత్రి కార్యక్రమం వివరాలు ఆలయ ఈవో గంగాధరరావు వెల్లడించారు. 7వ తేదీ ఉదయం 8 గంటలకు స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి పెళ్లి కుమారుడిని చేస్తారు. రాత్రి 9 గంటలకు విఘ్నేశ్వరపూజ, అంకురార్పణ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 8వ తేదీ మహాశివరాత్రి ఉదయం 8 గంటలకు అమ్మవారికి కుంకుమ పూజ చేస్తారు. ఉదయం 11 గంటలకు మండపం వద్ద దేవుడి ప్రభ బహిరంగ వేలం తర్వాత భక్తుల సమక్షంలో ప్రభను ప్రతిష్ఠిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తారు. ప్రభోత్సవాన్ని ప్రారంభిస్తారు. అర్ధరాత్రి 2.25 గంటలకు రావి ఉదయ్‌కిరణ్, దీప్తి పుణ్య దంపతులతో మండపంలో స్వామివారి కల్యాణం ఘనంగా చేస్తారు.
- 9వ తేదీ ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, 10వ తేదీ ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, కృష్ణానదిలో త్రిశూలస్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజ అవరోహణ, పవళింపుసేవ, నందీముద్దలు భక్తులకు ఇస్తారు.



దర్శనానికి ఏర్పాట్లు చేసిన బారికేడ్లు.

ఏర్పాట్లు పూర్తి..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, తాగునీరు, స్వామివారికి క్యూ మార్గంలో దర్శించుకోవటానికి బారికేడ్లు, ఉచిత ప్రసాదం, ఆలయానికి లైటింగ్, ఆలయ ప్రాంగణంలో రంగులు వేశారు. భక్తుల అవసరాలకు వైద్య శిబిరం, నదీ స్నానాల వద్ద ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లు, ప్రమాదాల నివారణకు ఫైర్ సిబ్బంది, శాంతిభద్రతలు పర్యవేక్షించటానికి పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు.

ఈసీఐ మార్గదర్శకాల మేరకు ఈవీఎంల వినియోగం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ఈవీఎంలను అధికారులకు అప్పగిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లాలో త్వరలో నిర్వహించనున్న సాధారణ ఎన్నికలల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేయడంతోపాటు ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఈసీఐ నిబంధనలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలను వినియోగిస్తున్నట్లు కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లలో భాగంగా అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రస్తుతం వినియోగిస్తున్న మూడు ఈవీఎంలకు అదనంగా మరో మూడు ఈవీఎంలను మంగళవారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గొల్లపూడిలోని ఈవీఎం గోడౌన్ నుంచి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఎన్నికలను పూర్తి స్థాయిలో పారదర్శకంగాను, జవాబుదారీతనంగాను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో ప్రజలు, యువతను ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రణాళిక ప్రకారం జన జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వి. శ్రీనివాసరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

ఏపీ విద్యా విధానం భేష్



ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్‌సీఈఆర్టీ బృందం

ఉత్తరాఖండ్ ఎస్‌సీఈఆర్టీ జాయింట్ డైరెక్టర్ ఆశా ప్రశంస

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాశాఖ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు చాలా బాగున్నాయి.. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న నూతన విద్యా విధానాలు భేష్ అంటూ ఉత్తరాఖండ్ ఎస్‌సీఈఆర్టీ జాయింట్ డైరెక్టర్ ఆశా ప్రశంసించారు. ఆమె నేతృత్వంలో విద్యావేత్తల బృందం సింగ్‌నగర్‌లోని ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌ను మంగళవారం సందర్శించింది. ఉపాధ్యాయులతో మాట్లాడి టైం టేబుల్, ఐఎఫ్‌సీ ప్యానెల్స్ ఉపయోగించి విద్యార్థులకు బోధిస్తున్న అంశాల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు అందజేస్తున్న రోజువారీ మెనూను చూసి అభినందించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్, ట్రైనింగ్, క్యాంపుల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరసా వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎల్‌వీ కృష్ణప్రసాద్ వారికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్యా విధానం తీరు అద్భుతంగా ఉందని, కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు బోధనా తరగతులు నిర్వహించడం, యూనిఫాం, షూస్, భోజనం వంటి విషయాలలో ప్రభుత్వమే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం మంచి పరిణామమని ఆమె కొనియాడారు. సీనియర్ ఉపాధ్యాయుడు కె.రాజశేఖర్, విజయవాడ నార్త్ ఎంఈఓ ఎ.ప్రభాకర్, స్కూల్ సూపర్‌వైజర్ రాజేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ హైస్కూల్‌లో జర్మనీ బృందం



విద్యార్థులతో జర్మనీ బృంద సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌ను జర్మనీ దేశానికి చెందిన అల్డలాండ్స్‌బర్గ్ సిటీ ఎక్స్ మేయర్, ఎమ్మెల్యే డాక్టర్ గుజ్జుల రవీంద్ర, జర్మనీ దేశ ప్రతినిధుల బృందం సందర్శించింది. వారిలో బుడ్డిగ జమీందార్, గాబ్రియేల్ గుజ్జుల, ఎరహార్డ్ లూగ్వింగ్ బోయిచ్చర్, మెరైక్‌బ్రూనె బోయిచ్చర్, ఫ్రాంక్ గ్యూంటర్ రూఫర్స్ బర్జర్, క్రిస్టన్ మార్గరెట్ ఉన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా సంబంధిత కార్యక్రమాలు, విద్యార్థుల నైపుణ్యాలను స్కూల్ కరస్పాండెంట్ ఆర్. సత్యనారాయణ వారికి వివరించారు. ఈ సందర్భంగా జర్మనీ దేశ బృంద సభ్యులు మాట్లాడుతూ ఉన్నత చదువులతోనే తాము జర్మనీలో మనుగడ సాగిస్తున్నామని తెలిపారు. చదువుతోపాటు కమ్యూనికేషన్ స్కిల్ ఉంటే ఏ దేశంలోనైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఆర్. గోపాలం, సెక్రటరీ ఎం. నరసింహారావు, ట్రెజరర్ డి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం (మైనార్టీ బాలికలు)లో ప్రవేశాలకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ (భవానీపురం) ప్రిన్సిపాల్ ఎస్. శివకుమారి ఓ ప్రకటనలో కోరారు. కోస్తా జిల్లాలైన శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఆయా జిల్లాల్లోని ముస్లిం, మైనార్టీలు, రిజర్వేషన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి అన్ని సీట్లకు, అలాగే 6, 7, 8 తరగతులకు మిగిలి ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష (ఏపీఆర్ఎస్ క్యాట్ – 2024) అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలలో ఏప్రిల్ 25న జరుగుతుందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్ఎస్ డాట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 8712625036 నంబర్‌లో సంప్రదించాలనికోరారు.

పంట నష్టం.. ఇదిగో పరిహారం

మిచాంగ్ తుపానుతో నష్టపోయిన రైతులకు నేడు ఇన్‌పుట్ సబ్సిడీ

- కృష్ణాజిల్లాలో 59,297.98 హెక్టార్లలో పంట నష్టం
- పంట నష్టపోయిన 93527 మంది రైతులు
- రైతుల ఖాతాకు జమకానున్న రూ 101.02 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ



తుపానుతో దెబ్బతిన్న వరి చేను(ఫైల్)

కంకిపాడు: కష్టం వచ్చిన ప్రతి సారీ నేనున్నానంటూ సర్కారు అండగా నిలుస్తోంది. అన్ని విధాలా బాసటగా నిలుస్తూ అన్నదాతకు సీఎం జగన్ ప్రభుత్వం వెన్నుతట్టి ధైర్యం చెబుతోంది. గతంలో ఏ ప్రభుత్వాలూ చేయలేని విధంగా ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి అదే సీజన్‌లో పరిహారం చేతికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రబీ సీజన్ ఆరంభంలో విరుచుకుపడ్డ మిచాంగ్ తుపానుతో నష్టపోయిన రైతులకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేయనుంది. కృష్ణాజిల్లాలో 93,527 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 101.02 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ జమ కానుంది.

కృష్ణాజిల్లాలో పంట నష్టం ఇలా..

గత ఖరీఫ్ సీజన్‌లో పంట చేతికొచ్చిన తరుణంలో మిచాంగ్ తుపాను విరుచుకుపడింది. గతేడాది డిసెంబర్ మొదటి వారంలో తుపాను కారణంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు అపారంగా నష్టం వాటిల్లింది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో చేతికొచ్చిన పంట తుపాను బారిన పడటంతో రైతులు నష్టపోయారు. వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖల బృందాలు ఉమ్మడిగా పంట నష్టం లెక్కించింది. ఆర్‌బీకేల పరిధిలో పంట నష్టం వివరాలు, రైతులు, కౌలురైతుల జాబితాలను ప్రదర్శించి సామాజిక తనిఖీ పూర్తి చేశారు. జాబితాను పారదర్శకంగా రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించారు.

- మిచాంగ్ తుపానుతో కృష్ణాజిల్లాలోని ఆయా మండలాల్లో 59,297.98 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని అధికారులు లెక్కతేల్చారు. 93,527 మంది రైతులు నష్టపోయారు. వీరికి రూ 101.02 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కానుంది.
- వ్యవసాయశాఖకు సంబంధించి వరి పంట 90741 మంది రైతులు 57777.08 హెక్టార్లలోనూ, మొక్కజొన్న 264 మంది రైతులు 167.70 హెక్టార్లలో, మినుము పంట 89 మంది రైతులు 58.04 హెక్టార్లలో, వేరుశనగ పంట 1066 మంది రైతులు 681.29 హెక్టార్లు , పత్తి 158 మంది రైతులు 151.50 హెక్టార్లలో నష్టపోయారు. 92318 మంది రైతులు 58835.56 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లింది. ఇందుకు రూ 99.90 కోట్ల ఇన్‌పుట్‌సబ్సిడీ విడుదలకానుంది.
- ఉద్యాన శాఖకు సంబంధించి 1209 మంది రైతులు 462.420 హెక్టార్లలో పంట నష్టపోయారు. ఇందుకు గానూ 112.453 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీగా తేల్చారు.
- అరటి పంట 839 మంది రైతులు 349.999 హెక్టార్లలో, తమలపాకు 51 మంది రైతులు 10.072 హెక్టార్లలో, ఎర్రమిర్చి 47 మంది రైతులు 33.760 హెక్టార్లలో, పూలతోటలు 18 మంది రైతులు 5.133 హెక్టార్లలో, బొప్పాయి ఐదుగురు రైతులు 2.035 హెక్టార్లలో, కూరగాయలు 247 మంది రైతులు 60.921 హెక్టార్లలో, కంద పంట ఇద్దరు రైతులు 0.500 హెక్టార్లలో నష్టం వాటిల్లింది.

ఎన్టీఆర్ జిల్లాలో...

మిచాంగ్ తుపాను, 2023 ఖరీఫ్‌లో తలెత్తిన కరువు పరిస్థితుల ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లాలో 12,929 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానశాఖల బృందాలు పరిశీలించి పారదర్శకంగా పంట నష్టం జాబితాను రూపొందించారు. 22,451 రైతులు నష్టపోయారు. వీరికి గానూ ప్రభుత్వం రూ 21.72 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేయనుంది.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా..

పంట నష్టపోయిన రైతులకు అందించే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ప్రభుత్వం ముందుగానే తేల్చింది. పంటల వారీగా అరటి హెక్టార్‌కు రూ. 25 వేలు, తమలపాకు సెంటుకు రూ. 300, ఎర్రమిర్చి, పూలతోటలు, బొప్పాయి, కూరగాయలు, కంద పంటకు హెక్టార్‌కు రూ. 17 వేలు పరిహారంగా అందనుంది. వ్యవసాయ శాఖకు సంబంధించి వరికి హెక్టార్‌కు రూ. 17 వేలు, మొక్కజొన్నకు హెక్టార్‌కు రూ. 12500, మినుముకు హెక్టార్‌కు రూ. 10 వేలు, వేరుశెనగ, పత్తికి హెక్టార్‌కు రూ. 17 వేలు ఇన్‌పుట్‌సబ్సిడీ అందనుంది.

నాలుగేళ్లలో రూ. 126.03 కోట్లు చెల్లింపు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ సీజన్‌లో విపత్తుతో పంట నష్టపోతే అదే సీజన్‌లో పరిహారం అందించింది. గడిచిన నాలుగేళ్లలో 164849 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ 126.03 కోట్లు జమ చేసి, అన్నదాతకు అండగా నిలిచింది.

పారదర్శకంగా జాబితా



తుపానుతో పంట నష్టపోయిన ఏ ఒక్క రైతు, కౌలు రైతు నష్టపోకుండా పంట నష్టం వివరాలను లెక్కించాం. సామాజిక తనిఖీ పూర్తి చేసి పారదర్శకంగా జాబితాను రూపొందించాం. మార్గదర్శకాలను పటిష్టంగా అమలు చేశాం. బాధిత రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది.

– ఎస్.పద్మావతి, కృష్ణాజిల్లా వ్యవసాయాధికారి

సమయానికి పరిహారం



మిచాంగ్ తుపాను వల్ల ఉద్యాన పంటలకూ అపార నష్టం వాటిల్లింది. పంట నష్టం వివరాలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందాలన్న ఉద్దేశంతో లెక్కింపు నిర్వహించాం. పరిహారం సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

– జె.జ్యోతి, కృష్ణా జిల్లా ఉద్యానశాఖ అధికారి

క్లుప్తంగా

ఆకృతిలో ప్రత్యేక చీరల విభాగం ప్రారంభం



జగ్గయ్యపేట: పట్టణంలోని జి.వి మాల్ వారి ఆకృతి షోరూంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక చీరల విభాగాన్ని మంగళవారం సినీ నటి అనసూయ భరద్వాజ్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సతీమణి విమలభానుతో ప్రారంభించారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ షోరూంలో మహిళల కోసం ప్రత్యేక చీరల విభాగాన్ని యాజమాన్యం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతానికి కూడా వ్యాపార రంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అనసూయను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ హరిచంద్ర, పీఆర్వో భాస్కరరావు, జగ్గయ్యపేట బ్రాంచి నిర్వాహకులు నీలిశెట్టి వాసు, నారాయణరావు, ఇముడిశెట్టి వెంకటేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని డ్రైవర్ దుర్మరణం



ఉంగుటూరు: చెన్నై–కోల్‌కత జాతీయ రహదారిపై తేలప్రోలు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా కెరళంపూడి మండలం గాద్దెనపల్లి గ్రామానికి చెందిన గండేపూడి రవి (22) గ్లాస్ లోడ్‌తో మినీ వ్యాన్‌పై విజయవాడ నుంచి రాజమండ్రి వెళుతున్నాడు. ఉంగుటూరు మండలం తేలప్రోలు జ్యూస్ ఫ్యాక్టరీ సమీపంలో మినీ వ్యాన్ టైర్ పంక్చరైంది. దీంతో వ్యాన్‌ను అక్కడ నిలిపి టైర్ మార్చుకుంటున్నాడు. అదే సమయంలో విజయవాడ నుంచి వేగంగా వస్తున్న గుర్తు తెలియని బస్సు రవిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆత్కూరు పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని మృత దేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు

- 18 నుంచి పరీక్షల నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో హాజరు కానున్న 7,671 మంది విద్యార్థులు
- పరీక్షా కేంద్రాలు 41



ఓపెన్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు (ఫైల్)

పెనుగంచిప్రోలు: కుటుంబ, ఇతర ఆర్థిక ఇబ్బందులతో పాటు పలు కారణాలతో చదువుకు దూరమైన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరంలా మారింది. సార్వత్రిక విద్యా పీటం రెగ్యులర్ విద్యార్థుల మాదిరిగానే పదో తరగతి, ఇంటర్ ఓపెన్ పరీక్షలు నిర్వహిస్తోంది. చదువుకోవాలనే ఆశ ఉన్న వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తోంది. పరీక్షల నిర్వహణకు ఏపీ సార్వత్రిక విద్యాపీటం అన్ని ఏర్పాట్లు చేసింది. పరీక్షలను మార్చి 18 నుంచి 27 వరకు నిర్వహించనుంది. పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్ కూడా విడుదల చేసింది.

ఎన్టీఆర్ జిల్లాలో...

ఎన్టీఆర్ జిల్లాలో పదో తరగతికి 10 పరీక్షా కేంద్రాలు కాగా 1785 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇంటర్‌కు 18 పరీక్షా కేంద్రాలు కాగా, 3110 మంది హాజరు కానున్నారు. స్టడీ సెంటర్లు పదో తరగతి, ఇంటర్‌కు కలిపి 48 ఉన్నాయి.

కృష్ణా జిల్లాలో....

జిల్లాలో పదో తరగతికి 5 పరీక్షా కేంద్రాలు ఉండగా 973 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇంటర్‌లో 8 పరీక్షా కేంద్రాలు ఉండగా 1803 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. స్టడీ సెంటర్లు పదో తరగతి, ఇంటర్‌కు 24 ఉన్నాయి.

నేటి నుంచి హాల్ టికెట్లు పంపిణీ....

ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు గతంలో హాజరై పరీక్షలు రాసి ఉత్తీర్ణత కాని వారు ఎన్టీఆర్ జిల్లాలో 200, కృష్ణా జిల్లాలో 150 మంది వరకు ఉన్నారని ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్స్ కో–ఆర్డినేటర్ నక్కా బాబూరావు తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం గం.2.30 నిమిషాల నుంచి గం.5.30 నిముషాల వరకు నిర్వహిస్తారన్నారు. ఇప్పుడు పరీక్షలు రాసే వారితో పాటు గతంలో ఉత్తీర్ణత కాకుండా తిరిగి పరీక్ష రాసేవారు అందరూ హాల్ టికెట్లను బుధవారం నుంచి స్టడీ సెంటర్ల నుంచి పొందవచ్చు.

పకడ్బందీగా నిర్వహణ



ఏపీ ఓపెన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్, డ్యూటీ ఆఫీసర్లను నియమించటంతో పాటు అవసరమైన శిక్షణ కూడా ఇచ్చాం. వారి సెంటర్లను సైతం పరిశీలించాం.

–తాహేరా సుల్తానా, డీఈఓ, కృష్ణా జిల్లా

పరీక్ష కేంద్రాల్లో వసతులు



స్టడీ సెంటర్లు ద్వారా పరీక్షలు రాసే అభ్యర్థులు హాల్ టికెట్లు వెంటను తీసుకోవచ్చు. పరీక్ష పేపర్లు మార్చి 14న జిల్లా కేంద్రాలకు వస్తాయి. అక్కడా నుంచి 15 న ఆయా సెంటర్లలోని పోలీస్‌స్టేషన్లకు పరీక్షా పేపర్లు వస్తాయి. గుర్తించిన పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాం. ఈసారి రెగ్యులర్ పదో తరగతి పరీక్షలు జరిగే చోట ఓపెన్ పరీక్షల సెంటర్లు లేకుండా చూశాం.

–యూవీ సుబ్బారావు, డీఎస్ఈఓ, ఎన్టీఆర్ జిల్లా

ఆత్మ విశ్వాసంతో విజయం సాధించాలి



పుస్తకాన్ని అందుకున్న విద్యార్థినులతో స్వర్ణశ్రీ సత్యనారాయణ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వన్‌టౌన్‌లోని కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో గల ఉమెన్స్ స్టడీస్ సెంటర్‌లో మంగళవారం కళారత్న డాక్టర్ సీహెచ్ బాబావలిరావు రచించిన 'మహాభారతంలో స్త్రీ మూర్తులు – సాధికారత' పుస్తక పరిచయ సభ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణ రావు అధ్యక్షత వహించిన ఈ సభలో పుస్తక ప్రచురణకర్త స్వర్ణశ్రీ సత్యనారాయణ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పుస్తకాన్ని తాను ముద్రించడమే కాకుండా పరిచయం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఒక మహిళ ఎనిమిది మంది పురుషులతో సమానమని పేర్కొన్నారు. మహిళా సాధికారత గురించి పంచమ వేదమైన మహాభారతంలో చెప్పబడిన అనేక అంశాలు నేటికీ అనుసరణీయమని చెప్పారు. మహాభారతం గ్రంథంలో పేర్కొన్న ఎందరో స్త్రీ మూర్తుల గురించి నేటి తరం తప్పకుండా తెలుసుకోవాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి తాము ఎంచుకున్న రంగంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బుడితి హరిణి రాజశేఖర్, విజయభాను రామమోహన్, గౌతమి కాంతిలాల్‌దండే, ధ్వన్యనుకరణ చక్రవర్తి భవిరి రవి పాల్గొన్నారు. మహాభారతంలో స్త్రీ మూర్తులు పుస్తకాన్ని విద్యార్థినులకు స్వర్ణశ్రీ సత్యనారాయణ అందజేశారు. ఈ పుస్తకాన్ని తప్పనిసరిగా చదవి స్త్రీ మూర్తుల ఔన్నత్యాన్ని తెలుసుకుని వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

దుర్గగుడి ట్రస్టు బోర్డు సభ్యురాలిగా రామలక్ష్మి నియామకం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నగరానికి చెందిన అమలవరపు రామలక్ష్మిని, ప్రత్యేక ఆహ్వానితులుగా అల్లా భువన్‌కుమార్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల్ వలవన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ట్రస్ట్ బోర్డు చైర్మన్, పాలక మండలి సభ్యులు 15 మంది, నలుగురు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్నారు. 13 నెలల కిందట దుర్గగుడి నూతన పాలక వర్గాన్ని ప్రభుత్వం నియమించగా, దసరా ఉత్సవాలకు ముందు నలుగురిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించారు. తాజాగా ఒకరికి ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా, మరొకరిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించడంతో ఈ జాబితా మొత్తం 21 మందికి చేరింది.

రైతన్నల సంక్షేమానికి డీసీఎంఎస్ కృషి

- డీసీఎంఎస్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ
- ఘనంగా డీసీఎంఎస్ సాధారణ మహాజన సభ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రైతన్నల సంక్షేమానికి డీసీఎంఎస్ విశేష కృషి చేస్తోందని డీసీఎంఎస్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. విజయవాడలో ఓ హోటల్‌లో డీసీఎంఎస్ సాధారణ మహాజనసభ మంగళవారం నిర్వహించారు. 2023 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 2024 ఫిబ్రవరి 29 వరకు సంఘ జమా ఖర్చులను పరిశీలించారు. ఆడిట్ రిపోర్ట్‌ను మహాజన సభ ఆమోదించింది. సహకార సంఘాల పర్సనల్ ఇన్‌చార్జిల పదవీకాలాన్ని ఆరు నెలలపాటు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహకార శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామంలో సొసైటీ తరపున పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. జన ఔషధీ కింద సొసైటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణంలో మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సంఘం నిర్వహించిన కార్యకలాపాల ద్వారా వచ్చిన లాభాలను సభ్యులకు త్వరలో పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. బిజినెస్ మేనేజర్ ప్రసాదరావు, బోర్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరమ్మతల్లికి భక్తుల జేజేలు

- మెట్టినింట ప్రవేశించిన అమ్మవారు
- ఆనందోత్సాహాలతో వసంతోత్సవం



మెట్టినింటిలోకి ప్రవేశిస్తున్న అమ్మవారి పల్లకిపై పూలు విసురుతున్న భక్తులు

ఉయ్యూరు: వీరమ్మతల్లికి భక్తులు జేజేలు పలికారు. చల్లనితల్లీ...కాపాడమ్మా...అంటూ పూజించి భక్తి పారవశ్యం చెందారు. దారి పొడవునా భక్తజన హారతులు నడుమ ఆలయం నుంచి అమ్మవారు ప్రత్యేక పల్లకిలో మెట్టినింటి ప్రవేశం చేసి భక్తుల పూజలందుకున్నారు. ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం సోమవారం రాత్రితో ముగిసింది. మంగళవారం వేకువజామున శ్రీకనక చింతయ్య సమేతంగా వీరమ్మతల్లిని ఊరేగింపుగా పారుపూడి, నెరుసు వంశస్తులు మెట్టినింటికి చేర్చారు. ఆలయం నుంచి పల్లకిలో బయలుదేరిన అమ్మవారి వెంట అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జై వీరమ్మ...జైజై వీరమ్మ అంటూ భక్తజన నినాదాలు చేశారు. ప్రధాన సెంటరులో ఊయల స్తంభం వద్ద అమ్మవారు ఊయలూగి కాలేజ్ రోడ్డు, రావిచెట్టు రోడ్డు, కొబ్బరితోట, మెట్టినింటి ఆలయ పరిసర పురవీధుల్లో గ్రామోత్సవం జరుపుకున్నారు. దారి పొడవునా భక్తులు పసుపునీరు ఓరబోసి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అమ్మవారు మెట్టినింట ప్రవేశం చేసే క్రమంలో భక్తులు పల్లకిలో పూలు విసురుతూ పసుపునీరు చిమ్ముకుంటూ వసంతోత్సవం జరుపుకున్నారు. ఆనందోత్సాహాలతో కల్పవల్లిని మెట్టినింటిలోకి తీసుకెళ్లారు. శ్రీకనక చింతయ్య సమేతంగా మెట్టినింట చేరిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు జరిపించారు. మళ్లీ తిరునాళ్ల మహోత్సవం వరకూ అమ్మవారు మెట్టినింటిలోనే భక్తుల పూజలందుకుంటారు. తిరునాళ్లను ప్రభుత్వ శాఖల అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. పోలీసుశాఖ ప్రధాన పాత్ర పోషించింది. డీఎస్పీ జయసూర్య, సీఐ హబీబ్ బాషా, ఎస్‌ఐ గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అందించిన సేవలుపై భక్తులు ప్రశంసలు కురిపించారు.

అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి రాజాబాబు



స్వీప్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ పి. రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ

చిలకలపూడి (మచిలీపట్నం): సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ విలువైన ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయడంలో భాగస్వామ్యం కావాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు జిల్లా వాసులను కోరారు. కలెక్టరేట్ ఆర్డీవో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన ఓటు వినియోగంపై అవగాహన ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రజలను చైతన్యవంతం చేయడమే ఎన్నికల ఈ ప్రచార వాహన ముఖ్య ఉద్దేశం అన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో ఓటు నమోదుకు అనేక ప్రచార కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. అదే రీతిలో నేడు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వాహనంలో ఓటర్లను చైతన్య పరిచే వీడియోలు, పోస్టర్లు ఉంటాయన్నారు. జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శిస్తూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజలను చైతన్యవంతం చేస్తామని వెల్లడించారు. ఇటువంటి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన బందరు ఆర్డీవోను కలెక్టర్ అభినందించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర రావు, ఆర్డీవో ఎం. వాణి, తహసీల్దార్ పి.సతీష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దుర్గా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):నిరుద్యోగ యువతకు ఉపాధి చూపించాలనే ఉద్దేశంతో తమ సంస్థ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ల్యాండ్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఎన్టీఆర్ జిల్లా అధికారి పి.నరేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో భూమి కొలతలు, హైవే రోడ్డు లెవలింగ్, ఆటో లెవలింగ్, కెనాల్ సర్వే అంశాలపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి సర్టిఫికెట్‌తో పాటుగా ప్రవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కూడా చూపిస్తామని చెప్పారు. 10వ తరగతి పాసై 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 11వ తేదీ లోగా విద్యాధరపురం కబేళా సెంటర్‌లో ఉన్న సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ ఆవరణలోని తమ కార్యాలయానికి పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఈ–మెయిల్ ఐడీ, మొబైల్ నంబరుతో వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98482 55009, 98667 95010 నెంబరులో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్ష ప్రశాంతం



చిలకలపూడి(మచిలీపట్నం): ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం ఇంగ్లీషు పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 18,479 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 18,220 మంది హాజరయ్యారు. 259 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మచిలీపట్నంలోని లేడియాంప్తిల్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పి. రాజాబాబు పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు నిర్దేశించిన నియమాలను అనుసరించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐవో పి.రవికుమార్, డీవీఈవో పీబీ సాల్మన్‌రాజు, డిస్ట్రిక్ ఎగ్జామ్స్ కమిటీ మెంబర్ ప్రసాదశాస్త్రి, ప్రిన్సిపాల్ కళ్యాణి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద యార్లగడ్డ ఓవర్ యాక్షన్



పోలీసులతో గొడవ పడుతున్న యార్లగడ్డ

గన్నవరం: విజయవాడలోని సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ ఎదుట గన్నవరం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు తన పార్టీ నేతలతో మంగళవారం కలిసి హల్‌చల్ చేశారు. కోర్టులో ఉన్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను దొంగచాటుగా వీడియో తీస్తూ పోలీసులకు పట్టుబడ్డ తమ వ్యక్తులను విడుదల చేయాలని స్టేషన్ ఎదుట హంగామా సృష్టించారు. పోలీసులు డౌన్...డౌన్ అంటూ నినాదాలు చేయడంతో పాటు వారించేందుకు ప్రయత్నించిన పోలీస్ అధికారులపై దురుసుగా ప్రవర్తిస్తూ అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రసాదంపాడులో 2019 ఎన్నికల సమయంలో జరిగిన గొడవపై నమోదైన కేసులో విచారణ నిమిత్తం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ విజయవాడ కోర్టుకు హాజరయ్యారు. కోర్టులో ఉన్న ఎమ్మెల్యేను టీడీపీ నాయకుడు గూడవల్లి నరసయ్య కుమారుడు, ఆయన కారు డ్రైవర్ రహస్యంగా వీడియోలు తీస్తుండడం గమనించి వారిని పట్టుకుని, సెల్‌ఫోన్లతో సహా పోలీసులకు అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న యార్లగడ్డ వెంకట్రావు పార్టీ నేతలతో కలిసి ప్రదర్శనగా సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ పోలీసు అధికారులతో గొడవకు దిగి వెంటనే తమ మనుషులను బయటకు పంపించాలని డిమాండ్ చేశారు. లేకపోతే జయహో బీసీ సభకు వచ్చిన టీడీపీ, జనసేన శ్రేణులతో విజయవాడను ముట్టడిస్తానని బెదిరింపులకు పాల్పడ్డారు. పోలీస్ అధికారులు సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ వినకుండా పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి రచ్చ చేశారు. ఒక దశలో పోలీసులపై యార్లగడ్డతో పాటు ఆ పార్టీ నేత దొంతు చిన్నా దురుసుగా ప్రవర్తించడంతో పాటు కించపరుస్తూ రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేశారు. గతంలో కూడా విజయవాడ రూరల్ మండలం పి.నైనవరంలో పోలీసులపైకి యార్లగడ్డ దురుసుగా వ్యవహరించారు. సైలెన్సర్లు తొలగించిన బైక్‌లతో రోడ్లపై బీభత్సం చేస్తున్న టీడీపీ యువకులను అడ్డుకున్నారనే కోపంతో పోలీసులపైకి దూసుకువెళ్లిన యార్లగడ్డ విమర్శల పాలయ్యారు.

నకిలీ ఐడీ కార్డులతో వీఐపీ దర్శనం

- దుర్గగుడిపై వ్యక్తిని పట్టుకున్న ఆలయ సిబ్బంది
- పోలీసులకు ఫిర్యాదు చేసిన దేవస్థానం
- విచారిస్తున్న వెస్ట్ ఏసీపీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇన్‌కంటాక్స్ అధికారి పేరిట నకిలీ ఐడీ కార్డులతో రాజమార్గంలో అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న వ్యక్తి మంగళవారం ఆలయ సిబ్బందికి పట్టుబడ్డాడు. ఆ వ్యక్తి వద్ద రెండు పేర్లతో ఐడీ కార్డులను గుర్తించి వ్యవహారాన్ని ఆలయ ఈవో కేఎస్ రామారావు, వన్‌టౌన్ పోలీసులకు తెలియజేశారు. దీంతో ఈ బండారం బట్టబయలైంది. ఇన్‌కంటాక్స్ జాయింట్ కమిషనర్ వి. శ్రీనివాస్, ఆనంద్ పేర్లతో ఉన్న ఐడీ, విజిటింగ్ కార్డులతో ఓ వ్యక్తి తరుచూ అమ్మవారి దర్శనానికి వస్తున్నట్లు ఆలయ అధికారులు గుర్తించారు. అయితే అమ్మవారి దర్శనం చేసుకున్న తర్వాత అధికారి అనే దర్పంతో ఆ వ్యక్తి ఆలయ సిబ్బందితో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. దీంతో ఆయన వద్ద ఉన్న గుర్తింపు కార్డులు చూపించాలని సిబ్బంది కోరారు. తొలుత ఆనంద్ పేరుతో ఉన్న గుర్తింపు కార్డు, ఆ తర్వాత శ్రీనివాస్ పేరిట ఉన్న మరో కార్డు చూపడంతో అనుమానం మరింత బలపడింది. గతంలోనూ పలు మార్లు ఇదే తరహాలో వీఐపీ దర్శనం చేసుకోవడమే కాకుండా ఆలయ పర్యవేక్షకులు, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించిన సందర్భాలున్నట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. అయితే మంగళవారం కూడా అదే పంథాలో వ్యవహరించడంతో సిబ్బంది ఆ వ్యక్తిని గట్టిగా ప్రశ్నించారు. ఆలయ ప్రాంగణంలో గొడవ జరుగుతుండటంతో అవుట్ పోస్టులోని పోలీసు సిబ్బంది వచ్చి ఆరా తీశారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారించాలని ఈవో కెఎస్.రామారావు పోలీసులను కోరారు. మరో వైపున ఈ వ్యవహారాన్ని ఇన్‌కంటాక్స్ అధికారులతో దుర్గగుడి అధికారులు మాట్లాడి అసలు ఈ శ్రీనివాస్, ఆనంద్ అనే వ్యక్తి ఆ శాఖలో ఉన్నారా అని ఆరా తీశారు. ఆ వ్యక్తిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి విచారించారు. ఇన్‌కంటాక్స్ అధికారి పేరిట సిబ్బందిని బెదిరింపులకు పాల్పడటంపై ఆలయ సిబ్బంది వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు విచారిస్తున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ లయోలా గార్డెన్స్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వెంకటేశ్వరానగర్ మొదటి రోడ్డు, స్పెన్సర్ రోడ్డు, ఎం హోటల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

గడప గడపకు సంక్షేమం



గుణదల(విజయవాడతూర్పు): గడప గడపకు 'మీ అవినాష్ అన్న హామీ' కార్యక్రమంలో భాగంగా దేవినేని అవినాష్ కుటుంబ సభ్యులు సిద్ధార్థ్ క్రీస్తురాజపురం కొండ ప్రాంతంలో మంగళవారం పర్యటించారు. గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ్ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందుకున్న సంక్షేమం, జరిగిన అభివృద్ధిని గమనించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో దేవినేని అవినాష్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఐదో డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, నాయకులు నీలం కొండ, రాజ్, షకీరా, వరుణ్ పాల్గొన్నారు.

బీసీసీఐ విజ్జి ట్రోఫీకి చంటి, సుశాంత్ నాయుడు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: ప్రతిష్ఠాత్మకమైన బీసీసీఐ విజ్జి క్రికెట్ ట్రోఫీకి విజయవాడ క్రీడాకారులు ఎం.సుశాంత్‌నాయుడు, జి.చంటి ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ఇరువురు క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నేపథ్యంలో దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల నుంచి ఎంపిక చేసిన బీసీసీఐ విజ్జి జట్టులో వీరు చోటు దక్కించుకున్నారు. వీరిద్దరు ప్రస్తుతం విజయవాడలోని నలంద డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. విజ్జి ట్రోఫీకి ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాలలో క్రీడాకారులను మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీసీఐ మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పాల్గొని క్రీడాకారుల ప్రతిభను కొనియాడారు. తమ కళాశాలలో క్రీడలకు ప్రోత్సాహం అందిస్తామని, క్రీడాకారులకు ఫీజులో రాయితీ ఇస్తామని ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, నలంద విద్యా సంస్థల చైర్మన్ ఎ.విజయబాబు తెలిపారు. ఈ నెల 10 నుంచి అస్సాంలోని గౌహతిలో జరిగే బీసీసీఐ విజ్జి ట్రోఫీలో క్రీడాకారులు పాల్గొంటారని కాలేజీ పీడీ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఘనంగా భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు



విజయవాడకల్చరల్: శృంగేరీ పీఠ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 74వ జన్మదినం సందర్భంగా దుర్గాపురంలోని శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న వైదిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం మహాశివలింగం, పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలకు వేదపండితులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ చక్రనవావరణ అర్చన, సాయంత్రం ఆదిదంపతులకు త్రిశతి, సహస్ర నామార్చన, మహామంగళ హారతి, నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ గురువారం శివాలయం ప్రాంగణంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ జరుగుతుందని, ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. శివరామకృష్ణ క్షేత్రం నిర్వహణా సంఘ సభ్యులు గండూరి చంద్రమౌళి, పూర్వపు ధర్మాధికారి జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి పాల్గొన్నారు.

జిల్లాలో 98.82 శాతం పెన్షన్ పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పెన్షన్‌కానుక 98.82 శాతం పంపిణీ జరిగింది. జిల్లాలో మొత్తం 2,38,157 మంది పెన్షనర్లకు గాను 2,35,342 మంది పెన్షన్ అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా జి.కొండూరు మండలంలో 99.56 శాతం, జగ్గయ్యపేట అర్బన్‌లో 99.5 శాతం, జగ్గయ్యపేట మండలంలో 99.47 శాతం, వీరులపాడులో 99.37శాతం, తిరువూరు(అర్బన్)లో 99.37 శాతం పంపిణీ చేశారు.

ముంపు చింత లేదిక

- వారధి ఎగువన పూర్తయిన రిటైనింగ్ వాల్ నిర్మాణం
- రూ.135 కోట్లతో 1.05 కి.మీ మేర నిర్మాణం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రణధీర్‌నగర్ ప్రజలు
- టీడీపీ అసమర్థ నేతల అసత్య ప్రచారంపై ప్రజల ఆగ్రహం
- మొత్తం 3.5 కి.మీల మేర రక్షణ గోడను రూ.360 కోట్లతో పూర్తి



వారధి ఎగువన నిర్మించిన రిటైనింగ్ వాల్



లబ్బీపేట(విజయవాడతూర్పు): వాళ్లంతా వివిధ రకాల వృత్తి, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారే. ఐదు దశాబ్దాల కిందట కనకదుర్గమ్మ వారధి ఎగువ ప్రాంతంలో కరకట్ట దిగువున నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడల్లా వారి కష్టాలు వర్ణనాతీతంగా ఉండేవి. ఇప్పుడు కనకదుర్గమ్మ వారధి ఎగువ ప్రాంతంలో సైతం రిటర్నింగ్ వాల్ నిర్మాణం కూడా పూర్తి కావడంతో రణధీర్‌నగర్ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానదికి వరదలు వచ్చినా ఇక ముంపు చింత లేదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, అనంతరం వాటిని మర్చిపోయిన నేతలను చూశామని, కానీ ఎలాంటి హామీ ఇవ్వకుండానే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కష్టాలు తొలగిపోయేలా చేశారంటున్నారు. తొలుత కనకదుర్గమ్మ వారధి దిగువ ప్రాంతంలోనే రిటైనింగ్ వాల్ కట్టాలనేది ప్రతిపాదన కాగా, ఎగువ ప్రాంతంలో కూడా ముంపు సమస్య ఉందని తెలుసుకుని, మా ఇబ్బందులు తొలగిపోయేలా రక్షణ గోడ నిర్మించారని ఆ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మా జీవితాంతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామంటున్నారు.

కష్టాలు తలచుకుంటేనే..

కృష్ణానదికి వరదలు వచ్చిన సమయంలో తాము పడిన కష్టాలు తలచుకుంటేనే ఆందోళనగా ఉంటుందని ఆ ప్రాంత వాసులు అంటున్నారు. ప్రస్తుతం వారధి ఎగువ ప్రాంతమైన రణధీర్‌నగర్‌లో సుమారు 15 వేల మంది వరకూ నివాసం ఉంటున్నారు. వారంతా కృష్ణానదికి వరద వచ్చిన సమయంలో ఇంట్లో సామాన్లు సర్దుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లోకి తరలివెళ్లేవారు. అక్కడ సరైన ఆహారం, నీళ్లు లేక, ఇంట్లో సామాన్లు ఏమైపోతాయో అనే ఆందోళనతో బిక్కు బిక్కు మంటూ గడిపేవారు. అలా వరద తగ్గే వరకూ పునరావాస కేంద్రాల్లో వారం, 10 రోజులు ఉన్న సందర్భాలు ఉన్నాయి. ఆ సమయంలో సరైన మరుగుదొడ్లు, ఇతర వసతులు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

రక్షణ కవచంలా..

కృష్ణానదికి వరద వచ్చిన సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ ప్రాంతంలో పర్యటించారు. రాణిగారితోట తారకరామనగర్, భూపేష్‌గుప్తా నగర్ తదితర ప్రాంతాల ప్రజలను పరామర్శించి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రక్షణ గోడ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు కనకదుర్గమ్మ వారధి దిగువన సుమారు రూ.225 కోట్లతో రెండు విడతలుగా రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. అనంతరం ఎగువ ప్రాంతంలో కూడా ముంపు సమస్య ఉందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సీఎం వైఎస్ జగన్‌కు చెప్పడంతో రూ.135 కోట్లతో 1.05 కి.మీ మేర నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు.

అసత్య ప్రచారానికి తెర..

ఆ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మిస్తామని టీడీపీ నేతలు అనేక సార్లు హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంగతి మర్చిపోయారు. కానీ నేడు వారధి ఎగువ ప్రాంతంలో హామీ ఇవ్వకుండానే రక్షణ గోడ నిర్మించడంతో టీడీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. ఆ ప్రాంతంలో రోడ్డు వేస్తారని, కరకట్ట దిగువున ఇళ్లు తొలగిస్తారంటూ అసమర్థులు అసత్య ప్రచారానికి తెర లేపారు. ఈ ప్రచారాన్ని ఇటీవల ఆ ప్రాంతంలో జరిగిన బహిరంగ సభలో దేవినేని అవినాష్ తిప్పికొట్టారు. ఇళ్లు కాదు కదా ఇసుక రేణువు కూడా తీయబోమని తేల్చి చెప్పి వారికి భరోసా ఇచ్చారు.

మా కష్టాలు తొలగిపోయాయి..



కృష్ణానదికి వరద వచ్చిందంటే మాకు కష్టాలు మొదలయ్యేవి. ఇళ్లలోకి నీరు చేరడంతో సామాన్లు సర్దుకుని పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. వరద తగ్గిన తర్వాత మళ్లీ ఇళ్లకు చేరేవాళ్లం. నా చిన్నప్పటి నుంచి ఇదే ప్రాంతంలో ఉంటున్నా. అనేక మంది ఎన్నో హామీలు ఇచ్చారు. కానీ మా ప్రాంతానికి హామీ ఇవ్వకుండానే రక్షణ గోడ కట్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– కంపెల్ల భాను లక్ష్మీనారాయణ, రణధీర్‌నగర్

ఇప్పుడు సంతోషంగా ఉంటున్నాం..



వర్షాకాలం వచ్చిందంటే చాలు కృష్ణానదికి వరద ఎప్పుడు వస్తుందో తెలియక ఆందోళన చెందుతూ ఉండేవాళ్లం. ఏడాదిలో ఒకటి, రెండు సార్లు వరద వస్తుండేది. ఇప్పుడు మాకు అలాంటి ఆందోళన లేకుండా సంతోషంగా జీవిస్తున్నాం. మా కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రక్షణ గోడ కట్టించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దమ్మున్న నాయకుడిగా నిరూపించుకున్నారు.

– ఒడుగు పిచ్చయ్య, రణధీర్‌నగర్

మా చిరకాల కోరిక తీరింది..



కృష్ణానదికి వరద వచ్చినా, ఇళ్లు ముంపునకు గురికాకుండా ఉండాలనేది ఎప్పటి నుంచో మా చిరకాల కోరిక. ఇప్పటి వరకూ వరదలు వచ్చిన సమయంలో ఎందరో నాయకులు వచ్చి, హామీలు గుప్పించే వాళ్లే కానీ ఒక్కరూ పరిష్కరించలేదు. కానీ మంచి మనస్సున్న వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రావడంతో మా కష్టాలు తొలగిపోయి, చిరకాల కల నెరవేరింది. ఆయనకు ఈ ప్రాంత ప్రజలంతా రుణపడి ఉంటాం.

– మాదగాని సూర్యనారాయణ, రణధీర్‌నగర్

నేడు మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం సభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): రానున్న ఎన్నికలకు బూత్ లెవల్‌లో పార్టీ కేడర్‌ను సమాయత్తం చేసేలా బుధవారం విజయవాడ తూర్పు నియోజకవర్గంలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం పేరుతో సభ నిర్వహించనున్నారు. గురునానక్‌కాలనీలో ఎన్ఏసీ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సారథ్యంలో జరిగే ఈ సభలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పార్టీ కో ఆర్డినేటర్ రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డితో పాటు, జిల్లా మంత్రి జోగి రమేష్, మరో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఇతర కీలక నేతలు పాల్గొననున్నారు. వీరితో పాటు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొననున్నారు.

ఎన్నికలపై దిశా నిర్దేశం

రానున్న ఎన్నికల్లో ఎలా వ్యవహరించాలనే అంశాలపై బూత్ కన్వీనర్లకు నాయకులు దిశానిర్దేశం చేయనున్నారు. విజయవాడ తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తలు పనిచేసేలా ఈ సభ ద్వారా సిద్ధం చేసేందుకు కార్యాచరణ రూపుదిద్దుతున్నారు. ప్రతి డివిజన్‌లో కార్యకర్తలు యాక్టివ్‌గా పనిచేయడంతో పాటు ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించడం, రానున్న రోజుల్లో మరింత మేలు జరగాలంటే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాల్సిన ఆవశ్యకతను తెలియజేయనున్నారు.

ఇప్పటికే విస్తృత ప్రచారం

నియోజకవర్గంలో ఇప్పటికే ఇన్‌చార్జి దేవినేని అవినాష్ రెండు పర్యాయాలు అన్ని ప్రాంతాలను చుట్టేశారు. మరో వైపు అవినాష్ భార్య సుధీర, సోదరి క్రాంతి, బావ సిద్ధార్థ్‌లు నలు దిక్కులా ప్రతి రోజూ పర్యటిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. ప్రజల నుంచి సైతం అనూహ్య స్పందన లభిస్తుండటంతో మరింత ఉత్సాహంగా గడప గడపకు వెళ్లి సంక్షేమాన్ని వివరిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతం

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివ జ్ఞాన పీఠం పీఠం ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం లోక కల్యాణార్థం సామూహిక కుజ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శివజ్ఞాన పీఠం పీఠాధిపతి శివాచార్య స్వామి కుజ వ్రతం విశిష్టతను భక్తులకు వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో గొడవర్తి శ్రీనివాస్, గార్లపాటి సుదర్శన్, కొనకళ్ల సత్యప్రసాద్, ఎస్‌వీఎస్ నాగేంద్ర దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను పీఠం ఆర్గనైజర్ పి.శ్యాంప్రసాద్ పర్యవేక్షించారు.

మద్యం విక్రయిస్తున్న సస్పెక్ట్ షీటర్ అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తెల్లవారుజామున మద్యం అక్రమంగా విక్రయిస్తున్న సస్పెక్ట్ షీటర్‌ను కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడీపేట సెక్టార్ ఎస్ఐ రాజనరేంద్ర మంగళవారం ఉదయం సాయిరాం థియేటర్ వద్ద గస్తీ నిర్వహిస్తుండగా, ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. సదరు ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిని నాగమ్మ సత్రం ప్రాంతానికి చెందిన షేక్ హజ్రత్ వలీ(26)గా గుర్తించారు. నిందితుడు గతంలో పలు చోరీ కేసుల్లో నిందితుడు కాగా క్రైమ్ సస్పెక్ట్ షీట్ కూడా ఉంది. ఈ నేపథ్యంలో యువకుడి వద్ద లభించిన సంచిని పరిశీలించగా అందులో బీర్ బాటిల్స్ 25, క్వార్టర్ బాటిల్స్ 6ను పోలీసులు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఎన్ఆర్ఈజీఎస్ కౌన్సిల్ సభ్యులు రాక

విజయవాడరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించేందుకు బుధవారం నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్ కౌన్సిల్ సభ్యులు నున్న గ్రామానికి వస్తున్నారని ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. నున్న గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో రైతుల పొలాల్లో భూగర్భ జలాల కోసం నీటికుంటల తవ్వకం, జగనన్న కాలనీలో జరుగుతున్న పనులు, ప్రభుత్వ పరంగా నిర్మించిన భవనాలను కౌన్సిల్ సభ్యులు పరిశీలిస్తారన్నారు.

పేదలకు అండగా దేవినేని నెహ్రూ ట్రస్ట్



టిఫిన్ బండిని అందజేస్తున్న చైతన్య తదితరులు

గుణదల(విజయవాడతూర్పు): పేదలకు అండగా దేవినేని రాజశేఖర్ నెహ్రూ ట్రస్ట్ సేవలందిస్తోందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్ లంబాడీపేటకి చెందిన జి.ప్రశాంతి జీవనోపాధికి ఇబ్బందిగా ఉందని, గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమంలో దేవినేని అవినాష్ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దేవినేని రాజశేఖర్ నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.25 వేల విలువైన టిఫిన్ బండిని ఉచితంగా మంగళవారం అందజేశారు. కొరివి చైతన్య మాట్లాడుతూ.. రాజకీయ నాయకులకు సేవే పరమావధి కావాలని ఆకాంక్షించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో విజయవాడ నగరంలో దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తూర్పు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ట్రస్ట్ చైర్మన్ దేవినేని అవినాష్ అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. దేవినేని నెహ్రూ నిత్యం పేదలకు అండగా ఉండేవారని, కష్టం అంటూ ఎవరు ఇంటికి వచ్చిన కులమత పార్టీలకతీతంగా వారికి అండగా నిలిచి, సమస్య పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. నేడు ఆయన తనయుడు దేవినేని అవినాష్ అదే బాటలో నడుస్తూ దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్య, ఉపాధి కల్పన కోసం అనేక సేవా కార్యక్రమలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సొంగా రాజ్ కమల్, పచ్చిగోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): మౌలిక సదుపాయాల కల్పనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని 18వ డివిజన్ కార్పొరేటర్, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ అన్నారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లోని సిమెంట్ గోడౌన్స్ సెంటర్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్నామన్నారు. డివిజన్‌లో రూ.12 కోట్లకు పైగా నిధులు వెచ్చించి రోడ్లు, యూజీడీ పైప్‌లైన్, వాటర్ పైప్‌లైన్, పార్క్, కమ్యూనిటీ హాల్, స్ట్రీట్ లైట్స్ వంటి పనులు చేపట్టామని చెప్పారు. సిమెంట్ గోడౌన్స్ నుంచి వారధి కరకట్ట వరకు రూ.17 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశామని, పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. డివిజన్ నాయకులు టి.బిక్షాలు రెడ్డి, కె.నాగేశ్వరరావు, వీఎంసీ ఏఈ నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆడిటోరియంలో మెడికల్ క్యాంప్



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ రైల్వే హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే ఆడిటోరియంలో మహిళా ఉద్యోగులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. రైల్వే హాస్పిటల్ ఏసీఎమ్ఎస్‌లు డాక్టర్ ఎం.జైదీప్, డాక్టర్ ఎల్.రవికాంత్‌లు మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జైదీప్ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు తరచూగా రైల్వే హాస్పిటల్‌లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 70 మంది మహిళా ఉద్యోగులకు వైద్య సిబ్బంది కాలేయం, మూత్రపిండం, కొలస్ట్రాల్, బ్లడ్ కౌంట్, షుగర్ లెవల్స్‌తో పాటు ఈసీజీ, ఎకో, జనరల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మహిళా ఉద్యోగులకు 'ఉమెన్ ఇన్ విక్షిత్ భారత్ – విక్షిత్ రైల్ 2047' అనే అంశంపై వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించామన్నారు. రైల్వే హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది, పలు ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్య బృందం పాల్గొన్నారు.

అమర గాయకుల సేవలు మధురం



గాయకుల సేవలు వివరిస్తున్న విజయలక్ష్మి, ఆనంద్ తదితరులు

విజయవాడకల్చరల్: అమర గాయకుల గాన సేవలు మధురాతి మధురమని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య – సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం బహుభాషా గాయకులు మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. తెలుగు చిత్ర సీమలో తన గాన మాధుర్యం ద్వారా లక్షలాది ప్రజలను ఆకట్టుకున్న గాయకులు వారన్నారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ పిఠాపురం, మాధవపెద్ది జంట గాయకులని వారు హాస్యగీతాలతో పాటు పలు భక్తి గీతాలను కూడా ఆలపించారని తెలిపారు. ఉమాబలరాం, విష్ణుప్రియ, వడ్డాది సూర్యకామేశ్వరి, హరికృష్ణ, పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలతో పాటు హాస్యగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సీనియర్ గాయకుడు డేవిడ్‌రాజు, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, బీవీ వీరభద్రరావు, కొప్పుల ఆనంద్ పాల్గొన్నారు.

మహిళల క్రీడా సాంస్కృతిక పోటీలు ప్రారంభం



లెమన్ స్పూన్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ఆధ్వర్యంలో క్రీడా సాంస్కృతిక పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. ఈనెల 7వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఆడిటోరియంలో క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని ఏపీ జేఏసీ మహిళా విభాగం చైర్ పర్సన్ పారే లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి తెలిపారు.
ముగింపు వేడుకల్లో పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ముగింపు వేడుకలకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ జేఏసీ అమరావతి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు.

దాడి ఘటనపై ఫిర్యాదులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న ఘటనపై పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోగా, మంగళవారం కొత్తపేట పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ ప్రైజర్‌పేటకు చెందిన జిర్రా వెంకటరమణ కుటుంబానికి పెద్దనాన్న కుమారుడైన అడవయ్య, ఇతర కుటుంబ సభ్యులతో వివాదం ఉంది. సోమవారం రాత్రి అడవయ్య వెంకట రమణ ఇంటి ముందు నుంచి వెళ్తూ దారిలో ఉన్న సామగ్రిని రోడ్డుపై పడేశాడు. దీంతో అడవయ్యను వెంకట రమణ కుటుంబ సభ్యులు ప్రశ్నించగా, పక్కనే ఉన్న చెక్క ముక్కతో దాడి చేశాడు. దాడిపై బాధితుడు వెంకట రమణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఇదే వ్యవహారంలో జిర్రా దేవమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దేవమ్మ కుమారుడు అడవయ్య ఇంటికి వస్తున్న తరుణంలో దారిలో అడ్డగా ఉన్న సామగ్రిని తీయాలని అడిగాడు. దీంతో అడవయ్యతో వెంకట రమణతో గొడవ పడి దాడికి పాల్పడ్డారు. వెంకట రమణ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి



వాంబేకాలనీలో కవాతు నిర్వహిస్తున్న బలగాలు

పాయకాపురం(విజయవాడరూరల్): త్వరలో జరిగే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని అదనపు డెప్యూటీ పోలీసు కమిషనర్ (టాస్క్‌ఫోర్స్) ఆర్.శ్రీహరి బాబు కోరారు. డీజీపీ ఆదేశాల మేరకు మంగళవారం వాంబేకాలనీలో పోలీసు అధికారులు నార్త్ జోన్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ డీఎస్‌వీ ప్రసాద్, సీఐలు ఎస్.దుర్గాప్రసాద్, జె.లక్ష్మీనారాయణ, జి.గురుప్రకాష్, టాస్క్‌ఫోర్స్ సీఐలు సీహెచ్ నాగశ్రీనివాస్, ఎస్.రమేష్‌కుమార్, సీఐఎస్ఎఫ్ ఆర్ఐ యాహిమ సిబ్బందితో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ ఆర్.శ్రీహరి బాబు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల నేపథ్యంలో కేంద్ర పారా మిలటరీ బలగాలు, విజయవాడ పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును సద్వినియోగించుకోవాలని, ఎలాంటి సంఘవిద్రోహశక్తులకు భయపడకుండా ఉండాలని చెప్పారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం

ఉంగుటూరు: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు దోహదపడతాయని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. పొట్టిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందని పేర్కొన్నారు. అనంతరం వైద్య శిబిరంలో మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల జ్యోతి, ఎన్ఏపేట సర్పంచ్ నాగరాజు, ఈఓఆర్‌డీ బాషా, కార్యదర్శి అప్పారావు, డాక్టర్ మనోహర్‌రెడ్డి, డాక్టర్ సుష్మా, డాక్టర్ కార్తిక్, డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరంలో వ్యక్తి మృతి

పెనమలూరు: చోడవరం గ్రామంలో మద్యంలో పొరపాటున కలుపు నివారణ మందు కలిపి తాగి వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం చోడవరం గ్రామంలో మాలావతు బాలయ్య(50) వ్యవసాయ కూలీగా పని చేస్తాడు. రాత్రి సమయంలో గ్రామంలోని రైస్‌మిల్లు వద్ద సెక్యూరిటీ గార్డుగా ఉంటాడు. కాగా సోమవారం ఉదయం మద్యంలో పొరపాటున నీరు అనుకుని కలుపు మందు కలుపుకొని తాగాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు మురళి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

వ్యవసాయంపై ఆసక్తి పెరిగింది



నేను చిన్నప్పటి నుంచి విజయనగరం జిల్లా గుర్ల మండలం ఆనందపురం గ్రామంలో మాకున్న పొలంలో వ్యవసాయం చేస్తున్నా. ప్రతి ఏడాది పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. పరిస్థితులు అనుకూలించినపుడు ఇల్లంతా సంతోషాలతో నిండిపోయేది. లేనినాడు దిగాలు పడాల్సి వచ్చేది. ప్రతి ఏటా దిగుబడిపై బెంగ ఉండేది. కానీ ఏనాడూ ఏ ప్రభుత్వం మాకు నష్టం వచ్చినప్పుడు పట్టించుకున్న దాఖలాల్లేవు. విత్తనాలు, ఎరువుల కోసం ఏటా రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. కానీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి మారింది. పెట్టుబడి సాయం అందుతోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఊళ్లోకే విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు వస్తున్నాయి. పండిన పంట మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి, సకాలంలో డబ్బు మా అకౌంట్లో జమ చేస్తోంది. ఇప్పుడు వ్యవసాయం చేయాలనే ఆసక్తి పెరుగుతోంది. నాకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 వంతున వస్తోంది. ధాన్యం అమ్మిన మూడు రోజులకే నగదు జమ అయ్యింది. రబీలో మొక్కజొన్న వేశాను. గ్రామ వ్యవసాయ అధికారి పొలానికి వచ్చి తెగుళ్లను పరిశీలించి స్వయంగా పురుగు మందులు అందజేశారు. నా భార్యకు వైఎస్సార్ ఆసరా ద్వారా ఏడాదికి రూ.పది వేలు, సున్నా వడ్డీ కింద ఏడాదికి రూ.రెండు వేలు వంతున వచ్చింది. మా అబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు. వాడికి అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు వంతున వస్తోంది. ఇప్పుడు మా కష్టాలన్నీ తీరిపోయాయి.

– నడుపూరు అప్పలనాయుడు, ఆనందపురం (మంత్రి పైడినాయుడు, విలేకరి, గుర్ల మండలం)

సమస్యలు తీరి సాఫీగా జీవిస్తున్నాం



గతంలో నేను అడవి పనులకు వెళ్లేదాన్ని. మా ఆయన వెదురు తడికలు అల్లుతూ, ఒక్కోసారి తాపీ పనికి వెళుతూ రోజువారీ కూలి ఎంతో కొంత సంపాదించేవాడు. వాటితో ఇద్దరు పిల్లలున్న ఇల్లు ఎంతో కష్టంగా గడిచేది. తెచ్చిన అప్పులు వడ్డీతో తీర్చలేక సతమతమయ్యేవాళ్లం. మాది అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేట. మా గురించి ఏ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాల్లేవు. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా లాంటి వారికి ఎంతో లబ్ధి కలిగింది. మా అమ్మాయి సత్యవతి జగనన్న విద్యా కానుకతో డిగ్రీ వరకు చదివింది. తర్వాత ఆమెకు పెళ్లి చేశాం. తనకు ఓ పాప పుట్టాక అంగన్‌వాడీ కేంద్రం ద్వారా మాకు పోషకాహారం అందుతోంది. మా అబ్బాయి సాయి కిశోర్‌కు అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు వస్తోంది. వాడి చదువుపై మాకిక బెంగ లేదు. కొండపోడు హక్కులు కల్పిస్తూ జగనన్న పట్టా ఇవ్వడంతో వ్యవసాయం చేస్తున్నాం. ఆ భూమిలో పొగాకు, జీడి మామిడి తోటలు పెంచుతున్నాం. రైతు భరోసా కింద రూ.13,500, ఆసరా కింద రూ.4,400, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 వంతున అందుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీనే మా ఆయనకు పింఛన్ అందుతోంది. ఇప్పుడు ఏ అవసరానికి ఎక్కడా అప్పు చేయాల్సిన అవసరం లేదు. మేం దర్జాగా బతుకుతున్నాం. ఈ ఉన్నతికి కారణమైన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– కేదారి నాగమణి, అప్పలరాజుపేట (వీర్రాజు తూపాటి, విలేకరి, రాజవొమ్మంగి)

పేద కుటుంబంలో పెద్ద చదువులు



మాది చాలా పేద కుటుంబం. శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండలంలోని దొమ్మరహట్టిలో మా అమ్మానాన్నలు రత్నమ్మ, శ్రీనివాసులు కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నేను ఇంటికి పెద్దమ్మాయిని. నాకు భార్గవ్, హరికృష్ణ అనే ఇద్దరు తమ్ముళ్లున్నారు. అసలే పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు మా ముగ్గురినీ చదివించడానికి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఇలాంటి తరుణంలో జగనన్న విద్యా దీవెన పథకం మా కుటుంబంలో వెలుగులు నింపింది. ఈ పథకం కింద నాకు బీఫార్మసీలో రూ.1.80 లక్షలు, ఎం.ఫార్మసీలో రూ.2.80 లక్షల ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చింది. వసతి దీవెన కింద రూ.20 వేలు అందింది. ఈ పథకాల పుణ్యమా అని నా ఇద్దరు తమ్ముళ్ల ఉన్నత చదువుకు అవకాశం ఏర్పడింది. పెద్ద తమ్ముడు భార్గవ్ పుట్టపర్తిలో ఎంబీఏ, చిన్న తమ్ముడు హరికృష్ణ తాడిపత్రిలో బీటెక్ చదువుతున్నారు. మా అమ్మమ్మ జయమ్మకు ప్రతి నెలా పింఛన్, మాకు ప్రతి ఏడాది వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయం అందుతోంది. వైఎస్సార్ ఆసరా పథకం కింద మా కుటుంబం లబ్ధి పొందింది. జగనన్న అమలు చేస్తున్న నవరత్నాల పథకాల వల్ల ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడ్డాం. జగనన్నకు మా కుటుంబమంతా జీవితాంతం రుణపడి ఉంటుంది.

– సువర్ణ, దొమ్మరహట్టి (డి.శంకర్‌రెడ్డి, విలేకరి, మడకశిర, శ్రీసత్యసాయి జిల్లా)

నైపుణ్య శిక్షణలో విశ్వరూపం

'భవిత' ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి జగన్

సాక్షి, విశాఖపట్నం: 'యువత మన భవిష్యత్తు. చదువులు, నైపుణ్య శిక్షణలో సమూల మార్పులు తెచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తున్నాం. రాబోయే రోజుల్లో నైపుణ్య శిక్షణలో విశ్వరూపం చూపిద్దాం. అందుకే ఈ 'భవిత' కార్యక్రమం'' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ ఆధ్వర్యంలో యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు చేపట్టిన 'భవిత' కార్యక్రమాన్ని మంగళవారం విశాఖలోని పీఎంపాలెం వి-కన్వెన్షన్ హాల్‌లో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, బొత్స సత్యనారాయణ, విడదల రజని, పారిశ్రామిక ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే...

జాబ్ ఓరియెంటెడ్‌గా

రాష్ట్ర చరిత్రలో బహుశా ఎప్పుడూ జరగని విధంగా పరిశ్రమలను మన కాలేజీలకు తీసుకొచ్చి అనుసంధానించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఏ చదువైనా జాబ్ ఓరియెంటెడ్‌గా ఉండాలి. క్వాలిటీ చదువులు మనకు అందుబాటులో లేకపోతే పూర్తిగా వ్యర్థమైపోయినట్లే. అందుకే జాబ్ ఓరియెంటెడ్‌గా క్వాలిటీ చదువులతో మార్పులు తెస్తున్నాం. నాణ్యమైన విద్యని స్కూల్స్ నుంచి కాలేజీలు, ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు.. అన్ని చోట్లా అందిస్తూ అడుగులు వేస్తున్నాం. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం వైపు అడుగులు వేయడం నుంచి సీబీఎస్ఈ, ఐబీ దాకా ఎలా ముందుకు వెళ్తున్నామో అందరికీ తెలిసిందే. మూడో తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్స్, టోఫెల్ శిక్షణ, బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలతోపాటు డిజిటల్ క్లాస్ రూమ్స్, ట్యాబ్స్ ద్వారా విద్యలో నాణ్యత పెంచుతున్నాం. డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ ఇలాగే అడుగులు వేస్తున్నాం.

- తొలిసారిగా కాలేజీల్లో కరిక్యులమ్ మార్చడం, నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ, తప్పనిసరి ఇంటర్న్‌షిప్, ఆన్‌లైన్ వర్టికల్స్, క్రెడిట్స్ మన కరిక్యులమ్‌లో భాగం చేయడం లాంటివన్నీ చేస్తున్నాం. హార్వర్డ్, ఎల్‌సీఈ, ఎల్‌బీఎస్, ఎంఐటీ లాంటి ప్రఖ్యాత యూనివర్సిటీల కోర్సులను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చి సర్టిఫికెట్లు ఇప్పిస్తున్నాం.



స్కిల్ యాప్, లోగోని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వాటి ద్వారా దరఖాస్తు చేసుకుంటే మంచి జీతాలతో ఉన్నత ఉద్యోగాలు లభించే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఈ తరహా మార్పు ఒకటో తరగతి చదువుతున్న పిల్లాడి దగ్గర నుంచే మొదలవుతోందని గర్వంగా చెబుతున్నా.

- ఐటీఐ, పాలిటెక్నిక్, స్కిల్ కాలేజీల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాం. వచ్చే టర్మ్‌లో ఈ మార్పులు విశ్వరూపం దాలుస్తాయి. తొలిసారిగా 158 పారిశ్రామిక సంస్థలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కలిపి మొత్తం 208 ఇన్‌స్టిట్యూషన్లు మన పిల్లల ట్రైనింగ్, కోర్సుల్లో భాగస్వాములై శిక్షణ అందించి ఉద్యోగాలిచ్చే కార్యక్రమం జరుగుతోంది. దాదాపు 87 పాలిటెక్నిక్ కాలేజీలు మన దగ్గర ఉంటే 2019కి ముందు (టీడీపీ హయాంలో) అక్రిడిటేషన్ పొందిన పాలిటెక్నిక్ కాలేజీ కేవలం ఒక్కటి మాత్రమే ఉండటం దురదృష్టం. కనీసం మన పాలిటెక్నిక్ కాలేజీల్లో చదువులు ఎలా ఉన్నాయి? అక్రిడిటేషన్ ఉందా? అనేది కూడా పట్టించుకోలేదు. ఈరోజు ఎన్‌బీఏ అక్రిడిటేషన్‌ని 32 పాలిటెక్నిక్ కాలేజీలు పొందాయి. క్వాలిటీ పెంచే దిశగా అడుగులు వేస్తున్నాం.
- రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ క్రియేట్ చేస్తాం. హబ్ ద్వారా ఒకే చోట ఐటీఐ, పాలిటెక్నిక్, పదోతరగతి డ్రాపవుట్స్ కోసం ట్యూటరింగ్ అందుబాటులోకి తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నాం. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో స్కిల్ కాలేజీ ఉంటుంది. వీటన్నింటి పైన ఒక స్కిల్ యూనివర్సిటీ కోర్సుల్ని డిజైన్ చేస్తుంది. పరిశ్రమల్ని కాలేజీల్లో భాగస్వాముల్ని చేస్తుంది. చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగం వచ్చేలా అడుగులు పడుతున్నాయి.
- ఇప్పటివరకూ 53 వేల మంది శిక్షణ పూర్తి చేసుకొని 26 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన భవిత కార్యక్రమం ఇకపై పైలట్‌గా కాకుండా ప్రతి నియోజకవర్గంలో విస్తరించే దిశగా శ్రీకారం చుడుతున్నాం.



ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను సీఎం జగన్ సమక్షంలో చూపుతున్న పలు సంస్థల ప్రతినిధులు

సీఎం సమక్షంలో ఎంవోయూలు

ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కలిసి నైపుణ్య శిక్షణ అందించేందుకు పలు సంస్థలు ఆరు ఎంవోయూలు చేసుకున్నాయి.

- విశాఖ పోలీస్ కమిషనరేట్‌తో మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ప్రొఫెషనల్ స్కిల్ కౌన్సిల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వైజాగ్ పోలీస్ వర్క్‌ఫోర్స్ నైపుణ్య సామర్థ్యాలు పెంపొందించేలా జాయింట్ సర్టిఫికేషన్ కోర్సులు అందించేలా సహకారం అందించనున్నారు.
- ఏపీఎస్ఎస్‌డీసీతో హియర్ టెక్నాలజీస్ ఎంవోయూ కుదుర్చుకుంది. ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ, విద్యార్థులకు లొకేషన్ సొల్యూషన్స్ కోసం ప్లాట్‌ఫామ్ అందించేలా 60–90 రోజుల సర్టిఫికేషన్ కోర్సు అందించేందుకు ఒప్పందం జరిగింది.
- ఏపీఎస్ఎస్‌డీసీ, తాజ్‌హోటల్స్, ఎస్ఐహెచ్ఎం మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. పర్యాటకం, హాస్పిటాలిటీ రంగంలో శిక్షణ అందించడం, ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు, ఉపాధి అవకాశాలు సృష్టించేలా ఒప్పందం కుదిరింది.
- ఏపీఎస్ఎస్‌డీసీ, డిక్సన్ టెక్నాలజీస్, నాలుగు ఐటీఐలు, మూడు పాలిటెక్నిక్ కాలేజీల మధ్య ఎలక్ట్రానిక్, మెకానికల్ రంగంలో ఇండస్ట్రీ స్పెసిఫిక్ ల్యాబ్ ఏర్పాటు చేయడం, పరిశ్రమకు అనుగుణంగా శిక్షణ, ఉపాధి పొందేలా ట్రైనింగ్ ఇవ్వడం మొదలైన అంశాల్ని అందించేలా ఎంవోయూ జరిగింది.
- వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ఏపీఎస్ఎస్‌డీసీ మధ్య ఎంవోయూ జరిగింది. కాలేజీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపించనున్నారు. వీల్స్ ఇండియా ద్వారా అభ్యర్థులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు అందించనున్నారు.
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్‌ఎడ్యుకేషన్, అవెరా ఏఐ మొబిలిటీ మధ్య ఈవీ టెక్నాలజీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపనకు మార్గం సుగమం చేసేలా, పరిశ్రమలు సందర్శించేందుకు ఏర్పాటు చేసేలా ఎంవోయూ జరిగింది.
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్(డీఈటీ), ఎల్ అండ్ టీ మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐటీఐ కోర్సులతో సమానంగా ఈ లెర్నింగ్ మాడ్యూల్స్ అందించడం, ఎల్ అండ్ టీ బృందం ద్వారా విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించడం, ఉపాధి కల్పనకు అవసరమైన నైపుణ్యాన్ని ఈ ఎంవోయూ ద్వారా అందించనున్నారు.

10 స్కిల్ సెంటర్లకు శంకుస్థాపన..

ఎంపీ ల్యాడ్స్ ద్వారా రూ.7 కోట్లతో 10 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రూ.44.32 కోట్లతో 43 పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణ పనులను ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.43.77 కోట్లతో 22 ఐటీఐల ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా భవిత కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు భవిత లోగో, యాంథమ్, స్కిల్ యూనివర్స్ యాప్, ఫ్లాగ్‌ని ఆవిష్కరించారు. అంతకు ముందు వీ కన్వెన్షన్‌కు చేరుకున్న సీఎం తొలుత స్కిల్ ఇన్‌స్టిట్యూట్స్ స్టాల్స్‌ని సందర్శించారు. ఎలక్ట్రానిక్ వెహికల్స్, బ్యాటరీలు తయారీ, విమాన విడిభాగాల తయారీ శిక్షణ తదితర స్టాల్స్‌ని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు.

అప్పుడు విస్మరించి ఇప్పుడు డిక్లరేషనా?

బీసీల గురించి మాట్లాడే అర్హత బాబుకు లేదు

మీడియాతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'సజ్జల'

సాక్షి, అమరావతి: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలను విస్మరించిన చంద్రబాబుకు బీసీల గురించి మాట్లాడే అర్హతలేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. బాబు అధికారంలో ఉండగా కేవలం వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని మండిపడ్డారు. ఇప్పుడు బీసీ డిక్లరేషన్ అంటూ మాయమాటలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం వడ్డెరల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 'సజ్జల' పాల్గొని మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థానాల్లోకి తీసుకొచ్చి తద్వారా సామాజిక సాధికారత దిశగా సీఎం జగన్ అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే మంత్రివర్గం నుంచి స్థానిక సంస్థల వరకు బీసీలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల్లోని పేదలను అన్ని రంగాల్లో పైకి తీసుకురావాలనే ధ్యేయంతోనే మంత్రివర్గంలో 70 శాతం పైగా వారికే పదవులు కట్టబెట్టారు. శాసనమండలి సభ్యులుగాను, స్థానిక సంస్థలలోను మెజారిటీ పదవులు వారికే దక్కాయి. సంక్షేమ ఫలాల్లోనూ మెజారిటీ మొత్తం బీసీలకే దక్కింది. అదే బీసీలపట్ల చంద్రబాబుకు ఎంతమాత్రం చిత్తశుద్ధిలేదు. కొత్తగా వచ్చిన పార్టీలా ఆయన బీసీలపై హామీలిస్తున్నారు. కానీ, బీసీల్లో వడ్డెరలకు వైఎస్సార్‌సీపీ ద్వారా పూర్తి న్యాయం జరుగుతుంది. బీసీలకు ఎంతగా ప్రాధాన్యత ఇస్తారంటే.. వడ్డెర్లకు సంబంధించి చూస్తే గుంటూరులో చంద్రగిరి ఏసురత్నం లాంటి వాళ్ల ఎమ్మెల్యేగా విజయం సాధించలేని పరిస్థితి ఉంటే ఆయనకు శాసనమండలి సభ్యులుగా అవకాశం కల్పించారు. ఇది సీఎం జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం. ఎక్కడ వీలైతే అక్కడ బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేలా చేస్తున్నారనేది ఇటీవల ప్రకటించిన అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తల సంఖ్య చూస్తే తెలుస్తుంది.



తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సజ్జల

గుమ్మనూరును ఎలా చేర్చుకుంటున్నారు?

ఇక గుమ్మనూరి జయరాం అక్రమాలు చేశారు.. అవినీతికి పాల్పడ్డారు, మాఫియా అంటూ చంద్రబాబు తెగ ప్రచారం చేశారు. మరిప్పుడు ఆయన్ను టీడీపీలోకి ఎలా చేర్చుకుంటున్నారు? అలాగే, సీఎం జగన్ చేసినవన్నీ తానే చేసినట్లుగా చంద్రబాబు బరితెగించి ప్రచారం చేసుకుంటున్నారు. ధైర్యం ఉంటే అధికారంలో ఉండగా ఏం చేశాడు.. అధికారంలోకి మళ్లీ వస్తే ఏం చేయగలడో చంద్రబాబు చెప్పాలి. ఇక జైలులో ఉండగా అన్నిరకాల రోగాలు తనకే ఉన్నాయని ఏడ్చి ఇప్పుడు పెద్దపెద్దగా అరుస్తున్నారు. చంద్రబాబుకు అనుకూలంగా ఏ సర్వేలు లేవు. అయినప్పటికీ అనుకూలంగా ఉన్నట్లు తన అనుకూల మీడియాతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇక సీఎం జగన్ తాను ఏం చేయగలరో అదే చెప్తారు.. చేసి చూపించారు కూడా. మేనిఫెస్టోలో 99 శాతం అమలుచేసి సగర్వంగా ప్రజలను ఓట్లు అడుగుతున్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బలం ఉంటే పొత్తులు ఎందుకు?

నిజానికి.. చంద్రబాబుకు బలం ఉంటే పొత్తులెందుకు? పురంధేశ్వరి, షర్మిల, సీపీఐ, సీపీఎం, దత్తపుత్రుడుతో పాటు ఇప్పుడు మేధావులు అంటూ మరికొందరు సీఎం జగన్‌పై దుష్ప్రచారానికి ఒడిగట్టారు. వాటిని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. వలంటీర్ల వల్ల ప్రజలకు మంచి సేవలందుతున్నాయని గర్వంగా చెప్పగలం. టీడీపీ హయాంలో దోపిడీలు చేసిన జన్మభూమి కమిటీలను మళ్లీ తెస్తామని చంద్రబాబు చెప్పగలరా? సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక గొడ్డలిపోటు అంటూ విషప్రచారం చేస్తున్నారు. జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబు మాఫియా గ్యాంగ్‌ని తయారుచేశారు. చివరికి మరుగుదొడ్ల విషయంలో కూడా అక్రమాలు చేశారు. రాజధాని పేరుతో చంద్రబాబు అతిపెద్ద స్కాం చేశారు. రానున్న ఎన్నికల్లో మారీచులకంటే మాయోపాయాలు పన్నే, కుట్రలు చేసేవారితో యుద్ధంచేస్తున్నాం. ఎలాగైనా సరే అధికారం చేపట్టాలనే భావనతో చంద్రబాబు ఉన్నారు. చంద్రబాబు విష ప్రచారం విషయంలో నిర్లక్ష్యం పనికిరాదు. ముఖ్యంగా రానున్న 50 రోజులు చాలా కీలకమైనవి. సీఎం జగన్‌కు ఉన్న నిబద్ధత మరొకరికి లేదు. ఆయనొక రిఫార్మర్‌గా ఆలోచనలు చేశారు.

బీసీ డిక్లరేషన్ పేరిట బాబు, పవన్ మరో మోసం

- 2014లో బీసీలకు 143 వాగ్దానాలిచ్చి అమలు చేయని ఘనుడు చంద్రబాబు
- మంత్రులు చెల్లుబోయిన, జోగి రమేష్





సాక్షి, అమరావతి: బీసీ డిక్లరేషన్ అబద్ధాల వీరులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మరో మోసానికి తెర తీశారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాసులు కాదు–బ్యాక్ బోన్ క్లాసులనే వైఎస్సార్‌సీపీని కాపీ కొట్టారని ధ్వజమెత్తారు. ఈ మేరకు వారిద్దరూ మంగళవారం ప్రకటన జారీ చేశారు. బీసీలంటే బ్యాక్ బోన్ క్లాసులని వైఎస్సార్‌సీపీ 2019 ఎన్నికల ముందు ఏలూరు డిక్లరేషన్‌లో చెప్పిన మాటల్ని గుర్తు చేశారు. 2014 ఎన్నికల సందర్భంగా బీసీలకు 143 వాగ్దానాలిచ్చిన టీడీపీ అందులో ఒకటి కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. ఇప్పుడు 50 ఏళ్లకే పెన్షన్, బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు సహా పలు కల్లబొల్లి హామీలు గుప్పిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఏ ఒక్క బీసీ వర్గం ప్రజలు బాబు, పవన్‌ను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. వీరు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు ఎలాంటి విలువ లేదన్నారు. 40 ఏళ్ల బాబు రాజకీయ జీవితంలో బీసీల్ని బాగా వాడుకుని చివరికి కత్తెర్లు, ఇస్త్రీ పెట్టెల కులాలుగా అవమానించే సంస్కృతి నుంచి బయటపడలేదన్నారు.

రూ.2.55 లక్షల కోట్ల జమ

గడచిన 57 నెలల పాలనలో తమ ప్రభుత్వం డీబీటీ ద్వారా పేదల ఖాతాల్లోకి రూ.2.55 లక్షల కోట్లు జమ చేసిందని మంత్రులు చెల్లుబోయిన, జోగి రమేష్ గుర్తు చేశారు. అందులో బీసీలకు డీబీటీ, నాన్ డీబీటీ కలిపి రూ.1.71 లక్షల కోట్ల మేర మేలు చేశామన్నారు. బాబు అధికారంలోకి వస్తే ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్ల మేర మేలు చేస్తామంటున్నారని, ఈ లెక్కన పరిశీలిస్తే తమ ప్రభుత్వం చేసిన దానికంటే రూ.25 వేల కోట్లు తక్కువే చేస్తామని అంటున్నారని పేర్కొన్నారు. 2014లో బీసీలకు ఏటా రూ.10 వేల కోట్లు బడ్జెట్ లో కేటాయిస్తానని, చివరకు రూ.19 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి బాబు దగా చేశారన్నారు. నిరుపేదలైన బీసీల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య, ఇళ్ల పట్టాలు పంపిణీపై కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారన్నారు. బీసీలకు అమరావతిలో ఇళ్ల పట్టాలు ఇస్తే డెమోగ్రాఫిక్ ఇంబ్యాలన్స్ వస్తుందన్న ఘనుడు బాబు అన్నారు. బీసీ అక్కచెల్లెమ్మలకు ఈ రోజు ఇస్తున్న చేయూత వంటి పథకం 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన బాబు ఏ ఒక్క రోజైనా అమలు చేశారా అని నిలదీశారు.

బీసీలకు అండగా ఉంటాం

పవన్‌తో కలసి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చంద్రబాబు

- బీసీల రుణం తీర్చుకోవడానికే 10 సూత్రాలతో డిక్లరేషన్
- 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చి రూ. 4 వేలకు పెంచేలా బాధ్యత తీసుకుంటాం
- చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాడతాం
- పాత పథకాలు పునరుద్ధరిస్తాం
- బీసీ డిక్లరేషన్‌కు జనసేన మద్దతిస్తుంది: పవన్ కళ్యాణ్
- ప్రజల స్పందన లేక టీడీపీ బీసీ సభ వెలవెల





బీసీ డిక్లరేషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు, పవన్. జనం లేక వెలవెలబోతున్న సభ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వెనుకబడిన కులాల దశ, దిశ మార్చేలా బీసీ డిక్లరేషన్ ఉంటుందని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద మంగళవారం సాయంత్రం 'జయహో బీసీ' పేరుతో నిర్వహించిన సభలో చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలిసి బీసీ డిక్లరేషన్ విడుదల చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. సమాజం కోసమే జనసేనతో కలిశామన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండేందుకు టీడీపీ, జనసేన సమష్టిగా ఈ డిక్లరేషన్ పెడుతున్నామన్నారు. 40 సంవత్సరాలుగా బీసీలకు అండగా ఉన్న పార్టీ తెలుగుదేశమని చెప్పారు. బీసీల డీఎన్ఏలోనే టీడీపీ ఉందన్నారు. వారి రుణం తీర్చుకోవడానికే 10 సూత్రాలతో డిక్లరేషన్ ఇస్తున్నామన్నారు. వైఎస్ జగన్ సామాజిక న్యాయం కంటే సామాజిక ద్రోహం ఎక్కువ చేశారన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు వారిని బ్యాక్ బోన్ సొసైటీగా నిలబెడతామన్నారు.

50 ఏళ్లకే పింఛన్

బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇస్తామని, ఆ పింఛన్‌ను రూ. నాలుగు వేలు ఇచ్చేలా బాధ్యత తీసుకుంటామన్నారు. బీసీ సబ్‌ప్లాన్, సంక్షేమ కార్యక్రమాలు ఇస్తూనే సంపద సృష్టిస్తామన్నారు. ఏడాదికి రూ. 30 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. 1.50 లక్షల కోట్లు బీసీ సబ్‌ప్లాన్ ఇస్తామన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 34 నుంచి 25 శాతానికి తగ్గించడం వల్ల 16,800 మంది పదవులు కోల్పోయారన్నారు. రాజకీయాల్లో రిజర్వేషన్లు పెట్టి వెనుకబడిన వర్గాల నుంచి నాయకులను తీసుకువచ్చామన్నారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకూ పోరాడతామన్నారు. రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వలేకపోతే నామినేటెడ్ పదవులు ఇస్తామన్నారు. ఇద్దరు పిల్లలు ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులు అని ఉన్న చట్టాన్ని రద్దుచేస్తామన్నారు. చట్టబద్ధంగా కులగణన నిర్వహిస్తామన్నారు. జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తామన్నారు. జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ. 10 వేల కోట్లు, రూ. 5 వేల కోట్లతో ఆదరణ పరికరాలు, బీసీలకు పారిశ్రామిక ప్రోత్సాహకాలు పునరుద్ధరిస్తామన్నారు. విద్యాపథకాలన్నీ పునరుద్ధరించి, గురుకులాలను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. షరతులు లేకుండా విదేశీ విద్య అమలు చేస్తామని, పీజీ విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరిస్తామని చెప్పారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తామన్నారు. 300 మందిని హత్య చేసి వేల మందిపై తప్పుడు కేసులు పెట్టారని, ప్రత్యేక చట్టం ద్వారా వారికి న్యాయం చేస్తామని చెప్పారు. చంద్రన్న బీమా రూ. 10 లక్షలు, పెళ్లికానుక కింద రూ. లక్ష ఇస్తామన్నారు. శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. వడ్డెరలను ఎస్సీల్లో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని, మత్స్యకారుల కోసం 217 జీవోను రద్దు చేస్తామని, చేనేత కార్మికులకు జీఎస్టీ రద్దు చేస్తామని ప్రకటించారు.

బీసీ సభకు స్పందన కరువు

జయహో బీసీ సభకు లక్ష మంది వరకూ బీసీలు వస్తారని తెలుగుదేశం నాయకులు ఊదరగొట్టారు. ఈ మేరకు జనసేన నేతలు కూడా పెద్దఎత్తున ప్రచారం చేశారు. అయితే ఈ సభకు స్పందన కనపడలేదు. సభా ప్రాంగణంలో 15 వేల కుర్చీలు వేస్తే అందులో రెండువేల కుర్చీలు పైబడి నిండలేదు. వచ్చిన వారు కూడా సభ మొదలు కాగానే తిరుగుముఖం పట్టారు. బీసీ డిక్లరేషన్ అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసినా.. సరైన స్పందన లేకపోవడం టీడీపీ, జనసేన నేతలను నిరుత్సాహానికి గురిచేసింది.

జగన్ హామీలు నిలబెట్టుకోలేదు

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. బీసీ డిక్లరేషన్‌కు జనసేన మద్దతు ప్రకటిస్తుందన్నారు. ప్రభుత్వ ఇసుక విధానం వల్ల 30 మంది భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. బీసీ డిక్లరేషన్ ప్రకటించిన జగన్.. అందులో ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోలేదన్నారు. బీసీల సంక్షేమానికి ఏటా రూ. 15 వేల కోట్లు ఇస్తానని చెప్పి పైసా కూడా ఇవ్వలేదన్నారు. 139 కార్పొరేషన్లు పెడతామని చెప్పి అధికారంలోకి వచ్చాక 56 కార్పొరేషన్లు ఇచ్చారన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం చాలా అవసరమన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న బీసీ నాయకులు గుడ్డిగా ఆ పార్టీని వెనకేసుకొస్తే కులానికి అన్యాయం చేసినట్లే అన్నారు. గంగవరం పోర్టు వల్ల నష్టపోయిన మత్స్యకారులను ఆదుకుంటామన్నారు. బీసీలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. నారా లోకేశ్ మాట్లాడుతూ.. తప్పుడు అధికారులు ఎవ్వరూ రెడ్‌బుక్ నుంచి తప్పించుకోలేరని అన్నారు. తాను మంగళగిరి నుంచి 50 వేల పైన మెజారిటీతో గెలుస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గుమ్మనూరు జయరామ్ చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

క్లుప్తంగా...

సంక్షేమ పథకాలు అందాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



చిత్తూరు అర్బన్: పేద, మధ్య తరగతి ప్రజలతోపాటు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో కూడా సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరులో పలు అభివృద్ధి పనులకు మంత్రి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ తమది పేదల కోసం పరితపించే ప్రభుత్వమని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కొందరు వ్యక్తులు వైఎస్సార్‌సీపీలో లబ్ధి పొంది ఇతర పార్టీల్లో చేరారన్నారు. ఎంతమంది ఏకమైనా సీఎం వైఎస్ జగన్ సింగిల్‌గానే ఎన్నికల బరిలోకి దిగుతారని పెద్దిరెడ్డి స్పష్టంచేశారు. చిత్తూరు నియోజకవర్గంలో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్, వైఎస్సార్‌సీపీ చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, మేయర్ అముద, 'చుడా' చైర్మన్ పురుషోత్తంరెడ్డి, వైస్-చైర్మన్ విశ్వనాథ్, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

రూ.2లక్షల కోట్ల ఆస్తి ఎలా వచ్చింది బాబూ..!

- బాబుపై మంత్రి కారుమూరి ఫైర్



తణుకు అర్బన్: 'తన ఆస్తి రూ.2లక్షల కోట్లు అని చంద్రబాబు గతంలో బహిరంగంగా ప్రకటించారు. ఎలా వచ్చింది అంత ఆస్తి. నీకు వారసత్వంగా వచ్చిన రెండు ఎకరాల భూమిలో వజ్రాలు పండించి రూ.2 లక్షల కోట్లు సంపాదించావా చంద్రబాబూ...' అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రశ్నించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో మంగళవారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాబు అధికారంలో ఉండగా దొరికినకాడికి అడ్డంగా దోచుకున్నాడని, అందుకే జైలుకు వెళ్లాడని మంత్రి మండిపడ్డారు. తన 14 ఏళ్ల పాలనలో చేసిన మంచి పని ఒక్కటీ లేకపోవడం వల్లే బాబు ప్రజల మధ్యకు వచ్చి సీఎం జగన్‌పై ఆరోపణలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ పని అయిపోయిందని, 175 స్థానాల్లో పోటీ చేయలేక జనసేనతో జట్టు కట్టిందన్నారు. ప్రజల దృష్టిలో నిజం అంటే జగన్ అని, అబద్ధం అంటే చంద్రబాబు అనేది బలంగా ఉందని చెప్పారు. బలహీన వర్గాల వారందరికీ సంక్షేమం అందించినందుకు సీఎం వైఎస్ జగన్‌ను అధఃపాతాళానికి తొక్కేస్తానంటున్నావా పవన్... అని మంత్రి ప్రశ్నించారు.

మడకశిర టీడీపీలో చల్లారని అసమ్మతి



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న టీడీపీ కార్యకర్త బొమ్మయ్య గారి చంద్ర

మడకశిర: శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో టీడీపీ అభ్యర్థి ఎంఈ సునీల్‌కుమార్‌ను మార్చాలనే డిమాండ్ పెరుగుతోంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి వర్గీయులు టీడీపీ అభ్యర్థిగా సునీల్ కుమార్‌ను ప్రకటించిన రోజునుంచీ ఆయనను మార్చాలంటూ నిరసన కార్యక్రమాలు చేస్తూనే ఉన్నారు. దీన్లోభాగంగా మంగళవారం 'సునీల్ వద్దు-చంద్రబాబు ముద్దు' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేసుకుంటూ మడకశిర గుండుమల తిప్పేస్వామి ఇంటినుంచి వాల్మీకి విగ్రహం వరకు భారీ ర్యాలీ చేశారు. ర్యాలీ ప్రారంభంలో టీడీపీ కార్యకర్త బొమ్మయ్యగారి చంద్ర ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అక్కడున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారించడంతో ప్రమాదం తప్పింది. పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కాగా.. కొంతమంది మహిళా కార్యకర్తలు మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలుపుతూ.. అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా.. గురువారం నారా లోకేశ్ శంఖారావ సభలో పాల్గొనడానికి మడకశిర వస్తుండటంతో ఈ విభేదాలు మరింత భగ్గుమనే ప్రమాదం లేకపోలేదు.

టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకే రాధాకృష్ణ పాట్లు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను టార్గెట్‌గా చేసుకుని ఆంధ్రజ్యోతిలో సీరియల్‌గా అసత్య కథనాలు రాస్తున్నారని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పత్రికలో మంగళవారం ప్రచురించిన అరాచక మల్లు కథనంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. టీడీపీని అధికారంలోకి తేవాలని ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ చానల్ ఎండీ రాధాకృష్ణ విష ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏం చేసైనా ప్రొద్దుటూరులో టీడీపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని రాధాకృష్ణకు ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

జగన్ పాలన మళ్లీ వస్తేనే ఇంటింటికీ సంక్షేమం

- టీడీపీ గెలిస్తే అన్నీ అనర్థాలే
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఆపేస్తారు
- వైఎస్సార్‌సీపీ ఎంపీ పి.మిథున్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఉమ్మడి గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి

సాక్షి, అమలాపురం: వైఎస్ జగన్ పాలన మళ్లీ వస్తేనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతాయని.. టీడీపీ గెలిస్తే అన్నీ ఆగిపోతాయని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. వలంటీర్, సచివాలయాల వ్యవస్థలు లేకుండా పోతాయని.. సచివాలయాలన్నీ జన్మభూమి కమిటీల కార్యాలయాలుగా మారిపోతాయనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం చాకలిపాలెంలో జరిగింది. నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన సభలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మిథున్‌రెడ్డి మాట్లాడారు. 'ఇంటింటికీ వెళ్లినప్పుడు సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చెప్పడంతో పాటు ఆయన మళ్లీ సీఎం కాకపోతే జరిగే నష్టాలను కూడా ప్రజలకు వివరించండి. చంద్రబాబు అధికారంలోకి వస్తే జరిగే అనర్థాలను తెలియజేయండి. జన్మభూమి కమిటీల పెత్తనం మళ్లీ పెరుగుతుందని వివరించండి. వైఎస్ జగన్ పాలన మళ్లీ వస్తేనే ఇంటింటికీ సంక్షేమాభివృద్ధి అందుతుందని తెలియజేయండి' అని సూచించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పొత్తుల విషయంలో టీడీపీ, జనసేన గందరగోళంలో ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఎవరనేది తేల్చుకోలేకపోతున్నాయని ఎద్దేవా చేశారు. ఇప్పుడు వారి పరిస్థితి చూస్తుంటే ఉమ్మడి గోదావరి జిల్లాలను క్లీన్‌స్వీప్ చేస్తామనే నమ్మకం తనకు పెరిగిందన్నారు. సీఎం జగన్ కోసం నెల రోజులు కష్టపడితే.. ఆయన మళ్లీ సీఎం అయిన తర్వాత అందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటారని చెప్పారు. మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ.. ఎంతమంది కలిసి వచ్చినా, ఎన్ని పార్టీలు పొత్తు పెట్టుకున్నా.. ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న సీఎం జగన్‌ను ఓడించడం సాధ్యం కాదన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ప్రధానులు, ముఖ్యమంత్రులు ఇప్పటి వరకు ఎవ్వరూ లేరన్నారు. సీఎం జగన్ ఒక్కరే మేనిఫెస్టోలోని ప్రతి హామీనీ నెరవేర్చారని చెప్పారు. సమావేశంలో అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయెల్, కుడుపూడి సూర్యనారాయణ రావు, ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కరువు సాయం.. మిచాంగ్ పరిహారం

- 11.59 లక్షల మందికి రూ. 1,294.58 కోట్లు
- తాడేపల్లి నుంచి బటన్ నొక్కి జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్-2023లో ఏర్పడిన కరువు సాయంతో పాటు రబీ సీజన్ ఆరంభంలో గతేడాది డిసెంబర్‌లో సంభవించిన మిచాంగ్ తుపాన్ వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు పెట్టుబడి రాయితీ(పంట నష్టపరిహారం) జమ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ విపత్తుల వల్ల నష్టపోయిన 11.59 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ. 1,294.58 కోట్ల పరిహారాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేయనున్నారు. ఖరీఫ్-2023లో 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడమే కాకుండా.. ఆయా మండలాల పరిధిలో 14.24 లక్షల ఎకరాల్లో 33 శాతం కంటే ఎక్కువగా పంటలు కోల్పోయిన 6,59,897 మంది రైతులకు రూ. 847.22 కోట్ల పెట్టుబడి రాయితీని అందిస్తున్నారు. మేలో కురిసిన అకాల వర్షాల వల్ల 5 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్న 1,892 మంది రైతులకు రూ. 5 కోట్లు కోత అనంతర పంట నష్టపరిహారం అందించనున్నారు. రబీ సీజన్ ఆరంభంలో డిసెంబర్‌లో సంభవించిన మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు, గాలుల వల్ల జరిగిన పంట నష్టంతో పాటు, నేల కోత, ఇసుక మేటలు కారణంగా నష్టపోయిన 4.61లక్షల మంది రైతులకు రూ. 442.36 కోట్ల పెట్టుబడి రాయితీని ఇవ్వనున్నారు. ఇలా కరువు, మిచాంగ్, కోత అనంతర పంటలను కోల్పోయిన 11,59,126 మంది వ్యవసాయ, ఉద్యాన రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్ము కింద రూ. 1,294.58 కోట్లను నేరుగా వారి ఖాతాలకు జమ చేయనున్నారు. తాజాగా జమ చేయనున్న ఇన్‌పుట్ సబ్సిడీతో కలిపి ఈ ఐదేళ్లలో 34.41 లక్షల మంది రైతులకు రూ. 3,261.60 కోట్లు పెట్టుబడి రాయితీని అందించారు. ఈ 57 నెలల్లో పెట్టుబడి రాయితీ కింద 22.82 లక్షల వ్యవసాయ, ఉద్యాన, పట్టు రైతుల ఖాతాలకు రూ. 1,967.02 కోట్లు నేరుగా జమ చేశారు.

కరువు, మిచాంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు చెల్లించనున్న పరిహారం వివరాలు

శాఖ	రైతులు	విస్తీర్ణం (హెక్టార్లలో)	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ. కోట్లలో)
వ్యవసాయ శాఖ	10,50,537	7,74,617	1,180.89
ఉద్యాన శాఖ	1,08,589	62,733	113.69
మొత్తం	11,59,126	8,63,228	1,294.58

గుమ్మనూరు వద్దు.. జితేంద్ర ముద్దు

గుంతకల్లులో టీడీపీ నేతల ఆందోళన



గుంతకల్లులోని టీడీపీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

గుంతకల్లు: కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అనంతపురం జిల్లా గుంతకల్లు అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీ చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో అసమ్మతి మొదలైంది. సాయంత్రం గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఆర్.జితేంద్రగౌడ్‌కు మద్దతుగా పార్టీ నేతలు, కార్యకర్తలు గుంతకల్లులోని టీడీపీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గుమ్మనూరు జయరాం వద్దు..జితేంద్రగౌడ్ ముద్దు అంటూ నినాదాలు చేశారు. గుమ్మనూరు జయరామ్‌కు టికెట్ ఇస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేదిలేదని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పామిడి లక్ష్మీనారాయణ, హనుమంతు, పాలమల్లికార్జున, కేశప్ప తదితరులు మాట్లాడుతూ చంద్రబాబు టికెట్ల కేటాయింపు విషయంలో తప్పటడుగులు వేస్తున్నారని మండిపడ్డారు. కళ్యాణదుర్గం, పెనుకొండ నియోజకవర్గాల్లో పార్టీని నమ్ముకున్న వారికి కేటాయించలేదని విమర్శించారు. ఇప్పుడు గుంతకల్లులో జితేంద్రగౌడ్‌కు టికెట్ ఇవ్వకుండా రూ.150 కోట్లు తీసుకొని గుమ్మనూరుకు ఇస్తామనడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. గుమ్మనూరు గతంలో చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను తిట్టాడని, అలాంటి వారిని పార్టీలోకి చేర్చుకోవడం తగదని అన్నారు. ఆలూరు నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడి చెడ్డపేరు తెచ్చుకున్న గుమ్మనూరు జయరామ్‌ను గుంతకల్లులో టీడీపీ తరఫున ఏవిధంగా పోటీ చేయిస్తారని ప్రశ్నించారు. స్థానికుడైన జితేంద్రగౌడ్‌ను కాదని.. పక్క జిల్లా నుంచి అభ్యర్థిని అరువు తెచ్చుకోవడం సిగ్గు చేటని విమర్శించారు.

'ఈనాడు'పై పరువు నష్టం దావా వేస్తా..

- పేరు లేకుండా కరపత్రాన్ని ఈనాడులో వేస్తారా?
- కొంచెమైనా విలువలున్నాయా?
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ఆగ్రహం
- చెవిరెడ్డితో కలిసి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, దుస్తుల పంపిణీ



ఇళ్ల పట్టాల డాక్యుమెంట్లతో పాటు లబ్ధిదారు దంపతులకు దుస్తులు అందజేస్తున్న బాలినేని దంపతులు, చెవిరెడ్డి

ఒంగోలు సబర్బన్: 'పచ్చ పత్రికల్లో వెధవ రాతలు, పిచ్చి రాతలు రాస్తున్నారు. ఎవరో వెధవలు పేరు లేకుండా కరపత్రాలు వేస్తే.. ఆ కరపత్రాన్నే ఈనాడు పేపర్‌లో రాస్తారు. అసలు కొంచెం అయినా విలువలున్నాయా' అని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఈనాడు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒంగోలు నగరంలోని రెండో డివిజన్ ముక్తినూతలపాడులో ఇళ్ల పట్టాలు, డాక్యుమెంట్లు లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో బాలినేని, ఆయన సతీమణి శచీదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఒంగోలు నగరంలోని సొంత ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలిచ్చి ఇళ్లు కట్టిద్దామనుకుంటే హైకోర్టుకు వెళ్లి అదే పనిగా ఆపేస్తున్న టీడీపీ నాయకులు, మరీ ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్.. పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని ధ్వజమెత్తారు. అయినా సరే మేం పట్టాలు పంపిణీ చేస్తుంటే టీడీపీ నాయకుల కడుపు మంట అంతా ఇంతా కాదన్నారు. పట్టాల వ్యవహారాన్ని జీర్ణించుకోలేక కొత్త ఎత్తుగడలు వేశారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో తాను పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి క్రాస్ ఓటింగ్ చేయిస్తానని టీడీపీ వాళ్లు ఎవరో ఊరు, పేరు లేకుండా కరపత్రాలు వేస్తే.. దానిపై ఈనాడు పత్రికలో కథనంగా రాస్తారా.. అసలు ఈనాడు యాజమాన్యానికి సిగ్గుందా? అంటూ నిలదీశారు. అందుకే ఆ పత్రికపై పరువు నష్టం దావా వేస్తున్నట్టు స్పష్టం చేశారు. కాగా, ఆంధ్రజ్యోతి పత్రికలో షాదీఖానాను ప్రారంభించిన దానినే రెండో సారి ప్రారంభిస్తున్నానని రాశారని, ఇవేం రాతలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చకు వస్తే వాస్తవాలు తేలుస్తామన్నారు. చెవిరెడ్డి మాట్లాడుతూ నలుగురు చీఫ్ సెక్రటరీలు వచ్చి, సీఎం చేతుల మీదుగా ఇళ్ల పట్టాలిస్తే దొంగ పట్టాలు అంటున్నారంటే.. టీడీపీ నేతలకు మతి పోయిందంటూ ఎద్దేవా చేశారు. వాసన్నకు తనకు అవినాభావ సంబంధం ఉందని చెవిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం బాలినేని దంపతులు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలతో పాటు దుస్తులు పంపిణీచేశారు.

హస్తినకు బీజేపీ అభ్యర్థుల జాబితా

- 25 లోక్‌సభ స్థానాలకు ఇద్దరు లేదా ముగ్గురి చొప్పున ఎంపిక
- 175 అసెంబ్లీ స్థానాలకు మూడేసి పేర్లతో అధిష్టానానికి నివేదిక
- శివప్రకాష్ నేతృత్వంలో జిల్లాల వారీగా పూర్తయిన భేటీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలని భావిస్తున్న బీజేపీ.. అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాను మంగళవారం పార్టీ అధిష్టానానికి పంపించింది. ఇందుకోసం జాతీయ పార్టీ సహ సంఘటనా కార్యదర్శి శివప్రకాష్ విజయవాడలో శనివారం, ఆదివారాల్లో జిల్లాల వారీగా పార్టీ అధ్యక్షులు, కన్వీనర్లు, ముఖ్యనేతలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని స్థానాలకు పార్టీ తరఫున పోటీ చేసే నాయకుల పేర్లతో జాబితాలను రూపొందించారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ముగ్గురికి తక్కువ కాకుండా పేర్లతో నివేదికను సిద్ధం చేసి ఢిల్లీకి పంపినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

9న ఢిల్లీలో భేటీకి అవకాశం

లోక్‌సభ అభ్యర్థుల తుది ఎంపికకు సంబంధించి బీజేపీ అధిష్టానం ఏపీ నేతలతో ఢిల్లీలో భేటీ అయ్యే అవకాశం ఉందని సమాచారం. ఆ తరువాతే అభ్యర్థుల ప్రకటన ఉండొచ్చని భావిస్తున్నారు. కాగా.. ఫిబ్రవరి 6న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఢిల్లీ వెళ్లి అమిత్‌షాతో భేటీ అయిన తర్వాత రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేయబోతున్నట్టు ఊహాగానాలు ఊపందుకున్నాయి. పొత్తులపై జాతీయ నాయకత్వం నేటికీ ఎలాంటి ప్రకటన చేయకపోయినా.. పొత్తులో బీజేపీకి కేటాయించే సీట్ల సంఖ్యపై టీడీపీ నేతలకు మీడియాకు లీకులు ఇస్తూ వచ్చారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం సైతం పొత్తుల ప్రచారానికి ఊతమిస్తూ.. పొత్తులపై పార్టీ జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని చెబుతూ వచ్చింది. తాజాగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాష్ట్ర పర్యటనకు వచ్చి ఒకే రోజున దాదాపు 15 లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించినా పొత్తులపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాగా.. రాజ్‌నాథ్ పర్యటన తర్వాత జాతీయ నాయకత్వం సూచన మేరకు శివప్రకాష్ విజయవాడ వచ్చి అభ్యర్థుల ఎంపిక కసరత్తు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తుకు అవకాశాలు ఉండకపోవచ్చనే చర్చ నడుస్తోంది.

వారసత్వ నాయకత్వాలకు చోటులేదు

- అమరావతే ఏపీ రాజధాని
- ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి



ప్రజాపోరు సభలో మాట్లాడుతున్న పురందేశ్వరి

గుంటూరు (మెడికల్): బీజేపీలో వారసత్వ నాయకత్వాలకు చోటు లేదని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మంగళవారం గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని బళ్లారి రాఘవ ఓపెన్ ఆడిటోరియంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పురందేశ్వరి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లుగా అవినీతి రహిత పరిపాలన అందిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అన్నివర్గాల అభివృద్ధి కోసం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఉగ్రవాదులు దేశం వైపు కన్నెత్తి చూసేందుకు సైతం భయపడేలా రక్షణ వ్యవస్థను బలోపేతం చేశారని, ఆర్టికల్ 370 రద్దు చేసి స్వతంత్ర కశ్మీర్‌ను భారత దేశానికి అందించారని, ట్రిపుల్ తలాఖ్ రద్దుతో మహిళల స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చారని వివరించారు. ఏపీలో మార్పు రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని, బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. ఏపీ రాజధాని అమరావతికి కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ప్రభుత్వ తీరుపై మండిపాటు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పరిపాలన సాగిస్తోందని పురందేశ్వరి విమర్శించారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ప్రజలపై రూ.12 లక్షల కోట్ల అప్పుల భారం పెట్టారన్నారు. సెక్రటేరియట్, గనులు సైతం తాకట్టు పెట్టారని, నాసిరకం మద్యాన్ని విచ్చలవిడిగా అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారని ధ్వజమెత్తారు. సొంత సోదరికి న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్రాభివృద్ధి ఎలా చేస్తారని ప్రశ్నించారు. కేంద్రం 22 లక్షల ఇళ్లు ఇస్తే, కేవలం 3 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేసి ప్రజలను మభ్యపెట్టారన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రజాపోరు గుంటూరు పార్లమెంటరీ కన్వీనర్ మకుటం శివ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనమా నరేంద్ర పాల్గొన్నారు.

'వెలిగొండ' కోసం వేయి కళ్లతో వేచిచూస్తున్నారు

- వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరరెడ్డి



సొరంగ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చెవిరెడ్డి, తాటిపర్తి

పెద్దదోర్నాల: వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించే సమయం కోసం ఈ ప్రాంత వాసులంతా వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును సీఎం జగన్ బుధవారం ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి వైఎస్సార్‌సీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్‌తో కలిసి ప్రాజెక్టు ప్రాంతాన్ని మంగళవారం సందర్శించారు. వెలిగొండ సొరంగ మార్గాన్ని పరిశీలించిన ఆయన ఎన్నో ఏళ్ల కల నేటితో సాకారం అయ్యే సమయం వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాలకు తాగు, సాగు నీరు అందుతుందని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఈ ప్రాజెక్టును ఆయన కుమారుడు పూర్తి చేసి జాతికి అంకితం చేయనుండటం శుభపరిణామమన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త తాడిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ సీఎం జగన్‌కు స్వాగతం పలికేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. జగనన్న ఎన్నికల ముందు చెప్పినట్టుగానే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నారని చెప్పారు.

మాధవిరెడ్డిని చిత్తుగా ఓడిస్తాం

- కడప అభ్యర్థిగా ఆమెను నియమించడం సిగ్గుచేటు
- అసమ్మతి నేతల ఆత్మీయ సమావేశంలో కడప టీడీపీ నేతలు ఆగ్రహం



లక్ష్మిరెడ్డి

కడప రూరల్: కడప నియోజకవర్గ టీడీపీలో అసమ్మతి చెలరేగింది. మాధవీరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేయడంపై స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను కాదని.. ఆమెను పోటీ చేయిస్తే చిత్తుగా ఓడిస్తామని చంద్రబాబును హెచ్చరించారు. మంగళవారం కడపలో టీడీపీ అసమ్మతి నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ.. 'అనేక ఏళ్లుగా టీడీపీ కోసం పనిచేస్తున్నా. కడప కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉంటే టీడీపీ నుంచి నా కోడలు ఉమాదేవి మాత్రమే కార్పొరేటర్‌గా గెలిచింది. ఈ విషయం తెలుసుకున్న నారా లోకేశ్ మమ్మల్ని అభినందించి.. కడప ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి కూడా మా వద్దకు వచ్చి కడప ఎంపీగా ఆయన, కడప ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉమాదేవి పోటీ చేస్తామన్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు. ఉమాదేవి అభ్యర్థిత్వాన్ని అధిష్టానం విస్మరించింది. నన్ను నమ్ముకున్న కార్యకర్తల అభీష్టం మేరకు భవిష్యత్ నిర్ణయం తీసుకుంటా' అని చెప్పారు. కడప మాజీ ఇన్‌చార్జి అమీర్‌బాబు మాట్లాడుతూ.. 'మైనార్టీ నేతగా పార్టీ కష్టకాలంలో కూడా అంకితభావంతో పనిచేశా. కానీ చంద్రబాబు నాకు కడప టికెట్ ఇవ్వకుండా మోసం చేశారు. పార్టీలోనే ఉన్న కొందరు నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. వారి నాలుకను చీరేస్తా..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు సురేష్, మొహిద్దీన్, రామ్మోహన్‌రెడ్డి, అబ్దుల్లా, స్వర్ణలత, మీనాక్షి మాట్లాడుతూ.. చంద్రబాబు నిజమైన కార్యకర్తలను పట్టించుకోకుండా.. హైదరాబాద్‌లో ఉంటూ అక్కడే వ్యాపారం చేసుకుంటున్న మాధవిరెడ్డిని అభ్యర్థిగా నియమించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆమెకు బీఫాం ఇస్తే చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. శ్రీనివాసులురెడ్డి కనీసం ఒక్క కార్యకర్తకైనా న్యాయం చేశారా అని ప్రశ్నించారు. కడప టీడీపీలో జరుగుతున్న అన్యాయాలపై చంద్రబాబు ఇంటి వద్దే తేల్చుకుంటామన్నారు.

ఇంధన సామర్థ్య కార్యక్రమాలకు విశాఖ భేష్

- బీఈఈ డీజీ అభయ్ భాక్రే వెల్లడి

సాక్షి, అమరావతి: పర్యావరణ హిత జీవనశైలిని అనుసరించేలా ప్రజలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ పథకం అమలుకు రాష్ట్రంలో విశాఖపట్నం అనుకూలమని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) డైరెక్టర్ జనరల్ (డీజీ) అభయ్ భాక్రే తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఈఈ నేతృత్వంలో విశాఖలో అమలు చేస్తామన్నారు. రాష్ట్రానికి మణిహారం లాంటి తీర ప్రాంత నగరం విశాఖ లైఫ్ పథకం అమలులో కీలకం కానుందన్నారు. ఇంధనాన్ని సమర్థంగా, జాగ్రత్తగా వినియోగించడం, ఇంధన సామర్థ్య కార్యక్రమాలను ప్రోత్సహించడంలో విశాఖ నగరం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఆయన వెల్లడించారు. నౌకాశ్రయం, వేగంగా వృద్ధి చెందుతున్న పారిశ్రామిక రంగం వంటివి విశాఖ నగరానికి ప్రత్యేకమని కొనియాడారు. ఇంధన సామర్థ్య రంగంలో అక్కడ అద్భుత అవకాశాలు ఉన్నాయన్నారు. నీతి ఆయోగ్ కూడా ఇప్పటికే విశాఖ నగరాన్ని గ్రోత్ హబ్ సిటీగా గుర్తించిందని గుర్తు చేశారు. బీఈఈ 22వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో తాజాగా నిర్వహించిన కార్యక్రమంలో అభయ్ భాక్రే ఈ విషయాన్ని వెల్లడించినట్లు బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు.

రాష్ట్రంలో ప్రధాన నగరాలపై ప్రత్యేక దృష్టి

2022-23లో దేశంలో 50.98 మిలియన్ టన్స్ ఆఫ్ ఆయిల్ ఈక్వలెంట్ (ఎంటీవోఈ) ఇంధనాన్ని ఆదా చేసినట్లు డీజీ వెల్లడించారు. అలాగే 24.68 ఎంటీవోఈ థర్మల్ విద్యుత్తును కూడా పొదుపు చేసినట్లు చెప్పారు. మొత్తం 306.55 బిలియన్ యూనిట్ల విద్యుత్తును ఆదా చేయడం ద్వారా రూ.1,94,320 కోట్ల మేర పొదుపు చేసినట్లు వివరించారు. అలాగే 306.40 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందిని, దేశంలోని 80 శాతం మందిని 2028కల్లా పర్యావరణ హితంగా మార్చడమే లైఫ్ మిషన్ పథకం ముఖ్య ఉద్దేశమని భాక్రే వివరించారు. రాష్ట్రంలో ప్రధాన నగరాలైన విశాఖ, విజయవాడ, కాకినాడ, కర్నూలు, తిరుపతిపైనా ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఏపీలో ఇంధన సామర్థ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్న డిస్కంలు, రాష్ట్ర ఇంధన సంరక్షణ సంస్థ (ఏపీఎస్ఈసీఎం), ఇంధన శాఖలను అభయ్ భాక్రే అభినందించారు.

ప్రభుత్వానికి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: ప్రతి ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవంగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలోని అసోసియేషన్ ప్రతినిధులు సీఎస్ జవహర్ రెడ్డిని కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సీఎస్ మాట్లాడుతూ..రానున్న రోజుల్లో రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని రెవెన్యూ అసోసియేషన్‌కు, సిబ్బందికి సూచించారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా ఆ శాఖలో ఉత్తమ సేవలందించిన విశ్రాంత రెవెన్యూ సిబ్బందిని సత్కరిస్తామని రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందిస్తామని తెలిపారు. జూన్ 20న భూసంబంధిత సేవలు, సర్టిఫికెట్ల జారీ, ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి అడంగల్, ఆర్వోఆర్, 1బి అంశాలపై మండల, జిల్లా స్థాయిల్లో సభలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. భవిష్యత్‌లో మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు, విజ్ఞాపనలు స్వీకరించాలని ఆదేశించారు.

కాపులంతా వైఎస్సార్‌సీపీతోనే..

జాతీయ కాపు సమాఖ్య అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి



పన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో కాపులంతా వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారని జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని కాపులకు గతంలో ఎన్నడూ లేని మేలు జరిగిందని పేర్కొన్నారు. కాపులను ఉప ముఖ్యమంత్రిగా, మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా పదవులు కేటాయించి రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఘనత సీఎం జగన్‌దేనని కొనియాడారు. ఇప్పటి వరకూ ప్రకటించిన సీట్ల కేటాయింపులోనూ వైఎస్సార్‌సీపీ కాపులకు పెద్దపీట వేసిందని ప్రశంసించారు. కాపులకు రాష్ట్ర చరిత్రలో లేని గొప్ప ప్రాధాన్యతను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న కాపులంతా టీడీపీ మాయలను గ్రహిస్తున్నారని, ఆ పార్టీని దూరంగా ఉంచుతారని స్పష్టం చేశారు.

రేపు ఖాజీల పదవీకాలం పొడిగింపు పత్రాల పంపిణీ

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా కడపలోని నూర్జహాన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించనున్న కార్యక్రమంలో ఖాజీలకు పదవీకాలం పొడిగింపు పత్రాలను ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అందజేస్తారని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) ఎల్.అబ్దుల్ ఖదీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో చాలామంది ఖాజీల పదవీకాలం గడువు ఏడాది, రెండేళ్లలో ముగియనుంది. అందువల్ల ఇటీవల పలువురు ఖాజీలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ పదవీకాలం పొడిగించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ఖాజీలకు పదేళ్ల కాల వ్యవధిని పొడిగిస్తూ కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు జారీచేశారు.

క్లుప్తంగా...

రేపు ఆన్‌లైన్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖలోని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం పరిధిలో పీహెచ్‌సీలు, ఇతర ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం శరవేగంగా చర్యలు తీసుకుంటోంది. ఈ పోస్టుల భర్తీకి గత ఏడాది ఏపీ మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీన్లో భాగంగా మంగళవారం 41 మంది అభ్యర్థులతో తొమ్మిదో ఎంపిక జాబితాను విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు గురువారం ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి తెలిపారు. ఎవరైనా అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు గైర్హాజరైతే వారి ఎంపిక రద్దవుతుందని పేర్కొన్నారు.

'యూత్ పార్లమెంట్ ఫెస్టివల్'లో ఆకట్టుకున్న కడప యువతి ప్రసంగం



వైవీయూ: వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నగరానికి చెందిన ఎస్.సానియా మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో నిర్వహించిన 'యూత్ పార్లమెంట్ ఫెస్టివల్-24'లో పాల్గొని ప్రసంగించారు. ఈమె నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్న విషయం తెలిసిందే. పార్లమెంట్ భవనంలో నిర్వహించిన సమావేశంలో సానియా వికసిత్ భారత్, యువత లక్ష్యసాధన, దేశప్రగతిలో పాత్రపై ప్రసంగించారు. కాగా సానియా కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసుకుని, ప్రస్తుతం డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పీజీ చేస్తున్నారు.

వలంటీర్లకు ఎన్నికల విధులు వద్దు

ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిల్

సాక్షి, అమరావతి: ఎన్నికల విషయంలో వలంటీర్లకు ఎలాంటి విధులు అప్పగించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. పల్నాడు జిల్లాలో ఇటీవల నిర్వహించిన గ్రామ, వార్డు వలంటీర్ల అవార్డుల అధికారిక కార్యక్రమంలో ప్రతిపక్ష నేతను విమర్శిస్తూ ముఖ్యమంత్రి చేసిన ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ప్రకాశం జిల్లా, అన్నంభొట్లవారిపాలేనికి చెందిన చెన్నుపాటి సింగయ్య ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి వలంటీర్లు వెళ్లకుండా ఆదేశాలివ్వాలని కోరారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల అధికారి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తదితరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చారు.

వాళ్లని అవినీతికి వాడుకుని వదిలేసిన బాబు

బాబు 'యూజ్ అండ్ త్రో' జాబితాలో ఉమా, గంటా, చింతమనేని, యరపతినేని



సాక్షి, అమరావతి: టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు దోపిడీలో భాగస్వాములై, అవినీతిని కొత్త పుంతలు తొక్కించిన ఆ టీడీపీ నేతలను ఇప్పుడు అదే చంద్రబాబు పాతాళంలోకి తొక్కేస్తున్నారు. చంద్రబాబుకు మాత్రమే సొంతమైన 'యూజ్ అండ్ త్రో' ఆటలో ఆ నేతలకు సొంత నియోజకవర్గాల్లోనే దిక్కు లేకుండాపోయింది. అధికారంలో ఉండగా ఈ నేతలకు సర్వాధికారాలూ ఇచ్చి, అక్రమ సంపాదనకు వారిని ప్రోత్సహించి, రాష్ట్రాన్ని దోచుకున్న చంద్రబాబు.. ఇప్పుడు వారికి టికెట్టు దక్కని పరిస్థితి కల్పించారు. అవసరానికి వాడుకోవడం, అవసరం తీరిపోయాక పక్కన పడేయడం చంద్రబాబుకు మొదటి నుంచి ఉన్న నైపుణ్యం. సొంత కుటుంబం నుంచి పార్టీలో అనేక మంది నాయకుల వరకు చంద్రబాబు పాలసీకి బలైన వారే. తాజాగా ఆ కోటాలో టీడీపీ సీనియర్ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు, చింతమనేని ప్రభాకర్, యరపతినేని శ్రీనివాసరావు చేరిపోయారు. 2014–2019 మధ్య యధేచ్ఛగా అవినీతికి పాల్పడి చంద్రబాబుకు, ఆయన తనయుడు లోకేశ్‌కి కప్పం గట్టిన వీరికి ఇప్పుడు సీట్లు లేకుండాపోయాయి. అప్పట్లో అధికారం తలకెక్కడంతో చంద్రబాబు చెప్పినట్లు చేసి తమ కోసం పనిచేసిన సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల్నే హింసించారు. తద్వారా కేడర్ వ్యతిరేకతను మోయలేనంతగా మూటగట్టుకున్న ఈ నేతలు ప్రజా క్షేత్రంలో బలం కోల్పోవడంతో చంద్రబాబు వెంటనే ప్లేటు ఫిరాయించేశారు. ఈ నేతలను పూచికపుల్లల్లా తీసి పక్కన పడేశారు.

జలవనరులను దోచి ఇచ్చినా ఉమాను పక్కన పెట్టిన బాబు

ఎన్టీఆర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు సీటు నిరాకరించడం రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. చంద్రబాబుకు అత్యంత విధేయుడు, సుదీర్ఘకాలం కృష్ణా జిల్లాలో కీలక నేతగా ఉన్నా ఎవరూ ఆయన గురించి ఒక్క మంచి మాట చెప్పరు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక జల వనరుల శాఖ మంత్రిగా ఆయన చేసిన అవినీతి అంతా ఇంతా కాదు. పోలవరం ప్రాజెక్టును దోపిడీకి ఉపయోగించుకున్నారు.

ఇతర సాగు నీటి ప్రాజెక్టుల్లోనూ అవినీతిని పారించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోనూ అందిన కాడికి దండుకుని వేల కోట్లు పోగేశారు. ఆ అక్రమ సంపాదనను చంద్రబాబు, లోకేశ్‌కి కట్టబెట్టి వారి మెప్పు పొందారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ ప్రోద్బలంతో అవినీతి పిచ్చిలో మునిగిపోయిన ఉమ తన కేడర్, నేతలను వదిలేశారు. జిల్లాలో ఇతర నాయకులు, సీనియర్లను కూడా ఇబ్బంది పెట్టారు. జిల్లా పార్టీలో తానే సర్వం అయ్యారు. పని మీద వెళ్లిన పార్టీ నేతలను అవమానించారు. దీంతో నియోజకవర్గం మొత్తం ఆయనకు వ్యతిరేకంగా మారిపోయింది. దీంతో బాబు ఆయన్ని పక్కన పెట్టేశారు. అప్పట్లో తనకు ఎంత సహకరించినా, అవినీతి సొమ్ములో కమీషన్లు కట్టినా చంద్రబాబు కనికరించలేదు.

గంటాతో భూకుంభకోణాలు

విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అవకాశవాద రాజకీయానికి, అవినీతికి నిలువెత్తు రూపమైనా చంద్రబాబుకు ఆయనకి మంత్రి పదవి కట్టబెట్టారు. గంటా ద్వారా చంద్రబాబు విశాఖలో ఊహించని రీతిలో భూ దందాలు చేయించారు. విశాఖ జిల్లావ్యాప్తంగా నానా బీభత్సం సృష్టించారు. విశాఖలో భూ కుంభకోణం జరిగిన ప్రతి చోటా గంటా పేరు వినిపించేది. దీంతో పార్టీలో, జనంలోనూ ఆయనపై వ్యతిరేకత వెల్లువెత్తింది. ఇక గంటాతో ఉపయోగం లేదనుకున్న చంద్రబాబు ఈ సారి విశాఖలో సీటు లేదని కరాఖండిగా చెప్పారు. ఏకంగా జిల్లా దాటించి విజయనగరం జిల్లా చీపురుపల్లిలో పోటీ చేయాలని సూచించారు. దీంతో గంటా ఏమి చేయాలో పాలుపోక చింతిస్తున్నారు.

అన్ని విధాలుగా వాడుకుని చింతమనేనికే ఎసరు

టీడీపీలోని పాపులర్ నాయకుల్లో చింతమనేని ప్రభాకర్ ఒకరు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన వైపు చూసేందుకే నేతలు, ప్రజలు భయపడేవారు. పోలవరం కాలువ గట్లపై యధేచ్ఛగా మట్టిని తవ్వి అమ్మేసి డబ్బు దండుకున్నారు. తమ్మిలేరులో ఇసుకను అక్రమంగా తవ్వి కనీవినీ ఎరుగని రీతిలో సొమ్ము చేసుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆయన అనధికారిక మంత్రిగా వ్యవహరించారు. అంతటి అవకాశం ఇచ్చిన చంద్రబాబు, ఆయన తనయుడికి చింతమనేని క్రమం తప్పకుండా కప్పం కట్టారు. వారి అండ చూసుకుని చింతమనేని అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను అల్పులుగా చూశారు. ఇసుకను అక్రమంగా తవ్వద్దని అడ్డపడినందుకు మహిళా తహసీల్దార్‌పైనే దాడి చేసిన ఘనుడు. దానికి చంద్రబాబు వంతపాడి తహశీల్దార్‌నే తప్పుపట్టి రాజీ చేశారు. ఇలా అనేక దౌర్జన్యాలకు పాల్పడిన చింతమనేనిపై 40కిపైగా కేసులున్నాయి. వీటిలో కొన్ని క్రిమినల్ కేసులు కూడా ఉన్నాయి. అడ్డగోలుగా గొడవలకు వెళ్లడం, రౌడీయిజంతో భయపెట్టడంతో జనం ఆయన్ని 2019లో ఓడించి కసి తీర్చుకున్నారు. ఇప్పుడు సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆయనకు సీటిస్తే పని చేసేది లేదని చెప్పడంతో చంద్రబాబూ ఆయన్ని వదిలించుకోవాలనుకున్నారు. దెందులూరు సీటు ఇవ్వనని చెప్పేశారు.

యరపతినేనితో గనుల దోపిడీ

ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మైనింగ్ డాన్‌గా పేరుపొందారు. లోకేశ్ అండతో ఆయన అక్రమ మైనింగ్‌లో రికార్డులు సృష్టించారు. గనులను కొల్లగొట్టి ఆ సొమ్మును లోకేశ్, చంద్రబాబుకు పంచిపెట్టారు. సొంత పార్టీ నేతలే ఆయన అక్రమ మైనింగ్ చూసి నివ్వెరపోయారు. అధికారులను కూడా బెదిరించి లొంగదీసుకున్నారనే ఆరోపణలున్నాయి. గుంటూరు జిల్లాలో తానే హోంశాఖ మంత్రి అనేలా పరిస్థితిని తయారు చేశారు. చంద్రబాబు ఇచ్చిన అధికార బలంతో పోలీసు అధికారులను సొంత ప్రయోజనాలకు వాడుకున్నారు. చివరికి ఆయన పాపం పండి అక్రమాలపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఇవన్నీ చూసి పార్టీ కేడరే విసుగెత్తిపోయింది. సొంత నియోజకవర్గంలో ప్రజలు, కేడర్ వ్యతిరేకం కావడంతో చంద్రబాబుకు యరపతినేని కరివేపాకు అయ్యారు. ఆయనకు సీటును డౌటులో పెట్టారు. టికెట్టు ఇస్తారో లేదో తెలియక యరపతినేని గందరగోళంలో ఉన్నారు.

త్వరలో ఆర్టీసీలోకి 3,500 కొత్త బస్సులు

- ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి
- హనుమాన్ జంక్షన్‌లో బస్‌స్టేషన్ ప్రారంభం



హనుమాన్‌జంక్షన్ బస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మల్లికార్జునరెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావు, జోనల్ చైర్మన్ మహేష్

హనుమాన్‌జంక్షన్ రూరల్/మచిలీపట్నంటౌన్: మరో రెండు నెలల్లో ఏపీఎస్ ఆర్టీసీలో 3,500 కొత్త బస్సులను తీసుకొస్తున్నట్టు సంస్థ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. హనుమాన్ జంక్షన్‌లో రూ.4.40 కోట్లతో నిర్మించిన బస్‌స్టేషన్‌ను మంగళవారం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ 3,500 బస్సుల్లో 1500 డీజిల్ బస్సులు కాగా, మరో 1000 ఎలక్ట్రిక్ బస్సులు, మిగిలిన 1000 అద్దె బస్సులుంటాయని తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

ఇదిలా ఉండగా ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారక తిరుమలరావు, రీజనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్‌లతో కలిసి మచిలీపట్నం బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రవాణా మంత్రిగా పేర్ని నాని ఉన్న సమయంలో మచిలీపట్నం బస్టాండ్ అభివృద్ధికి రూ.3.5 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులతో బస్టాండ్ ఆధునికీకరణ పనులు పూర్తికాగా, మరికొన్ని పూర్తవుతున్నాయని తెలిపారు. పాత భవనంలో ఉన్న డిస్పెన్సరీ కోసం రూ.80 లక్షలతో కొత్త డిస్పెన్సరీ భవనాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేశామని, ఇంకా అర్హత ఉన్న వారికి ఉద్యోగాలిస్తామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

శ్రీనివాసరావుకు ప్రతిష్టాత్మక డి.లిట్ అవార్డు



సాక్షి, అమరావతి: కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు ప్రతిష్టాత్మక డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డి.లిట్) అవార్డు లభించింది. భారతీయ భాషలకు, సాహిత్యానికి విశేష సేవలు అందించడంతో పాటు రెండు దశాబ్దాలుగా కేంద్ర సాహిత్య అకాడమీకి అందించిన సేవలకు గౌరవార్థం డి.లిట్ ప్రదానం చేస్తున్నట్టు జగదల్పూర్‌లోని షహీద్ మహేంద్ర కర్మా వర్సిటీ (బస్తర్) ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఆ రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ డి.లిట్ డిగ్రీని అందజేశారు. కృష్ణాజిల్లా పెదప్రోలుకు చెందిన శ్రీనివాసరావు తిరుపతి ఎస్వీయూలో ఇంగ్లిషులో డాక్టరేట్ చేశారు.

ఏపీలో విద్యా కార్యక్రమాలు అద్భుతం

ఉత్తరాఖండ్ ఎస్సీఈఆర్టీ బృందం ప్రశంస



ఉత్తరాఖండ్ విద్యాశాఖ అధికారులకు స్వాగతం పలుకుతున్న డాక్టర్ ప్రతాప్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని ఉత్తరాఖండ్ ఎస్సీఈఆర్టీ జాయింట్ డైరెక్టర్ ఆశారాణి కితాబిచ్చారు. ఇక్కడ అమలు చేస్తున్న విద్యా సంస్కరణలపై అధ్యయనానికి మంగళవారం ఉత్తరాఖండ్ విద్యాశాఖాధికారుల బృందం విజయవాడ వచ్చింది. వీరికి ఏపీ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి స్వాగతం పలికి.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న పథకాలను వివరించారు. జగనన్న అమ్మ ఒడి, మనబడి నాడు నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, విద్యార్థులకు బైలింగ్వువల్ టెక్ట్స్ బుక్స్, టోఫెల్, ఐబీ సిలబస్ అమలు వంటి అంశాలను ప్రతాప్‌రెడ్డి తెలియజేశారు. అనంతరం విజయవాడలోని ఎంకే బేగ్ మునిసిపల్ పాఠశాలను సందర్శించి విద్యా కార్యక్రమాలను ఉత్తరాఖండ్ బృందం అడిగి తెలుసుకుంది. అనంతరం ఆశారాణి మాట్లాడుతూ.. ఇక్కడ అమలు చేస్తున్న అమ్మఒడి, నాడు నేడు, టోఫెల్, ఐబీ వంటి కార్యక్రమాలు విద్యార్థుల ప్రగతికి దోహదం చేయడంతో పాటు ప్రభుత్వ ప్రతిష్టను కూడా పెంచాయని ప్రశంసించారు. కాగా.. ఉత్తరాఖండ్ విద్యాశాఖ అధికారుల బృందం మూడురోజుల పాటు నంద్యాల, విశాఖపట్నంలోని పాఠశాలలు, డైట్ సెంటర్లను పరిశీలించనుంది. ఈ బృందంలో కేఎస్ బిజిల్వాన్, రమేష్, హరేంద్ర అధికారి, వినయ్ అరుణ్ తదితరులు ఉన్నారు.

ఏపీ విద్యా సంస్కరణలకు జాతీయ గుర్తింపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలకు మరోసారి జాతీయ గుర్తింపు లభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 'ఐఎఫ్‌పీలు, ట్యాబ్స్ వినియోగంలో ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్ పాత్ర' ప్రాజెక్టు 'ప్రైమ్ మినిస్టర్స్ అవార్డు ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అవార్డు' అర్హుల జాబితాలో స్థానం లభించింది. మంగళవారం ఉన్నత విద్యామండలి, పాఠశాల విద్యాశాఖ అధికారులు, ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌తో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వీడియో సమావేశం నిర్వహించారు.పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నుంచి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు చేసిన వినూత్న కార్యక్రమాలకు ఈ అవార్డును ప్రదానం చేస్తారన్నారు. తుది జాబితాలోని 10 ప్రాజెక్టుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు కూడా ఉందన్నారు.

నేటి నుంచి ఐసెట్-2024 రిజిస్ట్రేషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఐసెట్-2024 రిజిస్ట్రేషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ ఐసెట్ నిర్వహణ బాధ్యతలు చేపడుతోంది. ఏప్రిల్ 7 వరకు ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తులకు అవకాశం కల్పిస్తోంది. మే 6, 7 తేదీల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.650, వెనుకబడిన తరగతుల అభ్యర్థులు రూ.600, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.550 దరఖాస్తు ఫీజు చెల్లించాలి. దరఖాస్తులను cets.apsche.a p.gov.in లో అందుబాటులో ఉంచింది.

ఆ వ్యాజ్యాల విచారణ 13కి వాయిదా

సునీత, తదితరుల వ్యాజ్యాల్లో కౌంటర్ వేయాలన్న హైకోర్టు

సాక్షి, అమరావతి: పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 13కి వాయిదా వేసింది. అప్పటికల్లా కౌంటర్ దాఖలు చేయాలని ఫిర్యాదుదారు కృష్ణారెడ్డిని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివేకా హత్య విషయంలో నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రాంసింగ్ తనను శారీరకంగా, మానసికంగా వేధించారని, తాము చెప్పినట్టు వినకుంటే అంతు చూస్తామని బెదిరించారని వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు కృష్ణారెడ్డి ఫిర్యాదుపై విచారణ జరపాలని పోలీసులను ఆదేశించింది. కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు పోలీసులు నర్రెడ్డి సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్‌లపై కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. సునీత తరఫు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. పులివెందుల కోర్టులో జరుగుతున్న కేసులో విచారణ ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. ఫిర్యాదుదారు తరఫు న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ.. కౌంటర్ దాఖలుకు సమయం కావాలని కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం ॥ 6-3-2024

గుడ్ టచ్- బ్యాడ్ టచ్



మీ అమ్మాయికి చెప్పండి!

మీ ఇంట్లో, మీ పక్కింట్లో, ఎదురింట్లో, పొరుగింట్లో కూతుళ్లు ఉండే ఉంటారు.
నవ్వుతూ తుళ్లుతూ స్కూళ్లకు వెళుతుంటారు.
కొన్ని కళ్లు చూపులతోనూ, మరికొన్ని చేతలతోనూ
ఆ నవ్వులను చిదిమేయడానికి పొంచి ఉంటాయి.
ఆమెకు చెప్పండి 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' అంటే ఏమిటో...
జాగ్రత్తగా ఎందుకు ఉండాలో.
'మీ పక్కింట్లో, ఎదురింట్లో, పొరుగింట్లో, వెనకింట్లో
ఉన్న అమ్మలు ఒక్కటవ్వండి. పరువు పరదాల మాటున
పసిపిల్లలపై జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్ట వేయండి..'
అని చెబుతున్నారు హైదరాబాద్ వాసులైన మమత, శైలజ, జయవర్ధని, పుష్పలత, లక్ష్మి.

ఆడపిల్లల భవిత బాగుండాలంటే వారు ఈ రోజు సురక్షితంగా ఉండాలి. చెడు చేతల బారిన పడకుండా 'గుడ్ టచ్- బ్యాడ్ టచ్' గురించి బడులు, మురికివాడలు, అపార్ట్‌మెంట్లు.. మొదలైన ప్రాంతాల్లో మమత, శైలజ, జయవర్ధని, పుష్పలత, లక్ష్మి.. లు 'అభయ భవిత' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. వీరు చేసే ఈ అవగాహన కార్యక్రమం ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా తెలుగు రాష్ట్రాలోని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోకీ తీసుకెళుతున్నామని తెలియజేశారు.

పిల్లల భావాలను గ్రహించండి..

మూడు నుంచి పదేళ్లలోపు పిల్లలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని జాతీయ, అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.'ఆ పై వయసు పిల్లలు కూడా ఎదురు చెప్పలేని, ఎదుర్కోలేని స్థితిలో ఉన్నారని గమనిస్తున్నాం' అంటున్నారు చైల్డ్ సైకాలజిస్టులు. పిల్లల్లో ఆకలి తగ్గిపోవడం, ఎవరితో కలవకపోవడం, నిద్రలో ఉలిక్కిపడి లేవడం, ప్రతి విషయానికి చికాకు పడటం, చదువులో వెనకబడిపోవడం .. వంటి సమస్యలన్నీ చెడు స్పర్శకు గురైన పిల్లల్లో చూస్తుంటాం. ఈ ప్రభావం వారి భవిష్యత్తును దెబ్బతీయకుండా ఉండాలంటే పిల్లల్లో ఇలాంటి భావాలేమైనా ఉంటే వాటిని తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. అబ్బాయిలనూ చెడు స్పర్శ సమస్య వెంటాడుతుంది. కాబట్టి, ఈ సమస్య అమ్మాయిలది మాత్రమే అని అనుకోవద్దు. పిల్లల ప్రవర్తనలో తేడాలు గమనించడం, నిపుణులు సాయం తీసుకోవడం సముచితం' అని తెలియజేస్తున్నారు.

తల్లిదండ్రులుగా మీరేం చేయాలంటే..

ఎవరైనా అమ్మాయిల తలపై, వీపుపై తట్టడం .. వంటి స్పర్శ వారిపై చూపించే శ్రద్ధగానే అనిపిస్తుంది. కానీ, వారి శరీరంలోని ప్రైవేట్ పార్ట్‌లను తడమడం, తాకడం, కొట్టడం.. వంటివి పిల్లల భావాలపై తీవ్రమైన చెడు ప్రభావం చూపుతుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు, అపరిచిత వ్యక్తులు ఎవరైనా సరే వారు స్పర్శించిన తీరు నచ్చకపోతే వెంటనే 'నో' చెప్పాలనే విషయాన్ని పిల్లలకు తెలియజేయాలి. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తున్నట్టుగా అనిపిస్తే .. • అప్రమత్తంగా ఉండమని చెప్పండి • భద్రత కోసం ఏదైనా వస్తువును ఉపయోగించమనండి • ఎవరినైనా సాయం కోరమనండి • గట్టిగా అరవమనండి • చెడు స్పర్శ వద్దే వద్దు అని చెప్పండి. • నిర్భయంగా ఉండమనండి • నీలో ఎంతో శక్తి ఉంది అది గ్రహించు అని చెప్పండి • సంఘటనను బట్టి వెంటనే ప్రతిఘటించమనండి • ఎలాంటి బాధ అయినా పంచుకోమని చెప్పండి. ఎవరికీ చెప్పుకోలేని సమస్య ఎదురైతే వెంటనే హెల్ప్‌లైన్ 1098 లేదా 100కు ఫోన్ చేయమనండి.

– నిర్మలారెడ్డి

బోర్డుపైన బొమ్మలు వేయించి



పదేళ్లుగా సామాజిక కార్యకలాపాల్లో పాల్గొంటున్నాను. పిల్లల ఆరోగ్యం గురించి, మహిళలకు స్కిల్ ట్రెనింగ్ చేస్తుండేవాళ్లం. ఇప్పుడు పిల్లలకు గుడ్ టచ్- బ్యాడ్ టచ్ మీద అవగాహన కల్పిస్తున్నాను. బళ్లారిలోని గవర్నమెంట్ స్కూల్‌లో ఇద్దరు అమ్మాయిలను నిలబెట్టి మిగతా అందరికీ అర్థమయ్యేలా వివరించాం. పిల్లల చేతనే బోర్డు మీద బాడీలో ఏయే పార్ట్స్ తాకితే బ్యాడ్ టచ్ అనే విషయాలను బొమ్మలు వేయించి, రాయించి తెలియజేశాను. ఈ కార్యక్రమంలో పిల్లలు వాళ్ల ఎక్స్‌పీరియన్స్‌ను షేర్ చేసుకోవడం, తాము ఎలా ప్రతిస్పందించాలో ఒకటొకటిగా చెబుతుంటే ఆనందంగా అనిపించింది.

– పుష్పలత

సమాచారం ఉన్నా అవగాహన లేదు



బిజినెస్ ఉమన్‌గా నా పనులు చేసుకుంటూనే స్వచ్ఛంద కార్యక్రమాలలో పాల్గొంటుంటాను. కార్పొరేట్ స్కూళ్లలో మా ఫ్రెండ్ వాళ్లు స్టూడెంట్స్‌కు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు చేస్తుంటారు. ఒక్కో కార్యక్రమానికి స్కూల్ నుంచి కొంత మొత్తం తీసుకుంటారు. కానీ, గవర్నమెంట్, ఇతర కాన్వెంట్ స్కూళ్లకు ఆ అవగాహన కల్పించే వారు తక్కువగా ఉన్నారు. మేము భవిత ప్రోగ్రామ్ ద్వారా ఉచితంగా అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం. ఇటీవల హన్మకొండ జిల్లా వంగరలోని స్కూల్ పిల్లలకు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. ఇందుకు సంబంధించిన సమాచారం ఇప్పుడు చాలామంది దగ్గర ఉన్నప్పటికీ ఈ విషయంపై పిల్లలకు ఎంతవరకు అవగాహన కల్పిస్తున్నారు అనేది తెలియడం లేదు. ఒకసారి చెప్పి వదిలేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఈ సమస్యకు సంబంధించిన అప్‌డేట్స్ ఎప్పుడూ ఇస్తూ ఉండాలి.

– జయవర్ధని

రక్షించుకోవాలనే ఆలోచన కలగాలి



ఖమ్మంలో నా ఫ్రెండ్ డాక్టర్ ప్రశాంతితో కలిసి నిన్ననే ఒక స్కూల్ విద్యార్థులను కలిశాం. టీచర్‌గా, చైల్డ్ సైకాలజిస్ట్‌గా పిల్లలను ధైర్యవంతులను ఎలా చేయాలి అనే అంశాలపై చర్చించుకుంటూ ఉంటాం. పిల్లల మీద దాడులు జరిగినప్పుడు పెద్దలు ఆ విషయాలను బయటకు రానివ్వరు. ఎప్పుడో ఒకటో రెండో సంఘటనలు బయటకు వస్తాయి. ఈ కారణంగా చిన్నవయసులోనే పిల్లలు గర్భవతులు అవడం, ఆసుపత్రుల పాలవడం కూడా చూశాం. మేం చేసే ఈ కార్యక్రమం ద్వారా సమస్యను కొంతవరకైనా తగ్గించగలుగుతాం అనే ఆలోచనతో మొదలుపెట్టాం. కరోనాకు ముందు స్కూల్, కాలేజీలలో దాదాపు పదివేల మంది పిల్లలకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్ గురించి వివరించాం. ఇది పిల్లలున్న ప్రతి ఇంట్లో అవసరమైన టాపిక్. ఒక కథ లాగా చెప్పడం, తాము ఎవరి సమక్షంలో అయినా ఉన్నప్పుడు సురక్షితంగా అనిపించకపోతే గట్టిగా అరవడం, కొరకడం, నెట్టేయడం.. వంటివి చేయడం గురించి చెప్పాం. కరోనా టైమ్‌లో చాలా మంది పిల్లలు ఈ విధానం వల్ల రక్షింపబడ్డారని వారి పేరెంట్స్ వచ్చి చెప్పినప్పుడు చాలా ఆనందం అనిపించింది. అనాథాశ్రమాల్లోనూ ఈ కార్యక్రమాన్ని చేపడుతుంటాం. తమని తాము ఎలా రక్షించుకోవాలనే ఆలోచనను పిల్లల్లో కలిగించడానికి వీలైనన్ని కాన్సెప్ట్స్ ఇస్తుంటాం. అభయ భవిత కార్యక్రమం ద్వారా వీలైనంత మందిమి గ్రూప్‌గా అవుతున్నాం. స్లమ్స్, ఇండ్లలోని వారిని కూడా కలుస్తున్నాం. తమ తమ ప్రాంతాల్లోనే ఉంటూ ఎవరైనా ఆడపిల్లల రక్షణ కోసం అవగాహన కల్పించవచ్చు.

– ఏలూరి మమత

పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకోవాలి



పోక్సో అండ్ పోష్ రెండూ సర్టిఫికేషన్ చేశాను. వీటిలో శిక్షణ తీసుకున్నాను. పిల్లలపై జరిగే అకృత్యాలు, దాడులకు సంబంధించిన చట్టాలు, ఎలా నియంత్రించవచ్చు... అనే దానిపై వర్క్ చేస్తుంటాను. మా ఫ్రెండ్ ఎన్జీవో నుంచి వాలంటీర్‌గా పిల్లలకు స్వీయ రక్షణ కార్యక్రమాలు చేశాం. ఇప్పుడు గవర్నమెంట్ స్కూల్ ప్రిన్సిపల్స్‌ను కలిసి, పిల్లలకు శిక్షణ తీసుకుంటూ ఉంటాను. ఇటీవల గోల్కొండ ప్రాంతంలోని గవర్నమెంట్ స్కూల్‌కి వెళ్లినప్పుడు 9వ తరగతి చదువుతున్న ఒక అమ్మాయి గురించి తెలిసింది. ఆ అమ్మాయి మొదట్లో చాలా చురుకుగా ఉండేది. ఇప్పుడు మానసికంగా చాలా దెబ్బతింది. తనతో మాట్లాడితే హాస్టల్‌లో లైంగిక వేధింపులకు గురైన విషయం తెలిసింది. ఎప్పుడూ ముభావంగా ఉండటం, సరిగా చదవకపోవడం, చిరాకు పడటం.. వంటివన్నీ ఉన్నాయి. లైంగిక వేధింపుల కారణంగా మానసికంగా దెబ్బతిన్న పిల్లలను చూస్తుంటే చాలా బాధ కలుగుతుంది.

– శైలజ యడవల్లి

ఎదుర్కోవడానికి సిద్ధం చేయాలి



మేం ఉంటున్న ఉప్పల్ ప్రాంతంలోనే ఉన్న కాన్వెంట్ స్కూల్‌కి వెళ్లి అక్కడి ప్రిన్సిపల్ అనుమతితో స్కూల్ అమ్మాయిలతో కలిసి, మాట్లాడాను. పిల్లల చేతనే గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి చిన్న చిన్న స్కిట్స్ చేయించాను. తోటి పిల్లల్లో ఎవరైనా ఎవ్వరితోనూ మాట్లాడకుండా, ముభావంగా ఉంటూ, సరిగ్గా చదవకుండా ఉన్నట్టు గమనిస్తే సమస్యను తెలుసుకుని టీచర్లకు తెలియజేయండి అని వివరించాను. పిల్లలు బాగా స్పందించారు. రెండు గంటలపాటు చేసిన ఈ కార్యక్రమంలో పిల్లలు ఆత్మరక్షణతో ప్రతిరోజూ ఎలా ఉండాలో, ఏదైనా చెడు సంఘటన జరుగబోతోందని అర్థమయిన వెంటనే ఎలా ఎదుర్కోవాలో వివరించాను. పదవతరగతి లోపు పిల్లలందరికీ ఎలాంటి చెడు సంఘటన ఎదురు కాకుండా ఉంటే ఆ తర్వాత వాటిని ఎలా ఎదుర్కోవాలో అర్థం చేసుకోగలరు. లేదంటే, వారి భవిష్యత్తుకు ప్రమాదం అవుతుంది. ఈ విషయం గుర్తించి అవగాహన కల్పిస్తున్నాను.

– లక్ష్మి

విమెన్స్ డే స్పెషల్

పర్పుల్ కలర్ ఎందుకు?

ఉమెన్స్ డే సందర్భంగా కనిపించే పోస్టర్లు, ప్రచార సందేశాలకు పర్పుల్ కలర్‌ను ఉపయోగిస్తారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఈ పర్పుల్ కలర్‌కి సంబంధం ఏమిటి? ఆ విశేషాలు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లోగోలు, పోస్టర్లు, ప్రచార చిత్రాల్లో పర్పుల్ కలర్ కనిపిస్తుంది. గూగుల్ కూడా తన లోగోలో ఈ రంగే వాడుతుంది. ర్యాలీల్లో మహిళలు ఈ రంగు దుస్తులు ధరిస్తారు. దీనికి కారణం ఏమిటి? పర్పుల్ రంగు హుందాతనానికి గుర్తు. దీనిని దర్పానికి, సృజనాత్మకతకి, ఆధ్యాత్మికతకు సంకేతంగా ఉపయోగిస్తారు. ఒకప్పుడు అమెరికాలో మహిళలు ఓటు హక్కు కోసం ఉద్యమించినప్పుడు తెలుపు, ఆకుపచ్చ, పర్పుల్ రంగులను ఉద్యమంలో ఉపయోగించారు. తెలుపు స్వచ్ఛతకు, ఆకుపచ్చ ఆశకు, పర్పుల్ హుందాతనానికి చిహ్నంగా వ్యాఖ్యానించారు. అప్పటి నుంచి పర్పుల్ స్త్రీల ఉద్యమ రంగు అయ్యింది. ఆ రోజుల్లో పర్పుల్ రంగును 'డై' చేయాలంటే ఖర్చుగా ఉండేది. కులీన వంశస్తుల స్త్రీలే పర్పుల్ రంగు గౌన్లు ధరించేవారు. 'స్త్రీల అమూల్యతను' తెలపడానికి పర్పుల్ ఆ విధంగా చిహ్నమైంది. మరో విషయం ఏమిటంటే పింక్, బ్లూ కలర్స్ కలిపితే పర్పుల్ అవుతుంది. పింక్ కలర్ స్త్రీత్వానికి గుర్తు అయితే బ్లూ పురుష సామర్థ్యానికి చిహ్నం. స్త్రీ పురుషులు సమానం అని చెప్పడానికి పర్పుల్ కచ్చిత నిర్వచనంగా నిలుస్తుంది. మార్చి 8న అంతర్జాతీయ దినోత్సవాన్ని పర్పుల్ కలర్‌తో సెలబ్రేట్ చేసుకోవాలి. ఆఫీసుల్లో హెచ్‌ఆర్‌లో ఈ కలర్ రిబ్బన్స్ అలంకరించడం ద్వారా మహిళా ఉద్యోగుల పట్ల వారి ఆకాంక్షల పట్ల సంఘీభావం తెలపాలి.

వారి చెమట చుక్కలే కుట్టుకోలతలు



మహిళలకు ఉపాధి దానివల్ల వారికి ఆర్థిక స్వావలంబన సమాజంలో లైంగిక వివక్షను చెరపగలదు.
కాని స్త్రీ, పురుషులకు ఉపాధి కల్పించడంలో వివక్ష కొనసాగుతూనే ఉంది.
తమ జీతభత్యాల బేరసారాల్లో స్త్రీల గొంతు బలపడుతున్నా
వారు పొందుతున్నది తక్కువే. ఇక పనిచోట వారి శ్రమదోపిడి తీవ్రం.
తమిళనాడులో విస్తారంగా ఉన్న రెడిమేడ్ దుస్తుల రంగంలో స్త్రీల పని పరిస్థితులు ఒక నమూనా.
శ్రమ తప్ప ఆదాయం లేని ఉపాధి స్త్రీలకు కొనసాగాల్సిందేనా?

స్త్రీలు ఉపాధి పొందాలంటే అంత సులభమా? చెంగల్పట్టులో ఉన్న అనేక ఎక్స్‌పోర్ట్ గార్మెంట్స్ మాన్యుఫ్యాక్చర్ కంపెనీల్లో ఆ చుట్టుపక్కల పల్లెల్లోని స్త్రీలు వేలాదిగా పని చేస్తారు. వారంతా ఉదయం నాలుగున్నరకే లేచి ఇంట్లో వంట చేసి పిల్లలకు క్యారేజీలు కట్టి తాము టిఫిన్, లంచ్ కట్టుకుని ఏడూ ఏడున్నరకంతా కంపెనీ బస్సు కోసం నిలుచోవాలి. 9 గంటలకు ఫ్యాక్టరీలో డ్యూటీ ఎక్కితే తిరిగి సాయంత్రం 6 గంటల వరకూ నిలుచునే పని చేయాలి. మళ్లీ బస్సెక్కి ఇల్లు చేరి రాత్రి వంటకు పూనుకోవాలి. ఇంతా చేసి వారికి నెలకు దక్కేది ఎంతో తెలుసా? 9,500 రూపాయలు. సీనియర్లకైతే 10,500 రూపాయలు. ట్రాన్స్‌పోర్ట్ కటింగు, ఫ్యాక్టరీలో ఇచ్చిన టీ, బిస్కెట్ల కటింగు పోను వచ్చే జీతం ఇంతే. కాని వీరు తయారు చేసిన బట్టలు పోలో, ఇండియన్ టెర్రైన్ వంటి బ్రాండ్లుగా యూరప్, జపాన్, కెనడా, అమెరికాల్లో ఖరీదైన వెలకు అమ్ముడుపోతాయి.

తమిళనాడులో గార్మెంట్ ఫ్యాక్టరీల్లో 5 లక్షల మంది స్త్రీలు పని చేస్తున్నారు. మొత్తం ఆ రాష్ట్రంలో 18 లక్షల మంది టైలరింగ్ ఉపాధిలో ఉంటే వారిలో 60 శాతం మంది మహిళలు. తమిళనాడులో వ్యవసాయం తగ్గాక రైతు కూలీలుగా పని చేసే స్త్రీలు ఫ్యాక్టరీల వైపు అడుగులు వేస్తున్నారు. కాని వారి శ్రమను దోచుకునే సమస్త ఏర్పాట్లు ఇదివరకే జరిగిపోయి ఉన్నాయి. అందుకే ఇటీవల చెన్నైలో ఈ ఫ్యాక్టరీలలో పని చేసే స్త్రీలు నిరసన వ్యక్తం చేశారు. కోర్టులు కూడా వీరి జీతం పెంచమని చెప్పినా తమిళనాడులోని 500 మంది గార్మెంట్ ఫ్యాక్టరీల యజమానులు జీతాలు పెంచితే ఖర్చు పెరిగి ఆర్డర్లు తగ్గుతాయని, దుస్తుల కంపెనీలు ఆర్డర్లను శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి దేశాలకు చీప్ కూలీల కోసం తరలిస్తాయని అభ్యంతరం చెబుతున్నారు. అయితే ఆ మాటలన్నీ సాకులే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కొత్త జీతాలైనా ఎంతని? 15,000 మాత్రమే. ఆ 15 వేలు కూడా ఇవ్వం అంటున్నారు.

స్త్రీలు ఉపాధి పొందితే ఆ ఆర్థిక స్వావలంబనతో వారిలో ఆత్మవిశ్వాసం కలుగుతుంది. కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు వారి అభిలాషల మేరకు నెరవేర్చుకోవచ్చు. భర్తమీద ఆధారపడవలసిన పని లేకుండా నిర్ణయాలు తీసుకోవచ్చు. కాని వారికి లభిస్తున్న ఉపాధి వారికి ఏ ఆదాయమూ మిగల్చనిది అయితే ఆ శ్రమకు అర్థం లేదు.

జీతాలు ఎప్పుడూ పురుషుల కోసమే అనే మైండ్‌సెట్ సమాజంలో పోలేదు. స్త్రీల జీతం కోసం పెంపునకు యోగ్యమైనదే అని గ్రహించినప్పుడే పరిస్థితిలో కొద్దిగానైనా మార్పు వస్తుంది.

యూత్ పల్స్

బిగ్ టాక్

కమ్మని కాఫీలాంటి కబుర్లు

కబుర్లు అంటే...
ఏ సినిమా చూశావు?
ఓటీటీలో ఆ షో నచ్చిందా?
ఆ గాసిప్ గురించి విన్నావా?
ఇన్‌స్టాగ్రామ్‌లో నా లేటెస్ట్ ఇమేజ్‌లు చూశావా?... ఇలాంటి కబుర్లేనా?
యువతరం తాజా ధోరణి 'కానే కాదు' అంటుంది.
'స్మాల్ టాక్' కంటే
'బిగ్ టాక్'కు ప్రాధాన్యత ఇస్తోంది...



యువతరంలో నలుగురు ఒక దగ్గర కూడితే ఏం జరుగుతుంది? సరదా సరదా మాటలు, జోక్స్, సినిమా కబుర్లు, సోషల్ మీడియా సంగతులూ వినిపిస్తాయి. అయితే యువతరంలో కాలక్షేపం కబుర్లు కాకుండా కాస్త సీరియస్ విషయాల గురించి చర్చించే ధోరణి పెరుగుతోంది. ఈ సరికొత్త ధోరణిని 'బిగ్ టాక్' ట్రెండ్ అంటున్నారు.

'బిగ్ టాక్' అనేది 'టాప్ ట్రెండ్స్ ఫర్ 2024' ఒకటిగా నిలిచింది. ఇది'స్మాల్ టాక్'కు అపోజిట్ ట్రెండ్. 'స్మాల్ టాక్' అంటే కాలక్షేపం కబుర్లలాంటివి.

'బిగ్ టాక్ ట్రెండ్ గురించి విన్నప్పుడు ఆసక్తిగా అనిపించింది. డిగ్రీ ఫ్రెండ్స్‌లో కొందరం వారానికి ఒకసారి కలుసుకొని కబుర్లు చెప్పుకుంటాం. ఎప్పుడూ కాలక్షేప కబుర్లేనా? సీరియస్ టాపిక్స్‌పై కూడా మాట్లాడుకుందాం అనే ప్రపోజ్‌కు వెంటనే కాకపోయినా కాస్త లేటుగా అయినా ఫ్రెండ్స్ ఒకే అన్నారు. అయితే బిగ్ టాక్ అనేది అంత తేలిక కాదు. ఎప్పుడూ సరదాగా మాట్లాడే ఫ్రెండ్స్‌తో ఉన్నట్టుంటి పర్యావరణ విషయాలు, రాజకీయ పరిణామాలు... మొదలైన విషయాల గురించి మాట్లాడడం అంతా ఈజీ కాదు. వినే వాళ్లు లెక్చర్ విన్నట్లుగా ఫీలవుతారు. ఎన్ని అడ్డంకులు ఉన్నా ఒకసారి ట్రై చేసి చూద్దాం అని మొదలు పెట్టాం. వారం వారం ఒక్కొక్కరు ఒక్కో టాపిక్‌పై మాట్లాడాలని నిర్ణయించుకున్నాం' అంటుంది ముంబైకి చెందిన ప్రణతి.

ఇక యువ ఉద్యోగుల విషయానికి వస్తే...'బిక్ టాక్'లో భాగంగా ప్రొఫెషనల్‌గా, పర్సనల్‌గా ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాల గురించి మాట్లాడుకుంటున్నారు.

'నా కొలీగ్ చిన్న విషయాలకు భయపడుతుంటాడు. ఏఐ టెక్నాలజీ వల్ల మన ఉద్యోగాలు ఉండవేమో అన్నట్లుగా మాట్లాడేవాడు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మనం బిగ్ టాక్‌లో కూర్చుందాం అన్నాను. అతడికి ఏమీ అర్థం కాలేదు. ఒక ఆదివారం కేఫ్ కాఫీ కార్నర్‌లో బిగ్ టాక్ కోసం కూర్చున్నాం' అంటున్నాడు నాగ్‌పూర్‌కు చెందిన నిఖిల్ మిత్ర.

బిగ్ టాక్‌లో భాగంగా...

జాబ్ మార్కెట్‌పై ఏఐ చూపించే ప్రభావం? ప్రపంచవ్యాప్తంగా ఫుల్–టైమ్ జాబ్స్‌పై 'చాట్‌జీపీటి'లాంటి జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సిస్టమ్ చూపించే ప్రభావం, మోస్ట్ హైలీ క్వాలిఫైడ్ వర్కర్స్ ఎలాంటి అడ్జెస్ట్‌మెంట్స్‌కు ప్రిపేర్ కావాల్సి ఉంటుంది, సీనియర్‌లతో పోల్చితే జెన్ జెడ్ ఏఐ గురించి ఎందుకు ఎక్కువగా భయపడుతున్నారు? ఏఐని ఫేస్ చేయడానికి ఎలా సన్నద్ధం కావాలి?... మొదలైన ఎన్నో టాపిక్‌లపై కొలీగ్‌తో మాట్లాడాడు నిఖిల్ మిత్ర. మిత్రుడిలోని అకారణ భయాలను దూరం చేయడంలో సక్సెస్ అయ్యాడు.

'బిగ్ టాక్' అయినంత మాత్రాన సమావేశం మొత్తం ముఖం సీరియస్‌గా పెట్టుకొని, అత్యంత గంభీరంగా మాట్లాడాలని కాదు. కాలహరణ కబుర్లకు తక్కువ ప్రాముఖ్యం ఇచ్చి, మనకు ఉపయోగపడే విషయాలకు ప్రాధాన్యత ఇవ్వడమే 'బిగ్ టాక్' ట్రెండ్ సారాంశం.

పారదర్శక సంభాషణ

స్నేహానికి సంభాషణే ప్రధాన ద్వారం. యంగ్ ప్రొఫెషనల్స్‌కు కొలీగ్స్‌తో ఉండే స్నేహం ఆఫీస్ టైమింగ్స్ వరకు మాత్రమే పరిమితమా? గత జెనరేషన్ ఉద్యోగులలో చాలామంది పాటించిన సెల్ఫ్–సెన్సర్ విధానం వీరిలోనూ ఉందా? అనే ప్రశ్నలకు 'లేదు' అనే సమాధానం వినిపిస్తుంది.

ముఖ్యమైనవి అనుకునే అంశాలపై మాట్లాడడానికి, తమ అభిప్రాయాన్ని వినిపించడానికి యంగ్ ప్రొఫెషనల్స్‌లో ఎలాంటి సంకోచాలు లేవు. ఎడోబ్ సర్వే ప్రకారం సెన్సిటివ్ టాపిక్స్ గురించి కొలీగ్స్‌తో మాట్లాడటాన్ని సౌకర్యంగా ఫీలవుతున్నారు.

కిచెన్ టిప్స్



• చేపలూ, ఉల్లిపాయ, వెల్లుల్లి.. వంటివి తరిగినప్పుడు వాటి వాసన చేతులకు అంటుకుంటుంది. అప్పుడు టీపొడిని కొద్దిగా రాసుకుని ఐదు నిమిషాలయ్యాక సబ్బుతో కడిగేస్తే చాలు.

• కాయగూరలు తరిగే చెక్కని నిమ్మచెక్కతో రుద్ది కాసేపయ్యాక కడిగేయండి. మరకలు పోతాయి. ఎప్పుడైనా దానిపై మాంసం కోసినా.. నిమ్మచెక్కతో రుద్దితే క్రిములు వృద్ధి చెందకుండా ఉంటాయి



• నిమ్మచెక్కలని సన్నగా తరిగి కాసిని నీళ్లలో వేసి ఆ పాత్రని మైక్రో ఓవెన్‌లో కొన్ని నిమిషాలు ఉంచి తీసేయండి. అలా చేస్తే దుర్వాసనలు తొలగిపోవడంతో పాటూ లోపల పడి ఉన్న పదార్థాలని శుభ్రం చేయడం కూడా తేలికవుతుంది.

• ఫ్రిజ్‌లో ఓ మూలగా నిమ్మచెక్కని పెట్టి చూడండి. అందులోంచి వచ్చే దుర్వాసనలు పోతాయి.

• స్టీలు కుళాయిలపై నీటిమరకలు పడుతుంటాయి. అవి తెల్లగా మారాలంటే వాటిని నిమ్మచెక్కతో రుద్ది కడిగితే చాలు.



• వేపుడు కూరలనగానే నూనె గుర్తొచ్చి భయం వేస్తుంది. కానీ ఇలా చేస్తే నూనె తక్కువగా రుచికరమైన వేపుడు కూరలను ఆస్వాదించవచ్చు. • బెండకాయ వేపుడులో నూనె తగ్గిస్తే జిగురు అడుగున నల్లగా పట్టేస్తుంటుంది. కాబట్టి అడుగు పట్టకుండా వేగడానికి నూనె ఎక్కువ వేయాల్సి వస్తుంది. బెండకాయ ముక్కల్లో ఒక స్పూన్ పెరుగు లేదా మజ్జిగ లేదా పాలు వేస్తే జిగురు విరిగిపోయి ముక్కలు అతుక్కోకుండా విడివిడిగా ఉంటాయి, తక్కువ నూనెతో చక్కగా వేగుతాయి.

• దొండకాయ వేపుడు చేసేటప్పుడు ధనియాల పొడి వేస్తే నూనె ఎక్కువ వేయాల్సిన పని ఉండదు.



"వృద్ధాప్యం, అనారోగ్యం, మరణం- ఇవి లోపలి నుంచి కాల్చే మంట ల్లాంటివి. ఇవి మరింత చెలరేగకుండా ఉండాలంటే, ధ్యానం ద్వారా వాటిని ఆర్పడానికి ప్రయత్నించాలి.
– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 6 మార్చి 2024

కొరకరాని కొయ్య ట్రంప్!

ఎన్ని అడ్డదారులు తొక్కినా, ఎలాంటి ప్రసంగాలు చేస్తున్నా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మొదట రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వాన్నీ, ఆ తర్వాత అధ్యక్ష స్థానాన్నీ డోనాల్డ్ ట్రంప్ గెల్చుకోవటం ఖాయమని తాజా పరిణామాలు తెలియజేస్తున్నాయి. కొలరాడోలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం జరిగే ఎన్నికలో బ్యాలెట్ పత్రంపై ట్రంప్ పేరు తొలగించాలన్న ఆ రాష్ట్ర సుప్రీంకోర్టు తీర్పును దేశ సర్వోన్నత న్యాయస్థానం ఏకగ్రీవంగా తోసిపుచ్చటం ఆయనకు కొత్త శక్తినిస్తుందనటంలో సందేహం లేదు. 'సూపర్ ట్యూజ్‌డే' కింద మంగళవారం ఒకేసారి పదిహేను రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ఎన్నికలు జరగనుండగా ఒకరోజు ముందు ఈ తీర్పు వెలువడింది. ట్రంప్ ఇప్పటికే అయోవా, న్యూహాంప్‌షైర్, నెవడా ప్రైమరీలను గెల్చుకోవటంతోపాటు తన ప్రత్యర్థి హేలీకి బలం వుంటుందని భావించిన ఆమె స్వస్థలం సౌత్ కరోలినాలో సైతం సత్తా నిరూపించుకున్నారు. 'సూపర్ ట్యూజ్‌డే' పోలింగ్‌లో సైతం ఆయనదే పైచేయి అని ప్రాథమిక సమాచారం చెబుతోంది. అయితే రకరకాల కేసుల్లో చిక్కుకుని వాటినుంచి బయటపడటానికి అనుసరించాల్సిన వ్యూహంపై న్యాయవాదులతో నిరంతరం సంప్రదింపులు జరపాల్సిరావటం, న్యాయస్థానాలకు హాజరుకావటం ట్రంప్ ప్రచారాన్ని దెబ్బతీస్తోందనే చెప్పాలి. న్యాయస్థానాలకు సెలవు దినాలైన శని, ఆదివారాల్లో మాత్రమే ఆయన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వాటిల్లో సైతం సరిగా దృష్టి సారించలేకపోతున్నారు. ప్రసంగాలకు బదులు కరచాలనాలతో సరిపెడుతున్నారు.

అయితే ఇదంతా ట్రంప్ స్వయంకృతం. దేశాధ్యక్ష ఎన్నికల్లో తనకు లభించిన విజయాన్ని డెమాక్రాటిక్ పార్టీ కొల్లగొట్టిందని ఆరోపిస్తూ కాపిటల్ హిల్‌పైకి మద్దతుదార్లను ఉసిగొల్పి విధ్వంసానికి కారకులయ్యారు. దాదాపు మూడు గంటలపాటు ఆ భవన సముదాయాన్ని మూకలు చేజిక్కించుకున్నాయి. ఆయన ప్రత్యర్థి, డెమాక్రాటిక్ అభ్యర్థి జో బైడెన్ విజయాన్ని ధ్రువీకరించటానికి 2021 జనవరిలో అమెరికా సెనేట్, ప్రతినిధుల సభ సంయుక్త సమావేశాన్ని నిర్వహిస్తున్న సమయంలో జరిగిన ఆ దాడి దేశంలోనే కాదు... ప్రపంచవ్యాప్తంగా అందరినీ నివ్వెరపరిచింది. నిజానికి ఈ కేసులోనే కొలరాడో సుప్రీంకోర్టు అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీపడే అర్హతను ట్రంప్ కోల్పోయారని తీర్పునిచ్చింది. రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకొచ్చిన ఎవరైనా అందుకు భిన్నంగా తిరుగుబాట్లను రెచ్చగొడితే భవిష్యత్తులో పదవులు చేపట్టటానికి అనర్హులవుతారని చెప్పే రాజ్యాంగం 14వ సవరణలోని సెక్షన్ 3కి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. మెయిన్, ఇల్లినాయీ సుప్రీంకోర్టులు సైతం ఇలాగే నిర్ణయం తీసుకునే అవకాశం వున్నదని అందరూ అనుకున్నారు. కానీ దేశ సుప్రీంకోర్టు తీర్పుతో అవి నిలిచిపోయాయి. జాతీయ స్థాయి ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థులపై ఇలా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్ణయాలు తీసుకుంటే... అవి పరస్పర విరుద్ధంగా వుంటే ఒకరకమైన అరాచకానికి దారితీస్తుందని ధర్మాసనంలోని తొమ్మిదిమంది న్యాయమూర్తులూ భావించారు. వీరిలో ఆరుగురు మితవాద న్యాయమూర్తులైతే మరో ముగ్గురు ఉదారవాదులు. దేశమంతటికీ వర్తించేలా పార్లమెంటు మాత్రమే అలాంటి నిర్ణయం తీసుకోవాలన్నది వారి ఉద్దేశం. అయితే పార్లమెంటు ఉభయసభలైన సెనేట్, ప్రతినిధుల సభల్లో అధికార విపక్షాలిద్దరికీ చెరోచోటా ఆధిక్యత వున్నప్పుడు సమస్య మరింత జటిలంగా మారుతుంది. ట్రంప్ అధ్యక్ష పదవి గెల్చుకున్నాక దాన్ని ధ్రువీకరించటానికి నిర్వహించే పార్లమెంటు సమావేశం కాస్తా ఆయన ఎన్నికను రద్దు చేస్తే దేశవ్యాప్తంగా ఎలాంటి పరిస్థితులు చోటుచేసుకుంటాయన్నది ఊహాతీతం. కాపిటల్ హిల్‌పై దాడికి సంబంధించి ట్రంప్‌పై నాలుగు వేర్వేరు కేసులు విచారణలో వున్నాయి. వాటిల్లోని దాదాపు 93 ఆరోపణలనూ ఆయన తోసిపుచ్చారు. ఆ నేరాలు తాను చేయలేదనటం మాత్రమే కాదు... ఇవన్నీ పదవిలో వుండగా వచ్చిన ఆరోపణలు కనుక అధ్యక్షుడిగా తనకు రక్షణ వుంటుందంటున్నారు. అధ్యక్ష పదవిలో వున్న నాయకుడిపై క్రిమినల్ నేరారోపణలు రావటం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారి. కాపిటల్ హిల్‌పై దాడికి ఆయన పిలుపు ఇచ్చివుండొచ్చుగానీ, ఆయన స్వయంగా ఈ దాడిలో పాల్గొనలేదన్నది ట్రంప్ న్యాయవాదుల వాదన. ఈ విషయంలో దేశ సుప్రీంకోర్టు ఏం చెబుతుందన్నది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న. వాస్తవానికి వచ్చే నెల 22న సుప్రీంకోర్టు దీనిపై విచారణను ప్రారంభించాలి. కానీ ప్రతి దశలోనూ ఏదో ఒక అభ్యంతరంతో అడ్డుకుంటున్న ట్రంప్ న్యాయవాదులు దాన్ని సజావుగా సాగనిస్తారా అన్నది చూడాల్సివుంది.

అయితే ట్రంప్ కష్టాలు ఈ కేసుతో తీరిపోతాయనడానికి లేదు. ఆయన చుట్టూ మరిన్ని కేసులున్నాయి. నీలి చిత్రాల తార స్టార్మీ డేనియల్స్ తనపై ఆరోపణలు చేయకుండా వుండటానికి ఆమెకు భారీ మొత్తంలో డబ్బు ముట్టజెప్పారన్న అభియోగం అందులో ఒకటి. న్యూయార్క్ రియల్ ఎస్టేట్ మోసం కేసులో ఆయన 50 కోట్ల డాలర్ల పరిహారం చెల్లించాలని తీర్పు వెలువడింది. ప్రస్తుతం ఆ మొత్తాన్ని సమీకరించటానికి ఆయన పాట్లు పడుతున్నారు. అధ్యక్ష ఎన్నికల కోసం విరాళాలు సేకరించటం సరేసరి. ఇదిగాక ట్రంప్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని కాలమిస్టు జీన్ కరోల్ ఆరోపించారు. అందులో 50 లక్షల డాలర్ల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించగా, ఆమె పరువు ప్రతిష్ఠలు దెబ్బతీశారన్న ఆరోపణకు సంబంధించి 8 కోట్ల 30 లక్షల డాలర్లు ఇవ్వాలని మరో కోర్టు నిర్ణయించింది. వీటిపై అప్పీళ్లకు వెళ్లదల్చుకున్నారు. జనంలో వరస విజయాలు సాధిస్తున్న ట్రంప్‌ను న్యాయస్థానాల ద్వారా నిరోధించే డెమాక్రాటిక్ పార్టీ వ్యూహం వారికి ఏమేరకు లాభిస్తుందో వేచిచూడాలి.

వృద్ధి గాథలో చూడాల్సిన కోణం

విశ్లేషణ



మైత్రీశ్ ఘటక్

జీడీపీలో భారత్ ప్రపంచంలో ఐదవ స్థానంలో ఉంది. 1990ల్లో 17వ స్థానంలో ఉండేది. మూడు దశాబ్దాల క్రితం తలసరి ఆదాయంలో 161వ స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు కేవలం 159వ స్థానానికి మాత్రమే ఎగబాకింది. తలసరి ఆదాయం పెరగకుండా జీడీపీ పెరగడం దీనికి ఒక కారణం. భారత తలసరి జీడీపీ ర్యాంకింగ్ పెరగాలంటే, సగటు వృద్ధి రేటు చాలా ఎక్కువుండాలి. గత మూడు దశాబ్దాల వృద్ధి లాభాల్లో ఎక్కువ భాగం జనాభాలోని ఒక చిన్న వర్గంలో కేంద్రీకృతమై ఉంది. దేశ జనాభాకు సంబంధించి అది చిన్నదే అయినా, మార్కెట్‌గా ఆ సమూహ పరిమాణం తక్కువ కాదు. ప్రపంచ దేశాలు ఆర్థిక శక్తిగా భారత్‌పై దృష్టి సారిస్తున్నాయంటే కారణం ఇదే.

భారతదేశ స్థూల దేశీయోత్పత్తి ఇప్పుడు ప్రపంచంలోనే ఐదవ స్థానంలో ఉంది. 2030 నాటికి మన జీడీపీ మూడవ స్థానానికి చేరుకుంటుందని అంచనా. 1990ల ప్రారంభంలో, జీడీపీ పరంగా భారతదేశం 17వ స్థానంలో ఉండేది. ఈ విషయంలో దాని సాపేక్ష స్థానం గణనీయంగా మెరుగు పడిందనడంలో సందేహం లేదు. అయితే, తలసరి ఆదాయం ప్రాతిపదికన, భారతదేశం 1990ల ప్రారంభంలో 161వ స్థానంలో ఉండగా ఇప్పుడు 159వ స్థానంలో ఉంది. అంటే, తలసరి ఆదాయం పరంగా భారతదేశ సాపేక్ష స్థానం జీడీపీ పరంగా 17వ స్థానం నుండి 5వ స్థానానికి చేరుకున్న కాలంలోనూ పెద్దగా మారలేదు. ఎందుకు?

తలసరి ఆదాయాన్ని పెంచకుండా యాంత్రికంగా జీడీపీని పెంచే జనాభా పెరుగుదలే దీనికి కారణమని అనుకోవచ్చు. కానీ అది కారణం కాదు. వాస్తవానికి, జనాభా పరంగా భారతదేశ సాపేక్ష స్థానం ఈ కాలంలో ప్రపంచంలో రెండవ అతిపెద్ద (చైనా తర్వాత) దేశంగా ఉంది. అంతే కాదు, చర్చిస్తున్న కాలంలో జనాభా పెరుగుదల రేటు విషయంలో భారత్‌కూ, ప్రపంచ సగటుకూ గణనీయంగా తేడా లేదు. పైగా కాలక్రమేణా, దాని జనాభా పెరుగుదల రేటు తగ్గింది.

1991, 2021 మధ్య తలసరి స్థూల దేశీయోత్పత్తి ఏడు రెట్లు ఎక్కువ పెరిగిందనే వాస్తవంలో కొంత సమాధానం ఉంది. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మినహాయిస్తే, దేశ తలసరి వాస్తవ జీడీపీ దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు చూడవచ్చు. అయినప్పటికీ, జీడీపీ ర్యాంకింగ్ మెరుగుపడి తలసరి జీడీపీ ఎందుకు స్తబ్దుగా ఉంది?

ఒక ఉదాహరణ చెప్తాను. ఒక దేశ తలసరి జీడీపీ దశాబ్దంలో రెట్టింపు అయిందనుకుందాం. ఆ దేశాలు ఇప్పటికే తలసరి సగటు జీడీపీని ఎక్కువగా కలిగి ఉన్నట్లయితే లేదా అవి కూడా సహేతుకమైన అధిక రేటుతో వృద్ధి చెందుతున్నట్లయితే, ఇతర దేశాలతో పోలిస్తే దాని సాపేక్ష స్థితిలో పెద్ద తేడా ఉండకపోవచ్చు. కానీ, ఆ దేశ జనాభా ఎంత పెద్దదైతే, మొత్తం జీడీపీ విలువ ఆ జనాభా దామాషా ప్రకారం అంత ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు, దాని జనాభా రెట్టింపు అయితే, మొత్తం జీడీపీ నాలుగు రెట్లు పెరుగుతుంది. మనం దీనిని జనాభా గుణకం ప్రభావం అని పిలవవచ్చు. ఇతర దేశాలతో పోలిస్తే అధిక జనాభా ఉన్న దేశ సాపేక్ష స్థానం జీడీపీ పరంగా పెరిగే అవకాశం ఉంది. ఈ పెద్ద జనాభా గుణకం కారణంగానే భారతదేశం 1990ల ప్రారంభం నుండి ఇప్పటి వరకు జీడీపీ ర్యాంకింగ్స్‌లో అగ్ర స్థానానికి ఎదగగలిగింది. కానీ భారత తలసరి జీడీపీ ర్యాంకింగ్‌ను పెంచడానికి సగటు వృద్ధి రేటు ఇంకా ఎక్కువగా ఉండాలి.

అనేక దశాబ్దాలుగా జీడీపీ ర్యాంకింగ్‌లో భారత్ సాధిస్తున్న మెరుగుదల వెనుక... అధిక జనాభా, తలసరి జీడీపీకి చెందిన అధిక వృద్ధిరేటు కలయిక దాగి ఉంది. చైనాతో పోల్చి చూద్దాం. 1991, 2021 మధ్య, జీడీపీలో చైనా ర్యాంక్ 11 నుండి 2వ స్థానానికి పెరిగింది. అదే



సమయంలో సగటు తలసరి ఆదాయంలో దాని స్థానం 158 నుండి 75కి పెరిగింది. ఈ కాలంలో దాని తలసరి జీడీపీ 38 రెట్లు పెరిగింది. అయితే భారతదేశ తలసరి జీడీపీ కేవలం ఏడు రెట్లు మాత్రమే పెరిగింది. చైనాలో ఎక్కువ జనాభా ఉన్నందున, జనాభా గుణకం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కానీ వారు సగటు తలసరి ఆదాయాన్ని కూడా అనేక రెట్లు పెంచుకోగలిగారు. కాబట్టి మొత్తం ఆదాయం, తలసరి ఆదాయం రెండింటిలోనూ వారి సాపేక్ష స్థానం మెరుగుపడింది.

ఇప్పుడు, అసమానతల వెలుగులో, జీడీపీ లేదా జాతీయ ఆదాయం అనేది సగటు వ్యక్తి జీవన నాణ్యతకు నమ్మదగిన కొలమానం కాదని అందరికీ తెలుసు. ధనవంతులైన 10 శాతం మంది ఆదాయం 10 శాతం పెరిగి, మిగిలిన వారి ఆదాయం అలాగే ఉంటే, జాతీయ ఆదాయం 10 శాతం వృద్ధిని నమోదు చేస్తుంది. తలసరి జీడీపీ ఈ విషయంలో సాధారణ ప్రజల జీవన ప్రమాణానికి కొంచెం ఎక్కువ విశ్వసనీయ సూచికగా ఉంటుంది. ఈ ఉదాహరణలో, తలసరి ఆదాయం 1 శాతం మాత్రమే పెరుగుతుంది.

అభివృద్ధి పరంగా నిజమైన ప్రశ్న ఏమిటంటే, మొత్తం లేదా సగటు జాతీయ వృద్ధిరేటు సాధారణ జనాభా జీవన ప్రమాణాల పెరుగుదలను ఎంతవరకు ప్రతిబింబిస్తుంది అనేది. ఇప్పుడు, అధిక జనాభా కలిగిన దేశం తన తలసరి ఆదాయాన్ని దీర్ఘకాలంపాటు పెంచగలిగితే, పేదల ఉనికి ఎల్లప్పుడూ సగటు కంటే తక్కువగా ఉంటుంది కాబట్టి అది కొంత విశ్వసనీయతకు అర్హమైనది. తలసరి ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ, ప్రపంచ దేశాలు ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా భారత్‌పై దృష్టి సారిస్తున్నాయంటే కారణం ఏమిటి? ఈ గణాంకాలు మొత్తం చిత్రాన్ని పట్టుకోకపోయినా, ఇంకేదాన్నో సూచిస్తాయి. మార్కెట్ సైజు, జీడీపీ వృద్ధి లాభాల్లో సింహభాగాన్ని కైవసం చేసుకుంటున్న జనాభాలోని అతి చిన్న భాగపు సౌభాగ్యం ఇందులో ఉంది. అత్యధిక రాబడిని కోరుకునే మార్కెట్లు లేదా సరళమైన గ్లోబల్ క్యాపిటల్‌పై నిశితమైన దృష్టిని కలిగి ఉన్న బహుళజాతి సంస్థలు మొత్తం లేదా తలసరి జీడీపీ గురించి పట్టించు కోవు. గత మూడు దశాబ్దాలుగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలోని ఒక చిన్న భాగం వారికి ముఖ్యం.

గత మూడు దశాబ్దాల వృద్ధి లాభాల్లో ఎక్కువ భాగం జనాభాలోని ఒక చిన్న వర్గంలో కేంద్రీకృతమై ఉంది. అయితే భారతదేశ జనాభాకు సంబంధించి అది చిన్నదే అయినప్పటికీ, మార్కెట్‌గా ఆ సమూహ పరిమాణం తక్కువ కాదు. ఎందుకంటే బ్రిటన్ లేదా ఫ్రాన్స్ మొత్తం జనాభా భారతదేశ మొత్తం జనాభాలో 4–5 శాతానికి దగ్గరగా ఉంటుంది. చిన్న దేశాలలో తలసరి ఆదాయం ఎక్కువగా ఉండవచ్చు లేదా వేగంగా వృద్ధి చెందవచ్చు. కానీ మార్కెట్ పరిమాణం కారణంగా భారతదేశం ముఖ్యమైనది. కాబట్టి మొత్తం జీడీపీ విలువ లేదా దాని వృద్ధి రేటు అభివృద్ధికి కొలమానంగా బలహీనంగా ఉన్నప్పటికీ లేదా జనాభాలో అధిక భాగం పేదగా ఉన్నప్పటికీ, ఇది బాగా డబ్బున్న, సంపన్న సమూహపు కొనుగోలు శక్తికి సూచిక. ఆర్థిక వ్యవస్థలోని ఈ విభాగం లగ్జరీ కార్లు లేదా ఫ్యాన్సీ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్‌గా పరిమాణ పరంగా చూస్తే అనేక సంపన్న దేశాలతో పోటీపడగలదు. అదే సమయంలో మెరిసే షాపింగ్ మాల్స్, విలాసవంతమైన వస్తువులు, సేవల వినియోగం పెరగడం వల్ల భారత్ ప్రకాశిస్తున్నట్లు భ్రమ కలగవచ్చు.

మార్కెట్ పరిమాణం ఎందుకు ముఖ్యమైనది? మొదటిది, భారీ స్థాయి తయారీ పరిశ్రమలకు సంభావ్య కొనుగోలుదారుల పరంగా నిర్దిష్ట పరిమాణంలోని మార్కెట్ అవసరం. లేకపోతే, పెట్టుబడి లాభదాయకం కాదు. రెండవది, తలసరి ఆదాయంతో సంబంధం లేకుండా, ఒక పెద్ద దేశం జనాభాలో కొంత భాగం ఆదాయం నిర్దిష్ట పరిమితిని మించి ఉంటే, దాని డిమాండ్లు అవసరాల నుండి విలాసాలకు మారుతాయి.

కాబట్టి, జీడీపీ పరంగా భారతదేశ పెరుగుదల పూర్తిగా గణాంక నిర్మాణమేననీ, ఇది సామాన్యుల జీవన ప్రమాణాన్ని ప్రతిబింబించదనీ లేదా సగటు తలసరి ఆదాయం పెరగలేదనీ ఎవరైనా అనుకుంటే... వాళ్లు అసలు కథను విస్మరిస్తున్నట్టు. కొనుగోలు శక్తి జనాభాలోని నిర్దిష్ట విభాగానికి విపరీతంగా పెరిగింది. కాకపోతే సమస్య ఏమిటంటే– సప్లయ్, డిమాండ్ ఆట ఒక చిన్న విభాగానికే పరిమితమైతే... అది జనాభాలో ఎక్కువ భాగానికి విస్తరించకపోతే ఆర్థిక వృద్ధి స్తబ్ధతకు గురవుతుంది. కోవిడ్ మహమ్మారి ముందు కనిపించిన వృద్ధి క్షీణత సంకేతాలు దానికి ప్రతిబింబం కావచ్చు.

వ్యాసకర్త లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మాట్లాడాలి కదా?




రష్యన్ లక్ష్యాలపై దాడి గురించి జర్మన్ వైమానిక దళం మాట్లాడిన అధిక ప్రసంగ మాటలు లీక్ కావడం మీద కన్నా, వాటితో జర్మన్ ప్రభుత్వానికి సంబంధం లేదని కవర్ చేయడం మీద జర్మన్, పాశ్చాత్య దేశాలు దృష్టి పెట్టాయి. ఈ అన్యాయమైన పథకాల గురించి అవి మాట్లాడకపోవడం యూరప్‌కే కాదు, ప్రపంచానికే ప్రమాదం.
– కన్వల్ సిబాల్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి

మర్యాద



బాలాసాహెబ్ (బాల్ ఠాకరే) ఫొటోబయోగ్రఫీ మీద రాజ్ ఠాకరే పనిచేస్తున్నప్పుడు – అభివృద్ధి పనులను ప్రతిబింబించేట్టుగా ఒక ఫ్లై ఓవర్ ముందు బాలాసాహెబ్ ఫొటో కావాలనుకున్నారు. అయితే దాన్ని నితిన్ గడ్కరీ నిర్మించారు. ఆయన లేకుండా నేను ఫొటో దిగను అని బాలాసాహెబ్ అన్నారు. అలా ఈ ఫొటో వచ్చింది. (వాళ్లద్దరి ఫొటోను షేర్ చేశారు.)
– ప్రణవ్ జాధవ్, జర్నలిస్ట్

సాగిపోవాలి



ఎంపికలకు సంబంధించిన గందరగోళం మంచి, చెడుల మధ్య ఉండదు; మెరుగైనది, అత్యుత్తమమైనది మధ్య ఉంటుంది. మనం ఏది ఎంచుకున్నా ఇంకేదో మెరుగైనది ఉంటుంది. అందుకే అంతర్బుద్ధితో ఎంచుకోవాలి; ఒక్కసారి ఎంచుకున్నాక దాన్ని అంగీకరించాలి.
– శ్రీశ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక గురువు

అమ్మ అనడానికి ఇబ్బందా?



డచ్ (నెదర్లాండ్స్) ప్రభుత్వ అధికారులు సివిల్ రిజిస్ట్రీ నుంచి నిశ్శబ్దంగా 'అమ్మ' అనే మాటను తొలగించి, 'ఎవరికైతే శిశువు జన్మించిందో ఆ పేరెంట్' అని మార్చారు. ఈ పిచ్చికి అంతం లేదు.
– ఇవా వలార్డింగర్‌బ్రూక్, రైట్‌వింగ్ యాక్టివిస్ట్

అంతటా అంతే!



గురుగావ్‌కు డ్రైవ్ చేస్తూ పోవడం, రావడం (ఢిల్లీ నుంచి) నెమ్మదిగా మన జీవితాన్ని తగ్గిస్తుంది. మధ్యాహ్నం మూడింటికి కూడా హైవే మీద ప్రయాణించడం దుర్భరంగా ఉంటుంది.
– నిధి రజ్దాన్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ద్వంద్వ వైఖరి సరికాదు

జనవరి 5న రేషన్ బియ్యం కుంభకోణం గురించి టీఎమ్‌సీ నాయకుడు షేక్ షాజహాన్‌ను విచారించడానికి వెళ్లిన ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులను 2,000 మంది చుట్టుముట్టి తలలు పగలగొట్టారు. దీంతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సందేశ్‌ఖాలీ ప్రాంతం వార్తలకు ఎక్కింది. ఈ సందర్భంగా షేక్ షాజహాన్ అరాచకాలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు; అతనూ, అతని అనుయాయులూ స్త్రీలపై జరిపిన లైంగికదాడులూ ప్రపంచానికి తెలిశాయి. ఆ ప్రాంతంలోని నిమ్న వర్గాల మహిళలు గళం విప్పి, ఉద్యమం చేయడంతో ఈ సంఘటన చుట్టూ ఉన్న విషయాలన్నీ వెలుగు చూశాయి.

దేశంలో ఎక్కడైనా ఒక సంఘటన జరిగితే, నిమిషాల మీద అది బయట ప్రాంతాలకు వెళ్ళిపోతుంది. కానీ పశ్చిమ బెంగాల్లో వార్తా పత్రికలనూ, న్యూస్ ఛానెల్స్‌నూ దండోపాయాన్ని ఉపయోగించి మేనేజ్ చేయడం టీఎమ్‌సీ వాళ్లకు వెన్నతో పెట్టిన విద్య. టీఎంసీలో ఇప్పుడు ఉండే క్యాడర్ అంతా ఒకప్పుడు సీపీఎమ్‌లో ఉన్న కార్యకర్తలే. బెంగాలులో సీపీఎమ్ అధికారంలో ఉన్నప్పుడు ఎంత మంది కాంగ్రెస్ కార్యకర్తలు హత్య చేయబడ్డారో కాంగ్రెస్ నాయకులను అడిగితే చెబుతారు.

అనేక హత్యలు, కుంభకోణాలు మానభంగాలతో సంబంధం ఉన్న షేక్ షాజహాన్‌ను మమతా ప్రభుత్వం అరెస్టు చేయకుండా, 50 రోజులు మీనమేషాలు లెక్కించడం సరికాదు. కలకత్తా హైకోర్టు జోక్యంతో విధి లేని పరిస్థితులలో ఫిబ్రవరి 28న అరెస్టు చేసి మ్యాజిస్ట్రేట్ కస్టడీకి అప్పజెప్పడం జరిగింది. ఎన్నికల్లో లబ్ధి పొందడానికే టీఎమ్‌సీ నిందితుల అరెస్టుకు ఇంతవరకూ వెనుకాడిందనేది సుస్పష్టం.

మణిపూర్ జాతుల సంఘర్షణ విషయంలో దేశవ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, కేంద్ర పార్లమెంటులో నిరసనలు తెలిపిన ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులం అని చెప్పుకునేవారు సందేశ్‌ఖాలీలో స్త్రీలపై జరిగిన లైంగిక దాడులపై మౌనం వహించడం, అక్కడ మహిళలు నిర్వహించిన ఉద్యమానికి మద్దతు ఇవ్వకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.
– ఉల్లి బాల రంగయ్య; సామాజిక, రాజకీయ విశ్లేషకులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

నిజాయితీ నిబద్ధతల మేలు కలయిక

సందర్భం



డా॥ యలమంచిలి శివాజీ

ఇటీవల స్వర్గస్తులయిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ 1977–78 బ్యాచ్‌కి చెందినవారు. తొలిగా ప్రొబేషనరీ సబ్ కలెక్టరుగా తెనాలి వచ్చినప్పటి నుండి వారితో పరిచయం. 1987లో గుంటూరు జిల్లా కలెక్టరుగా వచ్చిన కొద్ది రోజులకే జిల్లా పరిషత్ అధ్యక్షురాలుగా ఉన్న దొడ్డపనేని ఇందిర అకాల మరణం చెందడంతో అక్కడ ఉప ఎన్నిక వచ్చింది. ఓట్ల లెక్కింపులో ఏదో బియ్యపు గింజలో వడ్ల గింజలాగా కొద్దిపాటి అవగాహనా లోపం! ఎన్టీఆర్‌కు ఫోన్ చేసి, యదార్థాలన్నింటినీ పూసగుచ్చి వివరించారు. అర్ధగంట సేపు దానితో కమ్ముకొన్న అనుమానాలన్నీ మబ్బుల్లాగా విడిపోయాయి.

1988 మార్చిలో నేను రాజ్యసభకు ఎన్నికయ్యాను. ప్రమాణ స్వీకారం చేయకముందే పత్తి రైతుల ఆత్మహత్యలపై రిజర్వు బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ పీడీ ఓజా అధ్వర్యంలో ఆంధ్రా బ్యాంక్ ఛైర్మన్, సిండికేట్ బ్యాంక్ ఛైర్మన్ లతో ఓ ఉన్నతాధికార సంఘం గుంటూరు, ప్రకాశం జిల్లాలలో పర్యటించింది. ఎంతో ఆశతో ప్రాణాలను కళ్లలో పెట్టుకొని, చింపిరి గుడ్డలతో భర్తలను కోల్పోయిన భార్యలూ, భార్యలను కోల్పోయిన భర్తలూ, తల్లిదండ్రులను పోగొట్టుకొన్న పిల్లలూ, తోబుట్టువులను కోల్పోయిన సోదరీ సోదరులూ ఎందరో తమ దీన గాథలను వెళ్లబోసుకొన్నారు. ఆ పర్యటన యావత్తూ జిల్లా కలెక్టర్లు జన్నత్ హుస్సేన్, జయప్రకాష్ నారాయణ్‌లు నిర్వహించారు. రైతుల రాయబారిగా నేను ప్రతి సమావేశంలోనూ, ప్రతి ఊరిలోనూ, రైతుల దీన గాథలను – పత్తిరైతుల గోసను వివరించాను. రాజ్యసభ సమావేశాలకు వెళ్లడంతోనే పై రెండు జిల్లాల కలెక్టర్లు తెల్ల దోమ, శెనగపచ్చ పురుగు నివారణకు అవసరమైన క్రిమిసంహారక మందులను దిగుమతి చేయాలనీ, వాటిపై దిగుమతి సుంకాలను రద్దు చేయాలనీ ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపారు. దానిని సాకారమయ్యేటట్లు చూడాలని నాకు ఫోన్ చేసి చెప్పారు. ఆ మేరకు కేంద్రంలో మంత్రులుగా ఉన్న నారాయణ్ దత్ తివారీ, దినేశ్ సింగ్, రామనివాస్ మీర్ధా, జలగం వెంగళరావు, భజన్‌లాల్ వంటి వారితోనే గాక సంబంధిత అధికారులతో గూడా చర్చించి, ఆ ప్రతిపాదనలు సాకారమయ్యేటట్లు అనుమతి తీసుకోవడం జరిగింది.

హుస్సేన్ కలెక్టరుగా ఉన్నన్ని రోజులూ, ఎంతో నిబద్ధతగా ఉన్నారు. మంత్రులెవరయినా అయినదానికీ, కాని దానికీ ఫోన్లు చేస్తే, కలెక్టరు గారు పనిలో ఉన్నారని చెప్పమనేవారు. ఉన్నట్టుండి 1988 మే లోనే బదలీ అయ్యారు. రాజ్యసభ సమావేశాలు అయినాక, గుంటూరు వచ్చి వారికి వీడ్కోలు చెబుదామని కలెక్టర్ బంగ్లాకు వెళ్లాను. కొత్త కలెక్టరు ఏపీవీఎస్ శర్మకి ఛార్జి అప్పజెబుతున్నారని చెబితే, కలెక్టరాఫీసుకు వెళ్లాను. 'శివాజీ గారూ, నేనూ చిరకాల మిత్రులం. అయితే వారు మన దగ్గరకు రారు – మనమే వారి వద్దకు వెళ్లాలి' అని శర్మగారికి పరిచయం చేశారు.



జన్నత్ హుస్సేన్

చరిత్రాత్మక పొగాకు రైతుల 'క్రాప్ హాలిడే' పోరాట సమయంలో, జన్నత్ వ్యవసాయ శాఖకు ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. పొగాకు రైతుల ప్రతినిధి బృందంతో పాటు, కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వారితో చర్చలు జరిపేందుకు, జన్నత్‌ను కూడా ఢిల్లీ పంపారు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. అక్కడ ఢిల్లీలో ఈ ప్రతినిధి బృందానికి అవసరమయిన భోజన, వసతి సౌకర్యాలు సరిపడా అందినవా, లేదా అని పరిపరి విధాల శ్రద్ధ తీసుకొనేవారు జన్నత్.


2007లో రైతులకిచ్చిన రుణాలను రద్దు చేయాలని ఒక సవివరమైన నివేదికను రూపొందించి, కేంద్ర ప్రభుత్వానికి అందజేశాను. ఆ ప్రతిపాదనకు 2008–09 వార్షిక బడ్జెట్‌లో ప్రకటించడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది కేంద్రం. ఆ సందర్భంలో 2008 జనవరిలో ముఖ్య మంత్రి రాజశేఖర రెడ్డిని కలిసి వివరించి, మాట సాయం చేయమని విజ్ఞప్తి చేశాను. వెంటనే ఆయన కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్‌పవార్‌కు ఫోన్ చేసి శివాజీ ప్రతిపాదన ఎంతవరకు వచ్చిందని అడిగారు. 'ఇప్పుడే విత్త మంత్రి చిదంబరంతో చర్చించి వస్తున్నాను. బడ్జెట్‌లో ఇది చోటు చేసుకుంటున్నద'ని జవాబిచ్చారు. ఇది తెలిసిన కొందరు అధికారపక్షం పెద్దలు, మంత్రులు దాని బదులు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తే బాగుంటుందని ముఖ్యమంత్రికి సలహా ఇచ్చారు. దానిపై ముఖ్య మంత్రి వైఎస్ఆర్ జన్నత్‌తో సంప్రదిస్తే – 'శివాజీ ఈ సమస్యను కడవరకూ తీసుకెళ్లాడు. ఈ తరుణంలో మనం దీనికి మెలిక వేస్తే, కేంద్రానికి మరో విధంగా సంకేతాలు వెడతాయ'ని జన్నత్ ముఖ్య మంత్రికి సలహా ఇచ్చి ఒప్పించారు.

ఉత్తరప్రదేశ్‌లో సిద్ధార్థనగర్ జిల్లాలో జన్మించిన జన్నత్‌కు చదువుకొనే రోజుల నుండి ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌తో స్నేహం. ప్రస్తుతం కేరళ గవర్నరుగా ఉన్న ఆరిఫ్... చరణ్‌సింగ్‌కు అనుయాయి. ఆ ప్రభావం కొంతవరకూ జన్నత్ మీద కూడా ఉన్నది. దైవభక్తి, పాపభీతి మెండుగా ఉన్న జన్నత్ ఎంతో నిజాయతీతో, నిబద్ధతతో తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించిచారు. ఆయన లేని లోటు మాబోటి వారికి తీరనిది.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ సభ్యులు | 98663 76735

అరుణగిరీశుని కరుణ

ఈశ్వర కృపకు పాత్రులవటానికి ముందు ఎన్నో పరీక్షలు ఎదుర్కోవాలి. చివరికి నిరాశా, నిస్పృహ లతో మరణపుటంచులకు కూడా వెళ్ళవలసి వస్తుంది. బతుకు మీద ఆశ నశిస్తుంది. నశిస్తున్న ఆశనూ, మోడు బారిన జీవితాన్నీ చిగురింప చేసేవాడు ఈశ్వరుడు. ఆయన కరుణ అపారం, అనంతం.



ఒక పేదవానికి రెండు కాళ్ళు చచ్చుబడిపోయాయి. సంపాదనా మార్గం లేక కన్నవారికే గుదిబండగా తోచాడు. అయిన వారి నుంచి ప్రతిక్షణం అవమానాలే! బతుకు భారమైంది. నిరాశ ఆవరించింది. ఒకరోజు ఎవరికీ చెప్పకుండా కర్రల సాయంతో కుంటుకుంటూ గిరి ప్రదక్షిణ మార్గంలో పోయి ప్రాణత్యాగం చేద్దామనుకున్నాడు.

నిరంతరం ఎదుర్కొన్న అవమానాల తలపులు అతని మరణ నిశ్చయాన్ని మరింత దృఢతరం చేస్తున్నాయి. అంతలో అతనికి ఎదురుగా ఒక సాధువు వచ్చాడు. ఊహించని విధంగా కుంటివానికి ఊతమిచ్చే కర్రలను 'ఈ ఆభరణాలు కూడానా నీకు' అంటూ లాగి దూరంగా విసిరేశాడు. అంతవరకూ అతను ఎదుర్కొన్న అవమానాల పరంపరకు ఇది పరాకాష్ట. కుంటివాడు అసహనంతో ఊగిపోయాడు. సాధువు పైకి ఒక్కసారిగా లంఘించాడు. తనకు కాళ్ళు పనిచెయ్యవని మర్చిపోయాడు. కాని, సాధువు అదృశ్యమయ్యాడు. కుంటివానికి ఆశ్చర్యం! తాను నడవగలుగుతున్నాడు. తన కాళ్ళు చక్కగా ఉన్నాయి. కానీ, సాధువేడీ! ఆనంద, సంభ్రమాలతో పరుగు పెట్టాడు. భక్తితో గిరి ప్రదక్షిణ చేశాడు. అవమానాలు చేసిన వారి చేతే గౌరవాలు పొందాడు. అరుణగిరి నాథుని కరుణకు సాక్షిగా నిలిచాడు.

పరమేశ్వరుని కరుణకు సాటి మరేదీ లేదు. నమ్మకంతో జీవనం కొనసాగిస్తే, ఈశ్వర కృప, ప్రేమ ఏ రోజు ఏ విధంగా ప్రసరిస్తుందో, జీవితాన్ని ఎటువంటి మలుపులు తిప్పుతుందో, ఊహించని గొప్ప మార్పులు తెస్తుందో చూస్తే ఆధ్యాత్మిక అనుభూతిని, స్ఫూర్తిని పొందకుండా ఉండలేము.
– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.ఏకాదశి రా.12.13 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.10.47 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: సా.6.29 నుండి 8.01 వరకు, దుర్ముహూర్తం: ప.11.48 నుండి 12.36 వరకు, అమృత ఘడియలు: ఉ.6.08 నుండి 7.42 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.20, సూర్యాస్తమయం: 6.03.

సాక్షి బిజినెస్
బుధవారం
6-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	195	73,677
నిఫ్టీ ▽	49	22,356

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,957	▽	250
డోజోన్స్	38,725	▽	264
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,649	△	9
డాక్స్	17,735	△	20
షాంఘై	3,047	△	8
నికాయ్	40,098	▽	12

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	64,598 △	1,118
బంగారం (99.5 స్వచ్ఛత)	64,339 △	1,113
వెండి (కేజీ)	72,244 △	1,467

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.50	83.52
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.04	106.61
€	యూరో	ఎస్‌బీఐ	88.91	91.27
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.64	55.88
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.02	54.96
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.37	64.05
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.20	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.67	23.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.47



ఒకసారి చార్జింగ్‌తో 650 కిలోమీటర్లు

- భారత్‌లో బీవైడీ సీల్ ఎలక్ట్రిక్ సెడాన్
- ఎక్స్‌షోరూం ధర రూ.41–53 లక్షలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఉన్న చైనా దిగ్గజం బీవైడీ.. భారత్‌లో సీల్ ఎలక్ట్రిక్ సెడాన్‌ను మూడు వేరియంట్లలో ఆవిష్కరించింది. ధర రూ.41 లక్షలతో ప్రారంభమై రూ.53 లక్షల వరకు ఉంది. ఒకసారి చార్జింగ్‌తో వేరియంట్‌నుబట్టి ఈ కారు 510–650 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 3.8 సెకన్లలో అందుకుంటుంది. 15.6 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, హెడ్-అప్ డిస్‌ప్లే వంటి హంగులు ఉన్నాయి. ప్రపంచంలో తొలిసారిగా సెల్ టు బాడీ, ఇంటెలిజెంట్ టార్క్ అడాప్షన్ కంట్రోల్ సాంకేతికతలతో రూపుదిద్దుకుందని కంపెనీ తెలిపింది. అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్‌ను పొందుపరిచారు. 4.8 మీటర్ల పొడవు ఉంది. పూర్తిగా తయారైన కారును చైనా నుంచి భారత్‌కు దిగుమతి చేస్తారు. ఇప్పటికే బీవైడీ భారత్‌లో ఈవీ6 ఎలక్ట్రిక్ ఎంపీవీ, ఆటో3 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని విక్రయిస్తోంది. రూ.30 లక్షలకుపైగా ఖరీదు చేసే లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో భారత్‌లో తాము నాయకత్వ స్థానంలో ఉన్నామని బీవైడీ ఇండియా ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వెహికల్ బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ గోపాలకృష్ణన్ తెలిపారు.

అతిజాగ్రత్తతో వృద్ధికి ఆటంకం

- రెగ్యులేటర్లు మరీ సంప్రదాయకంగా ఉండకూడదు
- కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్



న్యూఢిల్లీ: నియంత్రణ సంస్థలు జాగ్రత్త చర్యలు అతిగా అమలు చేస్తే ఆర్థిక వృద్ధికి ఆటంకం కలుగుతుందని కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ వ్యాఖ్యానించారు. రెగ్యులేటర్లు మరీ సంప్రదాయకంగా, అతిజాగ్రత్తగా వ్యవహరించకూడదన్నారు. అయితే, ఏ రంగంలోనైనా 'ప్రమాదాలు' చోటు చేసుకుంటే సత్వరం స్పందించే విధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్‌ఎఫ్ఆర్ఏ) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కోటక్ ఈ విషయాలు తెలిపారు. 'భారత్ భవిష్యత్తుపై నేను అత్యంత ఆశావహంగా ఉన్నాను. అదే సమయంలో తగిన జాగ్రత్త లేకుండా కేవలం అవకాశాలపైనే పూర్తిగా దృష్టి పెట్టి ముందుకెళ్లడమనేది రిస్కుతో కూడుకున్న వ్యవహారం. అలాగని, మరీ అతిగా జాగ్రత్త చర్యలు తీసుకుంటే మనం అక్కడికి (సంపన్న దేశం కావాలన్న లక్ష్యానికి) చేరుకోలేం' అని ఆయన పేర్కొన్నారు. వచ్చే 20–25 ఏళ్ల పాటు 7.5–8 శాతం జీడీపీ వృద్ధి రేటును కొనసాగించాలంటే సామర్థ్యాలను గణనీయంగా పెంచుకోవాల్సిన అవసరం ఉంటుందని కోటక్ చెప్పారు.

ఫిబ్రవరిలో నెమ్మదించిన సేవలు

న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం ఫిబ్రవరిలో నెమ్మదించాయి. జనవరిలో 61.8 వద్ద ఉన్న హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఫిబ్రవరిలో 60.6కు తగ్గింది. వ్యాపార క్రియాశీలత, అమ్మకాలు, ఉపాధి అవకాశాలు మందగించడం తాజా పరిస్థితికి కారణం. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే పరిగణించడం జరుగుతుంది. 50కన్నా దిగువన నమోదయితేనే క్షీణతగా భావిస్తారు. మరోవైపు సేవలు–తయారీలతో కూడిన కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ జనవరి ఆరు నెలల గరిష్టస్థాయి 61.2 నుంచి ఫిబ్రవరిలో 60.6కు పడిపోయింది.



నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

ప్రపంచ పరిణామాలపై అప్రమత్తత



ముంబై: దేశీయ స్టాక్ సూచీల నాలుగు రోజుల వరుస లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలూ ఇందుకు కారణమయ్యాయి. అమెరికా ఉద్యోగ గణాంకాలు, ఫెడ్ చైర్మన్ సెనెట్ ప్రసంగం వంటి ప్రపంచ పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. తీవ్ర ఒడిదుడుకుల నేపథ్యంలో సెన్సెక్స్ 195 పాయింట్లు నష్టపోయి 73,677 వద్ద స్థిరపడింది. ఒక దశలో 460 పాయింట్లు క్షీణించి 73,412 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ 49 పాయింట్లు నష్టపోయి 22,356 వద్ద నిలిచింది.

- ప్లాటినం ఇండస్ట్రీస్ బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.171)తో పోలిస్తే భారీగా 33% ప్రీమియంతో రూ.228 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 39% ఎగసి రూ.237 గరిష్టాన్ని తాకింది. చివరికి 29% పెరిగి రూ.221 వద్ద ముగిసింది.
- ఎక్సికం టెలి-సిస్టమ్స్ లిస్టింగ్ రోజే భారీ లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.142)తో పోలిస్తే 86% ప్రీమియంతో రూ.264 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 93% దూసుకెళ్లి రూ.274 వద్ద గరిష్టాన్ని తాకింది. చివర్లో 59% లాభంతో రూ.226 వద్ద స్థిరపడింది.

ఐపీఓకి బిగ్‌బాస్కెట్!



టాటా గ్రూప్ ఆన్‌లైన్ గ్రోసరీస్ సంస్థ బిగ్‌బాస్కెట్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2024–25)లో పబ్లిక్ ఇష్యూ చేపట్టాలని యోచిస్తోంది. అయితే అంతకంటే ముందుగానే కంపెనీ లాభాల బాటలోకి ప్రవేశించనున్నట్లు బిగ్‌బాస్కెట్ సహవ్యవస్థాపకుడు, సీఈవో హరి మీనన్ పేర్కొన్నారు. టాటా డిజిటల్‌లో భాగమైన కంపెనీ రానున్న 6–8 నెలల్లో టర్న్‌అరౌండ్ కానున్నట్లు అభిప్రాయపడ్డారు.

డీలిస్ట్ చేసిన యాప్‌లు మళ్లీ ప్లేస్టోర్‌లోకి..

కేంద్రం జోక్యంతో సమస్య పరిష్కారం!

న్యూఢిల్లీ: బిల్లింగ్ వివాదంతో డీలిస్ట్ చేసిన దాదాపు 250 భారతీయ యాప్‌లను గూగుల్ తమ ప్లేస్టోర్‌లో పునరుద్ధరించే ప్రక్రియను ప్రారంభించింది. గూగుల్, స్టార్టప్ సంస్థల మధ్య సయోధ్య కుదిర్చేందుకు కేంద్ర టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఇరు పక్షాలతో సమావేశమైన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే డీలిస్ట్ చేసిన యాప్‌లను ప్లేస్టోర్ లో తిరిగి అనుమతించినప్పటికీ సదరు సంస్థలతో 3–4 నెల ల పాటు చర్చించే సమయంలో కూడా ఇన్- యాప్ పేమెంట్స్‌పై గూగుల్ 11–26 శాతం సర్వీసు ఫీజు విధించడాన్ని కొనసాగిస్తుందని సమాచారం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-3-2024	
విశాఖ	500–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463–00
విజయవాడ	463–00
రిటైల్ ధర (డజను)	72.00
5-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	469–00
వరంగల్	471–00
రిటైల్ ధర	5.30

రైల్వేస్టేషన్లలో స్విగ్గీ ఫుడ్ డెలివరీ

- మార్చి 12 నుంచి వైజాగ్, విజయవాడసహా 4 స్టేషన్లలో సర్వీసులు

న్యూఢిల్లీ: రైలు ప్రయాణికులకు రైల్వే స్టేషన్లలో ఫుడ్ డెలివరీ సర్వీసులు అందించే దిశగా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)తో స్విగ్గీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం మార్చి 12 నుంచి వైజాగ్, విజయవాడతో పాటు నాలుగు స్టేషన్లలో (బెంగళూరు, భువనేశ్వర్) ఈ సర్వీసులు ప్రారంభించనున్నట్లు సంస్థ తెలిపింది. రాబోయే వారాల్లో వీటిని మరో 59 స్టేషన్లకు విస్తరించనున్నట్లు స్విగ్గీ సీఈవో రోహిత్ కపూర్ పేర్కొన్నారు.

మోసపూరిత కాల్స్‌పై ఫిర్యాదుకు చక్షు



- కీలక సేవలను ప్రారంభించిన టెలికం

న్యూఢిల్లీ: మోసపూరిత కాల్స్, లాటరీ ఆఫర్లు, ఉద్యోగ ఆఫర్ల వంటి అనుమానిత సందేశాలను నివేదించడానికి కేంద్ర టెలికం శాఖ చక్షు సేవలను ప్రారంభించింది. సంచార్‌సాథి పోర్టల్‌లో ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కాల్, ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా సైబర్ నేరం, ఆర్థిక మోసాలు, వంచన, ఏదైనా ఇతర దుర్వినియోగం వంటి ప్రయోజనం కోసం కేవైసీ, లోన్/జాబ్/ఆన్‌లైన్ లాటరీ ఆఫర్, ఫేక్ కస్టమర్ కేర్ హెల్ప్‌లైన్, అనుమానిత లింక్స్, ఆటోమేటెడ్ కమ్యూనికేషన్ వంటివి ఏవి అందుకున్నా చక్షు ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్ సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ: భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా జీమెయిల్, యూట్యూబ్‌తో పాటు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ల సర్వీసులకు మంగళవారం అంతరాయం కలిగింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 9 గంటలకు గూగుల్, మెటా యాప్స్ సర్వీసుల్లో అంతరాయం గురించి ఫిర్యాదులు వచ్చినట్లు సోషల్ మీడియా నెట్‌వర్క్ ఔటేజ్ ట్రాకర్ ప్లాట్‌ఫాం డౌన్ డిటెక్టర్ వెల్లడించింది.

మరోవైపు, తోటి సోషల్ నెట్‌వర్క్ సైట్లలో అంతరాయాలను వెక్కిరిస్తూ ఎక్స్ చీఫ్ ఎలాన్ మస్క్ స్పందించారు. 'మీరు (యూజర్లు) ఈ పోస్టును చదువుతున్నారంటే మా సర్వర్లు పక్కాగా పని చేస్తున్నాయని అర్థం' అంటూ పోస్ట్ చేశారు.

జేఎం ఫైనాన్షియల్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు

- రుణాల విడుదలకు చెక్

ముంబై: ప్రైవేట్ రంగ సంస్థ జేఎం ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్‌పై ఆర్‌బీఐ వెనువెంటనే అమల్లోకి వచ్చేవిధంగా ఆంక్షలు విధించింది. షేర్లు, డిబెంచర్లుసహా ఐపీవోలకు రుణాలు విడుదల చేయవద్దంటూ ఆదేశించింది. అయితే ప్రస్తుత రుణ ఖాతాలను కొనసాగించేందుకు అనుమతించింది. యథావిధిగా రుణ వసూళ్లు, రికవరీలను నిర్వహించుకోవచ్చని తెలియజేసింది. డిబెంచర్ల సబ్‌స్క్రిప్షన్‌కు సైతం తాజా ఆదేశాలు వర్తించనున్నాయి. ఎన్‌సీడీ సబ్‌స్క్రిప్షన్లు, ఐపీవో ఫైనాన్సింగ్‌లలో నిబంధనల ఉల్లంఘనలు.. కంపెనీపై తాజా చర్యలకు నేపథ్యం.

జాబ్ పాయింట్

ఎయిమ్స్‌లో-నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

ఎయిమ్స్ న్యూఢిల్లీ.. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్(నార్‌సెట్)–6 నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **ఎయిమ్స్ సంస్థలు:** ఎయిమ్స్ భటిండా, ఎయిమ్స్ భువనేశ్వర్, ఎయిమ్స్ బిలాస్‌పూర్, ఎయిమ్స్ డియోఘర్, ఎయిమ్స్ గోరఖ్‌పూర్, ఎయిమ్స్ గువాహటి, ఎయిమ్స్ కళ్యాణి, ఎయిమ్స్ మంగళగిరి, ఎయిమ్స్ నాగ్‌పూర్, ఎయిమ్స్ రాయ్ బరేలీ, ఎయిమ్స్ న్యూఢిల్లీ, ఎయిమ్స్ పాట్నా, ఎయిమ్స్ రాయ్‌పూర్, ఎయిమ్స్ విజయ్‌పూర్.
» **అర్హత:** గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ లేదా యూనివర్శిటీ నుంచి బీఎస్సీ(హానర్స్) నర్సింగ్/ బీఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ(పోస్ట్ సర్టిఫికేట్)/బేసిక్ బీఎస్సీ నర్సింగ్ తదితర ఉత్తీర్ణత ఉండాలి. స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ లేదా రాష్ట్రంలో నర్సులు, మిడ్‌వైఫ్‌లుగా రిజిస్టర్ అయి ఉండాలి. **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** రూ.9300 నుంచి రూ.34,800+ గ్రేడ్ పే రూ.4600.
» **పరీక్ష విధానం:** నార్‌సెట్ పరీక్ష రెండు దశలలో జరుగుతుంది. అవి..ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ పరీక్ష. వీటి ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.03.2024.
» **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

ఎస్ఎస్‌సీ-కేంద్ర ప్రభుత్వ శాఖల్లో వివిధ ఉద్యోగాలు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి పరీక్ష నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 2049
» **ఖాళీలున్న విభాగాలు:** ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, సెంట్రల్ వాటర్ కమిషన్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ మినిస్ట్రీ, హోం అఫైర్స్ మినిస్ట్రీ, డిఫెన్స్ మినిస్ట్రీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్, సెంట్రల్ ట్రాన్స్‌లేషన్ బ్యూరో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 27 ఏళ్లు ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోసడలింపు లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్–టైపింగ్/డేటా ఎంట్రీ/కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(సంబంధిత పోస్టులకు మాత్రమే), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. 100 ప్రశ్నలు- 200 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. పరీక్షా సమయం 60 నిమిషాలు. జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు –50 మార్కులకు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(బేసిక్ అర్థమెటిక్ స్కిల్స్) 25 ప్రశ్నలు–50 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్(బేసిక్ నాలెడ్జ్) సబ్జెక్ట్‌లకు 25 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.50 మార్కుల నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.03.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 22.03.2024 నుంచి 24.03.2024.
» **పరీక్ష తేది:** 06.05.2024 నుంచి 08.05.2024 వరకు
» **వెబ్‌సైట్:** https://ssc.gov.in

సెయిల్, న్యూఢిల్లీలో 314 ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్).. వివిధ విభాగాల్లో ఆపరేటర్-కమ్-టెక్నీషియన్(ట్రైనీ)-(ఓసీటీటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 314
» **పోస్టుల వివరాలు:** ఓసీటీటీ-మెటలర్జీ–57, ఓసీటీటీ-ఎలక్ట్రికల్–64, ఓసీటీటీ-మెకానికల్–100, ఓసీటీటీ-ఇన్‌స్ట్రుమెంటేషన్–17, ఓసీటీటీ-సివిల్–22, ఓసీటీటీ-కెమికల్–18, ఓసీటీటీ-సెరామిక్–06, ఓసీటీటీ-ఎలక్ట్రానిక్స్–08, ఓసీటీటీ-కంప్యూటర్/ఐటీ(మైన్స్‌లో మాత్రమే)–20, ఓసీటీటీ-డ్రాఫ్ట్స్‌మ్యాన్–2.
» **అర్హత:** పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణతతోపాటు మెటలర్జీ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్, కెమికల్, సిరామిక్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాలకు సంబంధించి ఏదో ఒక దానిలో ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఓసీటీటీ-డ్రాఫ్ట్స్‌మ్యాన్ పోస్టుకు ఏడాదిపాటు డ్రాఫ్ట్స్‌మ్యాన్/డిజైనర్‌గా పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **పరీక్ష కేంద్రాలు:** దేశంలోని ప్రధాన నగరాల్లో ఉంటుంది.
» **దరఖాస్తులకు చివరితేది:** 18.03.2024.
» **వెబ్‌సైట్:** www.sail.co.in

గ్రూప్-1కు.. ఇలా గురి!

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1.. రాష్ట్రంలోని లక్షల మంది అభ్యర్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నోటిఫికేషన్! ఇటీవల గత నోటిఫికేషన్‌ను రద్దు చేసిన టీఎస్‌పీఎస్సీ.. 563 పోస్టులతో కొత్తగా గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో రెండుసార్లు ప్రిలిమ్స్‌కు హాజరైన వారు సైతం తప్పనిసరిగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ స్పష్టం చేసింది. గతంలో మాదిరిగానే రెండంచెల(ప్రిలిమ్స్, మెయిన్స్) రాత పరీక్షల విధానం ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. జూన్ 9వ తేదీన ప్రిలిమ్స్ పరీక్ష జరుగనుంది. ఈ నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 తాజా నోటిఫికేషన్
» మొత్తం 563 పోస్ట్‌ల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» జూన్ 9న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ
» విశ్లేషణాత్మక అధ్యయనమే విజయానికి మార్గం

గత గ్రూప్-1 నోటిఫికేషన్‌తో పోల్చుకుంటే.. తాజా నోటిఫికేషన్‌లో పోస్ట్‌ల సంఖ్య పెరగడం అభ్యర్థులకు కలిసొచ్చే అంశమని చెప్పొచ్చు. గత నోటిఫికేషన్‌లో 503 పోస్ట్‌లను పేర్కొనగా.. తాజా నోటిఫికేషన్‌లో మొత్తం 563 పోస్ట్‌లను ప్రకటించారు. అంటే.. 60 పోస్ట్‌లు పెరిగాయి.

అర్హతలు

- ఫిబ్రవరి 19, 2024 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్/అసిస్టెంట్ లెక్చరర్ ఇన్ ట్రెయినింగ్ కాలేజ్ అండ్ స్కూల్(ట్రెజరీ అండ్ అకౌంట్స్ సర్వీస్) పోస్ట్‌లకు కామర్స్/ మ్యాథమెటిక్స్/ఎకనామిక్స్ సబ్జెక్ట్‌తో కనీసం ద్వితీయ శ్రేణిలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. అదేవిధంగా ఆర్‌టీఓ పోస్టులకు మెకానికల్ ఇంజనీరింగ్/ఆటోమొబైల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి.

వయసు

- జూలై 1, 2024 నాటికి 18–46 ఏళ్లు ఉండాలి(డీఎస్పీ/అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్ట్‌లకు 21–35 ఏళ్లు; ఆర్‌టీఓ పోస్ట్‌లకు 21–46 ఏళ్లు; డీఎస్పీ–జైల్స్ పోస్ట్‌లకు 18–35 ఏళ్లు). రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలకు అనుగుణంగా గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల రాత పరీక్ష

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు దశల్లో రాత పరీక్షలు నిర్వహిస్తారు. అవి ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్.

ప్రిలిమినరీ పరీక్ష

గ్రూప్–1 సర్వీసుల ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో ఒకే పేపర్‌గా నిర్వహిస్తారు. జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ పేరిట ఈ పరీక్ష ఉంటుంది. మొత్తం 150 ప్రశ్నలతో–150 మార్కులకు ప్రిలిమ్స్ నిర్వహిస్తారు. పరీక్షకు అందుబాటులో ఉండే సమయం రెండున్నర గంటలు.

900 మార్కులకు మెయిన్స్

గ్రూప్–1 మెయిన్ ఎగ్జామినేషన్ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఆరు పేపర్లుగా 900 మార్కులకు నిర్వహించనున్నారు. దీంతోపాటు.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ పేపర్ కూడా ఉంటుంది. ఈ పేపర్‌ను కేవలం అర్హత పరీక్షగానే నిర్దేశించారు. జనరల్ ఇంగ్లిష్ (క్వాలిఫయింగ్ టెస్ట్) 150 మార్కులకు ఉంటుంది. పేపర్ 1లో జనరల్ ఎస్సే 150 మార్కులకు; పేపర్ 2లో హిస్టరీ, కల్చర్–జాగ్రఫీ 150 మార్కులకు; పేపర్–3లో ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం, పరిపాలన 150 మార్కులకు; పేపర్–4లో ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ 150 మార్కులకు; పేపర్ 5లో సైన్స్–టెక్నాలజీ–డేటా ఇంటర్‌ప్రిటేషన్ 150 మార్కులకు; పేపర్–6లో తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం 150 మార్కులకు ఉంటాయి.

సిలబస్‌పై అవగాహన

ప్రిపరేషన్‌ను ప్రారంభించే ముందు అభ్యర్థులు సిలబస్‌ను పూర్తిగా ఆకళింపు చేసుకోవాలి. ప్రిలిమినరీ పరీక్షలో పేర్కొన్న అన్ని అంశాలకు సంబంధించి నిర్దేశించిన సిలబస్‌ను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. దాని ఆధారంగా చదవాల్సిన ముఖ్యమైన అంశాలపై స్పష్టత ఏర్పరచుకోవాలి. ప్రిపరేషన్‌లో ఏ అంశానికి ఎంత సమయం కేటాయించుకోవాలో నిర్ణయించుకోవాలి. అదే విధంగా టీఎస్‌పీఎస్సీ ఇటీవల కాలంలో నిర్వహించిన ఇతర నియామక పరీక్షల జనరల్ స్టడీస్ పేపర్లను పరిశీలించడం కూడా మేలు చేస్తుంది.

సమయ పాలన

గ్రూప్–1 అభ్యర్థులు ప్రిపరేషన్‌లో సమయ పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9న నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. అంటే.. గరిష్ఠంగా మూడు నెలల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయంలో ప్రతిరోజు ప్రతి సబ్జెక్ట్ చదివేలా సమయ పాలన పాటించాలి. ప్రిలిమినరీ సిలబస్‌లో మొత్తం 13 అంశాలను పేర్కొన్నారు. వీటిలో కొన్నింటిని ఉమ్మడిగా అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. మొత్తంగా ప్రతి రోజు సగటున 8 నుంచి 10 గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి.



టీఎస్‌పీఎస్సీ ఎగ్జామ్స్

లోకల్ టు ఇంటర్నేషనల్

అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో అంతర్జాతీయ పరిణామాలు మొదలు.. స్థానిక అంశాల వరకు అన్నింటిపైనా దృష్టిపెట్టాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంత ప్రాధాన్యమున్న అంశాలను ఔపోసన పట్టాలి. తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలి ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ చరిత్రలో తెలంగాణ సామాజిక ముఖ చిత్రాన్ని తెలియజేసే అన్ని అంశాలను చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం, వనరులు, ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ఏర్పాటు తర్వాత అమలు చేస్తున్న కొత్త పథకాలు.. ఇలా అన్నింటిపైనా అవగాహన పెంచుకోవాలి.

ప్రభుత్వ విధానాలు

జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు; వాటిపై ప్రభుత్వాలు చేసిన విధానాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. ఇందులో మహిళా సాధికారత వంటివి ముఖ్యమైనవి. మహిళల సాధికారత కోసం జాతీయస్థాయిలో రకరకాల పథకాలు తెచ్చారు. మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, ఎస్సీ/ఎస్టీలు, బాలలు, వృద్ధులు, గిరిజన సంక్షేమం కోసం విధానాలు తెచ్చారు. అదే విధంగా పలు నూతన పాలసీలు రూపొందుతున్నాయి. వాటి గురించి కూలంకషంగా అధ్యయనం చేయాలి. ఉదాహరణకు..నూతన విద్యా విధానం..ఇప్పటి వరకు తీసుకొచ్చిన విద్యా విధానాలు,ప్రస్తుత విధానానికి వాటికి మధ్య ఉన్న వ్యత్యాసం,ఉద్దేశం, లక్ష్యాలు ఇలా అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి.

తెలంగాణపై ప్రత్యేక దృష్టి

తెలంగాణ ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న అంశాల నుంచి పరీక్షలో ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు ముందుగా తెలంగాణ పాలసీలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా తెలంగాణ ఏర్పాటు.. దానికి సంబంధించి ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్న నీళ్లు.. నిధులు.. నియామకాలు.. వంటి అంశాలపై ఎలాంటి విధానాలు తెచ్చారన్నది తెలుసుకోవాలి. అదే విధంగా రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన విధానాలపై అవగాహన పెంచుకోవాలి.

సొసైటీకి ఇలా

భారతీయ సమాజం, తెలంగాణ సమాజంలో ప్రత్యేక అంశాలు (వెట్టి, జోగిని వంటివి), సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆయా వర్గాల నిర్వచనంతోపాటు వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటినీ చదవాలి. అప్పుడే ఆయా అంశాలపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది.

డిస్క్రిప్టివ్ విధానం

డిస్క్రిప్టివ్ విధానంలో ప్రిపరేషన్ సాగిస్తే.. ఆయా అంశాలపై అన్ని కోణాల్లో సమగ్ర అవగాహన పెంచుకునేందుకు వీలుంటుంది. ఫలితంగా ప్రశ్న ఎలా అడిగినా జవాబు గుర్తించగలుగుతారు. ఇది భవిష్యత్తులో మలి దశలో ఉండే మెయిన్ పరీక్షకు కూడా ఉపయుక్తంగా నిలుస్తుంది. ఎంపిక చేసుకున్న ప్రామాణిక పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి.

మెయిన్స్‌తో అనుసంధానం

గ్రూప్–1 అభ్యర్థుల్లో చాలా మందిలో నెలకొనే సందేహం.. ప్రిలిమ్స్‌తోపాటు మెయిన్స్‌కు చదివే వీలుందా? అనేది. ప్రస్తుత సిలబస్ అంశాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ అవకాశం ఉందనే చెప్పాలి. మెయిన్స్ డిస్క్రిప్టివ్ విధానంలో, ప్రిలిమ్స్ ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు మెయిన్స్, ప్రిలిమ్స్ అంశాల సిలబస్‌ను బేరీజు వేసుకుని.. డిస్క్రిప్టివ్ విధానంలో చదివే నేర్పు సొంతం చేసుకుంటే ఒకే సమయంలో రెండింటికీ సన్నద్ధత లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2024, మార్చి14
- **దరఖాస్తుల సవరణ అవకాశం:** మార్చి 23 – మార్చి 27
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** పరీక్షకు వారం రోజుల ముందు నుంచి
- **ప్రిలిమినరీ పరీక్ష:** 2024, జూన్ 9
- **మెయిన్ ఎగ్జామినేషన్:** సెప్టెంబర్/అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.tspsc.gov.in



మెయిన్ 'డ్రా'కు గెలుపు దూరంలో...

ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ మెయిన్ 'డ్రా'కు విజయం దూరంలో నిలిచాడు. కాలిఫోర్నియాలో జరుగుతున్న ఈ టోర్నీలో క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 101వ ర్యాంకర్ సుమిత్ 6–2, 6–2తో ప్రపంచ 580వ ర్యాంకర్ స్టెఫాన్ డొస్టానిక్ (అమెరికా)పై గెలిచాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో కొరియా ప్లేయర్ సియోంగ్‌చన్ హాంగ్‌తో సుమిత్ తలపడతాడు.



నాలుగో బాక్సర్ కూడా తొలి రౌండ్‌లోనే...

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్ల పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ఇప్పటికే దీపక్, నరేందర్, జాస్మిన్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టగా... తాజాగా వీరి సరసన మరో భారత బాక్సర్ లక్ష్య చహర్ కూడా చేరాడు. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల 80 కేజీల విభాగం తొలి రౌండ్ బౌట్‌లో ఇరాన్ బాక్సర్ గెష్‌లగి మేసమ్ భారత జాతీయ చాంపియన్ లక్ష్య చహర్‌ను నాకౌట్ చేశాడు.

ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి–ట్రెసా ద్వయం 16–21, 21–19, 21–17తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ 21–13, 24–22తో ఒంగ్ యె సిన్–తియో ఈ యి (మలేసియా) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో లక్ష్య సేన్ (భారత్) 15–21, 21–15, 21–3తో కాంటా సునెయామా (జపాన్)పై నెగ్గగా... ప్రియాన్షు రజావత్ (భారత్) 8–21, 15–21తో ప్రపంచ నంబర్ వన్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయాడు.

షహబాజ్ నదీమ్ వీడ్కోలు



కోల్‌కతా: భారత్ తరఫున రెండు టెస్టులు ఆడిన జార్ఖండ్ లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ నదీమ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 34 ఏళ్ల నదీమ్ 2019లో దక్షిణాఫ్రికాపై రాంచీలో తొలి టెస్టు... 2021లో ఇంగ్లండ్‌పై చెన్నైలో రెండో టెస్టు ఆడి ఎనిమిది వికెట్లు తీశాడు. 'భవిష్యత్‌లో భారత జట్టుకు ఆడే అవకాశాల్లేవని తెలుసుకున్నాను. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నాను. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న టి20 ఫ్రాంచైజీ లీగ్‌లో నా అదృష్టాన్ని పరీక్షించుకుంటాను' అని షహబాజ్ తెలిపాడు. దేశవాళీ క్రికెట్‌లో బిహార్, జార్ఖండ్ జట్లకు ప్రాతినిధ్యం వహించిన షహబాజ్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 542 వికెట్లు, లిస్ట్–ఎ క్రికెట్‌లో 175 వికెట్లు, టి20ల్లో 125 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల తరఫున బరిలోకి దిగాడు.

'వంద'కు అటు ఇటు...

100వ టెస్టు ఆడనున్న అశ్విన్, బెయిర్‌స్టో

రేపటి నుంచి ధర్మశాలలో భారత్, ఇంగ్లండ్ ఐదో టెస్టు



ధర్మశాల: టి20ల మెరుపులతో సంప్రదాయ టెస్టు సిరీస్‌లే కుదించబడుతున్నాయి. 3, 5 టెస్టుల సిరీస్ నుంచి 2, 3 టెస్టుల సిరీస్ లేదంటే అనామక జట్లయితే మొక్కుబడిగా ఏకైక టెస్టుతో ఐదు రోజుల ఆటను కానిచ్చేస్తున్నారు. మరోవైపు ఆటగాళ్లు కూడా ధనాధన్ ఆట మాయలో అసలైన ఫార్మాట్‌కు మంగళం పాడి లీగ్, పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లతోనే కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఒక క్రికెటర్ 100వ టెస్టు ఆడటం ఆ ఆటగాడికే కాదు... ఇప్పుడు టెస్టు ఫార్మాట్‌కే మైలురాయిగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. మరి ప్రత్యర్థి జట్ల నుంచి చెరొకరు 100వ టెస్టు ఆడటమైతే అనూహ్యం! ఆతిథ్య భారత్ నుంచి దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఇంగ్లండ్ బృందం నుంచి బెయిర్‌స్టోలకు రేపటి నుంచి ఇరు జట్ల మధ్య ధర్మశాలలో జరిగే ఐదో టెస్టు చిరస్మరణీయం కానుంది. ఈ ఇద్దరు 99 మ్యాచ్‌లాడి టెస్టు క్రికెట్‌కు అభి'వంద'నం పలికేందుకు సిద్ధమయ్యారు.

14వ భారత క్రికెటర్‌గా...

భారత క్రికెట్‌లోనే విజయవంతమైన సారథులుగా వెలుగొందిన అజహరుద్దీన్ (99), ధోని (90)లు కూడా 100 టెస్టులు ఆడలేకపోయారు. జహీర్ ఖాన్ (92) సైతం 'వంద' భాగ్యానికి నోచుకోలేకపోయాడు. కొందరికే సాధ్యమైన ఈ మైలురాయిని అందుకోవడానికి అశ్విన్ సిద్ధమయ్యాడు. ఇటీవలే 500 వికెట్ల క్లబ్‌లో చేరిన అశ్విన్... కుంబ్లే తర్వాత ఈ మైలురాయి అందుకున్న రెండో భారత బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. 2011లో వెస్టిండీస్‌పై ఢిల్లీ టెస్టులో అరంగేట్రం చేసిన అశ్విన్ 13 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించాడు. టెస్టుల్లో టీమిండియా ఘనవిజయాల్లో భాగమైన అశ్విన్... ధోని సారథ్యంలో తురుపుముక్కగా రాటుదేలాడు. 99 టెస్టులాడి 507 వికెట్లు పడగొట్టాడు. 35 సార్లు ఐదేసి వికెట్లు, 8 సార్లు 10 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటర్లను తిప్పేశాడు. వందో టెస్టు ఆడుతున్న 14వ భారత ఆటగాడిగా అశ్విన్ ఘనత వహిస్తాడు.

> "ఇది అతిపెద్ద సంబరం. ఎందుకంటే నా కెరీర్లో ఇది గమ్యాన్ని మించిన పయనం. ఎప్పటికీ ప్రత్యేకం. ఎన్నో ఎత్తుపల్లాల్ని చూశాను. ఎంతో నేర్చుకున్నాను. 2012లో సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ నా కెరీర్‌కు టర్నింగ్ పాయింట్. నాలుగు టెస్టుల్లో 52.64 సగటుతో 14 వికెట్ల పేలవ ప్రదర్శనతో విమర్శలెదుర్కొన్నా. కెరీర్ ఆరంభంలోనే పనైపోయిందనుకున్న ప్రతీసారి నన్ను నేను మార్చుకుంటూ సరికొత్త బౌలింగ్ అస్త్రాలతో ఇక్కడిదాకా ప్రయాణించడం గొప్ప అనుభూతిని ఇస్తోంది. –అశ్విన్
>
> ఇది నాకు భావోద్వేగానికి గురిచేసే మ్యాచ్. ప్రొఫెషనల్ క్రికెటర్ కావాలనే అందరూ కలలు కంటారు. నేనైతే ఆ కలల్ని నిజం చేసుకొని కెరీర్‌లో వందో ఆటకు రెడీ కావడం చాలా గొప్పగా అనిపిస్తుంది. 8 ఏళ్ల వయసులో తండ్రిని కోల్పోయిన నాకు నా తల్లే సర్వస్వం. అందుకే ఈ ఘనత ఆమెకే అంకితం. –బెయిర్‌స్టో"

17వ ఇంగ్లండ్ ప్లేయర్ బెయిర్‌స్టో



ఇంగ్లండ్ వికెట్ కీపర్, బ్యాటర్ జానీ బెయిర్‌స్టో గురించి మనవాళ్లకి, ప్రత్యేకించి హైదరాబాద్ వాసులకి బాగా తెలుసు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్‌గా వార్నర్‌తో కలిసి మెరిపించాడు. టెస్టుల్లో నిలకడైన బ్యాటర్. 2012లో వెస్టిండీస్‌తో అరంగేట్రం చేసిన బెయిర్‌స్టో 99 టెస్టుల్లో 36.42 సగటుతో 5974 పరుగులు చేశాడు. ఇందులో 12 శతకాలు, 26 అర్ధ శతకాలున్నాయి. కీపర్‌గా 242 క్యాచ్‌ల్ని పట్టడంతో పాటు 14 స్టంపౌట్లు చేశాడు. వందోటెస్టు ఆడుతున్న స్టార్ వికెట్ కీపర్ ఈ ఘనత కెక్కనున్న 17వ ఇంగ్లండ్ క్రికెటర్. వన్డేల్లో వందో మ్యాచ్ కూడా ధర్మశాలలోనే ఆడిన బెయిర్‌స్టో ఇప్పుడు అక్కడే మరో 100కు సై అంటున్నాడు.

అర్జున్ ఐదో రౌండ్ గేమ్ 'డ్రా'



న్యూఢిల్లీ: షెన్‌జెన్ లాంగాంగ్ మాస్టర్స్ క్లాసిక్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొలి 'డ్రా' నమోదు చేసుకున్నాడు. యు యాంగి (చైనా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను అర్జున్ 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ తర్వాత అర్జున్ 3.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నాడు.

రష్మిక జోడీ శుభారంభం



నాగ్‌పూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్ చేరింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో రష్మిక–వైదేహి (భారత్) ద్వయం 6–2, 6–1తో సౌజన్య బవిశెట్టి (భారత్)–మె హసెగావా (జపాన్) జంటను ఓడించింది. సింగిల్స్ విభాగంలో హైదరాబాద్‌కే చెందిన సౌజన్య బవిశెట్టి, హుమేరా బహార్మస్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు.

ఢిల్లీ ధమాకా...

- జెమీమా, మెగ్ లానింగ్ మెరుపులు
- 29 పరుగులతో ఓడిన ముంబై ఇండియన్స్

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు హవా కొనసాగుతోంది. సొంతగడ్డపై మొదలైన రెండో అంచె పోటీలో ఢిల్లీ గర్జించింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 29 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్స్ ముంబై ఇండియన్స్‌ను ఢిల్లీ ఓడించింది. ఈ గెలుపుతో ఢిల్లీ 8 పాయింట్లతో ఒంటరిగా అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీస్కోరు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ (33 బంతుల్లో 69 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 27 బంతుల్లోనే ఆమె అర్ధ శతకాన్ని పూర్తిచేసింది. ఓపెనర్, కెప్టెన్ మెగ్ లానింగ్ (38 బంతుల్లో 53; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా ధాటిగా ఆడింది. లానింగ్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన షఫాలీ వర్మ (12 బంతుల్లో 28; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో కాసేపే ఉన్నా మెరిపించింది. దీంతో ఢిల్లీ పవర్‌ప్లేలో 56/1 స్కోరు చేసింది. డెత్ ఓవర్లలో జెమీమా చెలరేగడంతో భారీస్కోరు సాధ్యమైంది. ముంబై బౌలర్లు షబ్నిమ్, సైకా ఇషాక్ చెరో వికెట్ తీశారు. అనంతరం కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసి ఓడిపోయింది. ఢిల్లీ బౌలర్లు జెస్ జొనాసెన్ (3/21), మరిజాన్ కాప్ (2/37), శిఖా పాండే (1/27), టిటాస్ సాధు (1/23) ముంబైను కట్టడి చేశారు. ఒకదశలో ముంబై 68/5 స్కోరు వద్ద సగం వికెట్లను కోల్పోయింది. టాపార్డర్‌లో హేలీ మాథ్యూస్ (17 బంతుల్లో 29; 6 ఫోర్లు) మినహా ఆ తర్వాత వరుసగా యస్తిక భాటియా (6), నట్ సీవర్ (5), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (6) నిరాశపరిచారు. లోయర్ ఆర్డర్‌లో అమన్‌జోత్ (27 బంతుల్లో 42; 7 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. నేడు జరిగే మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడుతుంది.


జెమీమా

విజయం దిశగా విదర్భ

నాగ్‌పూర్: మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ రెండో సెమీఫైనల్లో రెండుసార్లు చాంపియన్ విదర్భ విజయం దిశగా సాగుతోంది. విదర్భ నిర్దేశించిన 321 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన మధ్యప్రదేశ్... నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 71 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 228 పరుగులు చేసింది. గెలుపు దక్కాలంటే మధ్యప్రదేశ్ మరో 93 పరుగులు చేయాల్సి ఉండగా... నాలుగు వికెట్లు పడగొడితే విదర్భ మూడోసారి ఫైనల్ బెర్త్ లభిస్తుంది. ప్రస్తుతం సారాంశ్ జైన్ (16 బ్యాటింగ్), కుమార్ కార్తికేయ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. యశ్ దూబే (94; 10 ఫోర్లు), హర్ష్ గావ్లి (67; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 343/6తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 402 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ (141; 18 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మధ్యప్రదేశ్ బౌలర్లలో అనుభవ్ అగర్వాల్ ఐదు వికెట్లు తీసుకున్నాడు.


యశ్ రాథోడ్

సినిమా

ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు – గోపీచంద్



''భీమా' పక్కా కమర్షియల్ ప్యాక్డ్ మూవీ. నేను చేసిన భీమా పాత్రలో చాలా ఇంటెన్సిటీ ఉంటుంది. ప్రేమ, ఎమోషన్స్, రొమాన్స్.. ఇలా అన్ని అంశాలున్నాయి. ఈ కథలో సెమీ ఫ్యాంటసీ ఎలిమెంట్‌ని హర్ష అద్భుతంగా చూపించాడు. ప్రతి యాక్షన్ సీక్వెన్స్‌లో అద్భుతమైన భావోద్వేగం ఉంటుంది. సినిమా చూసి బయటికి వచ్చాక ప్రేక్షకుల మనసులో భీమా నిలిచిపోతాడనే నమ్మకం ఉంది'' అని హీరో గోపీచంద్ అన్నారు. ఎ. హర్ష దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా, ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భీమా'. కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా గోపీచంద్ పంచుకున్న విశేషాలు.

- 'భీమా' సహనిర్మాత శ్రీధర్‌గారు కోవిడ్ సమయంలో దర్శకుడు హర్షని నాకు పరిచయం చేశారు. అప్పుడో కథ చెప్పాడు హర్ష.. కథ బావుంది కానీ ఆ సమయంలో చేయకూడదని అనిపించింది. పోలీస్ నేపథ్యంలో ఏదైనా వైవిధ్యమైన కథ ఉంటే చెప్పమన్నాను. ఎనిమిది నెలలు గ్యాప్ తీసుకొన్న హర్ష ఆ తర్వాత వచ్చి 'భీమా' కథ చెప్పాడు. చాలా బాగా నచ్చడంతో ఓకే చెప్పాను.
- నేను గతంలో పోలీసు పాత్రలు చేశాను. 'గోలీమార్'లో డిఫరెంట్ కాప్. 'ఆంధ్రుడు' లవ్ స్టోరీ నేపథ్యంలో నడుస్తుంది కానీ దాని నేపథ్యం పోలీసు కథే. 'శౌర్యం' కూడా భిన్నమైన కథ. ఈ మూడు చిత్రాలకు పూర్తి వైవిధ్యమైన పోలీస్ పాత్రని 'భీమా'లో చేశాను. ఈ పోలీసు కథలో సెమీ ఫ్యాంటసీ ఎలిమెంట్ చాలా కొత్తగా ఉంటుంది.. అదే నాకు చాలా ఆసక్తిని కలిగించింది. హర్ష కన్నడలో చాలా అనుభవం ఉన్న దర్శకుడు. 'భీమా'ని అద్భుతంగా తీశాడు.. స్క్రీన్ ప్లే చాలా ఆసక్తిగా ఉంటుంది.
- 'భీమా' పరశురామ క్షేత్రంలో జరిగే కథ. ట్రైలర్‌లో చూపించినట్లు అఘోరాలు, కలర్ ప్యాలెట్, నేపథ్య సంగీతం వల్ల 'అఖండ' సినిమాతో పోలుస్తున్నారు. కానీ, ఇది పూర్తిగా వైవిధ్యమైన కథ. ఈ సినిమాలో శివుని నేపథ్యం ఉంది. పైగా సినిమా కూడా మహాశివరాత్రికి వస్తోంది. అయితే దీన్ని మేం ముందుగా ప్లాన్ చేయలేదు.. అలా కలిసొచ్చింది. శివుని ఆజ్ఞ అనుకుంటాను.
- నిర్మాత రాధామోహన్, నా కాంబినేషన్‌లో 'పంతం' (2018) సినిమా వచ్చింది. అప్పటి నుంచి ఆయన, నేను చాలా ఫ్రెండ్లీగా ఉంటాం. 'పంతం' వాణిజ్య పరంగా సక్సెస్ అయినా ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ కాలేదు. కానీ, 'భీమా'తో తప్పకుండా హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది. ఈ సినిమాని చాలా గ్రాండ్‌గా నిర్మించారాయన.
- మా నాన్న (డైరెక్టర్ టి. కృష్ణ)తో పాటు ఆ తరంలోని దర్శకులు జనాలతో మమేకం అయ్యేవారు. అలా ప్రజల సాధక బాధకాలు, సమస్యలు తెలుసుకుని కథ రాసుకుని, సామాజిక బాధ్యతతో సినిమాలు తీసి హిట్ సాధించేవారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. శంకర్‌గారి లాంటి ఒకరిద్దరు దర్శకులు తప్ప మిగిలిన వారు సమాజం, ప్రజల నేపథ్యంలో కథలు రాయడం లేదు. సొసైటీ బ్యాక్‌డ్రాప్‌ని ఎంచుకుని సరైన విధానంలో తెరపై చూపించగలిగితే ఇప్పటికీ ప్రేక్షకులు బ్రహ్మాండంగా ఆదరిస్తారు. దర్శకత్వం అనేది చాలా కష్టమైన పని.. అందుకే నాకు ఆ ఆలోచన లేదు.
- చిత్ర పరిశ్రమలో దాదాపు 22 ఏళ్ల ప్రయాణం నాది.. ఇన్నేళ్ల జర్నీ హ్యాపీగా ఉంది కానీ నటుడిగా పూర్తిగా సంతృప్తి పడటం లేదు. ఒక నటుడికి సంతృప్తి అనేది ఎప్పటికీ ఉండదు.. ఎప్పటికప్పుడు కొత్తగా చేయాలనే తపన ఉంటుంది. ప్రభాస్, నేను కలిసి సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాం. కానీ, ఆ చాన్స్ రాలేదు.. వస్తే మాత్రం తప్పకుండా నటిస్తాం. ప్రస్తుతం శ్రీను వైట్లగారి దర్శకత్వంలో నేను చేస్తున్న సినిమా 30 శాతం పూర్తయింది. ఆ తర్వాత బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడుగార్లతో ఓ చిత్రం, యూవీ క్రియేషన్స్‌లో ఓ సినిమా చేయాల్సి ఉంది.

రహస్య గూఢచారిగా యుద్ధం


ఎన్టీఆర్

హిందీ చిత్రం 'వార్ 2'లో ఎన్టీఆర్ విలన్‌గా కనిపిస్తారా? అసలు ఆయన పాత్ర ఎలా ఉంటుంది? అనే ప్రశ్నలకు చిన్న క్లూ దొరికింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ భారతదేశానికి చెందిన రహస్య గూఢచారి పాత్రలో కనిపిస్తారని టాక్. ఈ పాత్ర పాజిటివ్‌గా ఉంటుందట. ఇక యశ్‌రాజ్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న 'వార్ 2' మల్టీస్టారర్ మూవీ అనే విషయం తెలిసిందే. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. త్వరలో ఎన్టీఆర్ ఈ చిత్రం షూటింగ్‌లో పాల్గొంటారు. ఇంకో విషయం ఏంటంటే... 'వార్ 2'లో రహస్య గూఢచారిగా యుద్ధం చేసే ఎన్టీఆర్‌తో ఆ తర్వాత ఇదే పాత్రతో ఒక ఫుల్ మూవీ తీయాలని, ఆ తర్వాత వచ్చే ఈ స్పై చిత్రాల్లో కీలక పాత్రల్లో ఎన్టీఆర్‌ని చూపించాలని ఆదిత్య చోప్రా అనుకుంటున్నారట. ఇక 'వార్ 2' వచ్చే ఏడాది ఆగస్టు 14న విడుదల కానుంది.

ఓహ్... మేడమ్...


'అల్లరి' నరేశ్, ఫరియా

నచ్చిన అమ్మాయి మనసు దోచేయడానికి 'ఓహ్... మేడమ్...' అంటూ పాట అందుకున్నారు 'అల్లరి' నరేశ్. 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం కోసమే ఈ పాట. 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న చిత్రం ఇది. మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కోసం నరేశ్–ఫరియాపై చిత్రీకరించిన తొలి పాట 'ఓహ్.. మేడమ్'ను సంగీతదర్శకుడు ఎస్ఎస్ తమన్ విడుదల చేశారు. గోపీచందర్ స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి పాడారు. హీరోయిన్ పట్ల హీరో వ్యక్తపరిచే భావోద్వేగాల నేపథ్యంలో ఈ పాట ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. ఈ నెల 22న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

పెద్ద హీరోలతో సినిమాలు చేయను – చదలవాడ శ్రీనివాసరావు



''గతంలో డైరెక్టర్, ప్రొడ్యూసర్ భార్యాభర్తల్లా ఉండేవారు. ఇప్పుడు డైరెక్టర్, హీరో ఒక్కటై నిర్మాతకి అంత విలువ ఇవ్వట్లేదు. సినిమాల సక్సెస్ రేట్ తగ్గడానికి ఇదే ప్రధాన సమస్య. నేను బ్రతికుండగా పెద్ద హీరోలతో పెద్ద బడ్జెట్ సినిమాలు చేయను. నేనింత ఆరోగ్యంగా ఉండడానికి కారణం పెద్ద బడ్జెట్, పెద్ద హీరోల సినిమాలు చేయకపోవడమే'' అని దర్శక–నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు అన్నారు. నిహార్, నాగార్జున, రగ్గా ఇఫ్తాకర్, సత్య కృష్ణ, సంజన కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రికార్డ్ బ్రేక్'. చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో చదలవాడ పద్మావతి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న విడుదల కానుంది.

ఈ సందర్భంగా చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''బిచ్చగాడు'లో తల్లి కోసం కొడుకు కష్టపడతాడు. కానీ, 'రికార్డ్ బ్రేక్'లో బిడ్డల కోసం తల్లి ఏం చేస్తుంది? అన్నది ఆసక్తిగా ఉంటుంది. కథ బాగుంటే ప్రేక్షకులు ఏ సినిమాని అయినా ఆదరిస్తారని మా 'బిచ్చగాడు' నిరూపించింది. అదే నమ్మకంతోనే బడ్జెట్‌కి వెనకాడకుండా 'రికార్డ్ బ్రేక్' తీశాం. యునిక్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రాన్ని ఎనిమిది భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. గతంలో నాగేశ్వరరావు, శోభన్ బాబు, కృష్ణ గార్లతో సినిమాలు తీశాను. వాళ్లు నాకంటే ముందే షూటింగ్ లొకేషన్‌కి వచ్చేవారు. డైరెక్టర్లు అజయ్ కుమార్, సదాశివరావు, కేఎస్ నాగేశ్వరరావు కూడా మహానుభావులు'' అన్నారు.

ఆ నమ్మకమే ఈ సినిమా చేసేలా చేసింది


ఎస్తేర్

''మాయ' క్రైమ్ స్టోరీ అయినప్పటికీ ఇందులో భావోద్వేగాలు ఉన్నాయి. డైరెక్టర్ రమేశ్ నమ్మకమే నన్నీ సినిమాలో నటించేలా చేసింది'' అని హీరోయిన్ ఎస్తేర్ అన్నారు. కిరణ్ ఆవల, ఎస్తేర్ ప్రధాన పాత్రల్లో రమేష్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'మాయ'. జీరో ప్రొడక్షన్స్ సమర్పణలో రాజేష్ గొరిజవోలు నిర్మించిన ఈ మూవీ ఈ నెల 15న రిలీజవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి నటులు 'సత్యం' రాజేశ్, అనుదీప్ చౌదరి అతిథులుగా హాజరయ్యారు. రమేశ్ నాని మాట్లాడుతూ– ''మిస్టీరియస్ థ్రిల్లర్, ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్న బాపిరాజు గారికి థ్యాంక్స్'' అన్నారు. ''మంచి కథ కావడంతో గ్రాండ్‌గా నిర్మించాను'' అన్నారు రాజేశ్.

రిస్క్ అంచున ప్రయాణం చేశాం – విద్యాధర్ కాగిత



''గామి అంటే గమ్యం చేరేవాడు. ఇందులో ప్రధాన పాత్రకు ఒక గమ్యం ఉంటుంది. దాన్ని ఎలా చేరాడనేది ఆసక్తిగా చూపించాం. తర్వాత ఏం జరగబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో ఉంటుంది. స్క్రీన్‌ప్లే చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది'' అన్నారు విద్యాధర్ కాగిత. విశ్వక్ సేన్, చాందినీ చౌదరి జంటగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన చిత్రం 'గామి'. వి సెల్యులాయిడ్ సమర్పణలో కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. విద్యాధర్ కాగిత మాట్లాడుతూ– ''ఓ వాస్తవ ఘటనకి ఫిక్షన్ జోడించి 'గామి' కథ రాశాను. క్రౌడ్ ఫండ్ కోసం ఒక వీడియో చేశాం. దాని ద్వారా వచ్చిన డబ్బులతో సినిమా ఆరంభించాం. ఆ తర్వాత కార్తీక్ శబరీష్ బయట నుంచి డబ్బు తీసుకొచ్చారు. మా మూవీ గ్లింప్స్ నచ్చడంతో యూవీ క్రియేషన్స్ వారు భాగస్వామ్యం అయ్యారు. మా సినిమాకి ఐదేళ్లు పట్టింది. విశ్వక్ సేన్‌గారి ధైర్యాన్ని మెచ్చుకోవాలి. యూనిట్ అంతా ఈ సినిమా కోసం రిస్క్ అంచున ప్రయాణం చేశాం'' అన్నారు.

గ్రామంలో థ్రిల్


సత్యరాజ్, రవితేజ నున్నా

రవితేజ నున్నా, నేహా జురెల్ జంటగా సత్యరాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'రాజుగారి అమ్మాయి.. నాయుడుగారి అబ్బాయి'. మణికొండ రంజిత్ సమర్పణలో ముత్యాల రామదాసు, నున్నా కుమారి నిర్మించారు. రామిశెట్టి వెంకట సుబ్బారావు, కలవకొలను సతీష్ సహనిర్మాతలుగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో సత్యరాజ్, రవితేజ నున్నా మాట్లాడుతూ– ''రాజుగారి అమ్మాయి.. నాయుడుగారి అబ్బాయి' గ్రామీణ నేపథ్యంలో సాగే కథ అయినప్పటికీ ఇదొక క్రైమ్ థ్రిల్లర్. గోదావరి గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమాలంటే ప్రేమకథ, ప్రకృతి అందాలు వంటివి ఉంటాయి. అయితే మా సినిమాలో వీటితో పాటు అందమైన ప్రేమకథ, క్రైమ్ ఉంటుంది. ఈ మూవీలో హీరోయిన్ అనుకోకుండా చనిపోతుంది. ఆమెను ఎవరు హత్య చేశారు? అనే పాయింట్‌తో ఎంతో ఇంటెన్స్‌గా ఈ కథ నడుస్తుంది'' అన్నారు.

ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్ ఫార్మాట్‌లో ఆస్కార్

పదిహేనేళ్ల తర్వాత ఈ ఫార్మాట్ పునరుద్ధరణ



ఆస్కార్ అవార్డు వేడుకలను వీలైనంత ఎక్కువమంది వీక్షకులకు చేరువ చేయాలని ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూ ఉంటుంది ఆస్కార్ అవార్డు కమిటీ. ఇందులో భాగంగా ఈ ఏడాది 'ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్' ఫార్మాట్‌ను పునరుద్ధరించాలని అనుకుంటోందట. అప్పటి వరకూ జరిగిన అవార్డు వేడుకల్లో ఆస్కార్ గెలుచుకున్న ఐదుగురు స్టార్స్ తాజా వేడుకలో పాల్గొని, విజేతలను ప్రకటించి, అవార్డును ప్రదానం చేయడమే ఈ ఫార్మాట్ ఉద్దేశం. గతంలో (2009) జరిగిన ఆస్కార్ అవార్డు వేడుకలో ఈ విధానాన్ని పాటించారు. 'ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్' పేరిట అప్పటి అవార్డు వేడుకలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఆ తర్వాత జరిగిన వేడుకల్లో ఈ ఫార్మాట్‌ని ఫాలో కాలేదు. పదిహేనేళ్లకు ఈసారి ఈ విధానాన్ని పునరుద్ధరించాలని కమిటీ భావిస్తోందట.

మాజీ ఆస్కార్ విజేతలు తాజా విజేతలను ప్రకటించి, అవార్డును ప్రదానం చేయడం అనేది చూడ్డానికి కనువిందుగా ఉందని 2009లో జరిగిన అవార్డు వేడుకలో పలువురు పేర్కొన్నారు. వీక్షకుల నుంచి కూడా మంచి స్పందన వచ్చిందట. కాగా, కరోనా తర్వాత ఆస్కార్ అవార్డు వేడుకల వీక్షకుల సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టిందని హాలీవుడ్ అంటోంది. ఈ నేపథ్యంలోనే ఎక్కువ సంఖ్యలో వీక్షకులను రాబట్టడానికి గతంలో సక్సెస్ అయిన ఈ ఫార్మాట్‌ని పునరుద్ధరించాలని కమిటీ భావించిందని హాలీవుడ్ భోగట్టా. అయితే ఈ 'ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్' నటీనటుల విభాగానికి మాత్రమే వర్తిస్తుంది. ఇక ఈ నెల 10న లాస్ ఏంజిల్స్‌లో (భారత కాలమానం ప్రకారం మార్చి 11) ఆస్కార్ అవార్డుల వేడుక జరగనుంది. మూడేళ్లుగా వ్యాఖ్యాతగా వ్యవహరించిన జిమ్మీ కెమ్మెల్ ఈసారీ ఆ బాధ్యతను నిర్వర్తించనున్నారు. మరి.. వార్తల్లో ఉన్నట్లుగా 'ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్' ఫార్మాట్‌ని కమిటీ రీ విజిట్ చేసిందా? లేదా అనేది ఆ రోజు తెలిసిపోతుంది.